
'జాతికి జల సౌభాగ్యం కల్పించిన రోజే నాకు అసలైన పండుగ రోజు'

సత్యమేవ జయతే

# సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18 సంచిక: 196

మంగళవారం 7-10-2025



రిపోర్టింగ్... ఓ వార్! - IIలో


ఆఫ్రికా నత్తల నియంత్రణ అంత సులువు కాదు! - IIలో


SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL




"మన మానసిక ఆరోగ్యంపై తగిన శ్రద్ధ పెట్టడానికి ఉపకరించే పుస్తకం... ఆటోమిక్ హ్యాబిట్స్. అమెరికన్ రచయిత జేమ్స్ క్లీయర్ రాసిన ఈ పుస్తకంలో ఒత్తిడిని తగ్గించే, స్వీయక్రమశిక్షణను పెంపొందించే పాజిటివ్ హ్యాబిట్స్‌కు సంబంధించిన అంశాలు ఉన్నాయి. రోజువారీ చిన్న చిన్న అలవాట్లు భారీ మార్పుకు దారితీస్తాయని, సరైన వాతావరణం సానుకూల మానసిక ఆరోగ్య అలవాట్లను పెంపొందిస్తుందని 'ఆటోమిక్ హ్యాబిట్స్' చెబుతుంది."

● ఎంపవర్‌మెంట్

## కలిసి కట్టుగా కదిలారు... రోడ్డు నిర్మించారు





'అయ్యా మా గ్రామానికి రోడ్డు సరిగా లేదు. మీరు పట్టించుకోవాలి' అని మహిళా బృందం అధికారులకు విన్నవించుకుంది. 'అలాగే. తప్పకుండా' అని హామీ ఇచ్చారు అధికారులు. రోజులు గడుస్తున్నా, ఎక్కడి గొంగళి అక్కడే అన్నట్లుగా ఉంది.

ఝార్ఖండ్‌లోని పిచులియా గ్రామానికి చెందిన మహిళా స్వయం సహాయక బృంద సభ్యులు ఎవరో వస్తారని ఏదో చేస్తారని ఆలోచించకుండా తామే స్వయంగా రంగంలో దిగారు. 25 మంది మహిళలు పారలు, తట్టలతో రోడ్డు బాగు చేయడానికి దృఢసంకల్పంతో ముందుకు కదిలారు. రాష్ట్ర ప్రభుత్వ పథకం మైయా సమ్మాన్ యోజనను ఉపయోగించుకున్నారు. 18 నుండి 50 సంవత్సరాల మధ్య వయసు గల మహిళలకు ప్రతినెల రూ.2,500 పొందడానికి వీలుకల్పించే పథకం ఇది. దసరాకు ముందు రోడ్డు వేయాలనే లక్ష్యాన్ని నెరవేర్చుకున్నారు. చాలా రోజులు కష్టపడి తమ గ్రామాన్ని మిగిలిన గ్రామాలు, పట్టణాలతో అనుసంధానించే రోడ్డు నిర్మించారు. దసరాకు కొన్ని రోజుల ముందే రోడ్డు నిర్మాణం పూర్తయింది.

పాత్ మేకర్





అల్లికల నుంచి అంతరిక్షం దాకా అన్నిట్లో ఆడవాళ్ల జాడలు కనిపిస్తున్నా ఇదింకా పురుష ప్రపంచమే! అసలు ఆ జాడలు కూడా లేని కాలం ఎలా ఉండిందో! అలాంటి కాలంలో పురుషాధిపత్య రంగాల్లోకి స్త్రీలు ధైర్యంగా అడుగుపెట్టడమే ఓ సమరం! పెట్టాక బాధ్యతల కోసం ఒక పోరాటం! అలా పోరాడి.. పురుషులు సాధించలేని టాస్క్‌లను ఛేదించి.. తర్వాత తరాల అమ్మాయిలకు ఓ పాత్‌ను క్రియేట్ చేశారు కొందరు వనితలు! ఆ షీరోస్‌ను పరిచయం చేసే శీర్షికే 'పాత్ మేకర్'. ఆక్రమంలో ఈ వారం.. దేశపు తొలి మహిళా వార్ జర్నలిస్ట్ ప్రభాదత్ గురించి...

## రిపోర్టింగ్... ఓ వార్!

బిల్లా, రంగా పేరు వినే ఉంటారు. గీతా, సంజయ్ చోప్రా అనే ఇద్దరు స్కూల్ పిల్లలను ఎత్తుకెళ్లిపోయి, వాళ్లను హత్యచేసిన హంతకులు. మరణ శిక్షతో జైల్లో ఉన్న ఆ బిల్లా, రంగాలను ఇంటర్వ్యూ చేయడానికి ఒక జర్నలిస్ట్ .. జైల్ అధికారుల అనుమతి కోరారు. 'నో' అన్నారు ఆఫీషియల్స్. ఆ 'నో'ను సవాలు చేస్తూ కోర్టుకు వెళ్లి, ఇంటర్వ్యూకు పర్మిషన్ తెచ్చుకుని.. ఆ ఇద్దరి మరణ శిక్ష అమలుకు ముందు వాళ్లను ఇంటర్వ్యూ చేశారు ఆ జర్నలిస్ట్. జైన్ శుద్ధ్ వనస్పతి లిమిటెడ్.. పేరు కూడా వినే ఉంటారు. ఈ సంస్థ అమ్మే నేతిలో పందికొవ్వు కలుస్తోందనే ఇన్వెస్టిగేటివ్ రిపోర్టింగ్ చేశారు ఆ జర్నలిస్ట్. అంతేకాదు ఎయిమ్స్‌లోని మెడికల్ స్కామ్‌నూ బయటకు తీశారు. ఆ జర్నలిస్ట్ పేరే ప్రభాదత్! 1965లో జరిగిన ఇండియా– పాకిస్తాన్ యుద్ధాన్ని వార్ ఫీల్డ్‌లోంచి రిపోర్ట్ చేసిన వీరనారి! దేశపు ఫస్ట్ ఉమన్ వార్ కరెస్పాండెంట్‌గా చరిత్ర సృష్టించారు. బక్కపల్చటి దేహం.. కాటన్ చీర.. తలకు హెల్మెట్‌తో యుద్ధ ట్యాంక్‌ల వెనుక నుంచి యుద్ధాన్ని కలంతో కవర్ చేసిన ఆమె ఇమేజ్ తర్వాత తరాల జర్నలిస్ట్‌లు ఎందరికో ప్రేరణనిచ్చింది. అందుకే ఆమెను చమేలీ దేవీ జైన్ అవార్డ్ వరించింది. ప్రభాదత్ ఏం చేసినా సెన్సేషనే! ఆమె (మగాళ్ల రాజ్యం) జర్నలిజంలోకి అడుగు పెట్టడమే మహా సంచలనం!

### జర్నలిజం.. వార్ రిపోర్టింగ్

ప్రభాదత్ ఇరవైల్లోనే జర్నలిజంలోకి వచ్చారు. ఇంటర్వ్యూలో ఫ్లవర్ ఎగ్జిబిషన్‌ను కవర్ చేసే డ్యూటీని సూచించాడట ఎడిటర్. అంతకన్నా గొప్ప విషయాలనే మహిళలు రిపోర్ట్ చేయగలరు అని అతనితో వాదించి.. మెప్పించి ఫ్లవర్ ఎగ్జిబిషన్ రిపోర్టింగ్‌ను తిరస్కరించి.. కీలకమైన అసైన్‌మెంట్స్‌కే 'యెస్' అనిపించుకున్నారు. అలాంటి ధీర ఇండియా– పాకిస్తాన్ వార్ రిపోర్టింగ్‌ను వదులుకుంటారా? అప్పుడు ఆమె హిందుస్తాన్ టైమ్స్‌కి పని చేస్తున్నారు. తనకు వార్ అసైన్‌మెంట్ ఇవ్వమని రిక్వెస్ట్ చేయలేదు. డిమాండ్ చేశారు. ఎడిటర్ దగ్గర్నుంచి 'నో' అనే జవాబే వచ్చింది. అప్పుడు ఆమె స్మార్ట్ స్టెప్ తీసుకున్నారు. పంజాబ్‌లో ఉన్న తన పేరెంట్స్‌ను చూడ్డానికి వెళ్తున్నానని సెలవుకు దరఖాస్తు పెట్టుకున్నారు. వెంటనే మంజూరైంది. పెట్టే బేడా సర్దుకుని నేరుగా ఖేమ్ –కరన్‌కి బయలుదేరారు ప్రభా. యుద్ధ రంగంలో నిలబడి ఏ రోజుకారోజు యుద్ధ విషయాల రిపోర్ట్‌ను పత్రికా ఆఫీస్‌కు పంపసాగారు. పట్టుదలకు పోయి మొదట్లో ఆ రిపోర్ట్‌ను పక్కన పెట్టినా.. తర్వాత తర్వాత ఆమె రిపోర్ట్ ఎప్పుడు వస్తుందా అని ఎదురుచూసేవాళ్లు పత్రికా ఆఫీస్‌లో. ప్రభాదత్ కన్విక్షన్, పర్‌ఫెక్షన్ అలాంటిది మరి. రేడియోల ముందూ చెవులు రిక్కించుకుని మరీ కూర్చునేవారట శ్రోతలు.. ఆమె రిపోర్టింగ్ విషయాలను వినడానికి. మిడిమిడి జ్ఞానం ఆమె డిక్షనరీలోనే లేదు. సంపూర్ణ అవగాహన, స్పష్టతతోనే వెళ్లేవారు ఎక్కడికైనా. పనితోనే గానీ వ్యక్తిగత చరిష్మాకు ఎప్పుడూ ప్రాధాన్యం ఇవ్వలేదు. తన జీవితమే రిస్క్‌లో పడేంత ప్రమాదకరమైన రిపోర్టింగ్ చేశారు. బెదిరింపులు, భౌతిక దాడులను ఎదుర్కొన్న సందర్భాలూ ఉన్నాయి. అయినా ప్రభాదత్ వెనకడుగు వేయలేదు. తను నమ్మినదానిపట్ల దృఢచిత్తంతో సాగిన ఆమె బ్రెయిన్ హ్యామరేజ్‌తో హఠన్మరణానికి గురయ్యారు. జర్నలిజంలో ఆమె చూపిన తెగువ, ధైర్యం మహిళా జర్నలిస్ట్‌లకే కాదు పురుషులకూ స్ఫూర్తే! ప్రముఖ జర్నలిస్ట్ బర్ఖాదత్ ఆమె కూతురే.

● ఫ్యూచర్ స్టార్స్

## రణధీర శరణార్థులు

గౌహతిలోని బర్సపారా క్రికెట్ స్టేడియంలో ఇండియా, శ్రీలంకల మధ్య జరిగిన మహిళల ప్రపంచ కప్ 2025 ప్రారంభ మ్యాచ్‌కు అఫ్గానిస్థాన్ శరణార్థ మహిళల క్రికెట్ జట్టు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. దీప్తి శర్మ, అమన్‌జోత్ కౌర్, ఇనోకా రణవీర ప్రారంభ ఆటలో అద్భుతమైన ప్రదర్శనతో వార్తల్లో నిలిచారు. అయితే ఆటలోకి అడుగు పెట్టకుండానే అఫ్గాన్ మహిళల జట్టు వార్తల్లో నిలిచింది. మహిళల హక్కుల కోసం పోరాడి, తాలిబాన్ ప్రభుత్వం నుంచి తప్పించుకున్న ఈ అఫ్గాన్ మహిళా క్రికెటర్‌ల బృందం ప్రవాసంలో ఉంటుంది. భద్రతా విషయాలను దృష్టిలో పెట్టుకొని అఫ్గానిస్థాన్ ప్లేయర్స్ వివరాలను ఐసీసీ బయటపెట్టలేదు.



అఫ్గాన్ ప్లేయర్స్: ఫిరోజ, నహిద

రాబోయే రోజుల్లో అఫ్గాన్ మహిళల క్రికెట్ జట్టును మరింత క్రియాశీలం చేయడానికి వారి పర్యటన తొలి ప్రయత్నంగా భావించాలి. అఫ్గానిస్థాన్ శరణార్థుల క్రికెట్ జట్టుకు భవిష్యత్తులో జరగబోయే రెండు ప్రధాన ప్రపంచ టోర్నమెంట్‌లలో స్థానం కల్పించనున్నట్లు ఐసీసీ ప్రకటించింది. తాలిబన్లు తిరిగి అధికారంలోకి వచ్చిన తరువాత క్రికెట్‌తో సహా ఎన్నో ఆటలపై మహిళలు ఆడకుండా నిషేధం విధించారు. ఈ నేపథ్యంలో తమ దేశం నుంచి పారిపోయిన అఫ్గాన్ మహిళా అథ్లెట్లకు సహాయం చేయడానికి ఐసీసీ చొరవ చూపింది. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ), ఇంగ్లండ్ అండ్ వేల్స్ క్రికెట్ బోర్డ్ (ఇసీబి), క్రికెట్ ఆస్ట్రేలియా (సిఏ) సహకారంతో అఫ్గాన్ జట్టును ముందుకు నడిపించడానికి ఐసీసీ డిప్యూటీ చైర్మన్ ఇమ్రాన్ ఖ్వాజా కీలకంగా వ్యవహరిస్తున్నాడు.

చాలామంది శరణార్థ ప్లేయర్స్ ఆస్ట్రేలియాలో నివసిస్తున్నారు. మరికొందరు యూకే, కెనడాలలో నివసిస్తున్నారు. అయితే వీసా సమస్య కారణంగా చాలా మంది మన దేశానికి రాలేకపోయారు. ఇక్కడికి వచ్చిన వారు శిక్షణ శిబిరాలలో పాల్గొంటారు. దేశీయ జట్లతో కొన్ని మ్యాచ్‌లలో పోటీ పడతారు.

● చైల్డ్ సేఫ్టీ

## డియర్ క్యాబ్ డ్రైవర్ ఫ్రెండ్స్



'పిల్లల భద్రతకు పూర్తి బాధ్యత తీసుకోవడం అంటే ఇది' అంటూ ఒక క్యాబ్ డ్రైవర్ షేర్ చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అయింది. ఒక మిలియన్ వ్యూస్‌తో దూసుకుపోతోంది. ఈ వీడియో చూసిన ప్రేక్షకులు అతడి వృత్తినైపుణ్యాన్ని, అంకితభావాన్ని ప్రశంసిస్తున్నారు. 'పిల్లలు సురక్షితంగా ఇంటికి చేరుకునేలా జాగ్రత్త పడడం ప్రతి స్కూల్ క్యాబ్ డ్రైవర్ బాధ్యత' అనే కాప్షన్‌తో వీడియోను ఇన్‌స్టాగ్రామ్‌లో షేర్ చేశారు. వీడియోలో ఏముంది? అనే విషయానికి వస్తే... స్కూల్ క్యాబ్ నుంచి బయటికి దిగిన బాలిక తన ఇంటివైపు పరుగులు తీస్తూ కనిపిస్తుంది. 'క్యాబ్ డ్రైవర్ మిత్రులారా, నేను చెప్పే విషయాన్ని గుర్తు పెట్టుకోండి. అమ్మాయి క్యాబ్ దిగగానే మన బాధ్యత తీరినట్లు కాదు. ఆ పాప ఇంట్లోకి అడుగుపెట్టే వరకు కాబ్ కదలకూడదు' అనే మాటలు బ్యాక్‌గ్రౌండ్ నుంచి వినిపిస్తూ ఉంటాయి. 'ప్రతి క్యాబ్ డ్రైవర్ నీలా ఆలోచిస్తే పిల్లల భద్రతకు ఎలాంటి సమస్య ఉండదు' అని ఒక నెటిజన్ స్పందించారు. 'మనం తీసుకునే చిన్న చిన్న జాగ్రత్తలు పిల్లల భద్రత విషయంలో కీలకం అవుతాయి' అని మరోసారి గుర్తు చేసే వీడియో ఇది.

**బులియన్** (బంగారం 10 గ్రా.: వెండి కిలో) అక్టోబర్ 6న ముగింపు రూ.లలో

| హైదరాబాద్ | | విజయవాడ | | విశాఖపట్నం | | రాజమండ్రి | | ప్రొద్దుటూరు | | చెన్నై | |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| బంగారం (24 క్యారెట్లు) | 1,24,610 | బంగారం (24 క్యారెట్లు) | 1,22,680 | బంగారం (24 క్యారెట్లు) | 1,20,770 | బంగారం (24 క్యారెట్లు) | 1,22,680 | బంగారం (24 క్యారెట్లు) | 1,23,700 | బంగారం (24 క్యారెట్లు) | 1,20,650 |
| బంగారం (22 క్యారెట్లు) | 1 ,12,450 | బంగారం (22 క్యారెట్లు) | 1,10,700 | బంగారం (22 క్యారెట్లు) | 1,10,7000 | బంగారం (22 క్యారెట్లు) | 1,14,020 | బంగారం (22 క్యారెట్లు) | 1,13,800 | బంగారం (22 క్యారెట్లు) | 1,10,600 |
| వెండి | 1.61,000 | వెండి | 1,56,500 | వెండి | 1,66,000 | వెండి | 1,56,500 | వెండి | 1,55,000 | వెండి | 1,66,000 |

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి

హస్త కార్తె: అక్టోబర్ 13 వరకు

## యువతకు ఆచరణాత్మక వ్యవసాయ శిక్షణ



సమీకృత ప్రకృతి వ్యవసాయాన్ని పూర్తి స్థాయి వృత్తిగా చేపట్టాలని భావించే యువతకు సరైన సమాచారంతో పాటు కొద్ది నెలల పాటు ఆచరణాత్మక శిక్షణ కూడా అవసరం. అటువంటి యువతకు ఆచరణాత్మక ప్రకృతి వ్యవసాయ జ్ఞానం అందించడానికి తెలంగాణలో రెండు సంస్థలు ఈ నెలలోనే ప్రత్యేక శిక్షణా శిబిరాలను ప్రారంభించనున్నాయి.

సేంద్రియ పశుపోషణ, సమీకృత సేంద్రియ వ్యవసాయంలో 15 ఏళ్ల అనుభవం గల అక్షయకల్ప సంస్థ 3 నెలల ఉచిత ఫెలోషిప్ కార్యక్రమాన్ని త్వరలో ప్రారంభించనుంది. యువకులను రైతు పారిశ్రామికవేత్తలుగా లేదా రైతు విస్తరణ నిపుణులుగా తీర్చిదిద్దటమే లక్ష్యంగా 19–27 ఏళ్ల మధ్య వయస్కులకు రంగారెడ్డి జిల్లా నందిగామ మండలం ఈదులపల్లిలోని అక్షయకల్ప రీజనరేటివ్ వ్యవసాయ పరిశోధన–అభివృద్ధి కేంద్రంలో 3 నెలల రెసిడెన్షియల్ శిక్షణ ఇస్తారు. భోజన వసతులతో పాటు స్టైపెండ్ కూడా ఇస్తారు. కర్ణాటక, తమిళనాడు రాష్ట్రాల్లో 2,300 మంది ప్రకృతి/సేంద్రియ రైతులకు శిక్షణ ఇచ్చి, నెలకు రూ. 1.2 లక్షలకు పైగా సంపాదించేలా ప్రాక్టికల్‌గా మార్గదర్శనం చేశామని అక్షయకల్ప ప్రతినిధి డాక్టర్ తేజేశ్వర్ రెడ్డి తెలిపారు. 30 మందితో త్వరలో ఒక బ్యాచ్‌ను ప్రారంభించనున్నామన్నారు. ఇతర వివరాలకు.. 89043 96761, 91132 03476.

### చౌహాన్ క్యు సేద్యంపై 12 నెలల శిక్షణ

దక్షిణ కొరియాకు చెందిన డా. చౌహాన్ క్యు ప్రకృతి వ్యవసాయ పద్ధతిపై న్యూ లైఫ్ ఫౌండేషన్(హైదరాబాద్) 12 నెలల పాటు యువతకు ఉచిత ఆచరణాత్మక శిక్షణ ఇవ్వనుంది. శాశ్వత ఎత్తుమడులపై ఉద్యాన పంటలను సాగు చేస్తూ అత్యంత తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులు సాధించటం ఎలాగో నేర్పిస్తామని ఫౌండేషన్ వ్యవస్థాపకుడు శివ సిందే తెలిపారు. రంగారెడ్డి జిల్లా షాబాద్ సమీపంలోని క్షేత్రంలో ఉచిత భోజన వసతులతో 12 నెలల పాటు శిక్షణ ఇస్తామని, పూర్తి చేసిన వారికి ధ్రువపత్రం ఇస్తామని అన్నారు. వ్యవసాయ డిప్లొమా విద్యార్థులకు స్టైపెండ్ ఇస్తామన్నారు.

కనీస చదువు: 10 తరగతి. కనీస వయసు: 18 ఏళ్లు.

ఇతర వివరాలకు.. 98660 73174.



NIPHM

## ఆఫ్రికా నత్తల నియంత్రణ అంత సులువు కాదు!

**తెలుగు రాష్ట్రాల్లో ఉద్యాన తోటలకు తీవ్ర నష్టం కలిగిస్తున్న ఆఫ్రికా నత్తల దండు**

**ప్రపంచవ్యాప్తంగా 'వంద దురాక్రమణ జాతుల' ఐయూసీఎన్ జాబితాలో ఇదొకటి**

**వాతావరణం తేమగా ఉన్న కాలాల్లో ఆఫ్రికా నత్తలు తామర తంపరగా విస్తరిస్తాయి**

**సమర్థవంతంగా అరికట్టే నిరూపిత పద్ధతులను వివరిస్తున్న ఎన్ఐపీహెచ్ఎం శాస్త్రవేత్తలు**

ప్రకృతిలో పుట్టిన ప్రాంతం దాటి ఇతర ప్రాంతాలకు చేరినప్పుడు తామర తంపరగా పెరుగుతూ జీవవైవిధ్యానికి ముప్పుగా పరిణమించే జాతులను ఇన్‌వాసివ్ స్పెసీస్ (దురాక్రమణ జాతులు) అంటారు. మొక్కలు, జీవులు ఈ జాబితాలో ఉంటాయి. స్వతహాగా పుట్టి పెరిగే వాతావరణ పరిస్థితుల్లో అవి సమస్యగా ఉండవు. అక్కడి నుంచి ఏదో ఒక విధంగా వేరే వాతావరణ పరిస్థితులున్న దేశాల్లోకి ప్రవేశించినప్పుడు అవి తమ సంతతిని తామర తంపరగా పెంపొందించుకుంటూ సమస్యాత్మకంగా మారతాయి. స్థానికంగా పంటలను ఆరగించేస్తూ.. రైతులను తీవ్ర ఇక్కట్ల పాలు చేస్తుంటాయి. సర్కారు తుమ్మ, వయ్యారిభామ అలాంటివే. ఈ జాబితాలో తాజాగా చేరింది 'జెయింట్ ఆఫ్రికన్ నత్త'. ఉత్తరాంధ్ర, కోస్తా ఆంధ్ర జిల్లాలతో పాటు తెలంగాణ రాష్ట్రంలోనూ కొన్ని చోట్ల కూరగాయలు, పండ్ల తోటల్లో కుప్పలు తెప్పలుగా ఆఫ్రికా నత్తలు తమ సంతతిని వృద్ధి చేసుకుంటూ పంటలను విధ్వంసకరంగా తినేస్తున్నాయి. దీంతో రైతులు తీవ్ర నష్టాల పాలవుతున్నారు. ఈ నేపథ్యంలో హైదరాబాద్‌లోని కేంద్ర వ్యవసాయ శాఖకు చెందిన నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ప్లాంట్ హెల్త్ మేనేజ్‌మెంట్ (ఎన్ఐపీహెచ్ఎం) శాస్త్రవేత్తలు **డాక్టర్ పి.శక్తివేల్, డాక్టర్ ఎ. మరియదాస్, డాక్టర్ సి. ఆలిస్ ఆర్ పి సుజీత** ఆఫ్రికా నత్తల బెడద నుంచి పంటలను, తోటలను కాపాడుకునే పద్ధతులను సూచిస్తున్నారు. 'సాక్షి సాగుబడి' కోసం వారు అందించిన వివరాలతో ప్రత్యేక కథనం.



మన దేశంలో దాదాపు 1,500 రకాల నత్తలున్నాయి. వాటిలో తొమ్మిది జాతుల నత్తలు పూలు, కూరగాయలు, పండ్ల తోటలకు హాని కలిగిస్తున్నాయి. హెలిక్స్ అనే సాధారణ నత్త హిమాచల్‌ప్రదేశ్, ఉత్తర ప్రదేశ్, ఆంధ్రప్రదేశ్, బిహార్, మహారాష్ట్ర, ఒడిశా వంటి రాష్ట్రాల్లో కనిపిస్తుంటుంది. అచటినా ఫులికా అనే జెయింట్ ఆఫ్రికన్ నత్త కూడా ఇప్పుడు తోడైంది. ఇది ఇప్పటికే మన దేశంలోని అనేక రాష్ట్రాలకు వ్యాపించింది. ఒడిశా, పశ్చిమ బెంగాల్, అస్సాం, తమిళనాడు, కేరళ, ఆంధ్రప్రదేశ్ తీరప్రాంతాలతో పాటు తెలంగాణలోనూ కొన్ని చోట్ల పండ్ల తోటలు, కూరగాయ తోటల్లో తామర తంపరగా విస్తరిస్తూ పెద్ద సమస్యగా మారింది. ఇంటర్నేషనల్ యూనియన్ ఫర్ కన్జర్వేషన్ ఆఫ్ నేచర్ (ఐయూసీఎన్) దీన్ని 'అత్యంత దురాక్రమణ గుణం కలిగిన వంద జాతు'ల్లో ఒకటిగా గుర్తించింది.

### నత్తల సమగ్ర నిర్వహణ మార్గాలివి:

- తోటను శుభ్రంగా ఉంచండి. కలుపు మొక్కలను తొలగించండి. నత్తలు లోపలికి రాకుండా తోట చుట్టూ మొక్కల్లేకుండా ఖాళీగా ఉంచండి.
- తోటలు/పొలాల్లోకి నత్తలు రాకుండా ఉండాలంటే చుట్టూతా ఉప్పు, సున్నపు పొడి లేదా కాపర్ సల్ఫేట్ చల్లితే చాలు. ఈ పదార్థాలను దాటి నత్తలు వెళ్లలేవు.
- ఉప్పు నత్తలను నిర్జలీకరణం చేసి, చంపుతుంది. కాపర్ సల్ఫేట్ విషపూరితమైన రసాయనం కాబట్టి అవరోధంగా పనిచేస్తుంది. వీటిని చల్లిన ప్రాంతాల్లో నత్తల సంఖ్య వేగంగా తగ్గుతుందని అధ్యయనాలు చెబుతున్నాయి. నత్తలు తోటల్లోకి ప్రవేశించకుండా లేదా మొక్కల కాండాలపైకి పాకకుండా నిరోధించడానికి నమ్మదగిన పద్ధతి ఇది.
- ప్లాస్టిక్ పాత్రలో కొద్దిగా బీరు, వైన్ లేదా ఈస్ట్‌లను పోసి.. ఆ పాత్ర అంచు నేలతో సమానంగా ఉండేలా, పాతిపెట్టాలి. నత్తలు పాక్కుంటూ వచ్చి అందులో పడతాయి. అప్పుడు ఉప్పు వేస్తే, చనిపోతాయి.
- నత్తలను ఆకర్షించడానికి కుండలు, బాక్సులు లేదా తడి సంచుల కింద నత్తలు లోపలికి వెళ్లే అంత ఖాళీ ఉండేలా రాళ్లు అమర్చి, వాటి లోపల క్యాబేజీ ఆకులు లేదా బొప్పాయి కాండాలను ఎరగా పెట్టి, రాత్రంతా అలా ఉంచాలి. ఉదయానికి నత్తలు వాటి కింద చేరతాయి. వాటిపై ఉప్పు చల్లితే చనిపోతాయి. లేదా వాటిని నలిపివేసి చంపండి.
- పండ్ల చెట్లు, కూరగాయ మొక్కల కాండాలకు ఎగబాకకుండా ఉండాలంటే.. వాటి చుట్టూ ఒక వలయంలో కొద్దిగా సూపర్ ఫాస్ఫేట్ ఎరువును చల్లండి.
- నత్తలు మొక్కలు, చెట్ల పైకి ఎక్కకుండా ఆపటానికి చెట్ల కాండాలకు సన్నని రాగి లేదా జింక్ రేకు (సుమారు 0.8 మిమీ మందం) చుట్టండి.
- నత్తలున్న తోటల్లో 3 శాతం కాపర్ సల్ఫేట్ ద్రావణం (అంటే.. 400 లీటర్ల నీటిలో 12 కిలోల కాపర్ సల్ఫేట్ కలిపి హెక్టారుకు) పిచికారీ చేయండి.
- కంచెలు/ప్రహరీలు, నత్తలు గుడ్లు పెట్టిన ప్రాంతాల్లో ఒక లీటరు నీటిలో కాపర్ సల్ఫేట్ (60 గ్రా.), పొగాకు (25 గ్రా.) రసం కలిపి పిచికారీ చేయడం ద్వారా కూడా నత్తల ముప్పును నియంత్రించవచ్చు.
- పొగాకు మిశ్రమాన్ని తయారు చేసే పద్ధతి: 50 గ్రాముల పొగాకును 1.5 లీటర్ల నీటిలో వేసి మరిగించండి. ద్రావణం 1 లీటరుకు తగ్గే వరకు మరిగించండి. అందులో, 1 లీటరు నీటిలో 60 గ్రాముల కాపర్ సల్ఫేట్ కలిపిన ద్రావణాన్ని కలపండి. ఆ ద్రావణాన్ని నత్తలున్న చోట పిచికారీ చేయండి.
- ప్రభుత్వం ప్రచారోద్యమం చేపట్టి సమగ్ర చర్యల ద్వారా నత్తల సమస్యను నియంత్రించవచ్చు. మొక్కలు/చెట్లపై ఉండే నత్తలను ప్రజల సహకారంతో చేతులతో తీసివేయించటం, బాతులతో నత్తలను తినిపించటం వంటి పటిష్టమైన చర్యలు తీసుకుంటే ఆఫ్రికా నత్తల సంతతి వ్యాప్తిని నియంత్రించడానికి అవకాశం ఉంది.

### నత్తల ద్రావణంతో పంటలకు మేలు!

నత్తలు పంటలకు నష్టదాయకంగా పరిణమిస్తున్న నేపథ్యంలో ఈ నత్తలతో పంటల పెరుగుదలను వేగవంతం చేసే ద్రావణం(గ్రోత్ పమోటర్) తయారు చేసుకొని పంటలపై పిచికారీ చేయటం ద్వారా రైతులు ప్రయోజనం పొందవచ్చని కాకినాడ జిల్లా ప్రకృతి వ్యవసాయ శాఖ ప్రాజెక్ట్ మేనేజర్ తాతారావు 'సాక్షి సాగుబడి'కి తెలిపారు.

నత్తల ద్రావణం తయారు చేసే పద్ధతి: అవసరం ఉన్నన్ని నత్తలను ఒక డ్రమ్ములో వేసుకొని, అవి మునిగిన తర్వాత 2 అంగుళాల పై వరకు నిమ్మ రసం పొయ్యాలి. 15 రోజులు ఊరబెట్టాలి. అప్పటికి నత్తలు కోడిగుడ్ల మాదిరిగానే పూర్తిగా ద్రావణంలో కరిగిపోతాయి. వడగట్టిన ద్రావణానికి సమాన తూకంలో బెల్లం కలిపి 7 రోజులు వూరబెట్టండి. నత్తల ద్రావణం అర లీటరును 100 లీటర్ల నీటిలో కలిపి ఒక ఎకరంలో ఏ పంటల కైనా పిచికారీ చెయ్యొచ్చు. నత్తల సమస్య తీరిపోతుంది. పంట బలంగా పెరిగి రైతుకు డబ్బులు వస్తాయని ఆయన సూచించారు.




### నత్తలన్నీ గుడ్లు పెడతాయి!

జెయింట్ ఆఫ్రికన్ జాతికి చెందిన నత్తలన్నిటిలో మగ, ఆడ జననాంగాలుంటాయి. కాబట్టి ఆడ, మగ కూడా గుడ్లు పెడతాయి. సాధారణంగా శరద్ రుతువు, శీతాకాలంలో వాతావరణం తేమగా ఉన్నప్పుడు జతకూడి తడి నేలలో గుండ్రని తెల్ల గుడ్లు పెడతాయి. తడి వాతావరణంలో గుడ్లు రెండు నుంచి నాలుగు వారాల్లో పిల్లలు పుడతాయి. పిల్ల నత్తలు ఒక సంవత్సరం తర్వాత గుడ్లు పెట్టటం ప్రారంభిస్తాయి. నత్త మూడు నుంచి ఐదేళ్లు జీవిస్తుంది. జెయింట్ ఆఫ్రికన్ నత్త సంవత్సరానికి ఒకసారి 50-200 గుడ్లు పెడుతుంది. దాని జీవితకాలంలో వెయ్యి వరకు గుడ్లు పెడుతుంది.



సత్యమేవ జయతే
# సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 16 వెల: ₹ 6.50
సంపుటి: 18
సంచిక: 196
SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



## పసిడి హైజంప్...!

బంగారం ధర మరో రికార్డు గరిష్టానికి చేరింది. ఒక్క రోజే 10 గ్రాములకు రూ.2,700 ఎగిసి, ఢిల్లీ మార్కెట్లో రూ.1,23,300 నమోదు చేసింది. వెండి సైతం కిలోకి రూ.7,400 పెరిగి మరో నూతన జీవిత కాల గరిష్ట స్థాయి రూ.1,57,400కు చేరింది. -13లో

# సీజేఐపై దాడికి లాయర్ యత్నం



### జస్టిస్ గవాయ్‌పైకి బూటు విసిరేందుకు ప్రయత్నించిన రాకేశ్

- కోర్టు గదిలో కేసుల విచారణ జరుగుతుండగా ఘటన
- అప్రమత్తమై అడ్డుకున్న భద్రతా సిబ్బంది
- దాడులు తనపై ఎలాంటి ప్రభావం చూపబోవన్న జస్టిస్ గవాయ్

### జస్టిస్ గవాయ్‌కి ప్రధాని మోదీ ఫోన్

ఈ ఘటన ప్రతి ఒక్క భారతీయుడిని ఆగ్రహానికి గురి చేసిందని వ్యాఖ్య

### రాజ్యాంగంపై దాడి: సోనియా

- వివరాలు 6లో ▶

# వైద్యశాస్త్రంలో ముగ్గురికి నోబెల్


మేరీ ఈ.బ్రంకోవ్ ఫ్రెడ్ రామ్స్‌డెల్ షికోమ్ సకాగుచీ

రోగ నిరోధక వ్యవస్థపై పరిశోధనలకు విశిష్ట గుర్తింపు

**మేరీ ఈ.బ్రంకోవ్, ఫ్రెడ్ రామ్స్‌డెల్, షికోమ్ సకాగుచీకి ఉమ్మడిగా బహుమతి**

నోబెల్ కమిటీ ప్రకటన

- వీరికి ఉమ్మడిగా 1.2 మిలియన్ డాలర్లు (రూ.10.65 కోట్లకుపైగా) అందజేస్తారు. విజేతలకు ఒక్కొక్కరికి 18 కేరట్ల బంగారు పతకం లభిస్తుంది

6లో



## ఎకరం రూ.177 కోట్లు

- హైదరాబాద్‌లోని రాయదుర్గంలో టీజీఐఐసీ భూముల వేలంలో సరికొత్త రికార్డు
- ఏకంగా రూ. 1,357.59 కోట్లు పలికిన 7.67 ఎకరాల ప్లాటు
- ఎకరా రూ. 141.5 కోట్ల చొప్పున అమ్ముడుపోయిన 11 ఎకరాల స్థలం
- సుమారు 18 ఎకరాల వేలంతో ఖజానాకు రూ. 3,135 కోట్ల రాబడి

- వివరాలు 3లో

**గుడ్లు & చికెన్ ధరలు: హైదరాబాద్ జోన్**

| | | | | |
|---|---|---|---|---|
| 12 గుడ్ల రిటైల్ ధర ₹70 | ఫారం వద్ద లైవ్ బర్డ్ | 115 | బ్రాయిలర్ స్కిన్‌తో | 199 |
| | రిటైల్ లైవ్ బర్డ్ | 137 | స్కిన్ లెస్ | 226 |

# ఎల్ లిల్లీ @రూ.9 వేల కోట్లు

**రాష్ట్రంలో ఫార్మా దిగ్గజం భారీ పెట్టుబడి | హైదరాబాద్‌లో మాన్యుఫాక్చరింగ్ హబ్**

### సీఎం రేవంత్‌తో భేటీ అనంతరం ఎల్ లిల్లీ ప్రకటన

- దేశంలోనే తొలిసారిగా తెలంగాణలో ఏర్పాటు
- తయారీ కర్మాగారం, నాణ్యత కేంద్రం ద్వారా యువతకు ఉద్యోగాలు
- డయాబెటిస్, కేన్సర్, ఒబెసిటీ, అల్జీమర్స్, ఇమ్యూన్ వ్యాధులకు కొత్త ఔషధాలు, కొత్త ఆవిష్కరణలు
- ఆగస్టు 4న హైదరాబాద్‌లో ఎల్ లిల్లీ జీసీసీని ప్రారంభించిన సీఎం
- సంస్థ తాజా ప్రకటనతో గ్లోబల్ లైఫ్ సైన్సెస్ హబ్‌గా తెలంగాణ


ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో ఎల్ లిల్లీ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్. చిత్రంలో మంత్రి శ్రీధర్ బాబు, సంస్థ ప్రతినిధి శిల్పాగుప్తా

సాక్షి, హైదరాబాద్: ఫార్మా రంగంలో ప్రపంచంలోనే దిగ్గజ కంపెనీ ఎల్ లిల్లీ తెలంగాణలో భారీ పెట్టుబడి పెడుతున్నట్లు ప్రకటించింది. దేశంలో తొలిసారిగా హైదరాబాద్‌లో తమ మాన్యుఫాక్చరింగ్ హబ్ (తయారీ కర్మాగారం)ను నెలకొల్పుతున్నట్లు వెల్లడించింది. దీని కోసం సుమారు రూ.9 వేల కోట్లు (ఒక బిలియన్ డాలర్లు) వెచ్చించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసింది. తద్వారా ప్రపంచ వ్యాప్తంగా తమ ఔషధాల సరఫరా సామర్థ్యాన్ని విస్తరించనుంది. సోమవారం ఎల్ లిల్లీ కంపెనీ ప్రతినిధులు ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ సెంటర్‌లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో భేటీ అయ్యారు. ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఎల్ లిల్లీ సంస్థ ప్రెసిడెంట్ ప్యాట్రిక్ జాన్సన్, సంస్థ ఇండియా ప్రెసిడెంట్ విన్సెలో టుకర్, పరిశ్రమల శాఖ ప్రత్యేక కార్యదర్శి సంజయ్ కుమార్, సీఎం ప్రత్యేక కార్యదర్శి అజిత్‌రెడ్డి ఈ సమావేశంలో పాల్గొన్నారు. ఈ భేటీ అనంతరం తమ విస్తరణ ప్రణాళికలు, రాష్ట్రంలో భారీ పెట్టుబడులపై ఎల్ లిల్లీ కీలక ప్రకటన చేసింది. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సహకారంతో దేశంలో అధునాతన తయారీ యూనిట్ ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించింది.

### క్వాలిటీ హబ్ ఏర్పాటు

హైదరాబాద్‌లో ఏర్పాటు చేసే మాన్యుఫాక్చరింగ్, క్వాలిటీ హబ్ తమకు అత్యంత కీలకమని ఎల్ లిల్లీ కంపెనీ ప్రకటించింది. 'సంస్థ హైదరాబాద్ నుంచి దేశంలో ఉన్న ఎల్ లిల్లీ కాంట్రాక్ట్ మాన్యుఫాక్చరింగ్ నెట్‌వర్క్‌కు సాంకేతిక పర్యవేక్షణ, నాణ్యత నియంత్రణ, అధునాతన సాంకేతిక సామర్థ్యాలను అందిస్తుంది. కొత్త హబ్ ఏర్పాటుతో తెలంగాణతో పాటు దేశంలో ఫార్మా రంగంలో పని చేస్తున్న వేలాది మంది ప్రతిభావంతులకు ఉద్యోగావకాశాలు లభిస్తాయి. త్వరలో కెమిస్టులు, అనలిటికల్ సైంటిస్టులు, క్వాలిటీ కంట్రోల్, మేనేజ్‌మెంట్ నిపుణులు, ఇంజనీర్ల

మిగతా 3వ పేజీలో ▶

# ముందు హైకోర్టుకు వెళ్లండి

### బీసీలకు 42% రిజర్వేషన్లపై తొలుత అక్కడే తేల్చుకోండి



- సరైన న్యాయ ప్రక్రియను పాటించాల్సిందేనన్న సుప్రీం ధర్మాసనం
- హైకోర్టులో అనుకూల ఉత్తర్వులు రానంత మాత్రాన సుప్రీంకోర్టుకు రావడం సరికాదని వ్యాఖ్య
- పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరణ.. ఉపసంహరణకు అనుమతి

2లో

# నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

### షెడ్యూల్ విడుదల చేసిన కేంద్ర ఎన్నికల సంఘం

2లో

**ఈ నెల 13న నోటిఫికేషన్ జారీ • నవంబర్ 14న ఫలితాలు**

## 2 దశల్లో బిహార్ ఎన్నికలు

- అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- నవంబర్ 6న మొదటి దశ, 11న రెండో దశ పోలింగ్.. 14న ఓట్ల లెక్కింపు
- ఎస్ఐఆర్‌తో ఓటర్ల జాబితా శుద్ధీకరణ ..
- అన్ని ఎన్నికలకు తల్లిలాంటివి బిహార్ ఎన్నికలు
- సీఈసీ జ్ఞానేశ్ కుమార్ వెల్లడి

6లో



# కొండ చరియలు.. విరిగిపడుతున్నాయ్!

- దేశవ్యాప్తంగా అనేక రాష్ట్రాల్లో తీవ్ర ముప్పు
- మొత్తం 4.3 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం
- 44% మధ్యస్థ, అధిక ముప్పు ఉన్న ప్రాంతం
- మ్యాపింగ్ చేసి ప్రభావం గుర్తించిన జీఎస్ఐ

కొండచరియలు విరిగిపడి పలువురి మృతి.. నిలిచిపోయిన రాకపోకలు.. యాత్రికుల అష్టకష్టాలు.. ఇలాంటి వార్తలు ఇటీవల ఎక్కువగా చూస్తున్నాం. కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనల్లో ప్రాణ, ఆస్తి నష్టం భారీగానే జరుగుతోంది. అందుకే దేశవ్యాప్తంగా ముప్పు ఉండే ప్రాంతాలను గుర్తించడంతోపాటు నష్ట నివారణ చర్యలను కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. - సాక్షి, స్పెషల్ డెస్క్

- ➤ పశ్చిమ బెంగాల్‌లోని మిరిక్, డార్జిలింగ్ హిల్స్‌లో కుండపోత వర్షాలకు కొండచరియలు విరిగిపడి అక్టోబరు 5న 20 మందికిపైగా ప్రాణాలు కోల్పోయారు. ఇళ్లు ధ్వంసమయ్యాయి. రహదారులు దెబ్బతిన్నాయి.
- ➤ ఆగస్టు నెలాఖరులో కురిసిన భారీ వర్షాలకు వైష్ణోదేవీ ఆలయ సమీపంలో కొండ చరియలు విరిగిపడి సుమారు 30 మంది మరణించారు.
- ➤ జమ్మూ కశ్మీర్, ఉత్తరాఖండ్, హిమా చల్‌ప్రదేశ్ వంటి రాష్ట్రాల్లో భారీ వర్షాలు పడితే కొండచరియలు విరిగి పడటం చాలాసహజం. ఆ సమయాల్లో ప్రజలు ప్రాణాలు గుప్పిట్లో పెట్టుకుని బతుకుతుంటారు.
- ➤ 2024 జూలైలో కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు కూలిన ఘటనల్లో ఏకంగా 260కిపైగా చనిపోయారు. ఇలా చెప్పుకుంటూ పోతే ఎన్నో.

### మ్యాపింగ్ చేసిన జీఎస్ఐ

కొండచరియలు విరిగిపడే అవకాశం ఉన్న ఎత్తైన కొండ ప్రాంతాలను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జీఎస్ఐ) దేశవ్యాప్తంగా మ్యాపింగ్ చేసింది. 19 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లో మొత్తం 4.3 లక్షల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో ఈ ముప్పు ప్రాంతాలు విస్తరించాయి.

### ముప్పును బట్టి..

కొండచరియలు విరిగిపడే ముప్పు తీవ్రతను బట్టి తక్కువ, మధ్య, అధిక ప్రాంతాలుగా జీఎస్ఐ విభజించింది. ఇందులో 63 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణం అధిక ప్రమాద జోన్‌లో ఉందని తేలింది. అలాగే 1,26,000 చ.కి.మీ. మధ్యస్థంగా, 2,45,000 చ.కి.మీ. తక్కువ ప్రమాదం ఉన్న ప్రాంతంగా వెల్లడించింది. హిమాచల్ ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, ఉత్తరాఖండ్, లద్దాఖ్.. అధిక ప్రమాదాన్ని ఎదుర్కొంటున్న ప్రాంతాలుగా ప్రకటించింది.

### ముప్పు ఉన్న ప్రధాన ప్రాంతాలు (విస్తీర్ణం వేల చ.కి.మీ.లలో)

| రాష్ట్రం | తక్కువ | మధ్య | అధిక | రాష్ట్రం | తక్కువ | మధ్య | అధిక |
|---|---|---|---|---|---|---|---|
| ఆంధ్రప్రదేశ్ | 1 | 1 | 0 | లద్దాఖ్ | 17 | 15 | 8 |
| అరుణాచల్ ప్రదేశ్ | 33 | 27 | 10 | మహారాష్ట్ర | 15 | 12 | 2 |
| అస్సాం | 21 | 3 | 1 | మణిపూర్ | 13 | 7 | 4 |
| హిమాచల్ ప్రదేశ్ | 17 | 12 | 12 | మిజోరం | 13 | 6 | 4 |
| జమ్మూ కశ్మీర్ | 19 | 7 | 3 | తమిళనాడు | 8 | 2 | 1 |
| కర్ణాటక | 26 | 4 | 1 | ఉత్తరాఖండ్ | 18 | 12 | 9 |
| కేరళ | 10 | 7 | 3 | పశ్చిమ బెంగాల్ | 1 | 1 | 1 |

### అధిక స్పష్టతతో..

రిమోట్ సెన్సింగ్, క్షేత్రస్థాయి సిబ్బంది ఆధారంగా కొండచరియలు విరిగిపడ్డ 91,000 సంఘటనల సమాచారాన్ని జీఎస్ఐ సేకరించింది. 33,904 ఘటనలను ధ్రువీకరించింది. అలాగే రాష్ట్ర ప్రభుత్వాలతో సంప్రదించి గుర్తించిన 200 కీలక ప్రాంతాల్లో మరింత ఆధునాతన మీసో–స్కేల్ మ్యాపింగ్‌కు శ్రీకారం చుట్టింది. వీటిలో ఈ ఏడాది మార్చి నాటికి 160 ప్రాంతాల్లో మ్యాపింగ్ పూర్తిచేసింది. 2028లోగా ఈ ప్రాజెక్టు పూర్తి చేస్తారు. పెళుసైన కొండ ప్రాంతాల్లో మౌలిక సదుపాయాల ప్రణాళిక, జోనింగ్ నిబంధనలు, కమ్యూనిటీ భద్రతకు ఈ అధిక స్పష్టత కలిగిన మ్యాప్స్ ఎంతో ఉపయోగపడతాయి.

### ముందస్తు హెచ్చరికలు

ప్రకృతి వైపరీత్యాలు పెరుగుతున్న నేపథ్యంలో ప్రభుత్వం కొండచరియల ముప్పు అంచనా సామర్థ్యాలను పెంచుతోంది. వాతావరణ శాఖ, ఇతర సంస్థల సహకారంతో జీఎస్ఐ అభివృద్ధి చేసిన 'ప్రాంతీయ కొండచరియల అంచనా వ్యవస్థ (ఆర్ఎల్ఎఫ్ఎస్)'.. వర్షపాతం, వాతావరణ పరిస్థితుల ఆధారంగా ముందస్తు హెచ్చరికలను అందిస్తోంది. జీఎస్ఐ ఈ సంవత్సరం రుతుపవనాలు ప్రారంభం కాగానే ఎనిమిది రాష్ట్రాల్లోని 21 జిల్లాల్లో చేపట్టాల్సిన కార్యాచరణతోపాటు కొండచరియలు విరిగిపడే ముప్పు ఉందని హెచ్చరించింది. ఈ జాబితాలో తమిళనాడు, పశ్చిమ బెంగాల్, కేరళ, కర్ణాటక ఉన్నాయి.

### దేశంలో కొండచరియల ముప్పు తీవ్రతను బట్టి విస్తీర్ణ శాతం

| | |
|---|---|
| తక్కువ | 56 |
| మధ్యస్థం | 29 |
| అధికం | 15 |




## ఖర్గేకు సీఎం రేవంత్ పరామర్శ

సాక్షి, హైదరాబాద్: ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను సీఎం రేవంత్‌రెడ్డి పరామర్శించారు. వైద్యుల సూచన మేరకు ఇటీవల పేస్‌మేకర్ అమర్చుకున్న ఖర్గేను.. సీఎం సోమవారం బెంగళూరులో కలిశారు. ఖర్గే ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకుని.. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికతో పాటు స్థానిక సంస్థల ఎన్నికలు, ఈ ఎన్నికల్లో బీసీలకు రిజర్వేషన్ల కల్పనపై కోర్టుల్లో జరుగుతున్న విచారణాంశాలపై రేవంత్ ఖర్గేతో చర్చించారని గాంధీభవన్ వర్గాల సమాచారం. ఖర్గేతో భేటీ అనంతరం సీఎం రేవంత్ హైదరాబాద్‌కు చేరుకున్నారు. డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పొన్నం ప్రభాకర్, వాకిటి శ్రీహరి కూడా ఖర్గేను పరామర్శించారు.

# ముందు హైకోర్టుకు వెళ్లండి

- బీసీలకు 42% రిజర్వేషన్లపై తొలుత అక్కడే తేల్చుకోండి
- సరైన న్యాయ ప్రక్రియను పాటించాల్సిందేనన్న సుప్రీం ధర్మాసనం



సాక్షి, న్యూఢిల్లీ: తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో నంబర్ 9ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌ను విచారించేందుకు సుప్రీంకోర్టు నిరాకరించింది. హైకోర్టును కాదని నేరుగా తమ వద్దకు రావడాన్ని తప్పుబట్టింది. సరైన న్యాయ ప్రక్రియను పాటించాల్సిందేనంటూ, ముందు హైకోర్టుకు వెళ్లమని సూచించింది. పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతించింది.

**ఇక్కడికి ఎందుకొచ్చారో చెప్పండి**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల కల్పన జీవోపై వంగా గోపాల్‌రెడ్డి సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన సంగతి తెలిసిందే. కాగా ఈ అంశంపై అత్యవసర విచారణ జరపాలని ఆయన కోరారు. అయితే సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతా ధర్మాసనం దీనిపై విచారణ చేపట్టింది. పిటిషనర్ తరపు న్యాయవాది వాదనలు వినిపిస్తూ.. రాజ్యాంగంలోని ఆర్టికల్ 32 కింద దాఖలు చేసిన రిట్ పిటిషన్‌ను విచారణకు స్వీకరించాలని కోరారు. ఈ అంశంపై ఇప్పటికే హైకోర్టులో రెండు కేసులు పెండింగ్‌లో ఉన్నాయని, మరికొద్ది రోజుల్లో ఎన్నికల నోటిఫికేషన్ రానుండటంతో అత్యవసరంగా విచారించాలని అభ్యర్థించారు. ఆయన కేసు వివరాల్లోకి వెళ్ళకముందే, జస్టిస్ విక్రమ్‌నాథ్ ఆయన్ను అడ్డుకున్నారు. 'ముందు మీరు ఆర్టికల్ 32 కింద ఇక్కడికి ఎందుకు వచ్చారో చెప్పండి?'అని సూటిగా ప్రశ్నించారు. అయినప్పటికీ ఆయన ధర్మాసనాన్ని ఒప్పించేందుకు తీవ్రంగా ప్రయత్నించారు. తమ క్లయింట్‌ను ఇబ్బంది పెట్టేందుకే తెలంగాణ ప్రభుత్వం పని దినాల్లో చివరి రోజైన శుక్రవారం నాడు కీలకమైన సర్క్యులర్ జారీ చేసిందంటూ వాదించారు. తాము అత్యవసర విచారణ కోసం సాయంత్రం 6 గంటలకు హైకోర్టు న్యాయమూర్తి నివాసానికి కూడా వెళ్లామని, కానీ అక్కడ ఉపశమనం లభించలేదని నివేదించారు. ఇక 9వ తేదీన ఎన్నికల నోటిఫికేషన్ వస్తుందని, ఇప్పుడు కోర్టు జోక్యం చేసుకోకపోతే తీవ్ర నష్టం జరుగుతుందన్నారు. దీంతో జస్టిస్ విక్రమ్‌నాథ్ జోక్యం చేసుకున్నారు.

**తొలుత ఆ అడ్డంకిని దాటండి**

'ముందు మీరు ఆ అడ్డంకిని దాటండి, ఆ తర్వాతే కేసు యోగ్యతపై (మెరిట్స్) మేము వాదనలు వింటాం'అని న్యాయమూర్తి తేల్చి చెప్పారు. హైకోర్టులో అనుకూలమైన ఉత్తర్వులు రానంత మాత్రాన, సుప్రీంకోర్టును ప్రత్యామ్నాయంగా వాడుకోవాలని చూడటాన్ని ధర్మాసనం తప్పుబట్టింది. న్యాయవాదిని ఉద్దేశించి.. 'మీ క్లయింట్లకు మీరు సరైన సలహా ఇచ్చి ఉండాల్సింది..'అని జస్టిస్ విక్రమ్‌నాథ్ వ్యాఖ్యానించారు. పిటిషన్‌ను ఉపసంహరించుకునేందుకు అనుమతిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. హైకోర్టును ఆశ్రయించేందుకు స్వేచ్ఛ ఇచ్చారు. ఈ పరిణామంతో తెలంగాణ ప్రభుత్వం తరఫున వాదనలు వినిపించేందుకు సిద్ధమైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మను సింఘ్వీకి ఆ అవసరం లేకుండా పోయింది. కాగా సుప్రీం నిర్ణయంతో రాష్ట్ర ప్రభుత్వానికి తాత్కాలికంగా ఊరట లభించినట్టయ్యింది. సుప్రీంకోర్టులో పిటిషన్ నేపథ్యంలో సోమవారం ఏం జరుగుతుందో, కోర్టు ఏం చెబుతుందో, స్థానిక ఎన్నికలు జరుగుతాయో లేదో అనే ఉత్కంఠ నెలకొంది. సర్వోన్నత న్యాయస్థానం పిటిషన్‌ను విచారించేందుకు నిరాకరించడంతో ఇక ఈ నెల 8వ తేదీన హైకోర్టులో జరిగే విచారణ, తీర్పు కీలకంగా మారనుంది.

## సుప్రీం నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం

- 42 శాతం బీసీ రిజర్వేషన్ల అమలుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది
- ఢిల్లీలో మీడియాతో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క



మాట్లాడుతున్న భట్టి. చిత్రంలో పొన్నం, వాకిటి

సాక్షి, న్యూఢిల్లీ: స్థానికసంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ తమ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో–9ను సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌పై హైకోర్టులోనే తేల్చుకోవాలని సుప్రీంకోర్టు పేర్కొనడాన్ని స్వాగతిస్తున్నామని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. సోమవారం సుప్రీంకోర్టులో వాదనల అనంతరం మంత్రులు వాకిటి శ్రీహరి, పొన్నం ప్రభాకర్‌గౌడ్, జై సంవిధాన్ కమిటీ చైర్మన్ వినయ్, ప్రభుత్వ స్టాండింగ్ కౌన్సిల్ శ్రావణ్‌కుమార్ తదితరులతో కలిసి భట్టి విలేకరులతో మాట్లాడారు. స్థానిక సంస్థలతోపాటు విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలనే విషయంలో ప్రభుత్వం చాలా స్పష్టంగా ఉందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో ఇప్పటికే అసెంబ్లీలో బిల్లును ఆమోదించడంతోపాటు తీసుకొచ్చిన జీవో అమలు కోసం పోరాడతామని భట్టి స్పష్టం చేశారు.

**న్యాయ ప్రక్రియలోనూ బీజేపీ, బీఆర్ఎస్ సహకరించాలి: మంత్రి పొన్నం**

బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో సహకరించిన బీజేపీ, బీఆర్ఎస్ నేతలు న్యాయ ప్రక్రియలోనూ సహకరించాలని మంత్రి పొన్నం ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు. కేంద్రం, రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులు ఆమోదం పొందేలా.. రాజ్యాంగం ద్వారా అడ్డంకులు లేకుండా చూడాలని బీజేపీ బీసీ ఎంపీలైన ఈటల రాజేందర్, బండి సంజయ్, ధర్మపురి అర్వింద్‌లను కోరారు. బీసీలపట్ల బీజేపీ నేతలకు చిత్తశుద్ధి ఉంటే కోర్టులో ఇంప్లీడ్ అవ్వాలని సవాల్ విసిరారు. ఈ విషయంలో ప్రచారం కోసం తాము ఢిల్లీకి రాలేదని.. చిత్తశుద్ధిని చాటుకోవడానికే వచ్చామని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు తెలుసుకోవాలన్నారు.


## స్థానిక ఎన్నికల్లో 'సిరా' చుక్కపై ఎస్ఈసీ స్పష్టత

- ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికల్లో ఓటరు ఎడమచెయ్యి చూపుడు వేలుపై..
- పంచాయతీ ఎన్నికల్లో మధ్యవేలుపై చుక్క వేయాలని ఆదేశం

సాక్షి, హైదరాబాద్ : ఈనెల 23, 27 తేదీల్లో (రెండుదశల్లో) ఎంపీటీసీ, జెడ్పీటీసీ, ఆ తర్వాత గ్రామపంచాయతీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో.. ఓటింగ్ సందర్భంగా వేలిపై సిరా చుక్క వేసే విషయంలో రాష్ట్ర ఎన్నికల సంఘం (ఎస్ఈసీ) స్పష్టతను ఇచ్చింది. ఈ నెల 23న తొలిదశ మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో భాగంగా ఎంపీటీసీ, జెడ్పీటీసీ స్థానాలకు ఓటింగ్ సందర్భంగా ఓటర్ ఎడమచెయ్యి చూపుడు వేలుపై వేసిన ఓటుకు గుర్తుగా సిరా చుక్క వేయాలని ఎన్నికల అధికారులకు తెలిపింది. ఆ తర్వాత ఈ నెల 31, నవంబర్ 4, 8 తేదీల్లో జరగనున్న మూడుదశల గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా ఓటరు మధ్యవేలుపై సిరాచుక్క వేయాలని పేర్కొంది. ఎస్ఈసీ కార్యదర్శి మంద మకరందు ఈ మేరకు ఓ సర్క్యులర్ ద్వారా జిల్లా కలెక్టర్లు, జిల్లా ఎన్నికల అధికారులు, అదనపు కలెక్టర్లు (స్థానికసంస్థలు), జెడ్పీ సీఈవోలు, డీపీవోలు, ఎంపీడీవోలు, రిటర్నింగ్ అధికారులకు సమాచారం పంపించారు.

## జీవో 9 రాజ్యాంగానికి వ్యతిరేకం.. కోర్టుల్లో నిలవదు

**జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య**



సాక్షి, న్యూఢిల్లీ: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన జీవో 9 రాజ్యాంగానికి వ్యతిరేకమని జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ ఈశ్వరయ్య అభిప్రాయపడ్డారు. ఈ జీవో న్యాయస్థానం ముందు నిలవదని స్పష్టం చేశారు. తెలంగాణ ఎమ్మెల్యేలందరూ కలిసి ఇంప్లీడ్ పిటిషన్ వేసి, రాష్ట్రప్రభుత్వానికి మద్దతు తెలిపినా 42 శాతం రిజర్వేషన్ల అమలు సాధ్యం కాదని అన్నారు. సోమవారం తెలంగాణభవన్‌లో జస్టిస్ ఈశ్వరయ్య విలేకరులతో మాట్లాడుతూ, తమిళనాడు తరహాలో బీసీ రిజర్వేషన్ల చట్టాన్ని రాజ్యాంగంలోని 9వ షెడ్యూల్లో చేరిస్తేనే రిజర్వేషన్లకు రాజ్యాంగ భద్రత లభిస్తుందని, అప్పుడే బీసీ రిజర్వేషన్ల అమలు సాధ్యమవుతుందని అన్నారు. ప్రస్తుత పరిస్థితులలో కేంద్రం నిధులు రావాలన్నా, స్థానిక సంస్థలు అభివృద్ధి చెందాలన్నా 50 శాతం రిజర్వేషన్లకు లోబడి ఎన్నికలు జరపాలని తెలిపారు. లేదంటే ఎన్నికలను వాయిదా వేసి, కేంద్రంపై ఒత్తిడి తెచ్చి బీసీ రిజర్వేషన్లను 9వ షెడ్యూల్లో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేయాలని సూచించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో కేంద్ర ప్రభుత్వానికి చిత్త శుద్ధి లేదు కాబట్టే బిల్లులు చట్టరూపం దాల్చడంలేదని ఈశ్వరయ్య చెప్పారు.



ఇదండీ సంగతి

## బీసీ రిజర్వేషన్ల జీవోను కొట్టేయండి

- హైకోర్టులో మరో పిటిషన్ దాఖలు
- రిజర్వేషన్లు సమర్థిస్తూ పలువురు ఇంప్లీడ్

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లను పెంచుతూ ప్రభుత్వం జారీ చేసిన జీవో–9ను కొట్టేయాలంటూ హైకోర్టులో మరో పిటిషన్ దాఖలైంది. వికారాబాద్ జిల్లా ధరూర్ గ్రామానికి చెందిన మడివాల మచ్చదేవ రజకుల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.లక్ష్మయ్యతోపాటు హైదరాబాద్ బాగ్‌లింగంపల్లికి చెందిన న్యాయ వాది సి.శాంతప్ప ఈ పిటిషన్ వేశారు. 'పంచాయతీ ఎన్నికల్లో బీసీ–ఏ, బీ, సీ, డీ, ఈ లకు కేటగిరీలవారీగా రిజర్వేషన్లు కల్పించలేదు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ జారీ చేసిన జీవోను వెంటనే నిలిపేయాలి. చట్ట ప్రకారం బీసీ రిజర్వేషన్లను ఏ, బీ, సీ, డీలుగా వర్గీకరించాలి. ఆ తర్వాతే ఎన్నికలు నిర్వహించేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలి. అప్పటివరకు జీవో–9ను నిలిపివేయాలి'అని పిటిషనర్లు కోరారు.

**మా వాదనలూ వినండి...**

'ఇందిరా సాహ్నీ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసులో సుప్రీంకోర్టు విద్య, ఉద్యోగ రంగాలను మాత్రమే ప్రస్తావించింది. ఈడబ్ల్యూఎస్ రిజర్వేషన్లతో 50 శాతం పరిమితి దాటిపోయింది. సుప్రీం మార్గదర్శకాల మేరకే ప్రభుత్వం జీవో–9 జారీ చేసింది. ఈ పిటిషన్‌లో మా వాదనలూ వినాలి'అంటూ కాంగ్రెస్ నేతలు వి.హనుమంతరావు, మెట్టు సాయికుమార్, లక్ష్మణ్ యాదవ్, బీసీ మేధావుల ఫోరం అధ్యక్షుడు టి.చిరంజీవులు ఇంప్లీడ్ పిటిషన్లు దాఖలు చేశారు. వాటన్నింటిపై రేపు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం విచారణ చేపట్టనుంది. కాగా, ఇదే అంశంపై మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు చెందిన బుట్టెంగారి మాధవరెడ్డితోపాటు మరొకరు హైకోర్టులో గత నెల హౌస్ మోషన్ పిటిషన్ దాఖలు చేశారు.

## 'స్థానిక' గుర్తుల కేటాయింపు



సాక్షి, హైదరాబాద్: త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేయనున్న గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర పార్టీలకు గుర్తులు కేటాయిస్తూ రాష్ట్ర ఎన్నికల కమిషనర్ ఐ.రాణి కుముదిని ఉత్తర్వులు జారీ చేశారు. మండల, జిల్లా పరిషత్ ఎన్నికల్లో భాగంగా.. పార్టీల తరఫున పోటీ చేస్తున్న అభ్యర్థులకు ఈ గుర్తులపై పోటీ చేసే అవకాశం ఉంటుంది. రాష్ట్ర ఎన్నికల సంఘం వద్ద జాతీయ పార్టీలుగా గుర్తింపు పొందిన ఇండియన్ నేషనల్ కాంగ్రెస్‌కు హస్తం, భారతీయ జనతా పార్టీకి కమలం, బీఎస్పీకి ఏనుగు, ఆమ్ ఆద్మీ పార్టీకి చీపురు, సీపీఎంకు సుత్తి, కొడవలి నక్షత్రం, తెలంగాణలో రాజకీయ పార్టీలుగా గుర్తింపు పొందిన బీఆర్ఎస్‌కు కారు, ఎంఐఎంకు గాలిపటం గుర్తులను కేటాయించారు.

## ఏదో సాధించామని చెప్పడం విడ్డూరం

- హైకోర్టులో పెండింగ్ ఉందనే సుప్రీం డిస్మిస్ చేసింది: బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు



సాక్షి, హైదరాబాద్: సుప్రీంకోర్టు బీసీ రిజర్వేషన్ల పిటిషన్‌ను డిస్మిస్ చేస్తే..దీని నుంచి రాజకీయ లబ్ధి పొందేందుకు ఏదో సాధించామని రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నేతలు చెప్పుకోవడం విడ్డూరంగా ఉందని బీజేపీ అధ్యక్షుడు ఎన్.రాంచందర్‌రావు ఎద్దేవా చేశారు. దీనిపై మంత్రులు పెద్ద ఎత్తున హడావుడి చేసి ఏదో సాధిస్తామంటూ ఢిల్లీకి వెళ్లారన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ రాష్ట్ర సర్కార్‌కు, కాంగ్రెస్ పార్టీకి నిజంగా చిత్తశుద్ధి ఉంటే హైకోర్టులో ప్రతిభావంతులైన న్యాయనిపుణులతో వాదనలు వినిపించి బీసీలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేసిందన్నారు. హైకోర్టులో ఇదే అంశంపై కేసు పెండింగ్‌లో ఉండగా, ముందుగా అక్కడ వాదనలు వినిపించాలని సుప్రీంకోర్టు చెప్పడం సహజ ప్రక్రియ అని పేర్కొన్నారు. సుప్రీంకోర్టులో ఈ పిటిషన్ డిస్మిస్ కావడానికి కారణం హైకోర్టులో కేసు పెండింగ్‌లో ఉండటం మాత్రమే అన్నారు. బీసీలకు 42% రిజర్వేషన్లు కావాలని బీజేపీ మొదటి నుంచి కోరుతోందని, అందుకు మద్దతు ఇవ్వడంతోపాటు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. హైదరాబాద్–సికింద్రాబాద్ బస్సుల కనీస చార్జీని ఒక్కసారిగా రూ.10 పెంచడం పేద, మధ్యతరగతి ప్రజలపై నేరుగా భారం మోపడమేనని చెప్పారు. వెంటనే బస్సు చార్జీల పెంపుదలను రాష్ట్ర ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉపఎన్నికకు ముగ్గురు సభ్యుల కమిటీ ద్వారా అభిప్రాయ సేకరణ జరిపి బీజేపీ అభ్యర్థిని ప్రకటిస్తామన్నారు. మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని ముస్లిం మైనారిటీ వర్గానికి చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు రాంచందర్‌రావు, ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరారు.

# ఉప ఎన్నికకు సై



- జూబ్లీహిల్స్ యుద్ధానికి ప్రధాన పార్టీలు సన్నద్ధం
- అభ్యర్థిని ప్రకటించి ముందంజలో ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ
- త్వరలోనే తమ అభ్యర్థులను ప్రకటించేందుకు కాంగ్రెస్, బీజేపీ కసరత్తు
- ఎంఐఎం తీసుకునే నిర్ణయంపై రాజకీయ వర్గాల్లో ఆసక్తి

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో మరో రసవత్తర రాజకీయ పోరుకు తెరలేచింది. హైదరాబాద్‌లోని జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేయడంతో అన్ని ప్రధాన రాజకీయ పక్షాలు దీనిపై దృష్టి కేంద్రీకరించాయి. ఈ ఎన్నికల్లో త్రిముఖ పోటీ ఉండేందుకే ఎక్కువ అవకాశం ఉంది. సిట్టింగ్ పార్టీ బీఆర్ఎస్, అధికార కాంగ్రెస్‌తో పాటు బీజేపీ బరిలో ఉండే అవకాశాలున్నాయి. అయితే అభ్యర్థుల ఎంపిక, ఎంఐఎం తీసుకునే నిర్ణయాన్ని బట్టి ఈ లెక్కలు మారతాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

**కంటోన్మెంట్‌ను కైవసం చేసుకున్నట్టే..**

అధికార కాంగ్రెస్ పార్టీ జూబ్లీహిల్స్ ఉప ఎన్నికను ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. హైదరాబాద్‌లో పార్టీ బలహీనపడిందనే అంచనాల మధ్య అధికారంలోకి వచ్చిన తర్వాత జరిగిన కంటోన్మెంట్ ఉప ఎన్నికను గెలుచుకున్న ఆ పార్టీ.. జూబ్లీహిల్స్‌లోనూ గెలుపే మంత్రంగా ముందుకెళ్లనుంది. సీఎం రేవంత్‌రెడ్డి, టీపీసీసీ చీఫ్ బి.మహేశ్ కుమార్‌గౌడ్‌లు దీనిపై ఇప్పటికే ప్రత్యేకంగా దృష్టి పెట్టారు. మంత్రులు గడ్డం వివేక్, తుమ్మల నాగేశ్వరరావు, పొన్నం ప్రభాకర్‌లతో పాటు పెద్ద సంఖ్యలో కార్పొరేషన్ చైర్మన్లు, సీనియర్ నేతలు రంగంలోకి దిగి పని మొదలు పెట్టారు. బీసీ అభ్యర్థిని నిలబెట్టాలనే ఆలోచనతో పార్టీ నేతలు నవీన్ యాదవ్, బొంతు రామ్మోహన్, అంజన్ యాదవ్‌ల పేర్లను పరిశీలిస్తోంది. అయితే ఏఐసీసీకి పంపిన జాబితాలో కార్పొరేటర్ సీఎన్ రెడ్డి పేరు ఉండటం గమనార్హం.

**రేసులో 'కారు'జోరు**

నియోజకవర్గంలో ఉన్న పార్టీ సంస్థాగత బలంతో పాటు, మాగంటి గోపీనాథ్ కుటుంబంపై ఉన్న సానుభూతి, ప్రభుత్వంపై ఉన్న ఎంతో కొంత వ్యతిరేకత సిట్టింగ్ స్థానాన్ని నిలబెట్టుకునేలా చేస్తుందని బీఆర్ఎస్ అంచనా వేస్తోంది. దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ భార్య సునీతను అభ్యర్థిగా ఇప్పటికే ఖరారు చేయడం ద్వారా మిగిలిన పక్షాల కంటే ముందంజలో ఉంది. పార్టీ సీనియర్ నేతలతో పలు దఫాలుగా భేటీ అయిన కేసీఆర్ ఉప ఎన్నికలో బీఆర్ఎస్ అనుసరించాల్సిన వ్యూహంపై దిశానిర్దేశం చేశారు. తాజాగా షెడ్యూలు వెలువడిన నేపథ్యంలో మంగళవారం ఎర్రవల్లి నివాసంలో కీలక భేటీ నిర్వహిస్తున్నట్లు సమాచారం. కాగా పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సుమారు నెల రోజుల నుంచే పార్టీ కేడర్‌ను సన్నద్ధం చేసే పనిలో ఉన్నారు. ఎన్నికల ప్రచారాన్ని సమన్వయం చేసేందుకు ఆరు డివిజన్లకు పార్టీ ఇన్‌చార్జిలను ఇప్పటికే నియమించారు.

**హైదరాబాద్‌లో సత్తా చాటేందుకు..**

జీహెచ్ఎంసీ ఎన్నికలు ముంచుకొస్తున్న తరుణంలో హైదరాబాద్‌లో సత్తా చాటేందుకు వచ్చిన మంచి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, హిందూత్వ ఎజెండాతో పాటు కేంద్ర ప్రభుత్వ పథకాలు, రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యాలు, బీఆర్ఎస్ బలహీనతలను ఆసరాగా చేసుకుని జూబ్లీహిల్స్‌పై కాషాయ జెండా ఎగురవేయాలని కమలనాథులు ఆశపడుతున్నారు. ఈ పార్టీ టికెట్ కోసం గత ఎన్నికల్లో పోటీ చేసిన లంకెల దీపక్‌రెడ్డితో పాటు, అట్లూరి రామకృష్ణ, జూటూరి కీర్తిరెడ్డి, వీరపనేని పద్మ, బండారు విజయలక్ష్మి, సినీనటి జయసుధ, ఆకుల విజయ పోటీ పడుతున్నారు. ఒకట్రెండు రోజుల్లో రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్‌రావు ఆధ్వర్యంలో రాష్ట్ర ఎన్నికల కమిటీ సమావేశమై అభ్యర్థిని ప్రకటించనున్నట్టు సమాచారం. కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న సికింద్రాబాద్ లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో జూబ్లీహిల్స్ ఉండడంతో ఈ ఎన్నిక ఆయనకు ప్రతిష్టాత్మకంగా మారింది. ఎంఐఎం కార్యాచరణపై మాత్రం ఇంతవరకు స్పష్టత రావడం లేదు. గత ఎన్నికల్లో పోటీ చేయడం ద్వారా కాంగ్రెస్ అభ్యర్థి ఓటమికి కారణమైన మజ్లిస్ ఈసారి ఏం చేస్తుందన్నది ఆసక్తికరంగా మారింది. ఇక సీపీఐ, సీపీఎం, జనసమితిలు అధికార కాంగ్రెస్ వైపే నిలబడే అవకాశాలు ఎక్కువగా కనిపిస్తున్నాయి.

## నవంబర్ 11న జూబ్లీహిల్స్ ఉప ఎన్నిక

సాక్షి, న్యూఢిల్లీ: జూబ్లీహిల్స్ అసెంబ్లీ సెగ్మెంట్ ఉప ఎన్నికకు కేంద్ర ఎన్నికల సంఘం (ఈసీ) షెడ్యూల్‌ను విడుదల చేసింది. నవంబర్ 11వ తేదీన పోలింగ్ నిర్వహించనున్నట్లు ఈసీ ప్రకటించింది. అదే నెల 14న ఓట్ల లెక్కింపును చేపట్టడంతో పాటు ఫలితాలను వెల్లడించనున్నట్లు తెలిపింది. ఈ నెల 13న ఉప ఎన్నికకు సంబంధించిన అధికారిక నోటిఫికేషన్ వెలువడనుంది. సోమవారం ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన మీడియా సమావేశంలో ఈసీ అధికారులు వివరాలు వెల్లడించారు. అభ్యర్థులు తమ నామినేషన్లను ఈ నెల 21వ తేదీ వరకు దాఖలు చేసుకోవచ్చు. 22వ తేదీన వాటిని పరిశీలిస్తారు. 24వ తేదీని ఉపసంహరణకు చివరి తేదీగా నిర్ణయించారు. కాగా షెడ్యూల్ విడుదలతో నియోజకవర్గ పరిధిలో తక్షణమే ఎన్నికల ప్రవర్తనా నియమావళి (కోడ్) అమల్లోకి వచ్చినట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. బీఆర్ఎస్ సిట్టింగ్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ ఆకస్మిక మరణంతో ఉప ఎన్నిక అనివార్యమైన సంగతి తెలిసిందే.

## జూబ్లీహిల్స్‌లో బీసీలకే అవకాశం!

**టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్**



సాక్షి, హైదరాబాద్: జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో బీసీ వర్గాలకే పార్టీ టికెట్ వచ్చే అవకాశం ఉందని.. రెండు, మూడు రోజుల్లో అభ్యర్థిని ఖరారు చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ వెల్లడించారు. ఉప ఎన్నిక ఇన్‌చార్జులుగా నియమించిన ముగ్గురు మంత్రుల రిపోర్టుతో పాటు సర్వేలు, సామాజిక సమీకరణల ఆధారంగా అభ్యర్థి ఎంపిక ఉంటుందని సోమవారం ఆయన ఎమ్మెల్యే క్వార్టర్స్‌లో విలేకరులతో ఇష్టాగోష్టిగా మాట్లాడుతూ చెప్పారు. ఈ ఎన్నికల్లో ప్రజలు తమ పార్టీకి పట్టం కట్టడం ఖాయమని అన్నారు. త్వరలోనే మీనాక్షి నటరాజన్, ముగ్గురు మంత్రులతో కలసి తాను జూబ్లీహిల్స్‌లో బస్తీబాట చేపడతానని చెప్పారు. ఎంఐఎం తమ ఫ్రెండ్లీ పార్టీ అని, ఈ ఎన్నికల్లో పోటీ చేసే విషయంలో ఆ పార్టీ ఏం నిర్ణయం తీసుకుంటుందో చూడాలని వ్యాఖ్యానించారు.

# స్థానిక ఎన్నికల వేళ... బీజేపీలో సమన్వయ లొల్లి

- 8న జరిగే సమావేశం నాటికి పరిస్థితిని చక్కదిద్దడం తలకు మించిన భారమే...
- పదాధికారుల సమావేశంలో బయటపడ్డ అంతర్గత విభేదాలు, సమస్యలు

సాక్షి, హైదరాబాద్: స్థానిక సంస్థల ఎన్నికల వేళ.. పార్టీలో వివిధ స్థాయి నేతల మధ్య సమన్వయలేమి బీజేపీ నాయకత్వానికి కొత్త తలనొప్పులు తెచ్చిపెడుతోంది. ఈ ఎన్నికల్లో కనీసం 15 జెడ్పీలు గెలిచి రాజకీయంగా సత్తా చాటాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకోగా...దీని సాధనకు పార్టీ పూర్తిస్థాయిలో సంసిద్ధమై ఉందా ఉన్న ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. వచ్చే అసెంబ్లీ ఎన్నికల కల్లా...రాష్ట్రంలో పార్టీ గ్రామీణ ప్రాంతాల్లో పూర్తిస్థాయిలో బలపడేందుకు స్థానిక ఎన్నికలు ఏ మేరకు ఉపయోగపడతాయన్న దానిపై నాయకుల్లో స్పష్టత కొరవడింది. పార్టీలో కొంతకాలంగా అంటే గత అసెంబ్లీ, లోక్‌సభ ఎన్నికల తర్వాత నుంచి పాత-కొత్త నాయకులు, వివిధ స్థాయి నాయకుల మధ్య సమన్వయ సమస్యలు ఇంకా పూర్తిగా పరిష్కారం కాలేదు. తాజాగా స్థానిక సంస్థల ఎన్నికల సన్నద్ధతపై ఆదివారం జరిగిన రాష్ట్ర పదాధికారుల సమావేశంలోనూ ముఖ్యనేతల మధ్య సమన్వయలేమి, అంతర్గత సమస్యలు మరోసారి బయటపడ్డాయి. మూడునాలుగేళ్లుగా పలువురు ఇతర పార్టీల నుంచి బీజేపీలో చేరి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా గెలుపొందినా కూడా ఇంకా పార్టీలో పాత-కొత్తల వివాదం కొనసాగుతుండడంపై ముఖ్యనేతలు సైతం పెదవి విరుస్తున్నారు. అంతేకాకుండా జిల్లా నుంచి మండల, గ్రామస్థాయి వరకు నాయకులు, కార్యకర్తల సమన్వయం, ఆయా జిల్లాల్లోని ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలకు జిల్లా అధ్యక్షులు, ముఖ్యనేతలకు ఉన్న స్నేహపూర్వక సంబంధాలు, ఒకరికి ఒకరు సహకరించుకోకపోవడం వంటివి ప్రస్తుతం చర్చనీయాంశమవుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ రాష్ట్ర స్థాయి విస్తృత సమావేశం జరగనుంది. ఆ లోగా అందరికీ సర్ది చెప్పే ప్రయత్నాల్లో నాయకత్వం నిమగ్నమైంది.

**జిల్లాల్లోనూ అంతే...:** జిల్లా పార్టీలో సరైన సమన్వయం లేదంటూ చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమాల నిర్వహణ, తదితరాల విషయంలో తన ఎంపీ నియోజకవర్గ పరిధిలోకి వచ్చే రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల పార్టీ అధ్యక్షుల తీరుపై నాయకత్వానికి ఫిర్యాదు చేసినా ఎలాంటి చర్యలు తీసుకోలేదని పదాధికారుల సమావేశంలో నిలదీశారు. ఈ నేపథ్యంలో వెంటనే ఈ జిల్లాల అధ్యక్షులపై వచ్చిన ఫిర్యాదులపై మాజీ ఎమ్మెల్యే ధర్మారావు, పార్టీనేత గోలి మధుసూదన్‌రెడ్డిలతో ఓ కమిటీని అధ్యక్షుడు రామచందర్‌రావు ఏర్పాటు చేసినట్టు సమాచారం. పార్టీలో ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలుగా గెలిచిన ప్రజాప్రతినిధులతో జిల్లా నేతలకు సరైన సమన్వయం లేదని పదాధికారుల సమావేశంలోనే కామారెడ్డి ఎమ్మెల్యే వెంకట రమణారెడ్డి వాపోయారు. రాష్ట్ర పార్టీ కార్యాలయంలో కూర్చొని కార్యక్రమాలు నిర్ణయించడం తప్ప క్షేత్ర స్థాయిలో అసలు అవి ఏ విధంగా అమలు చేస్తున్నారనేదే నాయకత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఎమ్మెల్యే చేసిన విమర్శలు, లేవనెత్తిన అంశాలను సైతం సీరియస్‌గా తీసుకున్న నాయకత్వం...నేతల మధ్య సమన్వయం, జిల్లాల్లో పార్టీ కార్యక్రమాలు, తదితర అంశాలపైనా దృష్టి పెట్టినట్టు పార్టీవర్గాల సమాచారం.

# ఎకరం రూ. 177 కోట్లు!

- హైదరాబాద్‌లోని రాయదుర్గ్‌లో టీజీఐఐసీ భూముల వేలంలో సరికొత్త రికార్డు
- ఏకంగా రూ.1,357.59 కోట్లు పలికిన 7.67 ఎకరాల ప్లాటు
- ఎకరా రూ.141.5 కోట్ల చొప్పున అమ్ముడుపోయిన 11 ఎకరాల స్థలం
- సుమారు 18 ఎకరాల వేలంతో ఖజానాకు రూ.3,135 కోట్ల రాబడి



చింతల్‌లో ప్లాట్ల వేలంపాట నిర్వహిస్తున్న అధికారులు

సాక్షి, హైదరాబాద్: భాగ్యనగరంలో భూమి ధర సరికొత్త రికార్డును నమోదు చేసింది. హైదరాబాద్ నాలెడ్జ్ సిటీలోని రాయదుర్గ్‌లో ఎకరా ధర కళ్లు చెదిరే స్థాయిలో ఏకంగా రూ. 177 కోట్లు పలికింది. రాష్ట్ర ప్రభుత్వం, తెలంగాణ పారిశ్రామిక వసతుల కల్పన సంస్థ (టీజీఐఐసీ) సోమవారం నిర్వహించిన భూముల వేలంలో 7.67 ఎకరాలను రూ. 1,358 కోట్లకు ఓ రియల్ ఎస్టేట్ సంస్థ దక్కించుకుంది. ఈ ప్లాటు కోసం 12 సంస్థలు పోటీ పడ్డాయి. అలాగే 11 ఎకరాల మరో ప్లాటును ఎకరా రూ. 141.5 కోట్ల చొప్పున రూ. 1,556.5 కోట్లకు ఇంకో రియల్ ఎస్టేట్ సంస్థ చేజిక్కించుకుంది. ఈ ప్లాటును సొంతం చేసుకోవడానికి ఐదు సంస్థలు వేలంలో పాల్గొన్నాయి. ఈ రెండు ప్లాట్లకు చెందిన సుమారు 18 ఎకరాల వేలం ద్వారా రాష్ట్ర ప్రభుత్వానికి రూ. 2,913.5 కోట్లు సహా రిజిస్ట్రేషన్ ఫీజు, స్టాంపు డ్యూటీ తదితరాలు కలుపుకొని మొత్తంగా 3,135 కోట్లు సమకూరనున్నాయి. జాతీయ, ప్రాంతీయ రియల్ ఎస్టేట్ డెవలపర్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్న ఈ వేలం ప్రక్రియలో 7.67 ఎకరాలను ఎంఎస్ఎన్ రియాల్టీ పొందగా 11 ఎకరాల ప్లాటును ప్రెస్టీజ్ రియల్ ఎస్టేట్ సంస్థ సొంతం చేసుకున్నట్లు తెలిసింది.

### నాడు రూ.100 కోట్లు.. నేడు అంతకు 75% పెరిగి..

హెచ్ఎండీఏ 2017లో రాయదుర్గ్‌లో ఎకరా రూ. 42.59 కోట్ల చొప్పున 2.84 ఎకరాలను వేలంలో విక్రయించగా 2023లో నిర్వహించిన వేలంలో కోకాపేట నియోపోలిస్ వద్ద ఎకరా రూ. 100.75 కోట్ల చొప్పున 3.60 ఎకరాలు అమ్ముడుపోయి రికార్డు సృష్టించింది. అయితే సుమారు మూడేళ్ల వ్యవధిలోనే ఆ ధరతో పోలిస్తే ఏకంగా 75 శాతం భూమి విలువ వేలంలో పెరిగిందని టీజీఐఐసీ ఓ ప్రకటనలో పేర్కొంది. తాజా భూముల వేలం హైదరాబాద్ సాధిస్తున్న స్థిరమైన వృద్ధికి, గ్లోబల్ బిజినెస్ హబ్‌గా పరిణామం చెందిన తీరుకు అద్దం పడుతోందని పేర్కొంది. ప్రపంచస్థాయి మౌలిక సదుపాయాలు, బలమైన పాలన, అభివృద్ధి చెందుతున్న టెక్నాలజీ, జీసీసీ ఎకోసిస్టమ్‌ల ద్వారా హైదరాబాద్ నగరం ప్రముఖ డెవలపర్లు, గ్లోబల్ కార్పొరేషన్‌లను ఆకర్షిస్తూనే ఉందని టీజీఐఐసీ వెల్లడించింది. తెలంగాణ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై పెట్టుబడిదారులు పెట్టుకున్న బలమైన నమ్మకానికి ఇది నిదర్శనమని టీజీఐఐసీ వీసీ, ఎండీ కె.శశాంక పేర్కొన్నారు.

### చింతల్‌లో చదరపు గజం రూ. 1.14 లక్షలు

రంగారెడ్డినగర్: తెలంగాణ హౌసింగ్ బోర్డు కుత్బుల్లాపూర్ పరిధిలోని చింతల్‌లోని నివాస భూముల విక్రయాలకు సోమవారం నిర్వహించిన బహిరంగ వేలంలో చదరపు గజం భూమి ధర రూ. 1.14 లక్ష పలికింది. 513 గజాల విస్తీర్ణంలోని హెచ్ఐజీ ఓపెన్ ప్లాట్ ఈ ధర పలికినట్లు హౌసింగ్ బోర్డు వైస్ చైర్మన్ వి.పి.గౌతం ఓ ప్రకటనలో తెలిపారు. చదరపు గజానికి సగటున రూ. 91,947 ధర పలికిందని.. మొత్తం 18 ఓపెన్ ప్లాట్లు, 4 ఫ్లాట్ల విక్రయానికి బహిరంగ వేలం వేయగా హౌసింగ్ బోర్డుకు సుమారు రూ. 44.24 కోట్ల మేర ఆదాయం వచ్చిందన్నారు.

# క్షయ నిర్మూలనకు కలిసి రావాలి: గవర్నర్



సాక్షి, హైదరాబాద్: పేదరికం, పౌష్టికాహార లోపం, అవగాహన రాహిత్యం మూలంగా క్షయవ్యాధి ఇప్పటికీ ప్రజారోగ్యానికి సవాలుగా మారిందని రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్‌వర్మ అన్నారు. దేశంలో టీబీ నిర్మూలన కోసం యూత్ ఐకాన్స్, కళాకారులు, క్రీడాకారులు, స్వచ్ఛంద, విద్యా సంస్థలు కలిసికట్టుగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. టీబీ ముక్త్ భారత్ అంటే క్షయ నివారణ కాదు..పూర్తిగా నిర్మూలించడమే లక్ష్యమని గుర్తు చేశారు. 'టీబీ సీల్ సేల్'పేరుతో క్షయ నిర్మూలన కోసం విరాళాల సేకరణకి ఏటా నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని సోమవారం రాజ్‌భవన్‌లో గవర్నర్ ప్రారంభించి మాట్లాడారు. క్షయ వ్యాధి పట్ల ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు పరిశోధనల విషయంలో తెలంగాణ టీబీ అసోసియేషన్ చేస్తున్న సేవలను ఈ సందర్భంగా ఆయన కొనియాడారు.

# ముగిసిన 'స్వస్థ నారీ-సశక్త కుటుంబ' స్క్రీనింగ్

సాక్షి, హైదరాబాద్: మహిళల ఆరోగ్యంతోనే కుటుంబం బాగుంటుందనే ఉద్దేశంతో కేంద్ర ప్రభుత్వం చేపట్టిన స్వస్త నారీ-సశక్త కుటుంబ అభియాన్ రాష్ట్రంలో విజయవంతంగా ముగిసింది. గత నెల 17 నుంచి ఈ నెల 2 వరకు జరిగిన ఈ కార్యక్రమంలో 20 లక్షల మందికిపైగా మహిళలకు వైద్య పరీక్షలు నిర్వహించారు.

# పక్కాగా.. భూముల లెక్క

- 30 ఏళ్లుగా వివిధ ప్రాజెక్టులకు కేటాయించిన ప్రభుత్వ భూముల లెక్క తేల్చే పనిలో ప్రభుత్వం
- అటవీ, రెవెన్యూ శాఖల మధ్య పంపిణీ జరిగిన భూములపైనా ఫోకస్
- రైతుభరోసా నిధుల మిగులుతోపాటు ప్రభుత్వ శాఖల మధ్య వివాదాలు లేకుండా చూసే యోచన
- త్వరలోనే సమగ్ర నివేదిక తయారు చేయాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి ఆదేశాలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని ప్రభుత్వ భూములను వివిధ శాఖలకు కేటాయించిన లెక్కలు తేల్చేందుకు రెవెన్యూ శాఖ ఉపక్రమిస్తోంది. ముఖ్యంగా మూడు, నాలుగు దశాబ్దాలుగా వివిధ ప్రాజెక్టుల కోసం సేకరించిన భూములు, ఇతర అవసరాల కోసం తీసుకున్న భూములు ఎన్ని ఉన్నాయో సమగ్ర నివేదిక రూపొందించనుంది. ఈ మేరకు భూముల కేటాయింపు వివరాలు, ప్రస్తుతం వాటి వినియోగం, ఆ భూముల నమోదు పరిస్థితి తదితర అన్ని అంశాలతో వీలున్నంత త్వరగా నివేదిక సమర్పించాలని రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. పలు ప్రాజెక్టుల కోసం సాగునీటి, అటవీ శాఖలకు రెవెన్యూ శాఖ వేల ఎకరాల భూములను కేటాయించిందని, తెలంగాణ ఏర్పాటైన తర్వాత ఈ ప్రాజెక్టుల్లో మార్పులు జరగడంతో పాటు కొన్ని ప్రాజెక్టులు రద్దయిన నేపథ్యంలో అన్ని అంశాలను పరిగణనలోకి తీసుకొని నివేదిక సమర్పించాలని సోమవారం సచివాలయంలో జరిపిన సమీక్షలో ఆయన నిర్ణయించారు. ముఖ్యంగా అటవీ శాఖతో వివాదాలు లేకుండా భూముల లెక్క తేల్చాలని, ఏ శాఖ పరిధిలో ఎంత భూమి ఉందనే లెక్కలు రెండు శాఖల సమన్వయంతో రూపొందించాలని ఆదేశించారు.

- సీతారామ ఎత్తిపోతల పథకానికి ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని 1,138 ఎకరాల అటవీ భూమి కేటాయించే ప్రక్రియను వేగవంతం చేయాలని, గతంలో కేశవపురం తాగునీటి పథకానికి అటవీశాఖకు రెవెన్యూ నుంచి బదిలీ అయిన 1,030 ఎకరాలను తిరిగి సీతారామ ప్రాజెక్టు కోసం సాగునీటి శాఖకు బదలాయించే సాధ్యాసాధ్యాలను పరిశీలించాలని మంత్రి పొంగులేటి కోరారు. ఈ సమావేశంలో రెవెన్యూ, అటవీ, మెట్రో వాటర్ వర్క్స్ ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**ఆ రెండింటి కోసమేనా..?**

ప్రాజెక్టుల పేరుతో సేకరించిన భూముల లెక్క నిగ్గు తేల్చడంతోపాటు అటవీశాఖతో రెవెన్యూ శాఖకు ఉన్న భూవివాదాలను పరిష్కరించుకునే దిశలో రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం వెనుక రెండు కారణాలు కనిపిస్తున్నాయి.

- భూసేకరణ ద్వారా ప్రభుత్వానికి బదిలీ అయిన పట్టా భూములు ఇంకా రైతుల ఖాతాల్లోనే కనపడుతున్నాయి. ఈ కారణంగా వేలాది ఎకరాల్లో రైతుభరోసా కూడా ఆ రైతులకు జమ అవుతోంది.
- అటవీశాఖతో రెవెన్యూ శాఖకు చాలా సమస్యలున్నాయి. చాలా జిల్లాల్లోని భూములు ఏ శాఖకు చెందినవన్న దానిపై జాయింట్ సర్వేలు చేయాల్సి ఉంది. ఈ జాయింట్ సర్వేల ఊసే ఈ మధ్యకాలంలో వినిపించడం లేదు. ఈ నేపథ్యంలో అటు రైతు భరోసాతో ఇటు అటవీ శాఖతో దీర్ఘకాలికంగా ఉన్న వివాదాలను పరిష్కరించుకోవాలనే ఆలోచనతోనే ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకున్నట్లు రెవెన్యూ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

# ఎల్ లిల్లీ@ రూ.9వేల కోట్లు

▶ మొదటి పేజీ తరువాయి

నియామకాలు చేపడతాం..' అని తెలిపింది. 'అమెరికాకు చెందిన ఎల్ లిల్లీ 150 ఏళ్లుగా ప్రపంచ వ్యాప్తంగా ఔషధాల తయారీ రంగంలో విశేషమైన సేవలను అందిస్తోంది. ఈ క్రమంలో మేక్ ఇన్ ఇండియా లక్ష్యానికి అనుగుణంగా దేశంలో తొలిసారిగా ఏర్పాటు చేస్తున్న ఈ అధునాతన యూనిట్ తెలంగాణను అత్యాధునిక ఆరోగ్య పెట్టుబడుల గమ్యస్థానంగా నిలబెడుతుంది. ప్రధానంగా డయాబెటిస్, ఒబెసిటీ, అల్జీమర్స్, క్యాన్సర్, ఇమ్యూన్ వ్యాధులకు సంబంధించిన ఔషధాలు, కొత్త ఆవిష్కరణలపై ఈ కంపెనీ పని చేస్తుంది. భారత్‌లో ఇప్పటికే గురుగ్రామ్, బెంగళూరులో ఎల్ లిల్లీ కంపెనీ కార్యకలాపాలున్నాయి..' అని సంస్థ ప్రతినిధులు వివరించారు.

**జీనోమ్ వ్యాలీలో ఏటీసీ సెంటర్: సీఎం రేవంత్**

ఫార్మా కంపెనీలను ప్రోత్సహించే ఫార్మా పాలసీని రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తుందని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఈ సందర్భంగా వెల్లడించారు. జీనోమ్ వ్యాలీలో అడ్వాన్స్‌డ్ టెక్నాలజీ సెంటర్ (ఏటీసీ) ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించారు. జీనోమ్ వ్యాలీకి కావాల్సిన సాంకేతిక సహకారం అందిస్తామని హామీ ఇచ్చారు. 'హైదరాబాద్‌లో ఆగస్టు 4న ఎల్ లిల్లీ తన గ్లోబల్ కేపబిలిటీ సెంటర్‌ను ప్రారంభించింది. విస్తరణలో భాగంగా భారీ పెట్టుబడులకు ముందుకు రావటం తెలంగాణకు గర్వకారణం. పెట్టుబడులతో వచ్చే కంపెనీలు, పరిశ్రమలకు మా ప్రభుత్వం అన్ని రకాలుగా మద్దతు ఇస్తుంది. హైదరాబాద్ ఇప్పటికే ఫార్మా హబ్‌గా పేరొందింది. ఎల్ లిల్లీ పెట్టుబడితో ఇప్పుడు ప్రపంచం దృష్టినికూడా ఆకర్షిస్తుంది. 1961లో ఐడీపీఎల్ స్థాపించినప్పటి నుంచే హైదరాబాద్ దిగ్గజ ఫార్మా కంపెనీలకు చిరునామాగా మారింది. ప్రస్తుతం 40 శాతం బల్క్ డ్రగ్స్ హైదరాబాద్‌లోనే ఉత్పత్తి అవుతున్నాయి. కోవిడ్ వ్యాక్సిన్లు ఇక్కడే తయారయ్యాయి..' అని సీఎం చెప్పారు. హైదరాబాద్‌లో ఎల్ లిల్లీ పెట్టుబడులు తెలంగాణలో పరిశ్రమల విస్తరణ తీరును ప్రతిబింబిస్తుందని మంత్రి శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# కాంగ్రెసోళ్లు మంత్రి పదవి ఇస్తామన్నా పార్టీ వీడలేదు

హుజూరాబాద్ ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్: 'కాంగ్రెసోళ్లు నాకు రాష్ట్ర మంత్రి పదవి ఇస్తామన్నారు, ఎంపీగా గెలిపించి కేంద్ర మంత్రిని చేస్తామన్నారు. చివరకు రూ.100 కోట్లు ఇస్తామని ఆఫర్ చేశారు. అయినా బీఆర్ఎస్ పార్టీని వీడలేదు'అని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అన్నారు. సోమవారం ఆయన హనుమకొండ జిల్లా కమలాపూర్‌లో జరిగిన బీఆర్ఎస్ మండల స్థాయి కార్యకర్తల సమావేశంలో మాట్లాడారు. తాను బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్యేగా గెలిచాక కాంగ్రెస్ పార్టీలోకి వెళతానని చాలా మంది అనుకున్నారన్నారు. వాస్తవంగా రాహుల్ గాంధీ మొదలుకుని, వార్డు మెంబర్ వరకు తనకున్నన్ని పరిచయాలు ఎవరికీ లేవన్నారు. కాంగ్రెసోళ్లు ఎన్ని ఆఫర్లు చేసినా ఏవీ వద్దని, కేసీఆర్ తనను ఎమ్మెల్సీ చేశారని, తర్వాత ఎమ్మెల్యేను చేశారని, కష్టకాలంలో ఉన్న కేసీఆర్ వెన్నంటే ఉంటానని చెప్పి, కాంగ్రెస్ ఆఫర్లన్నీ తిరస్కరించానని స్పష్టం చేశారు. పార్టీ మారిన ఎమ్మెల్యేలనే తాను వదిలిపెట్టలేదని, బీఆర్ఎస్ నుంచి గెలిచిన వారు ఎవరైనా అమ్ముడుపోయి పార్టీ మారితే వెయ్యి మందితో వారి ఇంటిపై దాడి చేస్తామని తీవ్రస్థాయిలో హెచ్చరించారు.



# ఆర్టీఐ వారోత్సవాల లోగో ఆవిష్కరణ

సమాచార హక్కు చట్టం అవగాహన వారోత్సవాల సందర్భంగా సోమవారం లోగోను ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి. చిత్రంలో ఆర్టీఐ చీఫ్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి, కమిషనర్లు బోరెడ్డి అయోధ్యారెడ్డి, పీవీ శ్రీనివాస్, ఎం.పర్వీన్, డి.భూపాల్, వైష్ణవి

# దేశ చరిత్రలో ఇది ఒక చీకటి రోజు

- జస్టిస్ బీఆర్ గవాయ్‌పై దాడిని ఖండించిన సీఎం రేవంత్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్/ఖమ్మం లీగల్: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన దాడిని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఖండించారు. ఇది దేశచరిత్రలో ఇది చీకటి రోజని అభిప్రాయపడ్డారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టారు. 'ఈ దుష్ప్రయత్నం, దేశంలోని న్యాయ వ్యవస్థ యొక్క అత్యున్నత అధికారిపై దాడిచేసి భయపెట్టే చర్య. ఇలాంటి దాడులకు భయపడనని ధైర్యంగా ప్రకటించిన జస్టిస్ బీఆర్ గవాయ్‌కి యావత్ దేశ ప్రజలతోపాటు నేను సంఘీభావం తెలియజేస్తున్నాను' అని సీఎం పేర్కొన్నారు. కాగా, సీజేఐ జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడి భారత న్యాయ వ్యవస్థ స్వతంత్రత, ప్రజాస్వామ్య విలువలపై జరిగిన దాడి అని డిప్యూటీ సీఎం భట్టి అన్నారు. జస్టిస్ గవాయ్‌పై జరిగిన దాడిని మంత్రి సీతక్క, టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ మహేశ్‌గౌడ్, సీపీఐ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కె.నారాయణ, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, శాసనసభ్యుడు కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ కూడా ఖండించారు.

**ఇది న్యాయవ్యవస్థపైనే దాడి..**

న్యాయమూర్తులపై దాడి చేయడమంటే న్యాయవ్యవస్థపై దాడి చేసినట్టేనని, సుప్రీంకోర్టులాంటి పవిత్ర స్థలంలో ఇలాంటి దుర్ఘటన చోటు చేసుకోవడం విచారకరమని తెలంగాణ న్యాయమూర్తుల సంఘం అధ్యక్షుడు, ఖమ్మం జిల్లా జడ్జి రాజగోపాల్, కార్యదర్శి కె.మురళీమోహన్ ఒక ప్రకటనలో ఖండించారు. వేరొక ప్రకటనలో సీజేఐపై చేసిన దాడిని ఇండియన్ అసోసియేషన్ ఆఫ్ లాయర్స్ (ఐఏఎల్) ప్రధాన కార్యదర్శి బొమ్మగాని ప్రభాకర్ తీవ్రంగా ఖండించారు.

# బీసీలు రాజ్యాధికారాన్ని సాధించుకోవాలి

- శాసనమండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్



సాక్షి, హైదరాబాద్: వెనుకబడిన తరగతులు రాజ్యాధికారాన్ని సాధించుకునే వరకు ఉద్యమాన్ని ఆపొద్దని శాసన మండలి డిప్యూటీ చైర్మన్ బండ ప్రకాశ్ ముదిరాజ్ పిలుపునిచ్చారు. మాజీ ఐఏఎస్ అధికారి, బీసీ ఇంటలెక్చువల్స్ ఫోరం చైర్మన్ టి.చిరంజీవులు రచించిన హిస్సా ఇజ్జత్ హుకుమత్ – బీసీ రాజ్యాధికార సిద్ధాంతం పుస్తకాన్ని ఆదివారం ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాజకీయ ఆర్థిక రంగంలో బీసీలు అణచివేతకు గురవుతున్నారని, ఇందుకు సంబంధించిన వివరాలను గణంకాలతో సహా ఈ పుస్తకంలో పొందుపరిచారని అన్నారు. అనంతరం శాసనమండలి ప్రతిపక్ష నేత సిరికొండ మధుసూదనాచారి మాట్లాడుతూ బీసీలు చైతన్యం తెచ్చుకొని, అధికారం, హక్కుల కోసం పోరాటం చేయాలన్నారు. ఆ తర్వాత ఎంపీ ఈటల రాజేందర్ మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లో డబ్బు ప్రధాన పాత్ర పోషిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బీసీలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని, అందుకు ఆర్థిక రంగంపైనా దృష్టి సారించాలని అన్నారు. జాతీయ బీసీ కమిషన్ మాజీ చైర్మన్ జస్టిస్ వి.ఈశ్వరయ్య మాట్లాడుతూ బీసీలు రాజ్యాంగపరమైన పరిజ్ఞానం పెంచుకొని చట్టబద్ధమైన రిజర్వేషన్లు సాధించేందుకు పెద్ద ఎత్తున పోరాటాలు చేయాలని పిలుపునిచ్చారు.







ఒక విద్యార్థికి తన గురువును మించిన ప్రతిభ ఉంటే అది ఆ గురువు అదృష్టం.
– 'గజల్ క్వీన్' బేగమ్ అఖ్తర్



సాక్షి
మంగళవారం, 7 అక్టోబర్ 2025

# బిహార్ ఎటువైపు?

కేంద్రంలోని పాలక పక్షం ఎన్డీయే, విపక్ష కూటమి 'ఇండియా' జీవన్మరణ సమస్యగా భావిస్తున్న బిహార్ అసెంబ్లీ ఎన్నికల తేదీలు ఖరారయ్యాయి. వచ్చే నెల 6, 11 తేదీల్లో రెండు దఫాలుగా పోలింగ్ జరగబోతోంది. 14న ఓట్ల లెక్కింపు ఉంటుందని ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ ప్రకటించారు. వీటితోపాటు ఏడు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల్లోని ఎనిమిది స్థానాలకు ఉప ఎన్నికలుంటాయి. వివాదాస్పద స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పేరిట ఎన్నికల జాబితాను నవీకరించాక అది స్వచ్ఛంగా మారిందని జ్ఞానేశ్ ఇప్పటికే చెప్పారు. బిహార్‌లో ఇంతవరకూ సొంతంగా అధికారం చవిచూడని బీజేపీ ఈసారి ఎలాగైనా ఆ అదృష్టాన్ని దక్కించుకోవాలని తహతహ లాడుతోంది. కానీ కేంద్రంలో మద్దతిస్తున్న ముఖ్యమంత్రి నితీశ్ కుమార్ నేతృత్వంలోని జేడీ(యూ)తో ఎప్పటిలా కూటమి కట్టక తప్పలేదు. 2020 అసెంబ్లీ ఎన్నికల అనంతర పరిణామాలను గుర్తుంచుకుంటే నవంబర్ 15 తర్వాత ఏం జరిగినా ఆశ్చర్యపోనవసరం లేదు. మొత్తం స్థానాల సంఖ్య 243 కాగా, అప్పట్లో జేడీ(యూ) 122, బీజేపీ 121 స్థానాలు పంచుకున్నాయి. తమకన్నా ఒక్కటి ఎక్కువిచ్చి కాబోయే సీఎం నితీశేనని బీజేపీ చాటాల్సివచ్చింది. తీరా ఎన్నికలైన రెండేళ్లలోనే... అంటే 2022 ఆగస్టులో నితీశ్ ప్లేటు ఫిరాయించి ఆర్జేడీ, కాంగ్రెస్‌ల మహా కూటమితో చేయి కలిపి మళ్లీ సీఎం అయ్యారు. అది ఎక్కువకాలం సాగలేదు. లోక్‌సభ ఎన్నికలు సమీపిస్తుండగా ఇండియా కూటమిని నిరుడు జనవరిలో చావుదెబ్బతీసి మళ్లీ ఎన్డీయే గూటికి చేరారు. ఫిరాయించిన ప్రతిసారీ సీఎం పదవికి రాజీనామా చేయటం, కొత్త కూటమి పక్షాన మళ్లీ దక్కించుకోవటం నితీశ్ ప్రత్యేకత.

సాధారణ సమయాల్లో రాజకీయాలే ఊపిరిగా భావించే బిహార్ ప్రజానీకం పోలింగ్‌పై పెద్దగా ఆసక్తి చూపరంటే ఆశ్చర్యం కలుగుతుంది. అక్కడ సగటు పోలింగ్ శాతం ఎప్పుడూ 56 శాతం దాటలేదు. ఓటేసేవారిలో కూడా దాదాపు 60 శాతం మహిళలే. ఇది ప్రతిసారీ బీజేపీకి కలిసొస్తున్నది. క్రితంసారి ఎన్డీయేలో జేడీ(యూ) కేవలం 43 గెలుచుకుంది. బీజేపీ 74 సాధించింది. కానీ పొత్తు ధర్మానికి తలొగ్గి నితీశ్‌కే సీఎం పగ్గాలు అప్పగించింది. అప్పట్లో అలిగివెళ్లిన ఎల్‌జేపీ ఒక స్థానంమించి గెలవకపోయినా 33 చోట్ల అది జేడీ(యూ)ను దెబ్బ తీయగలిగింది. ఇప్పటికైతే ఆ పార్టీ ఎన్డీయే పంచన ఉంది. ఎంఐఎం వల్ల నష్టపోతున్నామన్నది విపక్షాల భావన. సీమాంచల్ లో క్రితంసారి అది అయిదు గెల్చుకుంది. ఇక ప్రశాంత్ కిశోర్ 'జన్ సురాజ్' పార్టీ ఏ మేరకు ఓట్లు చీల్చగలదో చూడాల్సి ఉంది. బిహార్‌లో వామపక్షాలు బలంగా ఉన్నాయి. గత ఎన్నికల్లో ఆ పార్టీలు 16 స్థానాలు సాధించాయి.

రాష్ట్రంలో నితీశ్‌తో కలిస్తేనే అధికారం దక్కుతుందన్న భావన అన్ని పార్టీల్లోనూ ఉంది. అందుకే ఆయన ఎటు దూకినా, తిరిగొస్తే అక్కున చేర్చుకోవటం ప్రధాన పక్షాలకు అలవాటైంది. నాలుగు దఫాలు సీఎంగా చేశాక ఇంకా ఆయనలో ఆ 'మ్యాజిక్' ఉందా అన్నది ఈ ఎన్నికలు తేల్చేస్తాయి. 2020 ఎన్నికల్లో కాంగ్రెస్ వంటి బొత్తిగా జనాకర్షణ లేని పార్టీతో కలిసి వెళ్లినా ఆర్జేడీ నేత తేజస్వీ యాదవ్ అద్భుతమైన పనితీరు కనబరిచారు. ఎన్డీయేతో పోలిస్తే కేవలం 16,825 ఓట్ల తేడాతో అధికారానికి దూరమయ్యారు. ఈసారి 'ఓట్ చోరీ' ప్రచారం ప్రభావం వల్ల తన స్థితి మెరుగైందన్న భరోసాతో కాంగ్రెస్ స్వరం పెంచుతోంది. ఆర్జేడీకి అది గుదిబండగా మారుతుందా... లేక స్వీయ భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని జాగ్రత్తగా మెలగుతుందా అన్నది చూడాలి.

సాధారణ సమయాల్లో జనాకర్షణ పథకాలు ప్రమాదమంటూ గంభీరంగా మాట్లాడే ఎన్డీయే, ఎప్పటిలాగే బిహార్‌లో చేతికి ఎముక లేకుండా తాయిలాలు ప్రకటించింది. గత నెలలో ముఖ్యమంత్రి మహిళా రోజ్‌గార్ యోజన కింద 75 లక్షల మంది మహిళలకు రూ. 10,000 చొప్పున అందించారు. నెలకు రూ. 2,500 చొప్పున ఇస్తామన్న మహా కూటమి హామీకి ఇది విరుగుడు. ఏదేమైనా ఈసారి బిహార్ తీర్పుపై కేంద్రంలోని ఎన్డీయే కూటమి మనుగడ ఆధారపడి ఉంటుంది. అక్కడ బీజేపీ ప్రాభవం తగ్గితే జేడీ(యూ), టీడీపీలు తోకజాడించే ప్రమాదముంది. అదీగాక 2027 మార్చిలో జరిగే యూపీ ఎన్నికలపై కూడా దాని ప్రభావం పడుతుంది. ఇన్నివిధాల కీలకమైన బిహార్ ఎటు మొగ్గుతుందన్నది మరో నెల్లాళ్ల వ్యవధిలో తేలిపోతుంది.

### గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, ఆశ్వయుజ మాసం, **తిథి:** పౌర్ణమి ప.9.36 వరకు, తదుపరి బహుళ పాడ్యమి, **నక్షత్రం:** రేవతి రా.3.46 వరకు, తదుపరి అశ్విని, **వర్జ్యం:** సా.4.25 నుండి 5.56 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.16 నుండి 9.03 వరకు తదుపరి రా.10.34 నుండి 11.23 వరకు, **అమృత ఘడియలు:** రా.1.24 నుండి 2.55 వరకు, **వాల్మీకి జయంతి.**

సూర్యోదయం : 5.54
సూర్యాస్తమయం: 5.43
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

## సోషల్ టాక్

### కొనక్కర్లేదు!



నేను ప్రీమియర్‌కు వెళ్లినప్పుడు డిజైనర్ల నుండి అందమైన బట్టలు, బూట్లు అరువుగా తీసుకుంటాను. వాటిని మంచి స్థితిలో తిరిగి ఇచ్చేస్తే మీరు మళ్లీ అరువు తీసుకోవచ్చు, డబ్బు ఉందని ప్రతిదీ కొనక్కర్లేదు. లైబ్రరీలో పుస్తకాలను కొంటామా?

– సారా జెస్సికా పార్కర్, టీవీ ప్రొడ్యూసర్

### సంపన్నత



అందమైన అపార్ట్‌మెంట్‌నూ, అందమైన విమానాన్నీ, అందమైన కార్లనూ, అందమైన ఇంటినీ కౌగిలించుకుని, కలిసి నిద్రపోలేము. వాటితో మాట్లాడలేము. సంపన్నుడు కాబట్టి నేను నా భర్తతో కలిసి ఉంటున్నానని అనేవారికి ఇదే నా సమాధానం!

– మెలనియా ట్రంప్, అమెరికా 'ఫస్ట్ లేడీ'

### అభిమానులు



నేను బీచ్‌లో చొక్కా లేకుండా పరిగెడతాను. నా పిల్లల్ని బయటకు తీసుకెళతాను. చర్చికి, డిన్నర్‌లకు వెళ్తుంటాం. వ్యక్తిగతమైన దేనినీ నేను వదులుకోను. అందుకే నా నిజ జీవితం గురించి తెలుసుకోటానికి అభిమానులు 'ర్యాగ్' మ్యాగజైన్‌లు కొంటుంటారు.

– మాథ్యూ మెక్కోనాహే, అమెరికన్ నటుడు

### తల్లి మనసు



నేను రెజ్లింగ్‌కి వెళ్లటం మా అమ్మకు ఇష్టం లేదు. గాయాలతో ఇంటికి చేరుకునే వాడిని. అమ్మ బాధపడేది, వద్దని బుజ్జగించేది. "నేను రాయి లాంటి వాడిని. నాకేం కాదు" అనేవాడిని. కోపం పట్టలేక చెంప మీద ఒక్కటిచ్చేది. తల్లి మనసు అంతే! దెబ్బలు తిని రావద్దని తనూ ఒక దెబ్బ వేస్తుంది.

– వరుణ్ ధావన్, బాలీవుడ్ నటుడు

### ధారపోయండి!



విజయం అంటే కేవలం గెలవటం మాత్రమే కాదు. మీ శక్తినంతా ధారపోయటం! నేను విజయం సాధించినప్పుడు నన్ను గెలిపించిన అంశాలపై మరింతగా కృషి చేస్తాను. నేను విఫలమైనప్పుడు నా బలహీనతల నుండి నన్ను నేను మెరుగుపరుచుకుంటాను.

– రోహన్ బోపన్న, టెన్నిస్ క్రీడాకారుడు

### ఇష్టం ఉండదు!



విజయాన్ని సాధించటం కంటే, విజయానికి తోడ్పడటం నాకు ఇష్టం. నాకు నచ్చిన పనులు చేయటం నాకు ఇష్టం ఉండదు. కంపెనీ విజయానికి దోహదపడే పనులు చేయటం నాకు ఇష్టం. నాకు ఇష్టమైన వాటికి ఎక్కువ సమయం కేటాయించను.

– మైఖేల్ డెల్, 'డెల్ టెక్నాలజీస్' సీఈవో

# ఇష్టం ఉంటే కష్టం ఉండదు!

విశ్వ గురు



నూతనంగా పట్టభద్రులైన విద్యార్థులను ఉద్దేశించి 'గూగుల్', 'ఆల్ఫాబెట్' సీఈఓ సుందర్ పిచాయ్ చేసిన వర్చ్యువల్ ప్రసంగపు సంక్షిప్త పాఠం:

కొత్తగా పట్టభద్రులైన వారికి అభినందనలు. ప్రత్యక్షంగా మీ ముందు లేకుండా, ఇలా ఇంటి నుంచి వర్చ్యువల్ ప్రసంగం చేస్తానని నేను ఊహించలేదు. ప్రస్తుత కోవిడ్ పరిస్థితుల్లో ఆశావహ దృక్పథంతో మెలగడం కష్టమే! కానీ, మీరు మరింత శక్తిమంతులుగా, ఉన్నతులుగా నిరూపించుకోగలరనడంలో సందేహం లేదు. ఎందుకంటే, మీకంటే ముందు చాలా మంది దాన్ని రుజువు చేశారు.

వందేళ్ళ క్రితం, 1920లో స్పానిష్ ఫ్లూ సమయంలోనూ కొందరు పట్టభద్రులుగా బయటకు వచ్చారు. అప్పటికి యాభై ఏళ్ళ తర్వాత, 1970లో వియత్నాం యుద్ధ కాలంలోనూ గ్రాడ్యుయేట్లు అయినవారున్నారు. అంతెందుకు, సెప్టెంబర్ 11 ఘటనకు కొద్ది నెలల ముందు 2001లో చదువు పూర్తి చేసుకుని యూనివర్సిటీల నుంచి బయటకొచ్చినవారు లేరా? మహమ్మారులను, యుద్ధాలను, ఇతర సంక్షోభాలను దాటుకుని వచ్చినవారు ఎందరో ఉన్నారు. వారు కొత్త సవాళ్ళను అనేకం ఎదుర్కోవాల్సి వచ్చింది. అన్ని సందర్భాలలోనూ వారు విజయులుగా నిలిచారు.

ఆశావాదంతో బతకమని మన సుదీర్ఘ చరిత్ర చాటుతోంది. ఆశావహులై ఉండండి. వర్తమానంలోని ప్రతి తరం, తమ తర్వాత రాబోయే తరం గురించి తక్కువ అంచనా వేసే విచిత్ర ధోరణిని నేను గమనించాను. ఒక తరం సాధించిన ప్రగతి తదుపరి తరానికి పునాది అవుతుందని గ్రహించలేకపోవడమే దానికి కారణం. కొత్త వ్యక్తుల సమూహం అన్నింటినీ సాధ్యం చేసి చూపిస్తుంది. మీ అనన్యమైన దృక్పథం ఇంతవరకు ఊహించని వాటిని కూడా మన ముందుకు తేవచ్చు.

> పరిస్థితులను మార్చాలనే తపనే నవీకరణలకు దారి తీస్తుంది. టెక్నాలజీ ఎంతగా అందుబాటులోకి వస్తే, మన జీవితాలు అంతగా మెరుగవుతాయి.

**టెక్నాలజీలో పుట్టిన తరం**

టెక్నాలజీ అంతగా అందుబాటులో లేని కాలంలో పెరిగి పెద్దవాడినయ్యాను. నాకు పదేళ్ళు వచ్చేదాకా నేను టెలిఫోన్ ముఖమే చూడలేదు. చదువుకునేందుకు అమెరికా వచ్చిన తర్వాతనే కంప్యూటర్‌ను రోజూ వాడుకోవడం కుదిరింది. పాత రోజుల్లోకి వెళితే, ఎంతో కాలానికి ఇంటికొచ్చిన టెలివిజన్‌లో ఒకే ఛానల్ ఉండేది. మీకిపుడు రకరకాల ఆకృతుల్లో, పరిమాణాల్లో కంప్యూటర్లు అందుబాటులో ఉన్నాయి. ఎక్కడైనా, దేని గురించైనా కంప్యూటర్‌ను అడగగలిగే సామర్థ్యం మీకిపుడు ఆశ్చర్యం కలిగించకపోవచ్చు. కానీ, అటువంటి సామర్థ్యాన్ని నిర్మించడంపైనే నేను ఓ దశాబ్ద కాలం పనిచేశాను. మిమ్మల్ని చూసి నేను కుళ్ళుకోను. ఈ రకమైన ప్రగతి నన్ను మరింత ఆశావహుడిని చేస్తుంది.

టెక్నాలజీకి సంబంధించిన కొన్ని అంశాలు మిమ్మల్ని బహుశా నిస్పృహకూ, అసహనానికీ లోనుచేస్తూ ఉండవచ్చు. ఆ అసహనాన్ని అలాగే ఉండనివ్వండి. ఎందుకంటే, అదే కొత్త టెక్నాలజీ విప్లవాన్ని సృష్టిస్తుంది. నా తరం కలలుకనే సాహసం చేయలేనివాటిని మీరు తయారు చేసి చూపించగలరు. వాతావరణ మార్పు లేదా విద్యారంగ సమస్యల పట్ల మా వైఖరి కూడా మిమ్మల్ని నిస్పృహకు గురిచేసి ఉండవచ్చు. అసహనంతోనే మెలగండి. అది ప్రపంచానికి అవసరమైన ప్రగతిని సృష్టిస్తుంది. పరిస్థితులను మార్చాలి, ఏదో చేయాలి అనే తపన నవీకరణలకు దారితీసి, ప్రపంచానికి కొత్త రూపురేఖలను సంతరిస్తుంది. టెక్నాలజీ మన కుటుంబాలకు ఎంతగా అందుబాటులోకి వస్తే, మన జీవితాలు అంతగా మెరుగవుతాయి.

మెరుగైన సెమీకండక్టర్లను తయారు చేయడం ద్వారా ఆ పని చేయగలనని నేను గ్రాడ్యుయేట్‌ని అయినపుడు భావించాను. అప్పటికి అంతకన్నా ఉత్తేజకరమైన అంశం ఏముంది? నేను అమెరికా రావడం కోసం విమాన టికెట్‌కు మా నాన్న ఒక ఏడాది జీతాన్ని వెచ్చించవలసి వచ్చింది. ఇంటికి ఫోన్ చేసేందుకు నిమిషానికి 2 డాలర్లకు పైగా ఖర్చయ్యేవి. బ్యాక్ ప్యాక్ కొనేందుకు కూడా ఇండియాలో మా నాన్నకు వచ్చే ఒక నెల జీతం అంత ఖర్చు పెట్టాల్సి వచ్చేది.

**అందరి కోసం టెక్నాలజీ**

నేను స్టాన్‌ఫోర్డ్‌లో చేరిన ఏడాదే ఇంటర్‌నెట్ రూపుదిద్దుకోవడం మొదలుపెట్టింది. అదే ఏడాది మొజాయిక్ బ్రౌజర్ విడుదలైంది. అది వరల్డ్ వైడ్ వెబ్, ఇంటర్‌నెట్‌లను ప్రాచుర్యంలోకి తెచ్చింది. టెక్నాలజీని మరింత మందికి అందుబాటులోకి తెచ్చేందుకు ఇంటర్ నెట్ ఏకైక ఉత్తమ మార్గం అవుతుందని నాకు అప్పటికింకా తెలియలేదు. ఆ సంగతి గ్రహించాక, గూగుల్‌లో నేను నా కలలను సాకారం చేసుకునే పనికి ఉద్యమించాను. నా నేతృత్వంలో సాగిన కృషితో 2009లో క్రోమ్ మొదలైంది. సరసమైన ధరలకు ల్యాప్ టాప్‌లను, ఫోన్లను అందించడంలో గూగుల్ చేసిన కృషికి సహాయపడ్డాను. గ్రాడ్యుయేషన్ తర్వాత పీహెచ్డీ చేసివుంటే అమ్మ, నాన్న గర్వపడేవారే. కానీ, టెక్నాలజీ ప్రయోజనాలను అనేకమందికి అందుబాటులోకి తెచ్చే అవకాశాన్ని కోల్పోయి ఉండేవాడిని. గూగుల్ సీఈఓగా ఈరోజు మీ ముందు నిల్చొని మాట్లాడగలిగి ఉండేవాడిని కాదు.

మీదైన రీతిలో ప్రపంచాన్ని మెరుగైనదిగా మార్చండి. మీకు ఇష్టమైన రంగాన్ని ఎంచుకొని, మీదైన విశిష్టమైన మార్గంలో సానుకూల ప్రభావాన్ని చూపేందుకు, దాన్ని వినియోగించుకోండి. క్యాలిఫోర్నియా రాష్ట్రంలో 27 ఏళ్ళ క్రితం మొదటిసారి అడుగిడినపుడు ఇవేవీ నా ఊహల్లో లేవు. అదృష్టంతోపాటు టెక్నాలజీ పట్ల గాఢమైన వ్యామోహం, విశాల దృష్టితో వ్యవహరించడం నన్నిక్కడకు తీసుకొచ్చాయి.

**అసహనమూ మంచిదే!**

> ఎంచుకున్న రంగం ఇష్టమైనదైతే మనసు పెట్టి పనిచేయగలుగుతారు. అదృష్టం, పరిస్థితులకన్నా, మీ వ్యామోహమే మిమ్మల్ని ముందుకు నడిపించే చోదక శక్తిగా పనిచేస్తుంది.

ప్రపంచంలో మిగిలిన వాటన్నింటి కన్నా మిమ్మల్ని ఏది ఎక్కువ ఉత్తేజపరుస్తోందో దాన్ని కనుగొనే ప్రయత్నం చేయండి. మీ తల్లితండ్రులు చెప్పారని లేదా మీ స్నేహితులు చేస్తున్నారని లేదా సమాజం మీ నుంచి ఆశిస్తోందనే కారణంతో మీకిష్టం లేని పనుల్లోకి దిగకండి. ఊహించని దారులు గణనీయమైన ప్రభావానికి దారితీస్తాయి. ఎంచుకున్న రంగం ఇష్టమైనదైతే మనసు పెట్టి పనిచేయగలుగుతారు. అదృష్టం, పరిస్థితుల కన్నా, మీ వ్యామోహమే మిమ్మల్ని ముందుకు నడిపించే చోదక శక్తిగా పనిచేస్తుంది. అది మీ గమనాన్ని తీర్చిదిద్ది, కలకాలం నిలవగల వారసత్వాన్ని మిగల్చగలుగుతుంది.

దేనినైనా అక్కున చేర్చుకునేందుకు సిద్ధంగా ఉండండి. ఉన్న వాటిని ఇంకా మెరుగుపరచాలనే అసహనంతోనే వ్యవహరించండి. ఆశావహ దృక్పథాన్ని వీడవద్దు. ఇదే నేనిచ్చే సలహా. మీరు ఆ పని చేయగలిగితే చరిత్ర మిమ్మల్ని గుర్తుపెట్టుకుంటుంది. అన్నింటినీ మార్చగలిగిన అవకాశం మీకుంది. మీరు మారుస్తారనే నమ్మకం కూడా నాకుంది! ◆

# పాఠాలు చెబుతున్నా... పనికిరారా?



సర్వీసులోని ఉపాధ్యాయులంతా టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (టెట్) పాస్ కావలసిందే అని ఈ ఏడాది సెప్టెంబర్ 1న సుప్రీం కోర్టు తీర్పు ఇచ్చింది. దీంతో దేశవ్యాప్తంగా టీచర్లు ఆందోళనలో పడ్డారు. తీర్పు ప్రకారం టెట్ లేకుండా సర్వీస్‌లో ఉన్నవారితో పాటు, ప్రమోషన్స్ పొందేవారు కూడా టెట్ పాస్ అయి తీరాలి. జస్టిస్ దీపాంకర్ దత్తా, జస్టిస్ మన్మోహన్‌లతో కూడిన ఇద్దరు సభ్యుల ధర్మాసనం ఈ తీర్పు వెలువరించింది. మైనారిటీయేతర పాఠశాలల్లో ఒకటి నుంచి 8వ తరగతి వరకు పాఠాలు చెప్పేవారంతా రెండేళ్ళలో టెట్ పాసవ్వాలి, లేదంటే తప్పనిసరిగా రిటైరై పోవాలనడం కలకలం రేపుతోంది.

2010 నుంచి అమలులోకి వచ్చిన విద్యాహక్కు చట్టం–2009కి ముందున్న టీచర్లు కూడా టెట్ పాసై ఉండాలి. కాకపోతే, వారి కోసం తీర్పులో కొన్ని సడలింపులిచ్చింది. పదవీ విరమణకు 5 ఏళ్ల లోపు సర్వీస్ ఉన్న టీచర్లు టెట్ పాసవ్వాల్సిన అవసరం లేకుండానే మిగతా సర్వీస్ పూర్తి చేసుకోవచ్చు. ఐదేళ్ల పైన సర్వీస్ ఉన్న టీచర్లు మాత్రం రెండేళ్లలో టెట్ పాస్ కావాలనీ, ప్రమోషన్స్ పొందాలంటే టెట్ ఉండాల్సిందే అనీ సుప్రీం తీర్పు నిర్దేశిస్తోంది.

తాజా సుప్రీం తీర్పు వల్ల దేశవ్యాప్తంగా 25 లక్షల మంది టీచర్లపై ప్రభావం ఉంటుందని ఒక అంచనా. తమిళనాడునే ఉదాహరణగా తీసుకుంటే, ప్రభుత్వ, ఎయిడెడ్ పాఠశాలల్లో దాదాపు 4.5 లక్షల మంది టీచర్లుంటే, అందులో సుమారు 4 లక్షల మంది టెట్ పాస్ కానివారే. ఈ పరిస్థితుల్లో సుప్రీం తీర్పు గనక అమలు చేస్తే, పలువురు టీచర్లు తమ ఉద్యోగాలకు అనర్హులై లక్షలాది విద్యార్థులు చదువుకు దూరమవుతారు. అందుకే, ఈ తీర్పు రాజ్యాంగంలోని 21ఎ అధికరణం కింద ఇచ్చిన ఉచిత, నిర్బంధ విద్య అనే ప్రాథమిక హక్కుకు భంగకరమని తమిళనాడు సర్కారు వాదిస్తోంది.

ఒక్క తమిళనాడులోనే కాదు... అనేక ఇతర రాష్ట్రాలలోనూ ఇదే పరిస్థితి. అందుకే, తమిళ సర్కారు ఈ తీర్పుపై రివ్యూ పిటిషన్ వేసింది. ఉత్తరప్రదేశ్ నుంచి కేరళ దాకా అనేక రాష్ట్రాలు సైతం ఈ ఆందోళనలో గొంతు కలుపుతున్నాయి. సుప్రీం తాజా తీర్పును పునఃసమీక్షించాలని కోరుతున్నాయి. స్కూల్ టీచర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సైతం తాజా తీర్పుపై సుప్రీంలో రివ్యూ పిటిషన్ వేసింది. నిజానికి, విద్యాహక్కు చట్టం అమల్లోకి వచ్చినా, చాలా రాష్ట్రాల్లో 2010 తర్వాత కూడా టెట్ లేకుండానే ప్రమోషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. తెలంగాణలో కూడా 3 సార్లు ఇలాగే జరిగింది. 2009కి పూర్వం ప్రాథమిక పాఠశాలల్లో ఉపాధ్యాయులకు ఉద్యోగ అర్హతకు బి.ఎడ్, డి.ఎడ్ కోర్సులు చదివినవారు అర్హులు. కానీ 2011లో సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం, 2011 ఆగస్టులో 'జాతీయ ఉపాధ్యాయ శిక్షణ మండలి' ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయుల ఎంపికలో టెట్ పేపర్1 రాయడానికి కేవలం డి.ఎడ్ వారినే అర్హులుగా చేసి దేశవ్యాప్త గెజిట్ జారీ చేశారు. సుప్రీం తీర్పు ప్రకారం రాష్ట్రాలు ఈ నిబంధనను అమలుచేశాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలోనూ 2012, 2017 డీఎస్సీల్లో అమలు చేశారు. 2018 వరకు ఆ తీర్పు అమలులో ఉండగా కేంద్ర ప్రభుత్వ రాజకీయ జోక్యంతో సుప్రీం తీర్పు పక్కన పెట్టి 2018 నవంబర్‌లో జాతీయ ఉపాధ్యాయ శిక్షణ మండలి ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయ పోస్టులకు బి.ఎడ్ వారికి కూడా టెట్ పేపర్1తో పాటు అవకాశం ఇచ్చారు. అనేక పరిణామాల తర్వాత 2023 సెప్టెంబర్ నుండి అన్ని రాష్ట్రాల్లో టెట్ పేపర్ 1తో పాటు ఎస్.జి.టి. పోస్టులకు కేవలం డి.ఎడ్ వారికే అవకాశం ఇస్తున్నారు. మరి ఇప్పుడు ఇన్ సర్వీస్ టీచర్లకు, ముఖ్యంగా ఎస్.జి.టి.లకు టెట్ పేపర్ 1 నిర్వహణ ఎలా సాధ్యం అవుతుంది? అయినా, నాణ్యమైన విద్య అందించాల్సిందే కానీ, అదే సమయంలో రాజ్యాంగమిచ్చిన చదువుకొనే హక్కునూ కాపాడాలి. సమతూకం పాటించాలి. చట్టం వచ్చిన 2010 నుంచి కాకుండా, అంతకు ముందు నుంచి ఉన్నవారికీ అమలయ్యేలా చూడాలనుకోవడం అసమంజసం. బోధన నాణ్యతనే పెంచాలనుకుంటే, ఇన్ సర్వీస్ ట్రైనింగ్, రిఫ్రెషర్ కోర్సుల లాంటి అనేక మార్గాలున్నాయి. అంతే కానీ, పాఠం చెప్పే టీచర్లను కాదు పొమ్మని, విద్యా వ్యవస్థను అస్తవ్యస్తం చేయడం తగదు.

– రావుల రామ్మోహన్ రెడ్డి, ఉపాధ్యాయుడు

# ఇవాళ్టి అవసరం వీరే!

ఇన్ బాక్స్

ఐఏఎస్ వంటి అఖిల భారత సర్వీసులకు ఎంపికైనవారు దేశానికి ఎంతో సేవ చేసే అవకాశం పొందుతారు. వీరి నిర్ణయాలు, రూపొందించే విధానాలు... దేశం దశ–దిశలను నిర్దేశిస్తాయి. ప్రజల జీవన స్థితిగతుల్లో అద్భుతమైన మార్పులు తీసుకురావడంలో ఎందరో అధికారులు కీలక పాత్ర పోషించారు. అందులో ఎస్.ఆర్. శంకరన్, డా॥ బి.డి. శర్మ, హర్ష మందర్, బి.ఎస్. యుగంధర్ వంటివారు ఉన్నారు.

ఇటువంటివారు ఏ స్థాయిలో పని చేసినా, ఎక్కడ పని చేసినా తమ ప్రత్యేకతను చూపించారు. మరీ ముఖ్యంగా ఒక్క సంవత్సరంలోనే 127 ప్రభుత్వ ఉత్తర్వులు విడుదల చేసి దళిత, గిరిజన జీవితాల్లో వెలుగులు నింపిన ఎస్.ఆర్. శంకరన్ ప్రజల హృదయాల్లో చిరంజీవిగా ఉంటారు. యానాదుల వంటి ఆదివాసీల జీవితాలను వారి గూడేల్లోనే నిద్రిస్తూ దగ్గరగా గమనించి ఆకళింపు చేసుకుని వారి ప్రగతికి బాటలు వేశారాయన. ప్రజా వ్యతిరేక విధానాలు అనిపించిన ప్రతి దాన్నీ ఆయన వ్యతిరేకించి ప్రభుత్వ పెద్దలకు మార్గదర్శనం చేసేవారు. కేవలం తన విధిని తాను నిర్వహించానని వినమ్రంగా చెబుతూ... తనకు కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన 'పద్మభూషణ్' అవార్డును సున్నితంగా తిరస్కరించారు. నిజాయతీకి నిలువెత్తు నిదర్శనం ఆయన. తన జీతంతో, పెన్షన్ డబ్బులతో పేద విద్యార్థుల చదువుకు సాయపడిన వ్యక్తిత్వం ఆయనది. శంకరన్ మరణించే నాటికి ఆయనకు కేవలం మూడు నాలుగు జతల బట్టలు, వెయ్యి రూపాయల బ్యాంకు బ్యాలన్సు మాత్రమే మిగిలాయట. బహుశా మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలామ్ మాత్రమే అంత నిరాడంబరంగా జీవించినట్లు మనం చదివాం!



ఎస్.ఆర్. శంకరన్

శంకరన్ లాగే డా॥ బ్రహ్మదేవ శర్మ కూడా గిరిజనుల హక్కుల కోసం, అభివృద్ధి కోసం ఎంతో శ్రమించారు. అవిభాజ్య మధ్యప్రదేశ్‌లోని బస్తర్ వంటి అటవీ ప్రాంతాల్లో కలెక్టర్‌గా పనిచేస్తూ భూస్వాముల దౌర్జన్యాలను, దుర్మార్గాలను ఎదుర్కొన్నారు. అపారమైన అటవీ సంపదను, ఖనిజ సంపదను బహుళజాతి సంస్థలు తన్నుకుపోకుండా అడ్డుకున్నారు. హర్ష మందర్ గుజరాత్ క్యాడర్ ఐఏఎస్ అధికారిగా ఉంటూ... రాష్ట్రంలో నాడు జరుగుతున్న దమన కాండనూ, ప్రభుత్వమే ప్రత్యేకించి ఒక మతం వారిపై జరిపిన నరమేధాన్నీ సహించలేకపోయారు. చివరకు తన పదవికి రాజీనామా చేసి ప్రజా పోరాటాలలో పాల్గొన్నారు. తన 34 ఏళ్ల సర్వీసులో 57 సార్లు బదిలీ అయినటువంటి హరియాణా క్యాడర్ ఐఏఎస్ అధికారి అశోక్ ఖేమ్కా తన సర్వీస్ అంతా అన్యాయాలకు, అక్రమాలకు వ్యతిరేకంగానే నిలిచారు. విలువలు కరిగిపోతూ రాజకీయ నాయకుల ప్రమేయం సాధారణ పాలనలో ఎక్కువైన నేపథ్యంలో ఇటువంటి ఉన్నతాధికారుల అవసరం ఇప్పుడు ఎంతో ఉంది.

– శ్రీ శ్రీ కుమార్

(దళిత గిరిజన బాంధవుడు ఎస్.ఆర్. శంకరన్ వర్ధంతి నేడు)

## డేటా పాయింట్

### 'డ్రాపవుట్' తగ్గుతోంది!

దేశంలో విద్యార్థుల డ్రాపవుట్ రేటు గత మూడేళ్లుగా అన్ని స్థాయుల్లోనూ తగ్గుతూ వస్తోందని కేంద్ర గణాంక శాఖ విడుదల చేసిన 'చిల్డ్రన్ ఇన్ ఇండియా 2025' నివేదిక వెల్లడించింది.




# పశ్చాత్తాప పడేలా...




దత్తావతారమైన మాణిక్యప్రభు ఒకసారి ఇద్దరు శిష్యులను వెంటపెట్టుకొని వైద్యనాథం నుంచి పండరీ పురానికి ప్రయాణమయ్యారు. చంద్రభాగా నదిని దాటి వెళ్ళాలి పండరీ పురానికి. వరద వచ్చి, నది పొంగి ఉధృతంగా ప్రవహిస్తున్నది. చీకటి పడింది. పడవ ఏదీ కనపడలేదు. రాత్రి గడపటానికి శిష్యులు భయపడ్డారు. భయపడనక్కరలేదన్నారు మాణిక్యప్రభు. అంతలోనే ఎక్కడి నుంచి వచ్చిందో ఒక పడవ వచ్చింది. వారు పడవ ఎక్కి పండరీ పురానికి చేరారు. ఆ తర్వాత వారు ఎంత చూసినా పడవ కనపడనే లేదు. పండరినాథుడే స్వయంగా వచ్చి వారిని నదిని దాటించాడని వారనుకున్నారు.

ఒక రోజు చినిగిపోయిన గుడ్డ పేలికలను తలకు చుట్టుకొని, శరీరమంతా మురికిగానున్న ఒక చండాలుడు గుడిలోకి పోవాలని వచ్చాడు. అక్కడున్న అర్చకులు అడ్డుపడ్డారు. అయినా అతడు దూసుకొని ఆలయంలోకి ప్రవేశించాడు. అర్చకులు అందరూ ఏకమై అతనిని పట్టుకొని కొట్టారు. కానీ కొద్దిసేపటికే అతడు మాణిక్యప్రభువు అని వారు తెలుసుకుంటారు. అర్చకులు పశ్చాత్తాపపడి క్షమించమని కోరారు. మాణిక్యప్రభువు వారికి అభయమిచ్చారు. ఒక అర్చకుని ఆహ్వానం మేరకు ఆయన ఇంట్లో కొద్ది రోజులు బస చేశారు. ఇలా మాణిక్యప్రభువు ఎందరిలోనో పరివర్తన తెచ్చారు, ఎందరినో ఉద్ధరించారు. (పుటలు 44, 45, 46 – శ్రీ మాణిక్యప్రభు చరిత్ర – గంటి రెడ్డయ్య)

– రాచమడుగు శ్రీనివాసులు

## క్లుప్తంగా...

### రెడ్డి జాగృతి పిటిషన్‌లను వెనక్కి తీసుకోవాలి

- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల



హిమాయత్‌నగర్ (హైదరాబాద్): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు ప్రభుత్వం విడుదల చేసిన జీవో నం.9ను అడ్డుకునేందుకు సుప్రీంకోర్టు, హైకోర్టులలో రెడ్డి జాగృతి నాయకులు వేసిన పిటిషన్‌లను 24 గంటల్లో ఉపసంహరించుకోవాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. లేనిపక్షంలో బీసీలకు రెడ్డిలను రాజకీయ శత్రువులుగా ప్రకటిస్తామని, 2028 ఎన్నికల్లో ఒక్క రెడ్డి అభ్యర్థి గెలవకుండా పని చేస్తామని హెచ్చరించారు. సోమవారం బషీర్‌బాగ్ దేశోద్ధారక భవన్‌లో బీసీ కుల సంఘాల జేఏసీ చైర్మన్ కుందారం గణేశ్‌చారి అధ్యక్షతన బీసీ సంఘాలు, మేధావులు, కుల సంఘాల ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా జాజుల హాజరై మాట్లాడుతూ జనాభాలో 5 శాతం లేని రెడ్డి సామాజిక వర్గం ఉద్యోగ, రాజకీయ రంగాలలో 90 శాతం పదవులు అనుభవిస్తోందని మండిపడ్డారు. 60 శాతానికి పైగా ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే ఎందుకు కడుపుమంట అని ప్రశ్నించారు. అన్ని రాజకీయ పార్టీలు ఏకగ్రీవంగా బీసీ రిజర్వేషన్ల బిల్లును రాష్ట్ర గవర్నర్‌కు పంపితే దానిని ఎందుకు ఆమోదించడం లేదని ప్రశ్నించారు. ఈ సమావేశంలో బీసీ నేతలు వి.జి.ఆర్. నారగోని, దాసు సురేశ్ తదితరులు పాల్గొన్నారు.

### నవంబర్ 25 నుంచి హైటెక్స్‌లో పౌల్ట్రీ ఇండియా ఎగ్జిబిషన్

- పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్‌సింగ్

సాక్షి, న్యూఢిల్లీ: దక్షిణాసియాలోనే అతిపెద్ద పౌల్ట్రీ ఈవెంట్‌కు తెలంగాణ వేదిక కానుంది. నవంబర్ 25 నుంచి 28 వరకు మూడు రోజులపాటు హైదరాబాద్‌లోని హైటెక్స్‌లో నిర్వహిస్తున్నట్టు ఇండియన్ పౌల్ట్రీ ఎక్విప్‌మెంట్ మాన్యుఫ్యాక్చరర్స్ అసోసియేషన్ (ఐపీఈఎంఏ) తెలిపింది. పౌల్ట్రీ ఇండియా అధ్యక్షుడు ఉదయ్‌సింగ్ బయాస్ సోమవారం ఢిల్లీలో విలేకరులతో మాట్లాడారు. ఈ 17వ పౌల్ట్రీ ఇండియా ఎక్స్‌పోను 'వన్ నేషన్–వన్ ఎక్స్‌పో' థీమ్‌తో నిర్వహిస్తున్నామని చెప్పారు. నవంబర్ 25న నోవాటెల్‌లో 'నాలెడ్జ్ డే'తో ఎగ్జిబిషన్ ప్రారంభమవుతుందని తెలిపారు. ఎగ్జిబిషన్‌లో 50 దేశాల నుంచి 500కి పైగా ఎగ్జిబిటర్లు, 50 వేలకు పైగా సందర్శకులు పాల్గొంటారని వివరించారు.

### ఏసీబీ కస్టడీకి విద్యుత్ శాఖ మాజీ ఏడీఈ అంబేడ్కర్

సాక్షి, హైదరాబాద్: ఆదాయానికి మించిన ఆస్తుల కేసులో అరెస్టు అయిన విద్యుత్‌శాఖ మాజీ ఏడీఈ (అసిస్టెంట్ డివిజనల్ ఇంజనీర్) అంబేడ్కర్‌ను ఏసీబీ అధికారులు కస్టడీకి తీసుకున్నారు. నాలుగు రోజుల కస్టడీలో భాగంగా మొదటి రోజు సోమవారం ఉదయం చంచల్‌గూడ సెంట్రల్ జైలు నుంచి నాంపల్లిలోని ఏసీబీ కార్యాలయానికి ఆయనను తరలించారు. మొదటి రోజు విచారణలో ప్రధానంగా ఆయన వ్యక్తిగత, వృత్తిగత వివరాలు, కుటుంబ వివరాలు..ఎక్కడెక్కడ విధులు నిర్వర్తించాడు అన్న అంశాలు సేకరించినట్టు తెలిసింది. ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టాడన్న ఆరోపణలతో సెప్టెంబర్ 16న అంబేడ్కర్ ఇళ్లు, ఆయన కుటుంబ సభ్యులు, బంధువుల ఇళ్లలో ఏకకాలంలో ఏసీబీ అధికారుల బృందాలు సోదాలు నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ సోదాల్లో స్వాధీనం చేసుకున్న డాక్యుమెంట్ల ఆధారంగా అంబేడ్కర్ నుంచి వివరాలు సేకరిస్తున్నారు. ఏసీబీ అధికారులు మంగళవారం ఆయనను మరోమారు ప్రశ్నించనున్నారు.

### భీమా జ్యువెల్స్ గోల్డెన్ సూపర్ సర్‌ప్రైజ్





**బడిలో పాలన.. చదువు సాగేనా**

ఆదిలాబాద్ జిల్లాలో కొత్తగా ఏర్పడిన భోరజ్ మండలం తహసీల్దార్ కార్యాలయాన్ని.. అక్కడి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేశారు. అందులోనే అంగన్వాడీ కేంద్రాన్ని సైతం నిర్వహిస్తున్నారు. అయితే తరగతి గదులు లేకపోవడంతో ఒకే గదిలో.. ఐదు తరగతులకు ఏకోపాధ్యాయునితో బోధన సాగుతోంది. వివిధ రెవెన్యూ పనుల నిమిత్తం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చే ప్రజలతో.. విద్యార్థుల బోధనకు తీవ్ర ఆటంకం కలుగుతోంది.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్ – ఆదిలాబాద్



**టీచర్లకు వంట బిల్లుల సెగ**

దండేపల్లి: మధ్యాహ్న భోజన బిల్లులు పెండింగ్‌లో ఉండటంతో.. మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని తొమ్మిది ఉన్నత పాఠశాలలతోపాటు లింగాపూర్ మోడల్ స్కూల్‌లో మధ్యాహ్న భోజనం నిర్వాహకులు శనివారం నుంచి వంట పనులు మానేశారు. దీంతో సోమవారం విద్యార్థులు ఇళ్లకు వెళ్లకుండా ఉండేందుకు.. కొన్ని పాఠశాలల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసి వంటలు వండించారు. దండేపల్లి ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు గరిట పట్టి వంట చేసి విద్యార్థులకు భోజనం వడ్డించారు.

# శ్రీశైలం ప్రాజెక్టుకు రికార్డు వరద

- జలాశయ చరిత్రలోనే ఈ ఏడాది అత్యధిక వరద
- 2,105 టీఎంసీల వరద ప్రవాహంతో కొత్త రికార్డు
- మరో 50–100 టీఎంసీలు వచ్చే అవకాశం
- నాగార్జునసాగర్‌కు సైతం 1,578 టీఎంసీల భారీ ప్రవాహం రాక



సాక్షి, హైదరాబాద్: శ్రీశైలం జలాశయానికి రికార్డు స్థాయిలో వరద వచ్చింది. పరీవాహకంలో ఏకధాటిగా భారీ వర్షాలు కురవడంతో గడిచిన మూడు నెలలుగా కృష్ణా ప్రధాన పాయతోపాటు తుంగభద్ర నుంచి నిరంతర వరద ప్రవాహం కొనసాగింది. దీంతో ప్రస్తుత నీటి సంవత్సరం (2024–25)లో సోమవారం ఉదయం 6 గంటల నాటికి జలాశయానికి 2105.43 టీఎంసీల వరద ప్రవాహం వచ్చింది. జలాశయ చరిత్రలోనే ఇప్పటి వరకు వచ్చిన అత్యధిక వరద ప్రవాహం ఇదే కావడం గమనార్హం. సాగునీటి రంగ పరిభాషలో జూన్ 1 నుంచి వచ్చే ఏడాది మే 31 మధ్య కాలాన్ని నీటి సంవత్సరంగా పరిగణిస్తారు. ప్రస్తుత నీటి సంవత్సరంలో మరో 50–100 టీఎంసీలు శ్రీశైలం జలాశయానికి వచ్చే అవకాశం ఉందని అంచనా వేస్తున్నారు. ఇంతకు ముందు అత్యధికంగా 1994–95లో 2,039.23 టీఎంసీల వరద ప్రవాహం రాగా, ఆ తర్వాత 2022–23లో దానికంటే స్వల్ప అత్యధికంగా 2,039.87 టీఎంసీల ప్రవాహం వచ్చింది. 1980లో శ్రీశైలం ప్రాజెక్టు అందుబాటులోకి రాగా, 1984–85 నుంచి పూర్తిస్థాయి నిల్వలను కొనసాగిస్తున్నట్టు గణాంకాలు పేర్కొంటున్నాయి.

- జలాశయానికి అత్యల్పంగా 2015–16లో 74.46 టీఎంసీల ప్రవాహం రాగా, 2003–04లో 129.47 టీఎంసీలు, 2023–24లో 145.12 టీఎంసీలు, 2012–13లో 197.53 టీఎంసీల వరద వచ్చింది.

#### సాగర్‌కూ భారీ వరద

ప్రస్తుత నీటి సంవత్సరంలో ఇప్పటి వరకు నాగార్జునసాగర్ ప్రాజెక్టుకు 1,578.28 టీఎంసీల భారీ ప్రవాహం వచ్చింది. నాగార్జునసాగర్ ప్రాజెక్టు 1967లో అందుబాటులోకి రాగా, 1975–76లో అత్యధికంగా 2,639.9 టీఎంసీలు, 1978–79లో 1,966.75 టీఎంసీల వరద వచ్చింది. ఆ తర్వాత కాలంలో కృష్ణానదిపై ఎగువన ఆల్మట్టి, నారాయణపూర్, జూరాల, శ్రీశైలం వంటి ప్రాజెక్టుల నిర్మాణంతో నాగార్జునసాగర్ జలాశయానికి వరద ప్రవాహం గణనీయంగా తగ్గిపోయింది.

- సాగర్‌కు అత్యల్పంగా 2016–17లో 74.25 టీఎంసీల వరద మాత్రమే రాగా, ఆ తర్వాత 2023–24లో 128.29 టీఎంసీలు, 2003–04లో 149.44 టీఎంసీలు, 2016–17లో 197.75 టీఎంసీల వరద మాత్రమే వచ్చింది. కర్ణాటక ప్రభుత్వం ఇటీవల తమ రాష్ట్రంలో కృష్ణానదిపై ఉన్న ఆల్మట్టి జలాశయ ఎత్తును పెంచాలని తీసుకున్న నిర్ణయం కార్యరూపం దాల్చితే తీవ్ర నీటిఎద్దడి నెలకొని ఉండే ఇలాంటి సంవత్సరాల్లో ఎగువ నుంచి శ్రీశైలం, సాగర్ ప్రాజెక్టులకు చుక్కనీరు వచ్చే అవకాశం ఉండదని ఈ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

#### పులిచింతల జలాశయానికి...

నాగార్జునసాగర్‌కు దిగువన ఉన్న పులిచింతల జలాశయానికి సైతం ప్రస్తుత ఏడాది రికార్డు స్థాయిలో అత్యధిక వరద వచ్చింది. ఈ ఏడాది ఇప్పటి వరకు జలాశయానికి వచ్చిన 1,293.68 టీఎంసీల వరదే జలాశయ చరిత్రలో అత్యధిక వరద ప్రవాహం కావడం గమనార్హం. 2022–23లో అత్యధికంగా 1,285.86 టీఎంసీల వరద పులిచింతల జలాశయానికి వచ్చింది. ఈ ఏడాది కృష్ణానదికి నిరంతరంగా భారీ వరదలు కొనసాగడంతో ఇప్పటి వరకు ఏకంగా 1,382 టీఎంసీల కృష్ణా జలాలు సముద్రం పాలయ్యాయి.

# తక్షణమే పత్తి కొనుగోళ్లు

- జిన్నింగ్ మిల్లర్లు, సీసీఐకి మంత్రి తుమ్మల ఆదేశం
- రైతులకు ఇబ్బంది కలిగించొద్దని స్పష్టీకరణ
- మిల్లర్లు నష్టపోకుండా చూడాలని సీసీఐకి సూచన



సాక్షి, హైదరాబాద్: పత్తి కొనుగోళ్లలో నెలకొన్న ప్రతిష్టంభనను తొలగించేందుకు సీసీఐ, జిన్నింగ్ మిల్లుల యాజమాన్యాలు సహకరించాలని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు కోరారు. ఇప్పటికే పత్తి సేకరణ ప్రారంభమైనందున కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధరకు పత్తిని కొనాలని ఆదేశించారు. కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) కొనుగోలు కేంద్రాలు ఇప్పటివరకు ఏర్పాటు కాకపోవడంతో రైతులు దళారులకు తక్కువ ధరకే పత్తిని విక్రయించే అవకాశం ఉన్నందున దాన్ని నివారించేందుకు తక్షణమే కొనుగోళ్లు ప్రారంభించాలని ఆదేశించారు. రాష్ట్రంలో పత్తి కొనుగోళ్లకు సంబంధించి తలెత్తిన సమస్యలను పరిష్కరించే ఉద్దేశంతో సీసీఐ సీఎండీ లలిత్‌కుమార్ గుప్తా, వ్యవసాయ శాఖ సంచాలకుడు డాక్టర్ బి. గోపి, కేంద్ర జౌళి శాఖ డైరెక్టర్ పూర్ణేష్ గురునాని, మార్కెటింగ్ శాఖ అధికారులు, జిన్నింగ్ మిల్లర్లతో మంత్రి తుమ్మల సోమవారం సచివాలయంలో సమావేశమయ్యారు. సీసీఐ పత్తి జిన్నింగ్ కోసం రెండుసార్లు ఇచ్చిన టెండర్ల నోటిఫికేషన్‌లో పాల్గొనేందుకు మిల్లర్లు అభ్యంతరం తెలపడానికి గల కారణాలపై చర్చించారు. సీసీఐ టెండర్లలో మిల్లుల కేటాయింపు, స్లాట్ బుకింగ్, ఏరియా మ్యాపింగ్ నిబంధనలపై అధికారులతో సమీక్షించారు. ఇతర రాష్ట్రాల్లో లేని అభ్యంతరాలు తెలంగాణలో ఎందుకు వచ్చాయని మంత్రి ప్రశ్నించారు. మొండిగా వ్యవహరించకుండా జిన్నింగ్ మిల్లర్లు వెంటనే టెండర్లలో పాల్గొని పత్తి కొనుగోళ్లు ప్రారంభించాలని ఆదేశించారు. మిల్లర్ల సమస్యలను కూడా సానుకూలంగా పరిష్కరించేందుకు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పత్తి కొనుగోళ్లకు రూపొందించిన కొత్త నిబంధనల్లో ఇబ్బందులేమైనా ఉంటే సీసీఐ అధికారులు ప్రతివారం సమీక్షించి జిన్నింగ్ మిల్లర్లు కూడా నష్టపోకుండా చూడాలని సూచించారు. పత్తి విక్రయాలకు సంబంధించి రైతులకు 'కపాస్ కిసాన్'యాప్, స్లాట్ బుకింగ్‌కు సంబంధించి విస్తృత అవగాహన కల్పించాలని మార్కెటింగ్ శాఖ అధికారులను ఆదేశించారు. కాగా, మంత్రి సూచనకు మిల్లర్లు అంగీకరించారని మార్కెటింగ్ శాఖ తెలిపింది. రానున్న వారం రోజుల్లో రైతుల నుంచి పత్తి సేకరణకు మిల్లర్లు అంగీకరించారని మంత్రి తుమ్మల కార్యాలయం ఓ ప్రకటనలో తెలిపింది.

## విజయ్ దేవరకొండకు తృటిలో తప్పిన ప్రమాదం

- హీరో కారును ఢీకొట్టిన బొలెరో వాహనం
- జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి వద్ద ఘటన



ఉండవెల్లి శివారులో ప్రమాదానికి గురైన హీరో విజయ్ దేవరకొండ కారు

ఉండవెల్లి: 44వ నంబర్ జాతీయ రహదారిపై హీరో విజయ్ దేవరకొండ ప్రయాణిస్తున్న కారును మరో వాహనం ఢీ కొట్టగా.. ఆయనకు తృటిలో ప్రమాదం తప్పింది. ఆంధ్రప్రదేశ్‌లోని పుట్టపర్తికి వెళ్లిన హీరో విజయ్.. సోమవారం మధ్యాహ్నం తిరిగి హైదరాబాద్ బయలుదేరారు. సాయంత్రం జోగుళాంబ గద్వాల జిల్లా ఉండవెల్లి మండలం శివారులో పత్తి మిల్లు వద్ద ఏపీలోని నందికొట్కూర్ నుంచి పశువుల లోడ్‌తో వస్తున్న బొలెరో వాహనం ఒక్కసారిగా కుడివైపునకు టర్న్ చేయడంతో వెనకాలే వస్తున్న విజయ్ కారు బలంగా ఢీ కొట్టింది. దీంతో విజయ్ ప్రయాణిస్తున్న లెక్సస్ కారు ముందుభాగం దెబ్బతింది. ఆయనకు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదం జరిగిన సమయంలో విజయ్‌తోపాటు ఆయన స్నేహితుడు రవికాంత్ యాదవ్, డ్రైవర్ శ్రీకాంత్ ఉన్నారు. కాగా.. వెనకాలే వచ్చిన స్నేహితుల కారులో విజయ్ హైదరాబాద్ వెళ్లిపోయారు. బొలెరో డ్రైవర్ రాష్ డ్రైవింగ్ వల్లే ప్రమాదం జరిగిందని... హీరో కారు డ్రైవర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ శేఖర్ తెలిపారు.

## మాదిగ అమరవీరులను ఆదుకోవాలి: మోత్కుపల్లి



పంజగుట్ట (హైదరాబాద్): రాష్ట్ర ముఖ్యమంత్రి ఎస్సీ వర్గీకరణ చేసి మాదిగల జీవితాల్లో వెలుగు నింపినందుకు ఎంతో సంతోషమని అలానే మాదిగ అమరవీరుల కుటుంబాలను కూడా ఆదుకోవాలని మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు అన్నారు. సోమవారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో మాదిగ సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ.. వర్గీకరణ కోసం ఎంతోమంది పోరాటం చేశారని, సురేందర్ మాదిగ, దామోదర్ మాదిగ, మహేశ్ మాదిగ, భారతి ఉద్యమంలో అమరులయ్యారని చెప్పారు. కానీ వారి కుటుంబాలకు ఇప్పటివరకు న్యాయం జరగలేదని, అమరుల కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం, 50లక్షల పరిహారం ఇవ్వాలని కోరారు.కాగా, మంత్రి పొన్నం ప్రభాకర్ సహచర మాదిగ మంత్రి లక్ష్మణ్‌ను దున్నపోతు అని అనడం సరికాదని, అది ఆయన అహంకారానికి నిదర్శనమని అన్నారు.

# ఉద్యమాన్ని కాపాడలేకపోయా.. క్షమించండి

- వర్తమాన ఫాసిస్టు పరిస్థితుల్లో మన లక్ష్యాన్ని అందుకోలేం
- పార్టీ కేడర్‌ను కాపాడుకోవాలి... అనవసర త్యాగాలకు ఫుల్‌స్టాప్ పెట్టాలి
- మావోయిస్టు పార్టీ కేడర్‌కు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను లేఖ
- 22 పేజీల సుదీర్ఘ లేఖలో పలు అంశాల ప్రస్తావన
- తాను అనర్హుడినని.. ఈ బాధ్యతల్లో ఇక కొనసాగలేనని వ్యాఖ్య



సాక్షి, హైదరాబాద్: ఉద్యమం ఓటమిపాలు కాకుండా కాపాడలేకపోయినందుకు బాధపడుతూ అందరికీ క్షమాపణలు చెబుతున్నానని మావోయిస్టు పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు మల్లోజుల వేణుగోపాల్ అలియాస్ సోను పేర్కొన్నారు. ఈ మేరకు సోను పేరిట 22 పేజీల సుదీర్ఘ లేఖ ఒకటి సోమవారం వెలుగులోకి వచ్చింది. ఆగస్టులో రాసినట్టుగా పేర్కొంటున్న ఈ లేఖ సాధారణంగా మావోయిస్టులు విడుదల చేసే లేఖకు భిన్నంగా ఎలాంటి వివరాలు లేకుండా సాదాసీదాగా తెలుగులో పీడీఎఫ్ రూపంలో ఉంది. విజ్ఞప్తి అనే శీర్షికన మొదలైన ఈ లేఖను మల్లోజుల 'ప్రియమైన కామ్రేడ్స్ లాల్‌సలాం''అంటూ ప్రారంభించారు. 28 సంవత్సరాలుగా మావోయిస్టు పార్టీలో కేంద్ర కమిటీ సభ్యుడిగా, 18 ఏళ్లుగా పొలిట్‌బ్యూరో సభ్యుడిగా పనిచేశానని, సుదీర్ఘ ఆచరణలో నిర్మాణ కర్తవ్యాలు, ఇతర పనులపై కేంద్రీకరించి సంతగా సిద్ధాంతాన్ని, మారుతున్న పరిస్థితులను లోతుగా, సమగ్రంగా అధ్యయనం చేయలేకపోయానని పేర్కొన్నారు. 'ఇంతటి నష్టాలకు, బలిదానాలకు దారి తీసిన విప్లవోద్యమానికి నాయకత్వం వహించిన నేను ఇకపై ఈ బాధ్యతల్లో కొనసాగడానికి ఇంకా ఎంత మాత్రం అర్హున్ని కానని భావిస్తున్నాను. పార్టీ అత్యంత కష్టకాలంలో ఉన్నప్పుడు ఇలాంటి నిర్ణయం సరైంది కాదని మీరు భావించొచ్చు. కానీ, పార్టీని కాపాడుకోవడానికి, సరైన పార్టీ నాయకత్వాన్ని కేడర్ ఎంచుకోవడానికి ఇలాంటి పరిస్థితులే అనివార్యం చేస్తాయి. నా అభిప్రాయాన్ని మీ అంతిమ నిర్ణయానికి వదలడం మించి నాకు మరే మార్గం లేదు. దీన్ని మీరు అర్థం చేసుకుంటారని విజ్ఞప్తి చేస్తున్నాను'అని పేర్కొన్నారు.

#### ప్రత్యామ్నాయ పరిస్థితులు లేకనే శాంతి చర్చలకు..

ప్రత్యామ్నాయ పరిస్థితులు లేకపోవడంతోనే శాంతిచర్చల ప్రక్రియకు పూనుకుంటున్నామన్నది అర్థం చేసుకోగలరని కేడర్‌కు సూచించారు. తాను పదేళ్లుగా కేంద్ర కమిటీలో చర్చించిన అంశాలంటూ ప్రధానంగా 'శత్రువుకు అభేద్యమైన రహస్య విప్లవ పార్టీ నిర్మాణం లేకపోవడం, శత్రువు ఎత్తుగడలను తక్కువగా అంచనా వేయడం, చట్టబద్ధ పోరాటాలను మనం కాదనుకున్నాం..అంటూ మూడు అంశాలపై సుదీర్ఘ లేఖలో ప్రస్తావించారు. 25 ఏళ్లుగా శత్రువును తక్కువ అంచనా వేస్తూ తప్పుడు ఎత్తుగడలు అనుసరించడమే నేటి పరిస్థితికి కారణమన్నారు. పొలిట్ బ్యూరోలో జరిగిన నిర్ణయాలను కేంద్రకమిటీ కొట్టివేసిందని, గెరిల్లా యుద్ధాన్ని తీవ్రతరం చేయడం..విస్తృతం చేయడం అనే పంథా సరికాదని గుర్తించలేకపోయారని పేర్కొన్నారు. జనతన సర్కార్‌లోనూ లోపాలు ఉన్నాయని ప్రస్తావించారు. 'తీవ్రమైన అధ్యయనం, ఓపిక, త్యాగాలతో కూడిన విప్లవాచరణ లేకుండా వర్తమాన ఫాసిస్టు పరిస్థితుల్లో మన లక్ష్యాన్ని నెరవేర్చలేం. మీరంతా ఆలోచించి సరైన నిర్ణయం తీసుకుంటారనీ విజ్ఞప్తి చేస్తున్నాను. ఇప్పటివరకూ కొనసాగించిన పంథానే సరైనదనీ, దానిని ఆచరిస్తూ మనం భవిష్యత్‌లో అద్భుతాలు సృష్టిస్తామని చెప్పేవారు ఎవరైనా ముందు తమపై తాము విశ్వాసం పెంచుకొని, ఇన్నాళ్లుగా ఆ అద్భుతాలు ఎందుకు సృష్టించలేకపోయారో, అసలు గాడి ఎక్కడ తప్పారో చెప్పి కనువిప్పు కలిగిస్తే, మనలో విశ్వాసాన్ని పెంపొందింపచేస్తే సంతోషిద్దాం. అది ఇక ఎవరివల్లా కాని పని. ఆ పనే మన పార్టీ చేయగలిగి ఉంటే, ఇవాళ ఈ స్థితి వచ్చేదే కాదు. ఇప్పుడు మనకు సానుకూల మార్పు కావాలి. ఉద్యమాన్ని కాపాడుకోవడం, కేడర్‌ను రక్షించుకోవడం కావాలి. అనవసర త్యాగాలకు అంతం పలుకుదాం. నూతన పద్ధతులలో పురోగమిద్దాం. అంతిమ విజయం ప్రజలదే..''అంటూ లేఖను ముగించారు.

# ఇందిర జయంతి రోజు 67 లక్షల చీరల పంపిణీ

- సిరిసిల్లలో మంత్రి సీతక్క.. ఇందిరా మహిళాశక్తి చీరల తయారీ పరిశీలన



చీరల వస్త్ర ఉత్పత్తిని పరిశీలిస్తున్న సీతక్క, ఆది శ్రీనివాస్ తదితరులు

సిరిసిల్ల: రాష్ట్రంలోని 67 లక్షల మంది మహిళా సంఘాల సభ్యులకు ఇందిరమ్మ జయంతి అయిన నవంబర్ 19న ఇందిరా మహిళా శక్తి చీరలను పంపిణీ చేస్తామని పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి, మహిళా శిశుసంక్షేమశాఖ మంత్రి సీతక్క తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కేంద్రంలో ఇందిరా మహిళాశక్తి చీరల తయారీతోపాటు పవర్‌లూమ్ కార్ఖానాలు, చీరల గోదాము, ప్రాసెసింగ్ యూనిట్‌ను సోమవారం ఆమె పరిశీలించారు. పలువురు నేత కార్మికులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యుల గౌరవం పెంచేలా ఏకరూప చీరలను పంపిణీ చేస్తామన్నారు. రాష్ట్రంలోని నేతన్నలకు నిరంతరం ఉపాధిని కల్పించేందుకే తమ ప్రభుత్వం ఇందిరా మహిళా శక్తి చీరల ఆర్డర్లు ఇచ్చిందన్నారు. నేతన్నలకు ఇబ్బంది లేకుండా ఉండేందుకు రూ.50 కోట్లతో యారన్ డిపోను వేములవాడలో ఏర్పాటు చేశామని వివరించారు. భవిష్యత్‌లో బతుకమ్మ చీరలపైనా ప్రభుత్వం నిర్ణయం తీసుకొని మహిళలందరికీ చీరలు అందించేందుకు కేబినెట్‌లో చర్చించి నిర్ణయం తీసుకుంటుందన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, చేనేత, జౌళిశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్, కాంగ్రెస్ నేత కె.కె. మహేందర్‌రెడ్డి స్థానిక నేతలు పాల్గొన్నారు.

## కర్కశంగా వ్యక్తి హత్య

- మృతదేహాన్ని ముక్కలు చేసి పడేసిన నిందితుడు
- తల, శరీర భాగాలు ఖమ్మంలో లభ్యం



వెంకటేశ్వర్లు

ఖమ్మంక్రైం/కామేపల్లి: కర్కశంగా హత్య చేసినా పగ తీరలేదో, ఇంకేమైనా కారణాలు ఉన్నాయోగానీ ఓ వ్యక్తిని హత్యచేసి మృతదేహాన్ని ముక్కలు చేసి వేర్వేరు ప్రాంతాల్లో పడేసిన ఘటన ఇది. 15 రోజుల క్రితం హత్య జరిగినట్లు తెలుస్తుండగా శరీరభాగాలను ఖమ్మం జిల్లా కేంద్రంలో పోలీసులు సోమవారం స్వాధీనం చేసుకున్నారు.

#### హైదరాబాద్ వెళ్తున్నట్లు చెప్పి....

ఖమ్మం జిల్లా కామేపల్లి మండలం కెప్టెన్ బంజర గ్రామానికి చెందిన గట్ల వెంకటేశ్వర్లు (40) హైదరాబాద్‌లో ఓ అపార్ట్‌మెంట్ లీజుకు తీసుకుని అద్దెకు ఇస్తూ అక్కడే నివాసం ఉంటున్నాడు. కొన్నాళ్ల క్రితం కొత్తగూడేనికి చెందిన మహిళతో ఆయనకు వివాహం జరగగా, ఆమె ప్రైవేట్ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తూ అక్కడే ఉంటోంది. వెంకటేశ్వర్లు గత నెల 13న కామేపల్లిలోని తన సోదరి ఇంటికి వచ్చాడు. మరుసటి రోజు శుభకార్యానికి హాజరై తిరిగి 15న హైదరాబాద్ వెళ్తున్నట్లు చెప్పాడు. ఆ తర్వాత రోజు నుంచి వెంకటేశ్వర్లు ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో ఆయన సోదరి భర్త కొండ యాదగిరి గత నెల 22న కామేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా వెంకటేశ్వర్లు మొబైల్ ఏపీకి చెందిన ఓ వ్యక్తి వద్ద ఉందని, ఆయన ఫోన్ పే ద్వారా నగదు ఖర్చు చేస్తున్నాడని గుర్తించారు. ఆపై సదరు వ్యక్తిని అదుపులోకి తీసుకుని విచారించడంతో వెంకటేశ్వర్లును హత్య చేసినట్లు గుర్తించారని సమాచారం.

#### సన్నిహిత సంబంధమే కారణమా?

హతుడు వెంకటేశ్వర్లుతో పాటు ఏపీకి చెందిన వ్యక్తికి నడుమ సన్నిహిత సంబంధాలు ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నా స్పష్టత రాలేదు. ఇద్దరి నడుమ ఘర్షణ జరగడంతో వెంకటేశ్వర్లును ఇనుప రాడ్‌తో కొట్టి హత్య చేసిన నిందితుడు కిరాతకంగా మృతదేహాన్ని యాక్సా బ్లేడ్‌తో ముక్కలు చేసినట్లు తెలిసింది. ఈ మేరకు తల, కొన్ని శరీరభాగాలు ఓ చోట, మిగతా శరీర భాగాలు ఇంకోచోట పడేసినట్లు గుర్తించగా కారేపల్లి సీఐ తిరుపతిరెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు సోమవారం ఖమ్మం వచ్చి గాలింపు చేపట్టారు. ఈ సందర్భంగా రాపర్తినగర్ బ్రిడ్జి పక్కనున్న తుప్పల్లో పాలిథిన్ కవర్‌లో తల, కొన్ని శరీర భాగాలు, మిగతా భాగాలను దానవాయిగూడెం సాగర్ కాల్వ పక్కన స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. అయితే, హత్యపై పూర్తిస్థాయి విచారణ అనంతరం పోలీసులు ఒకటి, రెండు రోజుల్లో వివరాలు వెల్లడించే అవకాశముందని తెలుస్తోంది.

# రెండు దశల్లో బిహార్ ఎన్నికలు

- అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల
- నవంబర్ 6న మొదటి దశ, 11న రెండో దశ పోలింగ్
- నవంబర్ 14వ తేదీన ఓట్ల లెక్కింపు
- ఎస్ఐఆర్‌తో ఓటర్ల జాబితా శుద్ధీకరణ
- రాష్ట్రంలో 69 లక్షల పేర్లు తొలగించాం
- అన్ని ఎన్నికలకు తల్లిలాంటివి బిహార్ ఎన్నికలు
- ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ వెల్లడి


జ్ఞానేశ్ కుమార్

న్యూఢిల్లీ: బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికల రణరంగానికి తెరలేచింది. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్) తర్వాత జరుగుతున్న ఈ ఎన్నికలపై అందరి దృష్టి కేంద్రీకృతమైంది. కేంద్రం ఎన్నికల సంఘం సోమవారం ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. రెండు దశాల్లో ఎన్నికలు నిర్వహించనున్న ప్రధాన ఎన్నికల కమిషనర్(సీఈసీ) జ్ఞానేశ్ కుమార్ వెల్లడించారు. ఆయన ఢిల్లీలో మీడియా సమావేశంలో మాట్లాడారు. మొత్తం 243 స్థానాలకు గాను.. మొదటి దశలో నవంబర్ 6న 121 స్థానాలకు, రెండో దశలో నవంబర్ 11న 122 స్థానాలకు ఎన్నికలు నిర్వహించనున్నట్లు తెలిపారు. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు చేపట్టనున్నట్లు వివరించారు. నవంబర్ 16 నాటికి మొత్తం ఎన్నికల ప్రక్రియ పూర్తి చేస్తామన్నారు. ఎన్నికల షెడ్యూల్ ప్రకటనలో బిహార్‌లో ఎన్నికల ప్రవర్తనా నియమావళి(ఎంసీసీ) తక్షణమే అమల్లోకి వచ్చింది. నామినేషన్ల ప్రక్రియ మొదటి దశ పోలింగ్‌కు అక్టోబర్ 17న, రెండో దశ పోలింగ్‌కు అక్టోబర్ 20న ప్రారంభమవుతుంది. రాష్ట్రంలో 7.43 కోట్ల మంది ప్రజలు ఓటు హక్కు వినియోగించుకోబోతున్నారు. ఎస్ఐఆర్‌ను ఓటర్ల జాబితా శుద్ధీకరణగా జ్ఞానేశ్ కుమార్ అభివర్ణించారు. ఈ ప్రక్రియ ద్వారా దాదాపు 69 లక్షల పేర్లను ఓటర్ల జాబితా నుంచి తొలగించినట్లు చెప్పారు. అయితే, భారత పౌరసత్వం లేనికారణంగా ఎన్ని పేర్లు తొలగించారో ఆయన బయటపెట్టలేదు. మరణాలు, పౌరసత్వం లేకపోవడం, ఇతర రాష్ట్రాలకు శాశ్వతంగా వలస వెళ్లడం వంటి కారణాలతో పేర్లు తొలగించినట్లు స్పష్టంచేశారు.

## 8 అసెంబ్లీ స్థానాలకు వచ్చేనెల 11న ఉప ఎన్నికలు

తెలంగాణ, రాజస్తాన్, పంజాబ్, జార్ఖండ్, ఒడిశా, మిజోరం తదితర రాష్ట్రాల్లో ఖాళీగా ఉన్న 8 అసెంబ్లీ స్థానాలకు ఉప ఎన్నికల షెడ్యూల్‌ను కేంద్ర ఎన్నికల సంఘం విడుదల చేసింది. నవంబర్ 11న ఉప ఎన్నికలు నిర్వహించనున్నట్లు పేర్కొంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ప్రారంభించనున్నట్లు తెలిపింది.

## ఇక దేశమంతటా ఎస్ఐఆర్

బిహార్‌లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ(ఎస్ఐఆర్)ను విజయవంతంగా పూర్తిచేశామని, ఇక దేశవ్యాప్తంగా ఈ ప్రక్రియ చేపడతామని ప్రధాని ఎన్నికల కమిషనర్ జ్ఞానేశ్ కుమార్ చెప్పారు. ఇందుకోసం కార్యాచరణ మొదలైందని అన్నారు. ఏయే రాష్ట్రాల్లో ఎప్పుడు ఎస్ఐఆర్ ప్రారంభించాలన్న దానిపై త్వరలో నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. ఎన్నికల సంఘంలోని మిగతా ఇద్దరు కమిషనర్లతో చర్చించి, తేదీలు ఖరారు చేయనున్నట్లు పేర్కొన్నారు. ఎస్ఐఆర్ కోసం సిద్ధంగా ఉండాలని అన్ని రాష్ట్రాల చీఫ్ ఎలక్టోరల్ అధికారులకు కేంద్ర ఎన్నికల సంఘం సూచించినట్లు తెలిసింది. చాలా రాష్ట్రాల్లో చివరిసారిగా 2002 నుంచి 2004 దాకా ఓటర్ల జాబితా ప్రక్షాళన జరిగింది.

బిహార్ ఎన్నికలు అన్ని ఎన్నికలకు తల్లిలాంటివని జ్ఞానేశ్ కుమార్ వ్యాఖ్యానించారు. బిహార్ ఎన్నికల్లో 17 సంస్కరణలు చేపడుతున్నామని, దేశవ్యాప్తంగా వీటిని అమలు చేస్తామని పునరుద్ఘాటించారు. దేశ ఎన్నికల చరిత్రలో బిహార్ ఎన్నికలు అత్యంత పారదర్శకంగా జరిగిన ఎన్నికల్లో ఒకటిగా రికార్డుకెక్కబోతున్నాయని చెప్పారు. ఓటర్ల జాబితా శుద్ధీకరణ విషయంలో మొత్తం దేశానికి బిహార్ ఒక మార్గం చూపిందని అన్నారు. రాజకీయ పార్టీల విజ్ఞప్తి మేరకు.. బిహార్‌లో ఈవీఎంల చివరి రెండు రౌండ్ల కౌంటింగ్ కంటే ముందే పోస్టల్ బ్యాలెట్ల లెక్కింపు పూర్తిచేస్తామని వివరించారు. మహిళలు ఓటు వేసే సమయంలో

**పారదర్శకంగా ఎన్నికల నిర్వహణ**

బుర్ఖా లేదా తలపై ముసుగు ధరించవచ్చా? అని ప్రశ్నించగా, ఓటర్ల గుర్తింపును నిర్ధారించే విషయంలో మార్గదర్శకాలు కచ్చితంగా అమలు చేస్తామని జ్ఞానేశ్ కుమార్ బదులిచ్చారు. పోలింగ్ కేంద్రాల వద్ద అంగన్‌వాడీ కార్యకర్తలు విధుల్లో ఉంటారని, మహిళా ఓటర్ల గుర్తింపును వారు తనిఖీ చేస్తారని వెల్లడించారు. రాష్ట్రంలో 250 పోలింగ్ బూత్‌ల పరిధిలో పోలీసులు గుర్రాలపై పెట్రోలింగ్ నిర్వహిస్తారని తెలియజేశారు. 197 పోలింగ్ కేంద్రాల్లో విధులు నిర్వర్తించే సిబ్బంది పడవలపై అక్కడికి చేరుకుంటారని చెప్పారు. ఎన్నికలకు సిద్ధం కావడం దగ్గర్నుంచి, ఓట్ల లెక్కింపు దాకా.. మొత్తం 17 సంస్కరణలు చేపట్టబోతున్నామని మరోసారి స్పష్టంచేశారు. ఇతర రాష్ట్రాల ఎన్నికల్లోనూ వీటిని అమలు చేస్తామన్నారు.




బిహార్‌లో మొత్తం నియోజకవర్గాలు **243**

మొత్తం ఓటర్లు **7.43** కోట్లు

మొత్తం పోలింగ్ కేంద్రాలు **90,712**

| | |
|---|---|
| పురుష ఓటర్లు | 3.92 కోట్లు |
| మహిళా ఓటర్లు | 3.51 కోట్లు |
| యువ ఓటర్లు(20-29 ఏళ్లు) | 1.63 కోట్లు |
| మొదటిసారి ఓటర్లు (18-19 ఏళ్లు) | 14.01 లక్షలు |

మొదటి దశ (121 సీట్లు) పోలింగ్: నవంబర్ 6

రెండో దశ (122 సీట్లు) పోలింగ్: నవంబర్ 11

ఓట్ల లెక్కింపు నవంబర్ 14



## తొలిసారిగా 'ఈసీఐ నెట్'

ఎన్నికల్లో పారదర్శకతను మరింత పెంచడానికి ఎన్నికల సంఘం చర్యలు చేపట్టింది. ఇందులో భాగంగా మొట్టమొదటిసారిగా బిహార్ ఎన్నికల్లో 'ఈసీఐ నెట్'ను ప్రవేశపెడుతోంది. ఎన్నికల సంఘానికి సంబంధించిన 40కిపైగా యాప్‌లను ఒకే వేదికపైకి తీసుకొస్తూ ఈసీఐ నెట్‌ను రూపొందించారు. ఇదొక డిజిటల్ ప్లాట్‌ఫామ్. ఇది 'మదర్ ఆఫ్ ఆల్ యాప్స్' అని చెబుతున్నారు. బూత్ లెవెల్ అధికారులు, చీఫ్ ఎలక్టోరల్ అధికారులు సహా ఎన్నికల విధుల్లో ఉండే సిబ్బంది దీన్ని వినియోగించుకుంటారు. ఓటర్ మేనేజ్‌మెంట్, కమ్యూనికేషన్, రిపోర్టింగ్ తదితర పనులు దీనిద్వారా నిర్వహిస్తారు. ఫలితంగా వారిమధ్య సమన్వయం పెరుగుతుంది. ఎన్నికలకు సంబంధించిన సమాచారం ఎప్పటికప్పుడు తెలిసిపోతుంది. మొత్తానికి ఎన్నికల నిర్వహణ సులభంగా మారుతుంది. ఓటర్లు కూడా ఈ వేదికను వాడుకోవచ్చు. పోలింగ్ విషయంలో ఏమైనా సమస్యలు ఉంటే యాప్ ద్వారానే ఫిర్యాదు చేయొచ్చు. కౌంటింగ్ స్టేటస్ తెలుసుకోవచ్చు. తొలుత బిహార్‌లో.. అనంతరం దేశమంతటా ఈసీఐ నెట్‌ను అందుబాటులోకి తీసుకురానున్నారు.

# సీజేఐపై దాడికి లాయర్ యత్నం

- కోర్టు గదిలో కేసులపై విచారణ జరుగుతుండగా ఘటన
- అప్రమత్తమై మధ్యలోనే అడ్డుకున్న భద్రతా సిబ్బంది
- దాడులు తనపై ఎలాంటి ప్రభావం చూపబోవన్న జస్టిస్ గవాయ్


జస్టిస్ గవాయ్

న్యూఢిల్లీ: దేశ అత్యున్నత న్యాయస్థానంలో షాకింగ్ ఘటన చోటుచేసుకుంది. సుప్రీంకోర్టులో సోమవారం ఉదయం 11.35 గంటలకు ఓ కేసుపై విచారణ జరుగుతుండగానే ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పై ఓ న్యాయవాది బూటు విసిరేందుకు ప్రయత్నించడం తీవ్ర కలకలం సృష్టించింది. కోర్టుగదిలో విధుల్లో ఉన్న భద్రతా సిబ్బంది వెంటనే అప్రమత్తమై అడ్డుకోవడంతో ఆ బూటు జస్టిస్ గవాయ్‌ని తాకలేదు. సీజేఐపై దాడికి ప్రయత్నించిన లాయర్‌ను ఢిల్లీ మయూర్ విహార్‌కు చెందిన రాకేశ్ కిశోర్(71)గా గుర్తించారు. అతడిని కోర్టు గది నుంచి బలవంతంగా బయటకు తరలించారు. సనాతన ధర్మాన్ని కించపరిస్తే సహించబోనంటూ రాకేశ్ కిశోర్ నినాదాలు చేయడం గమనార్హం. తనపై జరిగిన దాడి యత్నంపై జస్టిస్ గవాయ్ స్పందించారు. ఇలాంటి ఘటనలు తనపై ఏమాత్రం ప్రభావం చూపబోవని తేల్చిచెప్పారు. దాడులకు భయపడే ప్రసక్తే లేదంటూ పరోక్షంగా స్పష్టంచేశారు. దాడి యత్నం తర్వాత కూడా కేసుల విచారణను ఆయన యథాతథంగా కొనసాగించడం విశేషం

### అసలేం జరిగింది?

సుప్రీంకోర్టులో జస్టిస్ గవాయ్, జస్టిస్ కె.వినోద్ చంద్రన్‌తో కూడిన ధర్మాసనం వేర్వేరు కేసుపై విచారణ నిర్వహిస్తుండగా, అక్కడే ఉన్న లాయర్ రాకేశ్ కిశోర్ వారిద్దరూ కూర్చున్న వేదిక వద్దకు దూసుకొచ్చాడు. తన కాలికున్న బూటు తీసి న్యాయమూర్తులపైకి విసిరేందుకు ప్రయత్నించాడు. గమనించిన సెక్యూరిటీ సిబ్బంది మధ్యలోనే అడ్డుకుని బయటకు లాక్కెళ్లారు. సుప్రీంకోర్టు రిజిస్ట్రార్ జనరల్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు ప్రారంభించారు.


రాకేశ్ కిశోర్

### విష్ణు దేవుడి విగ్రహంపై వ్యాఖ్యల వివాదం

మధ్యప్రదేశ్‌లోని ఖజురహోలో ఉన్న విష్ణు దేవుడి విగ్రహంపై దాఖలైన పిటిషన్ విషయంలో చేసిన వ్యాఖ్యలే జస్టిస్ గవాయ్‌పై దాడి యత్నానికి కారణం కావొచ్చని న్యాయవాద వర్గాలు భావిస్తున్నాయి. ఖజురహోలోని జవేరీ టెంపుల్‌ను మళ్లీ నిర్మించి, ఏడు అడుగుల విష్ణు దేవుడి విగ్రహాన్ని నెలకొల్పేలా ప్రభుత్వాన్ని ఆదేశించాలని కోరుతూ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలైంది. ఈ పిటిషన్ జస్టిస్ గవాయ్ తిరస్కరించారు. 'మీరు ఏం కోరుకుంటున్నారో వెళ్లి ఆ దేవుడినే అడగండి. విష్ణు దేవుడికి మీరు నిజమైన భక్తులైతే అక్కడికే వెళ్లి ప్రార్థించండి. కొంతసేపు ధ్యానం కూడా చేయండి'' అని పిటిషనర్‌కు సూచించారు. ఈ వ్యాఖ్యలపై సర్వత్రా విమర్శలు వచ్చాయి.

### లాయర్‌పై సస్పెన్షన్ వేటు

సాక్షాత్తూ సీజేఐపైనే బూటు విసిరేందుకు ప్రయత్నించిన లాయర్ రాకేశ్ కిశోర్‌పై బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా(బీసీఐ) తక్షణమే చర్యలు తీసుకుంది. అతడిపై సస్పెన్షన్ వేటు వేస్తున్నట్లు ప్రకటించింది. లైసెన్స్‌ను రద్దు చేసింది.

### రాజ్యాంగంపై దాడి: సోనియా

జస్టిస్ గవాయ్‌పై బూటుతో దాడిచేసేందుకు ప్రయత్నించడాన్ని కాంగ్రెస్ సీనియర్ నేత సోనియా గాంధీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన సిగ్గుచేటు, మతిలేని చర్య అని పేర్కొన్నారు. ఇది మన రాజ్యాంగంపై, న్యాయ వ్యవస్థపై దాడేనని వ్యాఖ్యానించారు. విద్వేషం, ఉన్మాదం మన సమాజం చుట్టూ ఆవరించుకొని ఉన్నాయని చెప్పడానికి ఈ ఘటనే నిదర్శనమని పేర్కొన్నారు. ఈ మేరకు సోని యా ఒక ప్రకటన విడుదల చేశారు.

### జస్టిస్ గవాయ్‌కి ప్రధాని మోదీ ఫోన్

న్యూఢిల్లీ: జస్టిస్ బి.ఆర్.గవాయ్‌పైకి లాయర్ బూటు విసిరేందుకు ప్రయత్నించడాన్ని ప్రధాని మోదీ తీవ్రంగా ఖండించారు. ఈ ఘటన ప్రతి ఒక్క భారతీయుడిని ఆగ్రహానికి గురి చేసిందని పేర్కొన్నారు. మన సమాజంలో ఇలాంటి అనుచిత ధోరణులకు స్థానం లేదని తేల్చిచెప్పారు. ఈ మేరకు మోదీ సోమవారం 'ఎక్స్'లో పోస్టు చేశారు. జస్టిస్ గవాయ్‌తో ఫోన్‌లో మాట్లాడానని పేర్కొన్నారు. లాయర్ చర్య పట్ల పూర్తి సంయమనం పాటించినందుకు జస్టిస్ గవాయ్‌ని ప్రశంసించానని వెల్లడించారు. న్యాయ వ్యవస్థ విలువలను, రాజ్యాంగ స్ఫూర్తిని బలోపేతం చేయడానికి ఆయన కట్టుబడి ఉన్నట్లు దీన్నిబట్టి స్పష్టమవుతోందని ప్రధాని ఉద్ఘాటించారు.

## ఫ్రాన్స్ ప్రధాని సెబాస్టియన్ రాజీనామా



పారిస్: ఫ్రాన్స్‌లో రాజకీయ సంక్షోభం మొదలైంది. నెల రోజుల క్రితమే ఫ్రాన్స్ ప్రధానమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సెబాస్టియన్ లెకోర్ను సోమవారం తన పదవికి రాజీనామా చేశారు. ఆయన గత నెల 9న ప్రధానమంత్రిగా అధికారంలోకి వచ్చారు. నెల లోపలే పదవి నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. సెబాస్టియన్ ఆదివారం తన మంత్రివర్గాన్ని నియమించారు. దీనిపై రాజకీయంగా పలు విమర్శలు వచ్చాయి. దాంతో చేసేది లేక సెబాస్టియన్ రాజీనామా సమర్పించారు. దీన్ని ఫ్రాన్స్ అధ్యక్షుడు ఇమ్మానుయేల్ మాక్రాన్ ఆమోదించారు. మాక్రాన్ ఇప్పుడేంద చేస్తారన్నది ఆసక్తికరంగా మారింది. కొత్త ప్రధానమంత్రిని నియమిస్తారా? లేక జాతీయ అసెంబ్లీని రద్దు చేసి, మళ్లీ ఎన్నికలు నిర్వహిస్తారా? అనేది చర్చనీయాంశంగా మారింది. ఫ్రాన్స్‌లో గత రెండేళ్లలో ఐదుగురు ప్రధానమంత్రులు రాజీనామా చేయడం గమనార్హం.

## దగ్గు సిరప్ మరణాలపై ఎన్‌హెచ్‌ఆర్సీ నోటీసులు

న్యూఢిల్లీ: మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఉత్తరప్రదేశ్‌లలో దగ్గు సిరప్ తాగిన చిన్నారులు మృత్యువాత పడిన ఘటనలపై జాతీయ మానవ హక్కుల కమిషన్(ఎన్‌హెచ్ఆర్సీ)స్పందించింది. ఆ దగ్గు మందుల్లో ప్రమాదకర రసాయనాలున్నట్లుగా వస్తున్న ఆరోపణలపై విచారణ చేపట్టాలని, కల్తీ ఔషధాల విక్రయాలపై తక్షణమే నిషేధం విధించాలని కోరుతూ ఆయా రాష్ట్ర ప్రభుత్వాలకు సోమవారం నోటీసులు జారీ చేసింది. కల్తీ ఔషధాల నమూనాలను, వాటికి సంబంధించిన విచారణ నివేదికలను తమకు పంపించాలని కోరింది. కల్తీ మందులను నిషేధించే ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని కూడా రాష్ట్రాల చీఫ్ డ్రగ్స్ కంట్రోలర్లను ఆదేశించింది.

# వైద్య శాస్త్రంలో ముగ్గురికి నోబెల్

- రోగ నిరోధక వ్యవస్థపై పరిశోధనలకు విశిష్ట గుర్తింపు
- మేరీ ఈ.బ్రంకోవ్, ఫ్రెడ్ రామ్స్‌డెల్, డాక్టర్ షికోమ్ సకాగుచీకి ఉమ్మడిగా బహుమతి
- నోబెల్ కమిటీ ప్రకటన


ఫ్రెడ్ రామ్స్‌డెల్


షికోమ్ సకాగుచీ


మేరీ ఈ.బ్రంకోవ్

స్టాక్‌హోమ్: వైద్య శాస్త్రంలో ప్రతిష్టాత్మక నోబెల్ బహుమతి 2025 సంవత్సరానికి గాను ముగ్గురు సైంటిస్టులను వరించింది. మనుషుల్లో రోగ నిరోధక వ్యవస్థపై విశిష్టమైన పరిశోధనలు చేసిన మేరీ ఈ.బ్రంకోవ్, ఫ్రెడ్ రామ్స్‌డెల్, డాక్టర్ షికోమ్ సకాగుచీకి ఈ బహుమతి ఉమ్మడిగా అందజేయనున్నట్లు స్వీడన్‌లోని నోబెల్ కమిటీ సోమవారం ప్రకటించింది. మేరీ ఈ.బ్రంకోవ్, ఫ్రెడ్ రామ్స్‌డెల్ అమెరికాకు చెందినవారు కాగా, షికోమ్ సకాగుచీ జపాన్ సైంటిస్టు. 64 ఏళ్ల బ్రంకోవ్ ప్రస్తుతం సియాటెల్‌లోని ఇనిస్టిట్యూట్ ఫర్ సిస్టమ్స్ బయాలజీలో సీనియర్ ప్రోగ్రామ్ మేనేజర్‌గా పని చేస్తున్నారు. రామ్స్‌డెల్(64) శాన్ ఫ్రాన్సిస్కోలో సోనోమా బయోథెరాపిటిక్స్‌కు శాస్త్రీయ సలహాదారుగా సేవలందిస్తున్నారు. 74 ఏళ్ల సకాగుచీ జపాన్‌లోని ఒసాకా యూనివర్సిటీకి సంబంధించిన ఇమ్యూనాలజీ ఫ్రాంటియర్ రీసెర్చ్ సెంటర్‌లో ప్రొఫెసర్‌గా వ్యవహరిస్తున్నారు. మనుషుల ఆరోగ్యానికి శరీరంలో రోగనిరోధక వ్యవస్థ అత్యంత కీలకం. ప్రమాదకరమైన బ్యాక్టీరియా, వైరస్‌లు దాడి చేసినప్పుడు గుర్తించి, సమర్థంగా అడ్డుకుంటూ ఆరోగ్యాన్ని కాపాడుతూ ఉంటుంది. ఇదే రోగ నిరోధక వ్యవస్థ శరీరంలో సొంత కణాలపై దాడి చేయకుండా నియంత్రిత టీ-కణాలు(స్పెషల్ ఇమ్యూన్ సెల్స్) ఎలా కాపాడుతున్నాయో ముగ్గురు సైంటిస్టులు పరిశోధించి కనిపెట్టారు. అవి శరీరానికి సంరక్షకులుగా పని చేస్తున్న విధానాన్ని విడమర్చి చెప్పారు. రెగ్యులేటరీ టీ-సెల్స్ శక్తి సామర్థ్యాలను, రోగ నిరోధక వ్యవస్థను సమతూకంగా ఉంచడంలో వాటి ప్రాధాన్యతను ప్రపంచానికి వెల్లడించారు. ఆరోగ్యాన్ని కాపాడుకొనేందుకు అవసరమైన కొత్త ఔషధాల తయారీకి వారి పరిశోధన దోహదపడుతోంది. ఆటోఇమ్యూన్ వ్యాధులు, క్యాన్సర్ చికిత్సల్లో మెరుగైన విధానాలకు మార్గం చూపింది. అవయవాల మార్పిడి ప్రక్రియ సైతం సులభతరం కానుంది. ఇమ్యూన్ టోలరెన్స్‌ను అర్థం చేసుకొనే విధానాన్ని ఈ పరిశోధన మార్చేసింది.

**నేడు భౌతికశాస్త్రంలో బహుమతి ప్రకటన**

ఈ ఏడాది మొదటి నోబెల్ బహుమతిని వైద్య శాస్త్రానికి ప్రకటించారు. మంగళవారం భౌతిక శాస్త్రం, బుధవారం రసాయన శాస్త్రం, గురువారం సాహిత్యం, శుక్రవారం శాంతి బహుమతి విజేతల పేర్లను ప్రకటించబోతున్నారు. ఆర్థిక శాస్త్రంలో నోబెల్ మెమోరియల్ ప్రైజ్ విజేతను ఈ నెల 13న ప్రకటిస్తారు. ఆల్ఫ్రెడ్ నోబెల్ వర్ధంతి సందర్భంగా ఈ ఏడాది డిసెంబర్ 10న విజేతలకు బహుమతి ప్రదానం చేస్తారు. వైద్య శాస్త్రంలో నోబెల్ ప్రైజ్ పొందిన ముగ్గురు సైంటిస్టులకు ఉమ్మడిగా 1.2 మిలియన్ డాలర్లు (రూ.10.65 కోట్లకుపైగా) అందజేస్తారు. వారు ఆ సొమ్ము సమానంగా పంచుకోవాల్సి ఉంటుంది. విజేతలకు ఒక్కొక్కరికి 18 క్యారెట్ల బంగారు పతకం లభిస్తుంది.

### ఏమిటీ టీ-కణాలు?

టీ-కణాలు శరీరంలో తెల్లరక్త కణాల్లాంటివే. ఇమ్యూన్ సిస్టమ్‌లో ఒక భాగంగా ఉంటూ ఇన్ఫెక్షన్ల నుంచి శరీరాన్ని కాపాడుతుంటాయి. ఎముక మజ్జలో పుట్టే టీ-కణాలు థైమస్‌లో వృద్ధి చెందుతాయి. రోగ నిరోధక వ్యవస్థ రకరకాల టీ-కణాలను ఉత్పత్తి చేస్తుంది. ఒక్కోదానికి ఒక్కో ప్రత్యేక పాత్ర ఉంటుంది. ప్రాణాంతక బ్యాక్టీరియా, వైరస్‌లు, క్యాన్సర్ కణాలను గుర్తించి, నాశనం చేయడంలో ఇవి సైనికులుగా పనిచేస్తాయి. రక్షణ కవచంగా తోడ్పడుతాయి. ఇమ్యూన్ వ్యవస్థ పొరపాటున సొంత కణాలపై దాడి చేయకుండా రెగ్యులేటరీ టీ-కణాలు నిరోధిస్తాయి. ఆటోఇమ్యూనిటీని అడ్డుకుంటాయి. ఈ ప్రక్రియను పెరిఫెరల్ ఇమ్యూన్ టోలరెన్స్ అంటారు. ఒకవేళ టీ-కణాలు లేకపోతే సాధారణ రోగ నిరోధక వ్యవస్థ గతి తప్పుతుంది. ముఖ్యమైన అవయవాలు దెబ్బతింటాయి. ప్రాణాపాయం సంభవించవచ్చు. రెగ్యులేటరీ టీ-సెల్స్‌ను షిమోన్ సకాగుచీ 1995లో తొలిసారిగా గుర్తించారు. ఈ ప్రత్యేక కణాల వల్లే రోగ నిరోధక వ్యవస్థ ఒక క్రమపద్ధతిలో పని చేస్తున్నట్లు తేల్చిచెప్పారు. బ్రంకోవ్, రామ్స్‌డెల్ 2001లో ఈ పరిశోధనను మరింత ముందుకు తీసుకెళ్లారు. ఫాక్స్‌పీ3 అనే జన్యువును కనిపెట్టారు. రెగ్యులేటర్ టీ-సెల్స్ అభివృద్ధిలో ఈ జన్యువు పాత్ర కీలకమని గుర్తించారు. ఈ కణాల ఉత్పత్తి, పనితీరును ఫాక్స్‌పీ3 నియంత్రిస్తున్నట్లు నిరూపించారు.

## వాంగ్‌చుక్ అరెస్ట్‌పై కేంద్రానికి సుప్రీం నోటీసు

న్యూఢిల్లీ: లద్దాఖ్‌కు చెందిన ఉద్యమకారుడు సోనమ్ వాంగ్‌చుక్ అరెస్టుపై సుప్రీంకోర్టు సోమవారం కేంద్రంతోపాటు లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతం యంత్రాంగానికి నోటీసులు జారీ చేసింది. జాతీయ భద్రతా చట్టం(ఎన్ఎస్ఏ)కింద అరెస్ట్ చేసిన వాంగ్‌చుక్‌ను వెంటనే విడుదల చేయాలంటూ ఆయన భార్య గీతాంజలి అంగ్మో వేసిన హెబియస్ కార్పస్ పిటిషన్‌పై జస్టిస్ అరవింద్ కుమార్, జస్టిస్ ఎన్వీ అంజారియాల ధర్మాసనం విచారణ చేపట్టింది. వాంగ్‌చుక్ అరెస్టుకు కారణాలు తెలిపాలని ఆయన భార్య గీతాంజలి కోరుతున్నారని సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ ధర్మాసనానికి నివేదించారు. సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా జోక్యం చేసుకుని, ఇప్పటికే వాంగ్‌చుక్‌కు ఈ మేరకు అధికారులు వివరాలు అందజేసినట్లు వివరించారు. నిర్బంధానికిగల కారణాలను భార్యకు తెలపాలనే నిబంధనేదీ లేదని కూడా ఆయన చెప్పారు. అయితే, ఈ సమయంలో తామేమీ చెప్పలేమని ధర్మాసనం పేర్కొంది. అరెస్టుకు కారణాలను తెలిపే విషయం పరిశీలించాలని సొలిసిటర్ జనరల్‌ను కోరింది. అదే సమయంలో, వాంగ్‌చుక్ వైద్య అవసరాలను జైలు నిబంధనలకు లోబడి తీర్చాలని అధికారులను ధర్మాసనం ఆదేశించింది. ఈ విషయమై కేంద్ర ప్రభుత్వం, లద్దాఖ్ కేంద్ర పాలిత ప్రాంతానికి నోటీసులు జారీ చేస్తూ తదుపరి విచారణను 14వ తేదీకి వాయిదా వేసింది. లద్దాఖ్‌కు రాష్ట్ర హోదా కల్పించాలనే డిమాండ్‌తో రెండు రోజులపాటు కొనసాగిన ఆందోళనల్లో నలుగురు చనిపోగా 90 మంది గాయపడ్డారు. హింసకు వాంగ్‌చుక్ ప్రేరేపించారంటూ అధికారులు సెప్టెంబర్ 26న అదుపులోకి తీసుకుని, ఆ వెంటనే రాజస్తాన్‌లోని జోధ్‌పూర్ సెంట్రల్ జైలుకు తరలించారు. ఎన్ఎస్ఏ కింద అరెస్టయితే గరిష్ఠంగా 12 నెలలపాటు నిర్బంధంలో ఉంచొచ్చు.

# బీజేపీ నేతలపై మూక దాడి

- ఎంపీ ఖగేన్ ముర్ము, ఎమ్మెల్యే శంకర్ ఘోష్‌కు గాయాలు
- బెంగాల్ వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనకు వెళ్లగా ఘటన


గాయపడిన ఎంపీ ఖగేన్ ముర్ము

నగరాకాటా: వరద ప్రభావిత ప్రాంతాల్లో పర్యటనకు వెళ్లిన సమయంలో జరిగిన మూకదాడిలో బీజేపీకి చెందిన ఎంపీ, ఎమ్మెల్యే గాయాలపాలయ్యారు. ఈ ఘటన పశ్చిమ బెంగాల్‌లోని జల్పాయ్‌గురి జిల్లా నగరాకాటా వద్ద సోమవారం చోటుచేసుకుంది. దుఆర్ ప్రాంతంలో ఇటీవల వర్షాలకు జరిగిన నష్టాన్ని అంచనా వేసేందుకు, అందుతున్న సాయాన్ని పరిశీలించేందుకు బీజేపీ ఏర్పాటు చేసిన బృందంలో ఎంపీ ఖగేన్ ముర్ము, ఎమ్మెల్యే శంకర్ ఘోష్ ఉన్నారు. వరద బాధితుల దగ్గరికి వెళ్తున్న ఆ నేతల కాన్వాయ్‌ని బమన్‌దాంగా వద్ద ఓ గుంపు చుట్టుముట్టింది. 'దీదీ, దీదీ..'అని నినాదాలు చేస్తూ వాహనాలపై వారు రాళ్లు రువ్వారు. వాహనాల కిటికీల అద్దాలు పగిలిపోయాయి. ముర్ము తలకు గాయమై రక్తం కారింది. భయంతో ఘోష్ వణికిపోయారు. ఇందుకు సంబంధించిన లైవ్ వీడియో ఫేస్‌బుక్‌లో ఉంది. దుండగులు తమను దూషిస్తూ వెనుక నుంచి రాళ్ల దాడికి దిగారని శంకర్ ఘోష్ చెప్పారు. ఖగేన్‌కు రాళ్లు తగలడంతో భయపడి సీటు వెనుక దాక్కున్నట్లు తెలిపారు. ప్రాథమిక చికిత్స అనంతరం ఎంపీ ఖగేన్‌ను సిలిగురిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. ఈ ఘటన టీఎంసీ ఆటవిక పాలనకు మరో నిదర్శనమంటూ బీజేపీ మండిపడింది. ఈ ప్రాంతంలో ప్రజల్లో రాజుకుంటున్న అసమ్మతిని అణచివేసేందుకే సీఎం మమతా బెనర్జీ ఇలాంటివి చేయిస్తు న్నారని ఆరోపించింది. పోలీసుల సమక్షంలోనే తమ నేతల బృందంపై రాళ్ల దాడి జరిగిందని ఆరోపించింది. ఒక వైపు ప్రజలు వర్షాలు, వరదలతో తీవ్రంగా నష్టపోయి ఆపన్న హస్తాల కోసం ఎదురుచూస్తుంటే కోల్‌కతాలో సీఎం మమత మాత్రం ఉత్సవాలు చేసుకుంటున్నారని పేర్కొంది. ఇలా ఉండగా, సిలిగురిలోని వర్షాల ప్రభావిత ప్రాంతాల్లో ప్రజలకు సహాయ సహకారాలు అందించేందుకు వెళ్లిన తమకు టీఎంసీ శ్రేణులు పదేపదే అడ్డు తగిలారని బీజేపీ బెంగాల్ అధ్యక్షుడు సమిక్ భట్టాచార్య ఆరోపించారు. తమ బృందంలో ఎంపీలు రాజు బిస్తా, జయంత రాయ్, పలువురు ఎమ్మెల్యేలు ఉన్నారన్నారు.

## ఐసీయూలో మంటలు ఏడుగురు మృతి

జైపూర్: రాజస్తాన్ రాజధాని జైపూర్‌లోని సవాయ్ మాన్ సింగ్(ఎస్ఎంఎస్) ప్రభుత్వ ఆస్పత్రి ఐసీయూలో భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఘటనలో ఐసీయూలో చికిత్స పొందుతున్న ఏడుగురు ప్రాణాలు కోల్పోయారు. ఘటన సమయంలో ఐసీయూలో 11 మంది రోగులున్నారు. అర్ధరాత్రి సమయంలో స్టోరేజీ గదిలో మొదలైన మంటలు క్షణాల్లోనే ఐసీయూలోకి ప్రవేశించాయి. దీంతో, నలుగుర్ని మాత్రమే సిబ్బంది రక్షించగలిగారు. మంటల తీవ్రతకు ఐసీయూ గోడలు, పరికరాలు పూర్తిగా నల్లగా మసిబట్టాయి. కొన్ని పరికరాలు వేడికి కరిగి మెలికలు తిరిగాయి. అద్దాలు పగిలిపోయాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూటే ప్రమాదానికి కారణమని అనుమానిస్తున్నారు. మృతుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం రూ.10 లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సుశీల్ భాటిని తొలగించింది.

## దొంగనుకుని దళితుడ్ని చావబాదారు

- ఐదుగురు నిందితుల అరెస్ట్
- కులం రంగు పులమొద్దంటూ పోలీసుల వినతి

రాయ్‌బరేలీ: రాత్రి వేళ చోరీలు జరక్కుండా గస్తీ తిరుగుతున్న గ్రామస్తులు..తామడిగిన ప్రశ్నలకు సరైన జవాబులు చెప్పకపోవడంతో, దొంగగా అనుమానించి ఓ వ్యక్తిని దారుణంగా కొట్టారు. తీవ్రమైన గాయాలు, రక్తస్రావం కారణంగా అతడు ప్రాణాలు కోల్పోయాడు. ఉత్తరప్రదేశ్‌లోని ఉంఛాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో గత బుధవారం చోటుచేసుకున్న ఈ దారుణం తాజాగా వెలుగుచూ సింది. డ్రోన్లతో సర్వే చేసి మరీ రాత్రి వేళల్లో దొంగతనాలకు పాల్పడే ముఠా ఒకటి సంచరిస్తోందంటూ కొద్ది రోజులుగా ఆ ప్రాంతంలో పుకార్లు వస్తున్నాయి. దీంతో, గ్రామాల్లో రాత్రి సమయాల్లో ప్రజలు అప్రమత్తంగా ఉంటున్నారు. ఎవరి ఏరియాలో వారే గస్తీ ఏర్పాటు చేసుకున్నారు. బుధవారం రాత్రి జమునాపూర్ క్రాసింగ్ ఓ వ్యక్తి అనుమానాస్పదంగా కనిపించడంతో గ్రామస్తులు నిలదీశారు. తమ ప్రశ్నలకు అతడిచ్చిన సమాధానాలతో సంతృప్తి చెందని గ్రామస్తుల గుంపు అతడిపై దాడికి పాల్పడింది. విపరీతంగా కొట్టడంతో తీవ్ర గాయాలైన ఆ వ్యక్తిని ఈశ్వర్‌దాస్‌పూర్ రైల్వే స్టేషన్ వరకు లాక్కెళ్లి వదిలేశారు. గురువారం ఉదయం పోలీసులు వెళ్లే సరికి రక్తపు మడుగులో విగతజీవిగా పడి ఉన్నాడు. ఫతేహ్‌పూర్‌కు చెందిన హరిఓం(40)అనే దళితుడిగా అతడిని గుర్తించారు. హత్య కేసు నమోదు చేసి విచారణ చేపట్టిన పోలీసులు ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకు న్నారు. ఘటనపై సమాచారం అందినా నిర్లక్ష్యంగా వ్యవహరించారనే ఆరోపణలపై ఒక ఎస్సై, ఇద్దరు కానిస్టేబుళ్లను సస్పెండ్ చేశామని అదనపు ఎస్పీ సంజీవ్ కుమార్ సిన్హా వెల్లడించారు. దారుణంలో పాలుపంచుకున్న మరికొందరిని సైతం గుర్తించి, అరెస్ట్ చేసే పనిలో ఉన్నామన్నారు.

# సాక్షి హైదరాబాద్

మంగళవారం, 7, అక్టోబర్, 2025






**'హైడ్రా'మానేనా?**

గాజులరామారం సర్వే నెం.307లో హైడ్రా కూలి ్చవేతల వ్యవహారం అంతా డ్రామాగా మారింది. ఈ ఎపిసోడ్‌లో 260 నిరుపేద కుటుంబాలే నష్టపోయినట్లుగా అనిపిస్తోంది. -8లో



**యాంటిక్..కలెక్షన్ కిక్..**

పురాతనమే అధునాతనం అవుతోంది. పాతకాలపు వస్తువులు (యాంటిక్స్)కు నగరంలో భారీగా డిమాండ్ పెరిగింది. యువత, గృహిణులు యాంటిక్స్‌పై ఆసక్తి పెంచుకుంటున్నారు. - సిటీప్లస్‌లో

**వాతావరణం**

గరిష్టం/కనిష్టం 32.0/22.0

నగరంలో మంగళవారం ఉదయం ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు పొడి వాతావరణం నెలకొంటుంది. గరిష్టంగా 32, కనిష్టంగా 22 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదవుతాయి.


# మెట్రో కిటకిట

- మెట్రో రైలు స్టేషన్లలో ప్రయాణికుల రద్దీ
- సొంత ఊళ్ల నుంచి సిటీకి చేరుకున్న నగరవాసులు
- ప్రయాణికుల రాకపోకలతో సందడిగా స్టేషన్లు
- రహదారులపైన భారీగా రద్దీ



ఎల్బీ నగర్ మెట్రోస్టేషన్‌లో రద్దీ

సాక్షి, సిటీబ్యూరో: ప్రయాణికుల రాకపోకలతో సోమవారం నగరంలోని పలు మెట్రోస్టేషన్లు, మెట్రోరైళ్లు కిటకిటలాడాయి. దసరా సందర్భంగా సొంత ఊళ్లకు వెళ్లిన ప్రయాణికులు నగరానికి తిరిగి చేరుకోవడంతో వివిధ ప్రాంతాల్లో మెట్రోస్టేషన్లలో రద్దీ నెలకొంది. విజయవాడ వైపు నుంచి పలు ప్రాంతాల నుంచి నగరానికి చేరుకున్నవాళ్లు ఎల్బీనగర్ మెట్రోస్టేషన్ నుంచి నగరంలోని పలు ప్రాంతాలకు బయలుదేరారు. దీంతో ఎల్బీనగర్ మెట్రో వద్ద ఉదయం నుంచి ఇంచుమించు మధ్యాహ్నం వరకు ప్రయాణికుల సందడి నెలకొంది. అలాగే నగరంలోని ప్రధాన మెట్రో స్టేషన్లైన నాగోల్, ఉప్పల్, సికింద్రాబాద్ ఈస్ట్, అమీర్‌పేట్, రాయదుర్గం, లక్డీకాపూల్, ఖైరతాబాద్, కూకట్‌పల్లి, మియాపూర్ తదితర స్టేషన్ల వద్ద ప్రయాణికుల రద్దీ పెరిగింది. మరోవైపు దసరా అనంతరం శని, ఆదివారాలతో పాటు సోమవారం కూడా నగరవాసులు సొంత ఊళ్ల నుంచి పెద్ద సంఖ్యలో నగరానికి చేరుకున్నారు. తిరుగుప్రయాణం కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేసినప్పటికీ డిమాండ్ మేరకు అందుబాటులో లేకపోవడం వల్ల జిల్లా కేంద్రాల్లో గంటల తరబడి పడిగాపులు కాయాల్సివచ్చిందని పలువురు ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేశారు. మరోవైపు వివిధ ప్రాంతాల నుంచి నగరానికి చేరుకున్న రైళ్లతో సికింద్రాబాద్, చర్లపల్లి, నాంపల్లి, లింగంపల్లి స్టేషన్లలో సందడి కనిపించింది. సొంత వాహనాల్లోనూ జనం పెద్ద ఎత్తున నగరానికి చేరుకున్నారు. దీంతో విజయవాడ, వరంగల్, కరీంనగర్, తదితర ప్రధాన రహదారుల్లోని శివారు ప్రాంతాల్లో భారీ రద్దీ కారణంగా వాహనాలు స్తంభించాయి.



ఎల్బీనగర్‌లో వాహనాల రద్దీ

# నగారా మోగింది!

## జూబ్లీహిల్స్ ఉప ఎన్నికకు రంగం సిద్ధం

రాష్ట్రంలోని రాజకీయ పార్టీలతోపాటు నగర ప్రజలు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికకు షెడ్యూలు విడుదలైంది. ఈ నెల 13న నోటిఫికేషన్ జారీ కానుండగా, నవంబర్ 11వ తేదీన పోలింగ్ జరగనుంది. నవంబర్ 14న ఓట్ల లెక్కింపు ఉంటుంది. కేంద్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన నేపథ్యంలో ఉప ఎన్నికకు సంబంధించిన వివరాల్ని హైదరాబాద్ జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్, నగర పోలీస్ కమిషనర్ సజ్జనర్‌తో కలిసి సోమవారం విలేకరుల సమావేశంలో వెల్లడించారు. ఎన్నిక జరగనున్న జూబ్లీహిల్స్ నియోజకవర్గంతోపాటు హైదరాబాద్ జిల్లా పరిధి వరకు ఎన్నికల కోడ్ అమల్లో ఉంటుంది. అది వెంటనే అమల్లోకి వచ్చినట్లు పేర్కొన్నారు. జీహెచ్ఎంసీ పరిధిలోనే ఉన్నప్పటికీ రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల పరిధిలో మాత్రం ఎన్నికల కోడ్ వర్తించదు.

-సాక్షి, సిటీబ్యూరో



మీడియా సమావేశంలో కర్ణన్, సజ్జనర్

- నవంబర్ 11న పోలింగ్
- ఈ నెల 13 నుంచి నామినేషన్ల స్వీకరణ
- నామినేషన్లకు చివరి తేదీ 21
- 24 వరకు ఉపసంహరణకు గడువు
- 407 కేంద్రాల్లో పోలింగ్

### నోటిఫికేషన్: 13 అక్టోబర్ (సోమవారం)

- నోటిఫికేషన్ జారీ అయిన తేదీ నుంచి నామినేషన్ల స్వీకరణ ఉంటుంది. ఒక్కో పోలింగ్ కేంద్రానికి దాదాపు 980 మంది ఓటర్లుంటారు
- నియోజకవర్గంలోని అర్హులైన ఓటర్లు ఓటరు జాబితాలో తమ పేరున్నదీ, లేనిదీ ఈఆర్‌ఓ కార్యాలయంలోకానీ, బూత్‌లెవెల్ అధికారి వద్ద కానీ, ఓటర్ హెల్ప్‌లైన్ యాప్‌లోకానీ, సంబంధిత వెబ్‌సైట్లలో కానీ పరిశీలించుకోవాల్సిందిగా కర్ణన్ సూచించారు.
- జాబితాపై ఏవైనా అభ్యంతరాలున్నా, జాబితాలో పేరు లేకున్నా నామినేషన్ల చివరి రోజుకు పదిరోజుల ముందు వరకు దరఖాస్తు చేసుకోవచ్చునన్నారు. ఎన్నికలకు సంబంధించిన సమాచారం కోసం 1950 టోల్‌ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేయవచ్చునని తెలిపారు.
- ఎపిక్ కార్డుతో పాటు ప్రభుత్వం గుర్తించిన, ఫొటో కలిగిన 12 రకాల ఐడీల్లో ఏదైనా ఒకదాన్ని వినియోగించుకోవచ్చునన్నారు.

### ఎన్నికల నిర్వహణ కోసం సిబ్బంది

- నోడల్ ఆఫీసర్లు: 19 మంది
- సెక్టార్ ఆఫీసర్లు: 38 సెక్టార్లకు 55 మంది నియామకంతోపాటు రిజర్వులో కొందరిని ఉంచారు.
- రిజర్వుతోసహా మొత్తం పోలింగ్ సిబ్బంది: 2,400
- వీరిలో ప్రిసైడింగ్ ఆఫీసర్లు: 600 మంది, అసిస్టెంట్ ప్రిసైడింగ్ ఆఫీసర్లు 600 మంది, ఇతర సిబ్బంది 1200 మంది.

### ఈవీఎంలు, వీవీప్యాట్‌లు

- కంట్రోల్ యూనిట్లు: 826, బ్యాలెట్ యూనిట్లు: 1494, వీవీప్యాట్లు: 837.
- రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఇప్పటికే మొదటిదశ తనిఖీ పూర్తయిందన్నారు.

### ప్రవర్తన నియమావళి (ఎంసీసీ)

- షెడ్యూలు జారీతోనే ఎన్నికలప్రవర్తన నియమావళి అమల్లోకి వచ్చిందని, హైదరాబాద్ నగర పోలీసులతో యాక్షన్‌ప్లాన్ రెడీ అయిందని పేర్కొన్నారు.
- ఎన్‌ఫోర్స్‌మెంట్ కోసం 9 ఫ్లైయింగ్ స్క్వాడ్స్, 9 స్టాటిక్ సర్వేలెన్స్ టీమ్స్, 2 వీడియో సర్వేలెన్స్ టీమ్స్‌తో పాటు ఇతరత్రా టీమ్స్ ఉన్నాయని, అవసరాల కనుగుణంగా టీమ్స్ పెంచుతామన్నారు. ఫిర్యాదులకోసం కాంటాక్ట్ నెంబర్ 1950 , కంట్రోల్ రూమ్ 24 గంటలు పనిచేస్తాయన్నారు. సీజ్ చేసిన నగదు పరిశీలించి విడుదల చేసేందుకు జిల్లా గ్రీవెన్స్ కమిటీ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

### ఆర్డీఓ ఆఫీసులో నామినేషన్లు

జిల్లా ఎన్నికల అధికారిగా జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్ వ్యవహరిస్తుండగా, ఎన్నికల రిటర్నింగ్ ఆఫీసర్‌గా సికింద్రాబాద్ ఆర్‌డీఓ సాయిరామ్ బాధ్యతలు నిర్వహిస్తారు. నామినేషన్లను ఆర్‌డీవో కార్యాలయంలో స్వీకరిస్తారు. జూబ్లీహిల్స్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ ఈఆర్‌ఓగా వ్యవహరిస్తారు. జాయింట్ పోలీస్ కమిషనర్ నోడల్‌ఆఫీసర్‌గా వ్యవహరిస్తారు. ఓట్ల లెక్కింపు కోట్ల విజయభాస్కరరెడ్డి స్టేడియంలో జరగనుంది.

- ఎన్నికలు నిష్పక్షపాతంగా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని సీపీ సజ్జనర్ తెలిపారు. లైసెన్సుడు ఆయుధాలు కలిగిన వారు డిపాజిట్ చేయాలని సూచించారు.

### ఇంకా..

- శారీరక వికలాంగులు, 80 ఏళ్ల వయసు పైబడిన వారికి వీల్‌చైర్ సదుపాయం, వాలంటీర్ల ద్వారా ఇళ్లనుంచి పోలింగ్ కేంద్రాలకు తీసుకువచ్చి, తిరిగి ఇళ్లవద్ద దింపే సదుపాయం.
- పోటీ చేసే అభ్యర్థులు తమపై నమోదైన క్రిమినల్ కేసుల వివరాలు వార్తాపత్రికలు, టీవీల్లో మూడు పర్యాయాలు ప్రకటించాలి.
- రాజకీయ పార్టీలు ఎంపిక చేసిన అభ్యర్థుల వివరాల్ని 48 గంటల్లో వెబ్‌సైట్, సోషల్ మీడియా,పత్రికలు, టీవీల ద్వారా వెల్లడించాలి. 'నో యువర్ క్యాండిడేట్స్' యాప్ ద్వారా కూడా ప్రజలు అభ్యర్థుల వివరాలు తెలుసుకోవచ్చు.
- మీడియా ఫేక్‌న్యూస్ ప్రచారం చేయొద్దు. సంబంధిత అధికారుల నుంచి నిర్ధారణ చేసుకోవాలి. వదంతుల్ని ప్రచారం చేయవద్దు.

### 407 పోలింగ్ కేంద్రాలు

- 139 భవనాల్లోని 407 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ జరగనుంది.
- పోలింగ్ కేంద్రాల్లో ర్యాంప్‌లు, టాయ్‌లెట్స్, తాగునీరు, లైటింగ్, పోలింగ్ కేంద్రమని సూచించే బోర్డులు, వీల్‌చైర్లు, తదితర సదుపాయాలుంటాయన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాలకు ఆయా పార్టీల నుంచి బూత్‌లెవెల్ ఏజెంట్లున్నారన్నారు. ఇప్పటికే బీజేపీ నుంచి 219 మంది, కాంగ్రెస్ నుంచి 132 మంది ఉన్నారని, ఇతర పార్టీలవి పెండింగ్‌లో ఉన్నాయన్నారు.
- ఎన్నికల నిర్వహణకు సంబంధించి 407 మంది బీఎల్‌ఓలు, 38 మంది సూపర్‌వైజర్లను నియమించినట్లుపేర్కొన్నారు.
- 21,003 ఎపిక్ కార్డులు జనరేట్ కాగా, 8,491 కార్డుల ముద్రణ పూర్తయిందని, మిగతావి ఆయా దశల్లో ఉన్నాయన్నారు. 8,491 కార్డుల్ని పోస్టు ద్వారా పంపిణీ చేసినట్లు కర్ణన్ తెలిపారు.

# కొందరికే రేషన్ కార్డులు!

- ఇప్పటి వరకు 2.31 లక్షల కుటుంబాలకు కొత్త కార్డులు
- క్షేత్ర స్థాయిలో సగానికి పైగా విచారణ పెండింగ్
- సిఫార్సులుంటేనే విచారణ, ఆమోదం ప్రక్రియ
- ఇదీ గ్రేటర్‌లో పరిస్థితి

సాక్షి, సిటీబ్యూరో: సాక్ష్యాత్తు రాష్ట్ర రాజధానిలో కేవలం సుమారు 2.31 లక్షల కుటుంబాలకు మాత్రమే కొత్త రేషన్ కార్డులు మంజూరయ్యాయి. సగానికి పైగా దరఖాస్తులు పెండింగ్‌లో మగ్గుతున్నాయి. ఫలితంగా నిరుపేద కుటుంబాలకు కొత్త రేషన్ కార్డు అందని దాక్షగా తయారైంది. రెండు నెలల నుంచి కొత్త రేషన్‌కార్డు దరఖాస్తులపై క్షేత్ర స్థాయి విచారణ, ఆమోదం ప్రక్రియ అంతంత మాత్రంగా మారింది. కేవలం మధ్యవర్తుల ప్రమేయం, ఇతరాత్ర సిఫార్సుల ఉన్న దరఖాస్తులకు మాత్రమే మోక్షం లభిస్తోంది. వాస్తవంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో మీ సేవా కేంద్రాల నుంచి కొత్త రేషన్‌కార్డుల కోసం దరఖాస్తులు స్వీకరించడంతో నిరుపేదలు పెద్ద ఎత్తున నమోదు చేసుకున్నారు. ఒకటి రెండు నెలల వ్యవధిలోనే కొత్త కార్డుల మంజూరు ప్రక్రియ ప్రారంభమైంది. క్షేత్ర స్థాయి విచారణ కోసం ప్రత్యేక బృందాలను కూడా రంగంలోకి దించారు. ఏకంగా ఆగస్టు మొదటి వారంలో మంత్రులు సైతం నియోజకవర్గాల వారిగా ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించి కొత్త కార్డుల మంజూరు పత్రాలను లబ్ధిదారులకు అందజేశారు. రేషన్‌కార్డుల మంజూరు నిరంతర ప్రక్రియ అని ప్రకటించిన పౌరసరఫరాల శాఖ..ఆ తర్వాత కొత్త కార్డులు మంజూరును తగ్గించింది.



### కార్డు లేని కుటుంబాలు పది లక్షల పైనే..

గ్రేటర్‌లో రేషన్ కార్డులు లేని కుటుంబాలు 10 లక్షలపైనే ఉన్నాయి. సుమారు కోటిన్నర జనాభా కలిగిన మహానగరంలో సుమారు 40 లక్షల కుటుంబాలు ఉండగా అందులో దారిద్ర్యరేఖకు దిగువనున్న కుటుంబాలు 27.21 లక్షలు ఉన్నట్లు అంచనా. ప్రస్తుతం 17.21 లక్ష కుటుంబాలు మాత్రమే తెల్లరేషన్ కార్డులు కలిగి ఉన్నాయి. మిగతా కుటుంబాలు రేషన్ కార్డులు లేక వివిధ సంక్షేమ పథకాల వర్తింపు కోసం తల్లడిల్లుతున్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు అనంతరం ప్రజా పాలనలో పేద కుటుంబాలు ఆరు గ్యారంటీల పథకాలతో పాటు ప్రత్యేకంగా కొత్త రేషన్ కార్డుల కోసం పెద్ద ఎత్తున దరఖాస్తు చేసుకున్నాయి. హైదరాబాద్ మహానగర పరిధిలో సుమారు 5.73 లక్షల కుటుంబాల నుంచి దరఖాస్తులు వచ్చి చేరాయి. అయితే ప్రభుత్వం వాటిని పక్కకు పెట్టి ఇటీవల జరిగిన సమగ్ర కుటుంబ సర్వేలో రేషన్ కార్డులు లేని కుటుంబాలను గుర్తించి విచారణ జరిపింది.అయితే అది కాస్త విమర్శలకు దారితీయడంతో తిరిగి ఆన్‌లైన్ పద్ధతిలో దరఖాస్తులు స్వీకరిస్తోంది.

### ఆరు లక్షలపైనే దరఖాస్తులు

గ్రేటర్ పరిధిలో సుమారు ఆరు లక్షల పైనే కుటుంబాలు కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తు చేసుకున్నాయి. అందులో మంజూరు 30 శాతం మించలేదు. కనీసం దరఖాస్తులపై క్షేత్ర స్థాయి విచారణ కూడా ముందుకు సాగడం లేదు. కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తులు చేసుకునే ఎఫ్ఎస్‌సీ ఆన్‌లైన్ లాగిన్‌కు నాలుగేళ్ల తర్వాత మోక్షం లభించినా..మంజూరు మాత్రం కొందరికి పరిమితమవుతోంది. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో 2021 ఫిబ్రవరిలో కొత్త రేషన్ కార్డుల కోసం దరఖాస్తుల చేసుకునే పౌరసరఫరా శాఖ వెబ్‌సైట్ ఆన్‌లైన్ లాగిన్‌ నిలిచిపోయింది. అప్పటి వరకు ఆన్‌లైన్ ద్వారా వచ్చిన దరఖాస్తులను 360 డిగ్రీల స్థాయిలో వడబోసి అదే ఏడాది జూలై చివరి వారంలో కొత్త కార్డులు మంజూరు చేసింది. మొత్తం దరఖాస్తుల్లో 40 శాతం మాత్రమే క్లియర్ కాగా..మిగతా దరఖాస్తులు తిరస్కరణకు గురయ్యాయి. అప్పటి నుంచి నాలుగేళ్ల పాటు కొత్త రేషన్ కార్డుల దరఖాస్తుల స్వీకరణ లేకుండా పోయింది. బీఆర్ఎస్ ప్రభుత్వం తర్వాత కాంగ్రెస్ ప్రభుత్వ ఏర్పాటు అనంతరం ఈ ఏడాది ఫిబ్రవరిలో పునరుద్ధరించారు. దీంతో దరఖాస్తుల నమోదు నిరంత ప్రక్రియగా సాగుతున్నా...మంజూరు నత్తనడకన సాగుతోంది.

**గ్రేటర్‌లో రేషన్ కార్డుల పరిస్థితి**

| జిల్లా | కార్డులు | యూనిట్లు | కార్డులు | యూనిట్లు |
|---|---|---|---|---|
| | ఫిబ్రవరి-2025 | | అక్టోబర్-2025 | |
| హైదరాబాద్ | 6,39,415 | 23,61,440 | 7,33,155 | 27,99,060 |
| మేడ్చల్-మల్కాజిగిరి | 5,23,800 | 17,17,263 | 5,96,283 | 20.48,224 |
| రంగారెడ్డి జిల్లా | 5,58,352 | 18,21,881 | 6,23,371 | 21,04,811 |

# అక్రమ లేఔట్లు... రహదారుల ఆక్రమణలు!




### ప్రజావాణి ద్వారా హైడ్రాకు 41 ఫిర్యాదులు

సాక్షి, సిటీబ్యూరో: అనుమతి లేని లేఔట్లతో పాటు ఆక్రమణలకు గురవుతున్న రహదారులపై పలువురు హైడ్రాను ఆశ్రయిస్తున్నారు. కమిషనర్ ఏవీ రంగనాథ్ నేతృత్వంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి ద్వారా 41 ఫిర్యాదులు అందాయి. బొల్లారం మున్సిపాలిటీలోని ఎస్‌రిచ్ ప్రాంతంలోని సర్వే నం.83లో ఉన్న వరకుంట చెరువు కబ్జాల నిరోధించాలని, నిజాంపేట సర్వే నం.233/15లో ప్రభుత్వ భూమి కబ్జా అవుతోందని స్థానికులు ఫిర్యాదు చేశారు. మాజీ సైనికోద్యోగికి జవహర్‌నగర్‌లో ప్రభుత్వం ఇచ్చిన భూమిని కొందరు కబ్జా చేశారని ఫిర్యాదు చేరని ఆయన కుమారుడి ద్వారా ఫిర్యాదు అందింది. అయ్యప్ప సొసైటీలో 28వ ప్రధాన రహదారి 60 అడుగుల వెడల్పుతో ఉండాల్సి ఉండగా ఆక్రమణలకు గురైందని, అక్కడి డబ్బాలను తొలగించాలని హైకోర్టు ఆదేశాలున్నాయని స్థానికులు ఫిర్యాదు చేశారు. గతంలో ఖాళీ చేయించినా మళ్లీ డబ్బాలు పెట్టారని, వీటిని తీయమంటే రూ. 40 లక్షలు డిమాండ్ చేస్తున్నారని ఆరోపించారు. బౌరంపేటలోని సర్వే నం. 166/3లోని ప్రభుత్వ భూమిలో ఎగువన ఉన్న వెంచర్ల కోసం రహదారి నిర్మిస్తున్నారని ఫిర్యాదు అందింది. హయత్‌నగర్ మండలంలోని ఆదిత్యనగర్-బాలాజీ నగర్ మధ్య రెండు లింకు రోడ్లు ఆక్రమణకు గురయ్యాయని, పార్కు స్థలం కూడా కబ్జా అయిందని ఆదిత్యనగర్ రెసిడెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ హైడ్రాను కోరింది. మేడిపల్లి మండలం సాయిప్రియానగర్‌లో 2500 ప్లాట్లతో లే ఔట్ వేశారు. ఇందులో 2 వేల గజాల్లో ఉండాల్సిన పార్కును కూడా ప్లాట్లుగా చేసి విక్రయిస్తున్నారంటూ స్థానికులు ఫిర్యాదు చేశారు.


### హైడ్రాను అభినందించిన హైకోర్టు...

హైదరాబాద్ డిజాస్టర్ రెస్పాన్స్ అండ్ అసెట్ ప్రొటెక్షన్ ఏజెన్సీ (హైడ్రా) పని తీరును హైకోర్టు అభినందించిందని అధికారులు సోమవారం ప్రకటించారు. తమ విభాగం చెరువుల అభివృద్ధిని యజ్ఞంలా చేస్తోందని కితాబిచ్చినట్లు పేర్కొన్నారు. బతుకమ్మకుంటను అభివృద్ధి చేసిన తీరు హర్షణీయమని జస్టిస్ విజయ్ సేన్ రెడ్డి సోమవారం వ్యాఖ్యానించినట్లు ప్రకటించింది. బతుకమ్మకుంట ఆ పరిసర ప్రాంతాలకు వరద ముప్పు తప్పించడమే కాకుండా భూగర్భ జలాలను కూడా పెంచిందని, గచ్చిబౌలిలోని మల్కం చెరువును చూసినా ఆహ్లాదంగా కనిపిస్తోందని వ్యాఖ్యానించినట్లు హైడ్రా పేర్కొంది. చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ల పరిధిలో ఇంటి స్థలాలు, భూములు ఉంటే ట్రాన్స్‌ఫరబుల్ డెవలప్‌మెంట్ రైట్స్ (టీడీఆర్) కింద వారికి సరైన నష్టపరిహారం ఇవ్వాలని సూచించినట్లు పేర్కొన్నారు. దీని కోసం ప్రభుత్వం సమగ్ర విధానాన్ని తీసుకురావాలని హైకోర్టు అభిప్రాయపడినట్లు తెలిపారు. మాదాపూర్‌లోని తమ్మిడికుంట చెరువు పరిధిలోని రెండు ఎకరాలకు సంబంధించిన టీడీఆర్ కేసు విచారణ సందర్భంలో ఇది చోటు చేసుకుందని హైడ్రా తెలిపింది.

# హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్‌లపై నకిలీ దందా!

- అన్ని వాహనాలకు హైసెక్యూరిటీ తప్పనిసరన్న సుప్రీంకోర్టు
- గ్రేటర్‌లో సుమారు 45 లక్షల వాహనాలు పెండింగ్
- ఇప్పటి వరకు ఎలాంటి గడువు విధించలేదంటున్న రవాణాశాఖ
- నకిలీసైట్‌ల దందాలపై అప్రమత్తంగా ఉండాలని హెచ్చరిక

## 'సయామ్'లో అక్షరాలు మార్చి వెబ్‌సైట్‌ల మాయాజాలం




సాక్షి, సిటీబ్యూరో: వాహనాల హైసెక్యూరిటీ రిజిస్ట్రేషన్ నెంబర్‌ప్లేట్ (హెచ్ఎస్ఆర్‌పీ)లపై నకిలీ వెబ్‌సైట్‌లు దందా కొనసాగిస్తున్నాయి. కొత్తగా నమోదయ్యే వాహనాలతో పాటు పాతవాహనాలకు సైతం హెచ్ఎస్ఆర్‌పీని కచ్చితంగా అమలు చేయాలని సుప్రీంకోర్టు గతంలోనే ఆదేశించింది. ఈ మేరకు సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మ్యానుఫాక్చర్ (ఎస్ఐఏఎం-సయామ్) అనే సంస్థకు ఆ బాధ్యతలను అప్పగించారు. హైసెక్యూరిటీ నెంబర్‌ప్లేట్‌ల ఏర్పాటు పైన 15 రాష్ట్రాల్లో ఈ సయామ్ సంస్థ సేవలందజేస్తోంది. వాహనదారులు సయామ్ వెబ్‌సైట్‌లో హెచ్ఎస్ఆర్‌పీ కోసం దరఖాస్తు చేసుకున్న అనంతరం నిర్ణీత గడువు మేరకు కొత్త నెంబర్‌ప్లేట్లను అందజేస్తారు. కొత్తగా కొనుగోలు చేసే వాహనాలకు మాత్రం షోరూమ్‌లలోనే ఈ సదుపాయం అందుబాటులో ఉంటుంది. కేరళ, కర్ణాటక, గుజరాత్, రాజస్థాన్, ఢిల్లీ, ఏపీ తదితర రాష్ట్రాల్లో సయామ్ ద్వారా పెండింగ్ వాహనాలకు హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్‌లను అందజేస్తున్నారు. తెలంగాణ ప్రభుత్వం మాత్రం హెచ్ఎస్ఆర్‌పీపైన ఇప్పటి వరకు ఎలాంటి తుదిగడువును విధించలేదు. అయినప్పటికీ కొంతమంది వ్యక్తులు 'సయామ్' పేరిట నకిలీ వెబ్‌సైట్‌లను సృష్టించి ఇటీవల వాహనదారులకు పెద్ద ఎత్తున నోటీసులు అందజేశారు. హైసెక్యూరిటీ నెంబర్‌ప్లేట్‌లు లేకుండా తిరిగే వాహనాలపైన భారీ ఎత్తున జరిమానా విధించనున్నట్లు 'ఆర్టీఏ చలాన్‌ల' పేరిట వాహనదారులకు నోటీసులు ఇచ్చి గందరగోళం సృష్టించారు. ఈ క్రమంలో రవాణాశాఖ అప్రమత్తమైంది. హెచ్ఎస్ఆర్‌పీ కోసం తాము ఎలాంటి నోటీసులు ఇవ్వడం లేదని పేర్కొంది. అయినప్పటికీ వాహనదారుల్లో ఇంకా ఈ గందరగోళంకొనసాగుతూనే ఉంది. 'సయామ్' వెబ్‌సైట్‌ను పోలిన విధంగా ఒకటి, రెండు అక్షరాలను మార్చి మాయాజాలం సృష్టిస్తున్నారని, అలాంటి వెబ్‌సైట్ల నుంచి వచ్చే మెసేజ్‌లను చూసి మోసపోవద్దని రవాణాశాఖ ఉన్నతాధికారి ఒకరు స్పష్టం చేశారు.

### నాణ్యతపై సందేహాలు....

- హైసెక్యూరిటీ నెంబర్‌ప్లేట్‌లలో నాణ్యత లేకపోవడం వల్ల కూడా వాహనదారులు విముఖత చూపుతున్నారు.
- తెలుపురంగు ప్లేట్‌లపై నెంబర్లను ఎంబోజింగ్ చేసి నలుపురంగు పెయింట్ వేస్తారు.కానీ ఈ రంగు ఎక్కువ కాలం ఉండడం లేదు.
- ప్లేట్‌లు కూడా నాసిరకంగా ఉండి తొందరగా దెబ్బతింటున్నాయి. సొట్టలు పడుతున్నాయి. విరిగి ముక్కలవుతున్నట్లు కూడా ఆరోపణలు ఉన్నాయి.
- ఈ నెంబర్ ప్లేట్లు ఆకర్షణీయంగా లేకపోవడం కూడా మరో కారణం.
- రూ.లక్షల ఖరీదైన వాహనాలు కొనుగోలు చేసి ఇలాంటి నాసిరకం ప్లేట్‌లు అమర్చుకునేందుకు అయిష్టత చూపుతున్నారు.
- కానీ 2019 నాటికి నమోదైన అన్ని వాహనాలకు హెచ్ఎస్ఆర్‌పీ తప్పనిసరి అన్న సుప్రీంకోర్టు ఆదేశాల దృష్ట్యా కదలిక వచ్చింది.

### ఇప్పటికీ తప్పనిసరి కాదు...

'హెచ్ఎస్ఆర్‌పీపైన ప్రభుత్వం ఇంకా ఎలాంటి గడువు విధించలేదు. భవిష్యత్తులో గడువు విధించే వరకు హెచ్ఎస్ఆర్‌పీ కోసం ఎలాంటి వెబ్‌సైట్‌లను ఆశ్రయించవలసిన అవసరం లేదు. దీనిపైన ప్రభుత్వం నిర్ణయం తీసుకున్న తరువాత మాత్రమే స్పష్టమైన విధివిధానాలను విడుదల చేస్తాం. అప్పటి వరకు వాహనదారులు ఎలాంటి గందరగోళానికి, ఆందోళనకు గురికావలసిన అవసరం లేదు'. అని రవాణాశాఖ అధికారులు స్పష్టం చేశారు.

### గ్రేటర్‌లో 45 లక్షలకు పైగా పెండింగ్...

వాహనాల భద్రతను దృష్టిలో ఉంచుకొని సుప్రీంకోర్టు హెచ్ఎస్ఆర్‌పీని తప్పనిసరి చేసింది. ఈ మేరకు 2013లో అప్పటి ఉమ్మడి ప్రభుత్వం దీన్ని అమల్లోకి తెచ్చింది. కానీ ఈ పథకం ఏళ్లకు ఏళ్లుగా నత్తనడకన సాగుతుంది. తెలంగాణలో సుమారు 65 లక్షలకు పైగా వాహనాలు పెండింగ్‌లో ఉన్నట్లు అంచనా. వాటిలో 45 లక్షల వరకు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోనే ఉన్నాయి. 2019 వరకు నమోదైన అన్ని వాహనాలకు ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి హెచ్ఎస్ఆర్‌పీని అమర్చాలని సుప్రీంకోర్టు మరోసారి ఆదేశించింది. ఈ మేరకు పలు రాష్ట్రాల్లో ఈ పథకాన్ని యుద్ధ ప్రాతిపదికన చేపట్టారు. కానీ నగరంలో మాత్రం ఈ దిశగా ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ప్రభుత్వం నుంచి తమకు ఇంకా ఎలాంటి ఆదేశాలు అందలేదని, దీంతో తాము ఇప్పటి వరకు ఎలాంటి తుది గడువును విధించలేదని ఆర్టీఏ అధికారులు తెలిపారు. మొదట్లో ఈ ఏడాది సెప్టెంబర్ నాటికి ఏర్పాటు చేసుకోవాలంటూ వెలువడిన ఒక ఉత్తర్వు వాహనదారులను గందరగోళానికి గురి చేసింది. దీంతో చాలామంది ఆర్టీఏ కార్యాలయాలకు వెళ్లి అధికారులను సంప్రదించారు. ఇదే సమయంలో ఇతర రాష్ట్రాల్లో 'సయామ్' ద్వారా ఈ పథకం అమలు జరుగుతున్న క్రమాన్ని అవకాశంగా తీసుకొని నకిలీవెబ్‌సైట్‌లు రంగంలోకి దిగినట్లు అధికారులు పేర్కొంటున్నారు.

## రెచ్చిపోయిన దొంగలు.. రెండిళ్లలో చోరీ

23.2 తులాల బంగారం, రూ.47 వేల నగదు దొంగతనం

**చందానగర్:** చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో దొంగలు హల్‌చల్ చేశారు. దసరా సెలవుల్లో ఇళ్లలకు తాళాలు వేసుకొని సొంత ఊరికి వెళ్లడంతో దొంగలు అదే అదునుగా రెచ్చిపోయారు. డీఐ భాస్కర్ తెలిపిన మేరకు...ఓల్డ్ ఎంఐజీలో నివాసముంటున్న శ్రీరాంమూర్తి బీహెచ్‌ఈఎల్‌లో పని చేసి రిటైర్డ్ అయ్యారు. గత నెల 29న పుట్టపర్తికి వెళ్ళారు. ఆదివారం ఉదయం వచ్చి చూసే సరికి తాళాలు పగులగొట్టి ఉండడం గమనించారు. 18.2 తులాల బంగారు, 680 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రూ.7 వేల నగదు చోరీ అయినట్లు గమనించి పోలీసులకు ఫిర్యాదు చేశారు. సోమవారం కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

**పోలీస్ హెడ్ కానిస్టేబుల్ ఇంట్లో..**

మియాపూర్ పోలీస్ స్టేషన్‌లో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న విజయ్ కుమార్ లింగంపల్లి రైల్ విహార్‌లో నివాసముంటున్నారు. దసరా సెలవులల్లో భార్య, పిల్లలు స్వగ్రామమైన వికారాబాద్‌కు వెళ్ళారు. విజయ్‌కుమార్ శనివారం రాత్రి నైట్ డ్యూటీకి వెళ్ళాడు. ఆదివారం ఉదయం డ్యూటీ ముగించుకొని ఇంటి కి వచ్చి చూసే సరికి తాళాలు పగలగొట్టినట్లు గమనించాడు. ఇంట్లోకి వెళ్లి చూడగా 5 తులాల బంగారం, 300 గ్రాముల వెండి ఆభరణాలతో పాటు రూ.40వేల నగదు దొంగతనం జరిగినట్లు గమనించారు. చందానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా సోమవారం కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

## మద్యం మత్తులో భార్యను కొట్టిన భర్త

నలుగురు పిల్లలతో కలిసి భార్య అదృశ్యం



**గౌలిపురా:** మద్యం మత్తులో భర్త కొట్టడంతో నలుగురు పిల్లలతో కలిసి ఓ గృహిణి అదృశ్యమైంది. ఈ సంఘటన భవానీ నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. భవానీనగర్ తలాబ్‌కట్టా సిద్దిఖీనగర్ సమద్ హోటల్ ప్రాంతానికి చెందిన సయీద్ ఉన్నీసా (28), మహ్మద్ ఫెరోజ్ ఖాన్‌లు దంపతులు. వీరికి నలుగురు పిల్లలు. కాగా ఫెరోజ్ ఖాన్ తరచూ మద్యం తాగి వస్తుండటంతో ఇంట్లో గొడవలు జరుగుతున్నాయి. గత నెల 30న ఫెరోజ్ ఖాన్ మద్యం తాగి ఇంటికి రావడంతో భార్య మందలించింది. దీంతో ఫిరోజ్ ఖాన్ భార్య సయీద్ ఉన్నీసాను కొట్టాడు. ఈక్రమంలో మరుసటిరోజు (ఈ నెల 1న) సాయంత్రం సయీద్ ఉన్నీసా తన నలుగురు పిల్లలను తీసుకొని కుటుంబ సభ్యులకు చెప్పకుండా బయటికి వెళ్లింది. అనంతరం తిరిగి ఇంటికి రాలేదు. దీంతో ఫెరోజ్ ఖాన్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు.





# 'హైడ్రా'మా నేనా?

## గాజులరామారం సర్వే నెం.307లో కూల్చివేతలు

● వారం రోజుల్లోనే మళ్లీ ఫెన్సింగ్ వేసిన ఎమ్మెల్యే ● ఆ భూమి తమదేనంటూ ప్రెస్‌మీట్ సైతం నిర్వహణ



కంచెను హైడ్రా తొలగించిన అనంతరం..



ఆ తరువాత కంచె వేసిన హైడ్రా..



హైడ్రా వేసిన కంచె తొలగించి ఇలా..

సాక్షి, సిటీబ్యూరో:

**సెప్టెంబర్ 21:** గాజులరామారంలోని సర్వే నెం.307లో ఉన్న రూ.15 వేల కోట్ల విలువైన 317 ఎకరాల స్థలం ప్రభుత్వానిదని ప్రకటించిన హైడ్రా కూల్చివేతలు చేపట్టింది. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీకి అధీనంలో ఉన్న 11 ఎకరాల చుట్టూ ఉన్న షీట్లను తొలగించి ఫెన్సింగ్ వేసింది.

**సెప్టెంబర్ 23:** ఆ స్థలం తనదేనని, పట్టా భూమి కొనుగోలు చేశానని ప్రకటించిన అరికపూడి గాంధీ హైడ్రా అక్కడ వేసిన ఫెన్సింగ్ తొలగించారు. దాని స్థానంలో గతంలో మాదిరిగానే బ్లూషీట్లు ఏర్పాటు చేశారు. హైడ్రా చర్యలపై న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

**అక్టోబర్ 1:** అరికపూడి గాంధీ చెరలో ఉన్న ప్రభుత్వం భూమినీ పరిరక్షించాలంటూ కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు హైడ్రా సహా వివిధ విభాగాలకు దరఖాస్తులు ఇచ్చారు. ఆ స్థలం తనదేనని, ఆరోపణలు చేస్తే కోర్టు కీడుస్తానంటూ గాంధీ ప్రకటించారు. హైడ్రా మాత్రం ఈ భూమి విషయంలో మిన్నకుండిపోయింది.

పక్షం రోజులు సాగిన ఈ ఎపిసోడ్‌లో నష్టపోయింది మాత్రం 260 నిరుపేద కుటుంబాలే. గాజులరామారంలోని సర్వే నెం.307లో ఉన్న ప్రభుత్వ భూమిలోని వెంచర్లు, లే ఔట్లకు సంబంధించిన ఈ నిర్మాణాలను హైడ్రా గత నెల 21న తొలగించింది. ప్రగతినగర్ వైపు కబ్జా చేసిన వారిలో రాజకీయ నాయకులు, రియల్ ఎస్టేట్ సంస్థల యజమానులతో పాటు ప్రభుత్వ అధికారులు కూడా ఉన్నట్లు ప్రకటించింది. ఈ సర్వే నెంబర్‌లో 317 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఉమ్మడి రాష్ట్రంలో దీన్ని ఆంధ్రప్రదేశ్ ఫైనాన్స్ కార్పొరేషన్‌కు నాటి సర్కారు అప్పగించింది. రాష్ట్ర విభజన తర్వాత ఫైనాన్స్ కార్పొరేషన్ ఆస్తుల పంపకాల్లో జాప్యం జరిగింది. దీన్ని ఆసరాగా తీసుకున్న కొందరు ఆక్రమణలకు పాల్పడ్డారు. ఈ విషయంపై హైడ్రాకు స్థానికుల నుంచి ఫిర్యాదులు అందాయి. ఆరు నెలల పాటు సాగిన విచారణలో భాగంగా రెవెన్యూ, జీహెచ్‌ఎంసీ, ఫైనాన్స్ కార్పొరేషన్ అధికారులతో ఐదారుసార్లు సమావేశమై అనేక విషయాలు గుర్తించింది.

### బాధ్యులపై చర్యలేవి?

ఈ భూమిలో ప్రగతినగర్ వైపు బడాబాబులు వెంచర్లు, లే ఔట్లు వేశారని, సర్వే నంబర్లు 329/1, 342ల్లో ఉన్న భూమిని 60 గజాలు, 120 గజాల చొప్పున ప్లాట్లు వేసిన రౌడీషీటర్లు, స్థానిక నేతలు పేదలకు విక్రయించారు. జగద్గిరిగుట్ట పోలీసుస్టేషన్‌లో రౌడీషీటర్‌గా ఉన్న షేక్ అబిద్.. లక్ష్మి మురళి హౌస్సెస్ పేరుతో ఈ విక్రయాలు జరిపారు. బోడాసు శ్రీనివాస్ (డాన్ శీను), ఏసుబాబు, సయ్యద్ గౌస్ బాబు, మనీష్, దేవా తదితరులూ భూమిని ఆక్రమించి, ప్లాట్లుగా అమ్మేశారు. వీరికి స్థానిక రెవెన్యూ అధికారులు సహకరించారు. వీటిలో నిర్మించిన గదులను కొందరు అద్దెలకు కూడా ఇచ్చారు. ఇలా ఆ ప్రభుత్వ భూమిలో ఉన్న 12 ఎకరాల వెంచర్‌తో పాటు 20 ఎకరాల లే ఔట్‌ను హైడ్రా తొలగించింది. నిర్మాణాలను కూల్చివేసిన అందుకు బాధ్యులైన అధికారులపై మాత్రం చర్యలు తీసుకోలేదు.

### హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసిన ఆర్‌ఎల్‌ఆర్...

హైడ్రా కూల్చివేతలు చేపట్టిన భూమిలో 11 ఎకరాలు శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరికపూడి గాంధీ బంధువుల పేర్లపై ధరణిలో చేర్చింది ప్రభుత్వ భూమి అంటూ బీఆర్ఎస్ నేత రాగిడి లక్ష్మారెడ్డి (ఆర్‌ఎల్‌ఆర్) హైకోర్టులో పిటిషన్ వేశారు. తమ పేరిట ఉన్న 11 ఎకరాలను ఎప్పుడో విక్రయించి వెళ్లిపోయిన జాహెద్ బేగం, షేక్ ఇమామ్, ఇశాన్ అమీన్‌ను తీసుకొచ్చి వారి పేరిట భూమిని కొన్నట్లు చూపించారని ఆరోపించారు. గత బుధవారం హైడ్రా కమిషనర్‌కు కలిసిన కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ భూ ఆక్రమణకు పాల్పడిన అరికపూడి గాంధీపై ఫిర్యాదు చేశారు. హైడ్రా అధికారులు గత నెల 21న తమ భూమిలో చేపట్టిన కూల్చివేతలపై తాము హైకోర్టును ఆశ్రయించామని అరికపూడి గాంధీ అదే రోజు ప్రకటించారు. దీనిపై హైడ్రా ఆ భూమిలోకి ప్రవేశించకుండా ఉత్తర్వులు ఇచ్చిందని పేర్కొన్నారు. తనపై ఎవరైనా తప్పుడు ఆరోపణలు చేస్తే న్యాయపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఇప్పుడు హైడ్రా వ్యూహం ఎలా ఉంటుందన్న అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

## అడిగిన సమాచారం ఇవ్వండి

ఎక్సైజ్‌శాఖ డిప్యూటీ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి



**సాక్షి, సిటీబ్యూరో:** హైదరాబాద్, సికింద్రాబాద్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ల పరిధిలో ఉన్న 179 మద్యం దుకాణాల కోసం దరఖాస్తులు చేసుకునేవారికి అవసరమైన సమాచారాన్ని వెంటనే అందజేయాలని ఎక్సైజ్‌శాఖ హైదరాబాద్ డిప్యూటీ కమిషనర్ అనిల్‌కుమార్‌రెడ్డి సూచించారు. ఈ మేరకు సంబంధిత ఎక్సైజ్ స్టేషన్‌లు సిద్ధంగా ఉండాలని తెలిపారు. సోమవారం అబ్కారీ భవన్ సమావేశ మందిరంలో హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలోని 11 ఎక్సైజ్ స్టేషన్ల ఎస్‌హెచ్‌ఓలు, ఎస్సైలు, ఎన్‌ఫోర్స్‌మెంట్, డీటీఎఫ్ టీమ్‌లతో సమీక్ష నిర్వహించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మద్యం దుకాణాలకు సంబంధించిన రిజర్వేషన్లు, రెండేళ్లలో మద్యం అమ్మకాల వివరాలను దరఖాస్తుదారులకు ఇవ్వాలని చెప్పారు.అలాగే దరఖాస్తుల సమూనాలో తప్పులు లేకుండా సహకరించాలన్నారు. దరఖాస్తుదారులు తమ దరఖాస్తులను అబ్కారీ భవన్‌లోని మూడు, నాలుగు అంతస్తుల్లో ఉన్న కౌంటర్‌లో దాఖలు చేసేవిధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ఎన్ని దరఖాస్తులు వచ్చాయని రోజువారిగా డిస్ప్లే చేయాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ పంచాక్షరి సూచించారు.

## 26న ప్రెస్‌క్లబ్ ఎన్నికలు

**లక్డీకాపూల్ :** హైదరాబాద్ ప్రెస్ క్లబ్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదలైంది. ఈ నెల 26న క్లబ్ కార్యవర్గానికి ఎన్నికలు జరుగుతాయని ప్రెస్‌క్లబ్‌ప్రధాన కార్యదర్శి రవికాంత్ రెడ్డి చెప్పారు. 2025-27 సంవత్సరానికి ఎగ్జిక్యూటివ్ కమిటీని ఎన్నుకోనున్నట్టు చెప్పారు. ఈ ఎన్నికలకు రిటర్నింగ్ ఆఫీసర్‌గా దొడ్లా శ్రీనివాస్ రెడ్డి వ్యవహరిస్తారు. ఈ నెల 9వ తేదీ నాటికి సభ్యత్వ రెన్యువల్, అన్ని బకాయిలు చెల్లించిన రెగ్యులర్ సభ్యులు మాత్రమే ఈ ఎన్నికల్లో పోటీ చేయడానికి అర్హులని చెప్పారు. కొత్త ఎగ్జిక్యూటివ్ కమిటీకి అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు(జనరల్), ఉపాధ్యక్షురాలు, ప్రధాన కార్యదర్శి, ఇద్దరు సంయుక్త కార్యదర్శుల పదవులతో పాటు కోశాధికారి, పది మంది కార్యనిర్వాహక సభ్యులు (8 మంది సాధారణ సభ్యులు, రెండు మహిళా రిజర్వ్ స్థానాలు) ఎన్నికలు జరుగుతాయన్నారు.

## గాలిలో పల్టీలు కొట్టిన కారు

- ఫ్లైఓవర్‌పై స్తంభాన్ని ఢీకొట్టి..మరోకారుపై పడి...
- ఐదుగురికి గాయాలు.. ఇద్దరి పరిస్థితి విషమం

**కేపీహెచ్‌బీకాలనీ:** జేఎన్టీయూ-హైటెక్ సిటీ రోడ్డులో అతివేగంగా వెళ్తూ ఓ కారు కరెంటు స్తంభాన్ని ఢీకొట్టడమే కాకుండా గాలిలోకి పల్టీలు కొట్టి రోడ్డుకు అవతలి వైపు వెళ్తున్న మరో కారుపై పడింది. ఈ ప్రమాదంలో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. వీరిలో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. రాజస్థాన్ జోధ్‌పూర్ ప్రాంతానికి చెందిన వికాస్‌శర్మ, శాంతను స్నేహితులు. మాదాపూర్ అయ్యప్ప సొసైటీ 100 ఫీట్ల రోడ్డులో నివాసం ఉండే శాంతను సాఫ్ట్‌వేర్ ఉద్యోగి. వికాస్‌శర్మ ఇంటీరియర్ డిజైనర్. ఇద్దరూ కలిసి ఆదివారం రాత్రి మియాపూర్ ప్రాంతంలో మద్యం తాగారు. సోమవారం తెల్లవారుజామున జేఎన్‌టీయూ వైపు నుంచి హైటెక్ సిటీ వైపు టాటా కర్వ్ కారులో ఇరువురూ వెళ్తున్నారు. ఆ సమయంలో వికాస్‌శర్మ డ్రైవింగ్ చేస్తున్నాడు. నెక్సెస్ మాల్ ఫ్లైఓవర్ మీదుగా వెళ్తున్న వీరు ఫ్లైఓవర్ దిగే క్రమంలో అతివేగంగా వెళ్లి కరెంటు స్తంభాన్ని ఢీకొట్టారు. వీరు ప్రయాణిస్తున్న కారు గాల్లోకి ఎగిరి హైటెక్ సిటీ వైపు నుంచి-జేఎన్టీయూ వైపు వెళ్తున్న టాటా సిట్రాన్ ఎలక్ట్రిక్ కారుపై పడింది. ఈ కారులో నానక్‌రాంగూడలోని ఐసీఐసీఐ బ్యాంక్‌లో ఉద్యోగం చేస్తున్న ప్రియను దింపేందుకు సంస్థకు చెందిన కారును అఖిల్‌రెడ్డి నడుపుతుండగా సెక్యూరిటీగార్డ్‌గా వచ్చిన సాహిల్‌కుమార్ కూడా ఉన్నారు.ఈ ఘటనలో స్నేహితులు వికాస్‌శర్మ, శాంతన్‌తో మరో కారులోని అఖిల్‌రెడ్డితో పాటు అందులో ఉన్న ప్రియ, సాహిల్‌కుమార్‌లు తీవ్రంగా గాయపడ్డారు.కార్లను నడుపుతునన వికాస్ శర్మ,అఖిల్‌రెడ్డిల పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ఐదుగురూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు.

## నేడు పలుచోట్ల నీటి సరఫరాకు అంతరాయం

**సాక్షి,సిటీ బ్యూరో:** హైదరాబాద్ మహానగరానికి మంచినీటిని సరఫరా చేసే సింగూరు జలాశయం సింగాపూర్ నుంచి ఖానాపూర్ వరకు ఉన్న 1200 ఎంఎం డయా పీఎస్సీ గ్రావిటీ మెయిన్ కు మణికొండ కల్వర్టు వద్ద పీఎస్సీ పైపు లైన్ దెబ్బతిని ఏర్పడిన భారీ లీకేజీ మరమ్మతులు పనులు నేపథ్యంలో మంగళవారం ఉదయం కొన్ని ప్రాంతాల్లో ప్రెజర్ తో నీటిన రఫరా, మరికొన్ని ప్రాంతాల్లో సరఫరాలో అంతరాయం కలుగుతుందని జలమండలి వర్గాలు తెల్పాయి. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీలు, షేక్ పేట్, హకీంపేట్, తొలిచౌకి, కాకతీయ నగర్ లోని కొన్ని ప్రాంతాలు, మెహిదీపట్నం, ఆసిఫ్ నగర్, కార్వాన్, ప్రాంతాల్లో మంచి నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

## 19న సల్మాన్ ఖుర్షీద్‌కు సద్భావనా అవార్డు

**సాక్షి, సిటీ బ్యూరో:** రాజీవ్ గాంధీ సద్భావనా యాత్ర స్మారక దినోత్సవం సందర్భంగా ఈనెల 19న చార్మినార్ వద్ద కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సభ్యులు, మాజీ కేంద్ర మంత్రి, సుప్రీంకోర్టు న్యాయవాది సల్మాన్ ఖుర్షీద్ కు సద్భావనా అవార్డు ప్రదానం చేయనున్నట్లు కాంగ్రెస్ వర్గాలు తెల్పాయి. మాజీ ప్రధాని దివంగత రాజీవ్ గాంధీ 1990 అక్టోబర్ 19న చార్మినార్ వద్ద కాంగ్రెస్ పార్టీ పతాకాన్ని ఆవిష్కరించి జంట నగరాల్లో సద్భావనా యాత్ర చేశారు. రాజీవగాంధీ సద్భావనా యాత్రా స్మారక సమితి ఆధ్వర్యంలో ఆ రోజు ను 'రాజీవ్ గాంధీ సద్భావనా యాత్రా స్మారక దినం గా పాటిస్తూ గత 35 సంవత్సరాలుగా చార్మినార్ వద్ద ఒక కార్యక్రమాన్ని నిర్వహిస్తూ వివిధ రంగాల్లో సేవలు అందించిన ఒక ప్రముఖ వ్యక్తిని సద్భావనా అవార్డుతో సత్కరించడం ఆనవాయితీ. ఈ కమిటీ ఈ సంవత్సరం సద్భావన అవార్డుకు సల్మాన్ ఖుర్షీద్‌ను ఎంపిక చేశారు.

## విజయవంతంగా పీఎంవీబీఆర్ యోజన మేళా

**సాక్షి, సిటీ బ్యూరో:** బంజారా హిల్స్‌లోని ఉద్యోగుల ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్ ప్రాంతీయ కార్యాలయం ఆధ్వర్యంలో సోమవారం జూబ్లీహిల్స్‌లోని అపోలో హాస్పిటల్స్ , సోమాజిగూడలోని ఏజిస్ కస్టమర్ సపోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్‌లో ప్రధాన మంత్రి విక్షిత్ భారత్ రోజ్‌గార్ యోజన మేళాను విజయవంతంగా నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అపోలో హాస్పిటల్స్ హెచ్‌ఆర్ జనరల్ మేనేజర్ అమృత్ దత్తా అసిస్టెంట్ మేనేజర్ జి రామాంజనేయ రెడ్డి, ఏజిస్ కస్టమర్ సపోర్ట్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ హెచ్ ఆర్ మేనేజర్ జీ తిరుమల రావు తదితరులు పాల్గొన్నారు.

## నగరం.. రోడ్లు ఛిద్రం




విజయవాడ జాతీయ రహదారిపై..

**సాక్షి, రంగారెడ్డిజిల్లా:** అసలే నాసిరకం పనులు.. ఆపై ఏకధాటి వర్షాలు.. వరదలు.. ఇంకేముంది గ్రామీణ రహదారులను ఛిద్రం చేశాయి. మారుమూల గ్రామీణ రోడ్లే కాదు.. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే జాతీయ రహదారులు సైతం ధ్వంసమయ్యాయి. ఇటు ఎల్బీనగర్ నుంచి అటు బాటసింగారం వరకు విజయవాడ రహదారిపై అడుగుకో గుంతతేలింది. అష్ట వంకరలు తిరిగి.. అనేక మలుపులతో నిత్యం ప్రమాదాలకు కారణమవుతున్న బీజాపూర్ జాతీయ రహదారి (అప్పా జంక్షన్ నుంచి చేవెళ్ల వరకు) పూర్తిగా దెబ్బతింది. శంషాబాద్ నుంచి షాద్‌నగర్ వరకు ఉన్న బెంగళూరు జాతీయ రహదారి సహా పహడీషరీఫ్ నుంచి ఆమనగల్లు వరకు విస్తరించి ఉన్న శ్రీశైలం జాతీయ రహదారి, బీఎన్‌రెడ్డి నుంచి ఇబ్రహీంపట్నం మీదుగా మాల్ వరకు విస్తరించి ఉన్న నాగార్జునసాగర్ రోడ్డు, షాద్‌నగర్ నుంచి తాండూరు వెళ్లే మార్గం, కోకాపేట నుంచి శంకర్‌పల్లి మీదుగా చేవెళ్ల వెళ్లే మార్గం ఎక్కడికక్కడ గుంతలు తేలాయి. దెబ్బతిన్న రోడ్లకు ఎప్పటికప్పుడు మరమ్మతులు చేయాల్సిన రోడ్ల భవనాలశాఖ, పంచాయతీరాజ్ ఇంజినీరింగ్ విభాగాలు అటు వైపు దృష్టిసారించకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

**రాకపోకలకు ఇబ్బందులు**

ఎగువ ప్రాంతాల నుంచి వచ్చిన వరద లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లపై నిలిచి ఉండటంతో వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో పాటు రోజుల తరబడి నీరు నిల్వ ఉండటంతో రోడ్డుపై ఉన్న తారు, సీసీ దెబ్బతిని కంకర తేలుతోంది. దెబ్బతిన్న ఈ రోడ్లపై వాహనాల రాకపోకలకు తీవ్ర విఘాతం కలుగుతోంది.

## గొడవ వద్దన్నందుకు దాడి..వ్యక్తి మృతి



సయ్యద్ అమీర్ (ఫైల్)

**ఘట్‌కేసర్:** పిల్లలను గొడవపడొద్దు అన్నందుకు ఓ పిల్లాడి తండ్రి అతడిపై దాడిచేశాడు. ఈ సంఘటనలో బాధితుడు మృతి చెందాడు. ఈ సంఘటన ఘట్‌కేసర్ పీఎస్ పరిధిలోని అవుషాపూర్‌లో ఆదివారం జరిగింది. ఇన్‌స్పెక్టర్ బాలస్వామి తెలిపిన మేరకు.. అవుషాపూర్ గ్రామానికి చెందిన సయ్యద్ అమీర్ (34) రాళ్లు కొట్టుకుంటు కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆదివారం ఇంటిలో ఉండగా సమీపంలో నివసించే షన్ను పిల్లలు అసీనా, అజ్మద్, సయ్యద్ అలీ కుమారుడు అబు గొడవ పడ్డారు. శబ్దం విన్న సయ్యద్ అమీర్ బయటకు వచ్చిన గొడవ పడొద్దని అబుకు సూచించాడు.

**గొడవ వద్దన్నందుకు...**

గొడవ పడొద్దన్నాడనే విషయాన్ని అబు తన తండ్రి సయ్యద్ అలీకి చెప్పడంతో అతడొచ్చి సయ్యద్ అమీర్‌పై దాడికి దిగాడు. చుట్టు పక్కల వారు ఇరువురిని శాంత పరిచి ఇంటికి పంపించి వేశారు. అనంతరం అర్ధగంట తర్వాత ఛాతి నొప్పితో పాటు వాంతులు కావడంతో కుటుంబీకులకు సయ్యద్ అమీర్ తెలిపాడు. అతడి శరీరానికి చెమటలు పట్టడంతో గమనించిన కుటుంబ సభ్యులు వెంటనే ఘట్‌కేసర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన అక్కడి వైద్యులు అప్పటికే మరణించినట్లు ధృవీకరించారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

**జాతీయ రహదారిపై నిరసన...**

అకారణంగా దాడి చేసి ప్రాణం తీసిన సయ్యద్ అలీపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు బాధితులు పోస్ట్‌మార్టం అనంతరం జాతీయ రహదారిపై మృతదేహాన్ని ఉంచి నిరసన తెలిపారు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు నచ్చచెప్పి పంపించి వేశారు. కాగ ఇరు వర్గాల మధ్య ఓ ఒప్పందం జరిగినట్లు సమాచారం.

## సిటీ సీపీ ఆకస్మిక పర్యటన



**చంచల్‌గూడ:** హైదరాబాద్ నగర పోలీసు కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన వీసీ సజ్జనార్ సోమవారం మాదన్నపేట పోలీసు స్టేషన్ పరిధిలో ఆకస్మికంగా పర్యటించారు. మాదన్నపేటలోని సున్నితమైన ప్రాంతాల్లో పర్యటించి శాంతిభద్రతలపై స్థానికులతో మాట్లాడారు. ఇటీవల చావణీలో హత్యకు గురైన చిన్నారి సుమయ తండ్రి స్వయంగా సీపీని కలిసి నేరస్థులను త్వరగా పట్టుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. జాయింట్ సీపీ తఫ్సీర్ ఇక్బాల్, ఎస్‌బీ డీసీపీ అపూర్వారావు, సౌత్‌ఈస్ట్ జోన్ డీసీపీ చైతన్య కుమార్ ఉన్నారు.

## యువకుడి ఆత్మహత్య



కమలేష్ (ఫైల్)

**మూసాపేట:** అనుమానాస్పదంగా ఓ యువకుడు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన కూకట్‌పల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన మేరకు.. మహారాష్ట్ర, గంగలవాడి గ్రామానికి చెందిన కమలేష్ భరత్ (28) మూడు నెలల క్రితం నగరానికి వచ్చి సెంట్రింగ్ పని చేస్తున్నాడు. మూసాపేటలోని పటేల్ నగర్‌లో నివాసముంటున్నాడు. ఈ నెల 5న ఉదయం భరత్ తండ్రి వాసుదేవ్‌కు సెంట్రింగ్ మేస్త్రీ కుమారుడు ఫోన్ చేసి కమలేష్ చనిపోయాడని చెప్పాడు. మూసాపేటకు వచ్చి చూడగా భరత్ ఉరి వేసుకొని చనిపోయి ఉన్నాడు. కూకట్‌పల్లి పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## అమెరికాలో రోడ్డు ప్రమాదం.. చంచల్‌గూడ నివాసి మృతి



సిరాజ్ మొతీబ్ మహ్మద్ (ఫైల్)

**చాదర్‌ఘాట్:** అమెరికాలోని చికాగో ఇవన్‌స్టంగ్ ప్రాంతంలో నివాసముంటున్న చంచల్‌గూడకు చెందిన సిరాజ్ మొతీబ్ మహ్మద్ (25) రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. స్థానికులు తెలిపిన మేరకు.. కుటుంబ సభ్యులు పది సంవత్సరాల క్రితం అక్కడే సెటిలయినట్లు స్థానికులు తెలిపారు. వరుస సంఘటనలతో అమెరికాలో ఉంటున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురవుతున్నారు.

## చెరువులో పడి మహిళ మృతి



మానిక్కర్ ఆండాళు (ఫైల్)

**మోతీనగర్:** మతిస్థిమితం లేని ఓ మహిళ సున్నం చెరువులో పడి మృతి చెందింది. ఈ సంఘటన అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ సామల వెంకట్‌రెడ్డి తెలిపిన మేరకు.. బోరబండ సైట్ 3లో మానిక్కర్ ఆండాళు (49) నివాసముంటోంది. ఈ నెల 4న బయటకు వెళ్లి తిరిగి రాలేదు. కుమారుడు నవీన్‌కుమార్ బంధువులు, మిత్రులు, పరిసర ప్రాంతాల్లో విచారించినా జాడ తెలియరాలేదు. దీంతో 5న బోరబండ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఆమె కోసం గాలించగా అల్లాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సున్నం చెరువులో ఆమె మృత దేహం లభించింది.

## వేడుకల్లో విషాదం.. చిన్నారి మృతి

**అమీర్‌పేట:** నూతన గృహ ప్రవేశ వేడుకల్లో అపశ్రుతి చోటు చేసుకుంది. విద్యుత్ షాక్‌తో ఓ చిన్నారి మృతి చెందింది. ఎస్‌ఆర్‌నగర్ పోలీసులు తెలిపిన మేరకు.. సనత్‌నగర్ ఉదయ్‌నగర్ కాలనీలో శ్రీరాములు భార్య మానస, కుమార్తెలు మేఘన(8),ప్రణవితో కలిసి ఉంటున్నాడు. సుభాష్‌నగర్‌లో ఉండే సమీప బంధువు వెంకటస్వామి గృహ ప్రవేశానికి శ్రీరాములు ఆదివారం కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లాడు.రాత్రి ఎనిమిది గంటల సమయంలో గ్రౌండ్ ఫ్లోర్‌లో భోజనాలు చేసేందుకు వెళ్లారు. ఆ సమయంలో ముగ్గురు పిల్లలు టెర్రస్‌పై ఆడుకుంటున్నారు. ప్రమాదవశాత్తు ఇంటి డెకరేషన్ లైట్ల తీగలు తాకి మేఘన స్పృహ కోల్పోయింది. వెంటనే సనత్‌నగర్‌లోని ప్రైయివేటు ఆసుపత్రికి తరలించారు. అయితే చిన్నారి అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు.

## డివైడర్ ఢీకొని వ్యక్తి మృతి



మృతి చెందిన దిలీప్‌కుమార్

**మల్లాపూర్:** స్నేహితుడి పుట్టిన రోజు వేడుకలకు వెళ్లి ద్విచక్ర వాహనంపై వస్తుండంగా డివైడర్‌ను ఢీ కొని ఓ వ్యక్తి మృతి చెందాడు.ఈ సంఘటన నాచారం పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రభాకర్‌రెడ్డి తెలిపిన మేరకు.. చెంగిచర్ల గణేష్‌నగర్ కాలనీకి చెందిన చేర్యాల హైమావతి చిన్న కుమారుడు దిలీప్‌కుమార్ (31) ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం స్నేహితుడి బర్త్‌డే వేడుకలకు వెళ్లాడు. ఇంటికి ఆలస్యంగా వస్తానని తల్లికి చెప్పాడు. సోమవారం తెల్లవారుజామున ఉదయం 4.25 ఐఐసీటీ గేటు వద్ద యాక్టీవాపై(టీఎస్08జీఏ9032) వస్తుండగా ఫుట్‌పాత్‌ను ఢీ కొట్టాడు. దీంతో దిలీప్ కుమార్ తలకు తీవ్ర గాయ కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు నమోదు చేసుకోని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ ఆస్పత్రికి తరలించారు.

## నగరంలో ఫేక్ డాక్టరేట్ల కలకలం

– నిందితుడి అరెస్ట్

**లక్డీకాపూల్ :** నకిలీ డాక్టరేట్ సర్టిఫికెట్లు ఇస్తున్న నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. రవీంద్రభారతి వద్ద పెద్దిటి యోహాన్‌ను వెస్ట్ జోన్ టాస్క్‌ఫోర్స్ పోలీసులు అరెస్ట్ చేశారు. సైఫాబాద్ పోలీసులు తెలిపిన మేరకు..గుంటూరు జిల్లా గురుజాలకి చెందిన పెద్దిటి యోహాన్ గుర్రం జాషువా స్మారక కళా పరిషత్ పేరిట గత కొంత కాలంగా డాక్టరేట్లు, అవార్డులు ప్రదానం చేస్తున్నారు. ఈ క్రమంలో ఏపీకి చెందిన కవులు, కళాకారులు, స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులతో వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేశాడు. ఆ గ్రూప్ ద్వారా డాక్టరేట్లు ఇస్తామని నమ్మించి ఒక్కొక్కరి వద్ద నుంచి రూ.15 వేల నుంచి రూ.20 వేలు తీసుకుంటున్నాడు. ఆదివారం సాయంత్రం రవీంద్రభారతిలో పలువురికి ఫేక్ డాక్టరేట్లను ప్రదానం చేశారు. సమాచారం మేరకు రంగంలోకి దిగిన టాస్క్ ఫోర్స్ పోలీసులు వలపన్ని యోహాన్‌ను అదుపులోకి తీసుకుని సైఫాబాద్ పోలీసులకు అప్పగించారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. యోహాన్‌పై చీటింగ్ కేసు నమోదు చేసినట్టు సైఫాబాద్ పోలీసులు తెలిపారు.

## 8 నుంచి అమృత ఉత్సవాలు



కార్యక్రమ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న దృశ్యం

**పంజగుట్ట:** ప్రపంచ శాంతి కోసం లోయర్‌ ట్యాంక్‌బండ్‌లోని ఎన్టీఆర్‌ స్టేడియంలో అమృత ఉత్సవాలను నిర్వహిస్తున్నట్లు కామాఖ్యామృత శోధన అధ్యక్షుడు కేవీవీ సతీష్‌ బాబు, సెక్రటరీ ప్రసన్నకుమార్‌ తెలిపారు. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం కరపత్రాన్ని వారు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. పూజ్య గురూజీ అమృతానందనాథ సరస్వతి వారి 10వ వార్షికోత్సవం సందర్భంగా మూడు రోజులపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 8న ఆనంద గళ లలితామృతం పేరుతో లక్ష మందితో సామూహిక లలితా సహస్రనామం, 9వ తేదీన వెయ్యి కిలోల 9 రంగుల పూలతో అష్టోత్తర సిరిజ్యోతి పూజ, 10వ తేదీన 1008 హోమ కుండాలతో, 10,008 భక్తులతో సామూహిక చండీహోమం నిర్వహించనున్నట్లు తెలిపారు. వివరాలకు ఫోన్‌: 91600 05430.

## అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యం



పాదయాత్ర నిర్వహిస్తున్న కాంగ్రెస్‌ నేత కంజర్ల విజయలక్ష్మి

**శ్రీనగర్‌కాలనీ:** బీఆర్‌ఎస్‌, బీజేపీ రెండూ ఒక్కటే అని, అభివృద్ధి, సంక్షేమం కాంగ్రెస్‌తోనే సాధ్యమని కాంగ్రెస్‌ మహిళా నేత కంజర్ల విజయలక్ష్మి అన్నారు. ఎర్రగడ్డ డివిజన్‌, షేక్‌పేట డివిజన్లలో సోమవారం పాదయాత్ర నిర్వహించారు. కాంగ్రెస్‌ అధికారంలోకి వచ్చాక అందించిన పథకాలను, అభివృద్ధి పనులను ప్రజలకు తెలియజేశారు. పదేళ్లుగా జరగని అభివృద్ధి కేవలం నెల రోజుల్లో జూబ్లీహిల్స్‌ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ చేసి చూపించిందని అన్నారు.

## పెట్రోల్‌ బంకు సమీపంలో కారు దగ్ధం



**బంజారాహిల్స్‌:** ఎర్రమంజిల్‌ భారత్‌ పెట్రోల్‌ బంకు వద్ద సోమవారం మధ్యాహ్నం 12 గంటల ప్రాంతంలో ఓ కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. పెట్రోల్‌ బంకు పక్కనే కారులో నుంచి పెద్ద ఎత్తున మంటలు రావడంతో వాహనదారులతో పాటు చుట్టుపక్కల నివాసితులు భయాందోళనతో బయటకు పరుగులు తీశారు. ఒక్కసారిగా కారులో నుంచి మంటలను చూసిన స్థానికులు ఉరుకులు, పరుగులతో బయటకు రావడంతో ఇక్కడ ట్రాఫిక పూర్తిగా స్తంభించిపోయింది.

## డీఆర్‌సీ కేంద్రం పరిశీలన

**వెంగళరావునగర్‌:** జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నికలకు సంబంధించి ప్రభుత్వ అధికారులు ఎన్నికల లెక్కింపు కేంద్రాన్ని సోమవారం సందర్శించారు. యూసుఫ్‌గూడ కోట్ల విజయభాస్కర్‌రెడ్డి ఇండోర్‌ స్టేడియంలోని డీఆర్‌సీ కేంద్రాన్ని పరిశీలించి, స్ట్రాంగ్‌ రూములు, పార్కింగ్‌ స్థలాలను పర్యవేక్షించారు. నగర ఎన్నికల అధికారి ఆర్‌.వి. కర్ణన్‌, రిటర్నింగ్‌ అధికారి, సికింద్రాబాద్‌ ఆర్‌డీఓ పి.సాయిరామ్‌, అసిస్టెంట్‌ ఎన్నికల అధికారులు జీహెచ్‌ఎంసి సర్కిల్‌–19 ఉప కమిషనర్‌ జి.రజినీకాంత్‌రెడ్డి, అసిస్టెంట్‌ మున్సిపల్‌ కమిషనర్‌ సయ్యద్‌ కమల్‌, అసిస్టెంట్‌ సిటీ ప్లానర్‌ ఎస్‌.ప్రసీద తదితరులు ఉన్నారు.

## ఫిలింనగర్‌లో బంగారు ఆభరణాల చోరీ

**ఫిలింనగర్‌:** ఇంటి తాళం పగలగొట్టి బంగారు ఆభరణాలతో పాటు నగదు తస్కరించిన ఘటన ఫిలింనగర్‌ పోలీస్‌ స్టేషన్‌ పరిధిలో చోటుచేసుకుంది. వివరాలు.. షేక్‌పేట సమీపంలోని ఓయూ కాలనీలో నివాసముండే చింతకుంట్ల స్వప్న భర్త చిరంజీవి రియల్‌ ఎస్టేట్‌ వ్యాపారం చేస్తుంటాడు. గత నెల 11వ తేదీన చిరంజీవి మృతి చెందగా అంత్యక్రియలు పూర్తయిన అనంతరం స్వప్న షేక్‌పేట్‌లోని తన అత్తగారి ఇంటికి తాళం వేసి వెళ్లింది. గత నెల 27వ తేదీన తన సోదరితో కలిసి ఓయు కాలనీలో ఇంటికి వచ్చి ఇల్లు శుభ్రం చేసి మళ్లీ అత్తగారింటికి వెళ్లింది. అన్ని కార్యక్రమాలు పూర్తయిన తర్వాత సోమవారం సాయంత్రం 5 గంటల సమయంలో తన ఇంటికి వచ్చిన స్వప్న ఇంటి తాళం పగలగొట్టి ఉంది. బీరువాలోని 43 తులాల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు కనిపించలేదు. ఫిలింనగర్‌ పోలీసులు కేసు నమోదు చేసుకొని ఘటనా స్థలంలో క్లూస్‌ టీం సహాయంతో ఆధారాలు సేకరించారు. సీసీ టీవీ ఫుటేజీలను పరిశీలిస్తున్నారు.

# సూసుడే తప్ప.. చేసుడు లేదా?

**శిథిలమై కూలేందుకు సిద్ధంగా ప్రభుత్వ ఆస్పత్రి**

- 15 ఏళ్లుగా నిర్మాణానికి నోచుకోని వైనం
- ప్రజాప్రతినిధులు, అధికారులకు స్థానికుల మొర
- పలుమార్లు వేడుకున్నా పట్టించుకునే వారే కరువు
- ఇప్పటికైనా స్పందించాలని వినతి



భూమిలో కూరుకుపోయిన బీజేఆర్‌ ప్రభుత్వ ఆస్పత్రి

**ఫిలింనగర్‌:** జూబ్లీహిల్స్‌ ఉప ఎన్నిక నేపథ్యంలో ఎలాగైనా గెలవాలనే లక్ష్యంతో అధికార కాంగ్రెస్‌ పార్టీ కోట్లాది రూపాయల వ్యయంతో రోడ్లు, డ్రైనేజీ నిర్మాణ పనులకు భారీగా నిధులు మంజూరు చేసి పనులు ప్రారంభించింది. అయితే ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల విషయంలో మాత్రం దృష్టిసారించడం లేదు. ముఖ్యంగా సర్కార్‌ బడులు, ఆస్పత్రులను అందుబాటులోకి తీసుకురావడంలో పూర్తిగా విఫలమై ప్రజల ఆగ్రహానికి గురవుతోంది. జూబ్లీహిల్స్‌ నియోజకవర్గం షేక్‌పేట డివిజన్‌ పరిధి కిందికి వచ్చే ఫిలింనగర్‌లోని బీజేఆర్‌నగర్‌ బస్తీని ఆనుకుని సుమారు 1500 గజాల విస్తీర్ణంలో 30 సంవత్సరాల క్రితం సర్కార్‌ దవాఖానాను నిర్మించారు. వరద, మురుగు కారణంగా పక్కనే ఉన్న కొత్త చెరువులో నుంచి వస్తున్న మురుగుతో ఈ ఆస్పత్రి నిండిపోయి శిథిలావస్థకు చేరింది. రోజు రోజుకూ ఆస్పత్రి నీట మునుగుతూ భూమిలోకి కూరుకుపోతుండటంతో 15 సంవత్సరాల క్రితం ఆస్పత్రిని మూసేసి అద్దె భవనంలోకి మార్చారు. అప్పటి నుంచి ఈ ఆస్పత్రి నిర్మాణ పనులకు దిక్కూ మొక్కూ లేకుండా పోయాయి. అప్పటి వైద్య ఆరోగ్య శాఖ మంత్రి, ఖైరతాబాద్‌ ఎమ్మెల్యే దానం నాగేందర్‌ ఈ ఆస్పత్రిని పునర్నిర్మిస్తామని, స్థానికులకు హామీ ఇచ్చారు. అయితే ఈ ఆస్పత్రి భవనం ఉన్న ప్రాంతం జూబ్లీహిల్స్‌ నియోజకవర్గం పరిధిలోకి వస్తుండటంతో అప్పటి ప్రజాప్రతినిధులు అడ్డుపుల్ల వేశారు. దీంతో అప్పటి నుంచి ఈ భవనం పూర్తిగా బురదలో కూరుకుపోయింది. ఐదేళ్ల క్రితం అప్పటి వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి హరీష్‌రావును కలిసిన స్థానికులు ఈ ఆస్పత్రి నిర్మాణం చేపట్టాలంటూ కోరగా ఆయన పెడచెవిన పెట్టారు.



మంత్రి వివేక్‌కు ఆస్పత్రి దుస్థితి గురించి వివరిస్తున్న బీజేఆర్‌నగర్‌ బస్తీవాసులు

**మంత్రి వివేక్‌ను ప్రశ్నించిన స్థానికులు..**

జూబ్లీహిల్స్‌ నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు జోరుగా శంకుస్థాపనలు చేయడంలో ముగ్గురు మంత్రులు పొన్నం ప్రభాకర్‌, తుమ్మల నాగేశ్వర రావు, వివేక్‌ వెంకటస్వామి క్షణం తీరికలేకుండా తిరుగుతున్నారు. రెండు రోజుల క్రితం మంత్రి వివేక్‌ వెంకటస్వామి శిథిలావస్థలో ఉన్న బీజేఆర్‌నగర్‌ సర్కార్‌ దవాఖానా సమీపంలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసేందుకు వచ్చారు. బీజేఆర్‌నగర్‌ బస్తీ ఎమ్మార్పీఎస్‌ నాయకుడు బస్తీ ఆస్పత్రి సంగతేమిటని మంత్రిని నిలదీశాడు. ఈ ఆస్పత్రి చుట్టూ ఉన్న ఐదు బస్తీలు జూబ్లీహిల్స్‌ నియోజకవర్గం కిందికి వస్తాయని, ఇక్కడ ఆస్పత్రిని నిర్మించాలంటూ మంత్రికి వివరించడంతో ఆస్పత్రి నిర్మాణంపై అధికారులతో సంప్రదిస్తానని ఆయన హామీ ఇచ్చారు.

**ఒకప్పుడు ప్రసవాలు కూడా జరిగేవి..**

బీజేఆర్‌నగర్‌లోని సర్కార్‌ దవాఖానా ఒకప్పుడు చుట్టుపక్కల ఉన్న బస్తీలకు చెందిన 20 వేల మంది వరకు అందుబాటులో ఉండేది. ఇక్కడ ప్రసవాలు కూడా నిర్వహించేవారు. నిత్యం రోగులతో కిక్కిరిసిపోయేది. 2010 సంవత్సరం వరకు ఈ ఆస్పత్రి స్థానికులకు అందుబాటులోనే ఉంది. ఆ తర్వాత నిర్లక్ష్యం కారణంగా శిథిలావస్థకు చేరింది. అప్పటి నుంచి ఎంపీలు, ఎమ్మెల్యేలు, మంత్రులు పట్టించుకున్న పాపానపోలేదు. సీఎం రేవంత్‌రెడ్డి నివాసానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ ఆస్పత్రి పునర్నిర్మాణంపై దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. సికింద్రాబాద్‌ ఎంపీ, కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పార్లమెంట్‌ పరిధిలో ఉండటంతో ఆయన సైతం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

## ఆత్మకూరి రామారావు స్కూల్‌కు ప్లాటినం మెడల్‌ అవార్డు



స్కూల్‌లో వెజిటెబుల్‌ గార్డెన్‌లో విద్యార్థులు

**ఫిలింనగర్‌:** పాఠశాల ప్రాంగణంలో పచ్చదనం పరిశుభ్రతను పెంపొందిస్తున్నందుకు విద్యార్థులను పర్యావరణంలో భాగస్వాములను చేస్తున్నందుకు గుర్తింపుగా జూబ్లీహిల్స్‌ రోడ్డు నంబర్‌–45లోని భారతీయ విద్యాభవన్‌ ఆత్మకూరి రామారావు స్కూల్‌కు జాతీయ స్థాయిలో ప్లాటినం మెడల్‌ విన్నర్‌–2025 సర్టిఫికెట్‌ లభించింది. క్లైమెట్‌ రియల్టీ ప్రాజెక్టు ఇండియా–సౌత్‌ ఏషియా నిర్వహించిన గ్రీన్‌ క్యాంపస్‌ ప్రోగ్రాంలో భాగంగా ఈ పాఠశాలను జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మక అవార్డు వరించింది. గ్రీనరీ సస్టైనబుల్‌ డెవలప్‌మెంట్‌ యాక్టివిటీస్‌లో ఈ పాఠశాల దేశంలోని అన్ని పాఠశాలలను వెనక్కినెట్టి ఈ అవార్డుకు ఎంపికైంది. క్యాంపస్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులు, యాజమాన్యం కలిపి మొత్తం 5 వేల మొక్కలు నాటారు. తులసీ గార్డెన్‌, వెజిటెబుల్‌ గార్డెన్‌ను విద్యార్థులే అంకిత భావంతో పెంచుతున్నారు. మామిడి, జామ, బొప్పాయి, స్టార్‌ఫ్రూట్‌ తదితర పండ్ల మొక్కలతో పాటు పూల మొక్కలు, అలంకరణ చెట్లు, చుట్టూ పచ్చదనం ఈ స్కూల్‌కు ప్రత్యేక గుర్తింపు తీసుకువచ్చింది. విద్యార్థులు పుట్టిన రోజు నాడు ప్రాంగణంలో తప్పనిసరిగా ఒక మొక్కను నాటే కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తున్నారని, తమకు ఈ అవార్డు లభించడం గర్వకారణంగా ఉందని స్కూల్‌ ప్రిన్సిపాల్‌ శ్రీలతానాయర్‌ తెలిపారు.

## అంజద్‌ అలీఖాన్‌ కళాశాలలో వర్క్‌షాప్‌



విద్యార్థులతో మాట్లాడుతున్న విశ్వవిద్యాలయాల ప్రతినిధులు

**బంజారాహిల్స్‌:** బంజారాహిల్స్‌ రోడ్డు నంబర్‌–3లోని అంజద్‌ అలీఖాన్‌ కాలేజ్‌ ఆఫ్‌ బిజినెస్‌ అడ్మినిస్ట్రేషన్‌ ప్రాంగణంలో సోమవారం ఐర్లాండ్‌కు చెందిన నేషనల్‌ యూనివర్సిటీ ఆఫ్‌ ఐర్లాండ్‌ మేనూత్‌ ఆధ్వర్యంలో సస్టైనబుల్‌ ఫైనాన్స్‌ అనే అంశంపై ఒక్కరోజు వర్క్‌షాపు నిర్వహించింది. ఎన్విరాన్‌మెంటల్‌ సోషల్‌ అండ్‌ గవర్నెన్స్‌ అనే కాన్సెప్ట్‌తో విద్యార్థులకు అవగాహన కల్పించారు. మేనూత్‌ యూనివర్సిటీ స్కూల్‌ ఆఫ్‌ బిజినెస్‌ అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ ఆఫ్‌ ఫైనాన్స్‌ డాక్టర్‌ శివం అగర్వాల్‌, అసోసియేట్‌ డీన్‌ డాక్టర్‌ ఇమ్మానుయేల్‌ గైప్రాయిస్‌ తదితరులు పాల్గొని విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. నగరంలోని 20 వేర్వేరు కళాశాలలకు చెందిన విద్యార్థులు ఈ వర్క్‌షాప్‌లో పాల్గొన్నారు.

## నవీన్‌ యాదవ్‌పై ఎన్నికల సంఘానికి ఫిర్యాదు



ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేస్తున్న బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు

**బంజారాహిల్స్‌:** జూబ్లీహిల్స్‌ నియోజకవర్గంలో కాంగ్రెస్‌ నేతలు ఓటరు కార్డులు పంచడం చట్టవిరుద్ధమని, వారిపై చర్యలు తీసుకోవాలని బీజేపీ ఎంపీ రఘునందన్‌రావు సోమవారం రాష్ట్ర ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదు చేశారు. జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్‌ నేతలు ఓటరు ఐడీ కార్డులు పంచే దుకాణం పెట్టుకున్నారని ఆయన అన్నారు. ఎన్నికల కమిషన్‌ చేతుల్లోకి రావాల్సిన ఓటరు కార్డులు కాంగ్రెస్‌ నేతల చేతుల్లోకి ఎట్లా వెళ్లాయన్నారు. బహిరంగంగా ఓటరు కార్డులను పంచుతుంటే ఎన్నికల కమిషన్‌ మాట్లాడదు.. జీహెచ్‌ఎంసీ కమిషనర్లు మాట్లాడరు అంటూ మండిపడ్డారు. కొత్త ఓటరు కార్డులను పంచుతున్న నవీన్‌యాదవ్‌ పోటీకి ఎలా అర్హుడని ప్రశ్నించారు. వెంటనే ఎన్నికల కమిషన్‌ చర్యలు తీసుకోవాలని కోరారు.

## కాలనీవాసుల సహకారంతోనే అభివృద్ధి

**వెంగళరావునగర్‌:** ఎక్కడ అభివృద్ధి జరగాలన్నా ఆ ప్రాంత ప్రజల సహకారం అవసరం అవుతుందని, అదేవిధంగా మధురానగర్‌కాలనీ మరింత అభివృద్ధి చేసేలా ప్రజలు సహకారం అందించాలని స్థానిక కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌, ప్రముఖ సినీ హాస్య దర్శకుడు రేలంగి నరసింహారావు తెలియజేశారు. వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని మధురానగర్‌కాలనీ 45వ వార్షికోత్సవ వేడుకలు స్థానిక సాగి రామకృష్ణంరాజు కమ్యూనిటీ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. కాలనీలో కమ్యూనిటీ హాల్‌, జిమ్‌, లైబ్రరీ, సీనియర్‌ సిటిజన్స్‌ హాల్‌ తదితర అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టిందని తెలియజేశారు. అయితే తాగునీరు, విద్యుత్‌ సమస్యలు కాలనీని వెంటాడుతున్నాయని పలువురు అన్నారు. నగరంలోనే మోడల్‌ కాలనీ అనే బిరుదును కూడా దక్కించుకుందన్నారు. కాలనీ అసోసియేషన్‌ ప్రస్తుత అధ్యక్షుడు మనోహర్‌రావు, కార్యదర్శి కోడె సాంబశివరావు, జాయింట్‌ సెక్రటరీ హనుమంతరావు, కోశాధికారి సుగుణ తదితరులు పాల్గొన్నారు.

## బాధ్యతగా వ్యవహరించాలి

**వెంగళరావునగర్‌:** ఆపత్కాల సమయంలో ప్రజలను ఆదుకోవడానికి శక్తివంచనా లేకుండా కృషి చేయాలని ఫస్ట్‌ బెటాలియన్‌ కమాండెంట్‌ మురళీకృష్ణ అన్నారు. యూసుఫ్‌గూడలోని టీజీఎస్‌పీ ఫస్ట్‌ బెటాలియన్‌ ప్రాంగణంలో తెలంగాణ స్టేట్‌ డిజాస్టర్‌ రెస్పాన్స్‌ ఫోర్స్‌, సీఆర్‌పీఎఫ్‌ నూతన దళానికి శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం ప్రారంభించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఇన్‌చార్జి కమాండెంట్‌ వీరయ్య, ఎస్‌ఓ రామకృష్ణ, టి.నరేందర్‌ సింగ్‌, అసిస్టెంట్‌ కమాండెంట్స్‌ రాంబాబు, కేవీపీ ప్రసాదరావు, అప్పారాయ్‌, నరసింహారావు, ఆర్‌ఐలు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలను పరిష్కరించాలని వినతి



వినతి పత్రం అందజేస్తున్న గేటెడ్‌ కమ్యూనిటీవాసులు

**శ్రీనగర్‌కాలనీ:** గేటెడ్‌ కమ్యూనిటీలకు వెళ్లే రహదారిని పునరుద్ధరించాలని, ఎర్రగడ్డ భరత్‌నగర్‌ బ్రిడ్జి నుంచి మోతీనగర్‌ వెళ్లే దారిలో వర్షంపడితే వాహనదారులు, పాదచారులు ఇబ్బందులు పడుతున్నారని, రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ కూడా సరిగా లేదని కల్పతరు గేటెడ్‌ కమ్యూనిటీ మాజీ అధ్యక్షుడు హనుమంతనాయుడు, మాజీ సెక్రటరీ సాయిప్రసాద్‌, తెలంగాణ రాష్ట్ర డెయిరీ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌ అమిత్‌రెడ్డి, తెలంగాణ ఉర్దూ అకాడమీ చైర్మన్‌ తాహిర్‌బిన్‌కు వివరించారు. బ్రిగేడ్‌ సిటాడెల్‌ ప్రెసిడెంట్‌ విష్ణువర్ధన్‌, సెక్రటరీ శ్రీకాంత్‌, మాజీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, వాసవి బృందావన్‌ ప్రెసిడెంట్‌ హనుమంతరావు, జనప్రియ అపార్ట్‌మెంట్స్‌ ప్రతినిధులు సోమవారం కలిసి సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. రోడ్లు, డ్రైనేజీ, సుందరీకరణ పనులు చేపట్టాలని కోరారు. నేతలు రవిగౌడ్‌, రమేష్‌నాయక్‌, మోసిన్‌, జీహెచ్‌ఎంసీ అధికారులు ఉన్నారు.

## జర్నలిస్టుల సమస్యలపై ఐక్యంగా పోరాడదాం



సమావేశంలో మామిడి సోమయ్య తదితరులు

**పంజగుట్ట:** రాష్ట్రంలో జర్నలిస్టుల హక్కుల సాధన, జర్నలిజం విలువల పరిరక్షణే ధ్యేయంగా పనిచేస్తున్న ఏకైక జర్నలిస్టు యూనియన్‌ తెలంగాణ వర్కింగ్‌ జర్నలిస్ట్స్‌ ఫెడరేషన్‌(టీడబ్ల్యూజేఎఫ్‌)లో తమ సంఘాన్ని విలీనం చేస్తున్నట్లు తెలంగాణ ఆల్‌ జర్నలిస్ట్స్‌ ఫెడరేషన్‌(టీఏజేఎఫ్‌) ప్రకటించింది. సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో సోమవారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో టీఏజేఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు వి.రఘురాం, ప్రధానకార్యదర్శి దత్తాత్రేయ రాజేందర్‌, జాతీయ కన్వీనర్‌ కూసం సారంగపాణి మాట్లాడుతూ.. 2020లో ఏర్పడిన తమ సంఘం రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో కమిటీలు ఏర్పడి జర్నలిస్టుల సమస్యలపై అధ్యయనం చేశామని తెలిపారు. ఇటీవల జర్నలిస్టుల సంఘాలు అనేకం పుట్టుకురావడం, కొన్ని యూనియన్లు పాలకుల పక్షాన చేరి జర్నలిస్టులను విస్మరించడం వల్ల ప్రభుత్వాలు కూడా జర్నలిస్టులను చిన్నచూపు చూస్తున్నాయని అన్నారు. టీడబ్ల్యూజేఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జర్నలిస్టులకు తీరని అన్యాయం జరిగిందని అన్నారు. కార్యక్రమంలో ఆనందం, జగన్‌, విజయ్‌ కుమార్‌, తన్నీరు శ్రీనివాస్‌, మధు, వెంకటస్వామి, గోపాల్‌, నాంపల్లి శ్రీనివాస్‌, సంజీవ్‌ తదితరులు పాల్గొన్నారు.

## దివాలీ స్పెషల్‌.. ఆక్రుతి ఎలైట్‌

**సాక్షి, సిటీబ్యూరో:** నగరంలోని హోటల్‌ తాజ్‌ క్రిష్ణా వేదికగా మూడు రోజుల పాటు కొనసాగే ఆక్రుతి ఎలైట్‌ దివాలీ స్పెషల్‌ ఎగ్జిబిషన్‌ సోమవారం ప్రారంభమైంది. ఈ ఎగ్జిబిషన్‌ను ఆక్రుతి ఎగ్జిబిషన్‌ డైరెక్టర్‌ శశినాథ ప్రారంభించారు.



## మార్వాడి గో బ్యాక్‌ జేఏసీ చైర్మన్‌గా పిడమర్తి రవి

**హిమాయత్‌నగర్‌:** రాష్ట్రంలో మార్వాడీలకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంలో భాగంగా సోమవారం బషీర్‌బాగ్‌ దేశోద్ధారక భవన్‌లో మార్వాడి గో బ్యాక్‌ జేఏసీ రాష్ట్ర కమిటీ నియామకం జరిగింది. జేఏసీ చైర్మన్‌గా డాక్టర్‌ పిడమర్తి రవిని 11 సంఘాలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నాయి. రాష్ట్ర కో–చైర్మన్‌గా కరాటే శ్రీహరి, కో–ఆర్డినేటర్‌గా డా.బొమ్మెర స్టాలిన్‌, బోరెల్లి సురేష్‌, ఉపాధ్యక్షులుగా అందే కృష్ణ, వర్కింగ్‌ ప్రెసిడెంట్లుగా సురేందర్‌ సన్నీ, పి.రాములు నేత, డా.మీసాల మల్లేష్‌, వైస్‌ చైర్మన్లుగా గజ్జల మల్లికార్జున్‌, మాడుగుల నరసింహ, గుర్రం కోటేష్‌, కార్యదర్శులుగా మాడుగుల శివ, నక్క రమేష్‌, జోగు గణేష్‌, శ్రీనివాస్‌ గౌడ్‌, సూర్యారావు, హైదరాబాద్‌ జిల్లా అధ్యక్షుడిగా చాగంటి శేఖర్‌, సికింద్రాబాద్‌ అధ్యక్షుడిగా కిషన్‌ యాదవ్‌ తదితరులను ఎన్నుకున్నారు.

## త్వరితగతిన రోడ్డు మరమ్మతులు

**వెంగళరావునగర్‌:** గుంతలు ఏర్పడ్డ సీసీ రోడ్లకు మరమ్మతులు చేయిస్తున్నట్లు స్థానిక కార్పొరేటర్‌ దేదీప్య విజయ్‌ తెలియజేశారు. వెంగళరావునగర్‌ డివిజన్‌ పరిధిలోని మధురానగర్‌కాలనీలో సీసీ రోడ్డు నిర్మాణ పనులను సోమవారం ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడుతూ నిరంతరం రద్దీగా ఉండే మధురానగర్‌ ప్రాంతాల్లో త్వరితగతిన రోడ్డు నిర్మాణ పనులను పూర్తి చేయాలని సూచించారు. దాంతో పాటు పనుల్లో ఎలాంటి నాణ్యత కొరవడినా సహించేది లేదన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ సీనియర్‌ నేతలు విజయ్‌కుమార్‌, మధురానగర్‌కాలనీ నేతలు కోడె సాంబశివరావు, మనోహర్‌రావు, హనుమంతరావు, సుగుణ పాల్గొన్నారు.



## 8వ నిజాంని ప్రతిబింబించే..

# ఛాయా చిత్ర ప్రదర్శన..

సాక్షి, సిటీబ్యూరో: నవాబ్ మీర్ బర్కత్ అలీ ఖాన్, ఎనిమిదవ ఆసఫ్ జా హైదరాబాద్ మాజీ నిజాం అయిన ముకర్రం జా బహదూర్ జన్మదినం సందర్భంగా చౌమహల్లా ప్యాలెస్‌లో ఆయన ఛాయాచిత్రాల ప్రదర్శన ఏర్పాటైంది. దీనిని ఆయన కుమారుడు తొమ్మిదో నిజాం హెచ్‌ఇహెచ్ అజ్మత్ జా బహదూర్ సోమవారం ప్రారంభించారు. ఈ ప్రత్యేక ప్రదర్శనలో, ముకర్రం జా బహదూర్ బాల్యం నుంచి జీవితాంతం వరకూ ఆయన ప్రయాణాన్ని ప్రతిబింబించే 250కి పైగా అరుదైన ఛాయాచిత్రాలు కొలువుదీరాయి. వీటిలో చౌమహల్లా ప్యాలెస్ ఆర్కైవ్స్ నుంచి సేకరించిన పత్రాలు, వ్యక్తిగత వస్తువులు, చారిత్రక రికార్డులు ఈ ప్రదర్శనలో చోటు చేసుకున్నాయి. ఈ కార్యక్రమానికి ఐఏఎస్ అధికారి జయేష్ రంజన్ వంటి ప్రముఖులతో పాటు, ప్రిన్సెస్ ఎస్రా జా, ప్రిన్సెస్ షెహకర్ జా, ప్రిన్సెస్ నీలోఫర్ జా తదితర రాజకుటుంబ సభ్యులు హాజరయ్యారు.



## ముగిసిన అలుమ్నీ గోల్ఫ్ టోర్నీ

- కోరుకొండ సైనిక్ స్కూల్‌కు చాంపియన్‌షిప్
- బౌల్డర్ హిల్స్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్‌లో నిర్వహణ



గచ్చిబౌలి: అత్యంత ఆసక్తిగా కొనసాగిన ఆర్వీ ఇంజినీరింగ్ సైనిక్ స్కూల్స్ అలుమ్నీ గోల్ఫ్ టోర్నమెంట్–2025 ఘనంగా ముగిసింది. గచ్చిబౌలిలోని బౌల్డర్‌హిల్స్ గోల్ఫ్ అండ్ కంట్రీ క్లబ్‌లో ఈ టోర్నమెంట్ నిర్వహించారు. ఉత్కంఠభరితమైన ఈ పోటీలో చాంపియన్‌గా సైనిక్‌స్కూల్ కొరుకొండ నిలిచింది. సైనిక్ స్కూల్ చిత్తోర్గఢ్ రన్నరప్‌గా నిలిచింది. ఆర్వీ ఇంజినీరింగ్ లిమిటెడ్ చైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ చంద్రశేఖర్ మోటూరు విజేతలకు చాంపియన్ ట్రోఫీలను అందించారు. గ్రోస్ కేటగిరి, టోర్నమెంట్‌లో ఉత్తమ గోల్ఫర్‌గా లెఫ్టినెంట్ కల్నల్ హేమంత్‌రాజ్ విజేత, రన్నరప్ కెప్టెన్ సుభాష్‌దాస్. ప్లాటినమ్ కేటగిరిలో కల్నల్ అరుణ్‌కుమార్, కల్నల్ ఇంద్రజిత్ సుహాగ్ మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. డైమండ్ కేటగిరిలో కమాండర్ ఎస్ గంగాధర్, కల్నల్ టీ సాంబయ్యలు, గోల్డ్ కేటగిరిలో కల్నల్ రాకేష్‌కుమార్, కెప్టెన్ సంజయ్‌కుమార్ మొదటి రెండు స్థానాల్లో నిలిచారు. ఈ టోర్నీలో ముగ్గురు మహిళా గోల్ఫర్లు కూడా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో స్టాల్వర్ట్స్ గోల్ఫ్ డైరెక్టర్ బ్రిగేడియర్(రిటైర్డ్) డివిసింగ్ పాల్గొన్నారు.

పురాతనమే అధునాతనం అవుతోంది. నాటి మేటి పనితనం నేటి ఆధునికుల ఆదరణ పొందుతోంది. పాతకాలపు వస్తువులు (యాంటిక్స్)కు నగరంలో భారీగా డిమాండ్ పెరిగింది. నవ్యతను కోరుకునే యువత నుంచి అలంకరణలో ప్రత్యేకత కోరుకునే గృహిణుల వరకు కొత్త తరం యాంటిక్స్‌పై ఆసక్తి పెంచుకుంటోంది. ఆన్‌లైన్ మార్కెట్లలో కూడా వింటేజ్ తన డిమాండ్‌ను పెంచుకుంటోంది. ఓల్డ్ ఈజ్ గోల్డ్ అన్న నానుడిని నిజం చేస్తూ అనేక మంది పాత తరం వస్తువులకు ప్రాధాన్యతనిస్తున్నారు. వాటిని కొనేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. అంతేకాదు వాటికి తమ ఇళ్లలో ప్రత్యేక స్థానాన్ని కల్పిస్తున్నారు. వాటిని అలంకరించుకోవడం స్టేటస్ సింబల్‌గా ఫీల్ అవుతున్నారు. - సాక్షి, సిటీబ్యూరో




# యాంటిక్.. కలెక్షన్ కిక్..

వింటేజ్ కార్ల నుంచి యాంటిక్ వస్తువుల వరకూ

- పాత స్టైల్స్‌కు దాసోహం అంటున్న కొత్త తరం
- వినియోగం కంటే అలంకరణకే ప్రాధాన్యం
- ఆన్‌లైన్‌తోనూ జోరందుకున్న యాంటిక్ సేల్స్

ఆధునిక ఫర్నిచర్, మెటల్ డెకర్‌లతో పాటు, గత కాలపు శైలిని ప్రతిబింబించే వస్తువులు ఇప్పుడు ఇంటి అలంకరణలో ప్రత్యేక స్థానం సంపాదిస్తున్నాయి. 'పాతదే కొత్త అందం' అనే ధోరణి ఇప్పుడు నగరంలో ఒక కొత్త ఫ్యాషన్‌గా వర్ధిల్లుతోంది. పాత వస్తువుల ప్రాధాన్యం పెరగడానికి యువతలో 'సస్టైనబుల్ డిజైన్' భావన పెరగడం కూడా ఒక కారణమని మార్కెట్ నిపుణుల అంచనా. ఇక కార్పొరేట్ ఉద్యోగులు, ప్రొఫెషనల్స్ తమ ఇళ్లకు 'వింటేజ్ టచ్' ఇవ్వడానికి ఎక్కువ ఆసక్తి చూపుతున్నారు. అలాగే నగరంలోని ఎగువ మధ్యతరగతి ఆలోచనల్లో మార్పుల కారణంగా వీటి కొనుగోలుదారుల సంఖ్య భారీగా పెరిగింది.



## ఓల్డ్‌లో వెరైటీలెన్నో..

వీటిలో నాణేలు, పాత గడియారాలు, కెమెరాలు, విక్టోరియా శైలి ల్యాంప్స్ మొదలైనవి డిమాండ్‌లో ఉన్నాయి. రాగి పాత్రలు, గడియారాలు, గ్లాస్ షో కేసులు, టేబుల్ ల్యాంప్స్, ఫోన్ సెట్లు, ఫొటో కెమెరాలు, నిజామీ కాలపు నాణేలు, ఫ్రేమ్ చేసిన చిత్రాలు, వెయిటేజ్ ఫర్నిచర్, సినిమా పోస్టర్లు, రికార్డ్ ప్లేయర్లు ఎక్కువగా కొనుగోలు చేస్తున్నారు. బిద్రీవేర్ వంటి కళాత్మక వస్తువులు ప్రత్యేకంగా కొనుగోలుదారులను ఆకట్టుకుంటున్నాయి.

గతంలో పాత వస్తువుల కొనుగోళ్లు ఎక్కువగా స్టోర్లలోనే జరిగేవి.. కానీ ఇప్పుడు సోషల్ మీడియా, ఫ్లిక్, ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్స్, ఫ్లీ మార్కెట్ల ద్వారా వీటి పరిధి భారీగా విస్తరించింది. దీని వల్ల స్థానిక కళాకారులు, చిన్న–సామాన్య విక్రేతలు కూడా మంచి మార్కెట్ పొందుతున్నారు. నగరంలో సెక్రటేరియట్ సమీపంలోని పురాతన వస్తువుల దుకాణాలు, చార్మినార్, సండే బజార్, బేగంపేట, బేగం బజార్, అబిడ్స్, బంజారాహిల్స్ వంటివి 'పాత' వ్యాపారాలకు కేంద్రాలుగా మారాయి.

### పెట్టుబడి మార్గంగానూ..

కాలక్రమంలో విలువ పెంచుకునే లక్షణం కలిగిన వింటేజ్ వస్తువులు, ఫర్నిచర్ కొనుగోలుదారులను ఆకర్షిస్తోంది. ఇంటి అలంకరణతో పాటు భవిష్యత్తులో విక్రయించి లాభాలు పొందొచ్చు అనే ఆలోచన కూడా వీటి విక్రయాలకు ఊపునిస్తోంది. సరైన గుర్తింపు, డాక్యుమెంటేషన్ ఉంటేనే, వస్తువు చరిత్ర తెలుసుకుని గానీ కొనుగోలు చేయొద్దని నిపుణులు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో కొందరు వస్తువుల వాస్తవికతను డిజిటల్ రికార్డుల ద్వారా నిర్ధారించుకుంటున్నారు. అలాగే రాబడులను అందించే చారిత్రక విలువ ఉన్న వస్తువులు సరైన రీతిలో సంరక్షించాలని నిపుణులు సూచిస్తున్నారు.





## డిజైన్‌లో కొత్త ట్రెండ్..

ఇంటీరియర్ డిజైనర్లు చెబుతున్న లెక్కల ప్రకారం.. పాత వుడ్ టేబుల్స్‌కి గ్లాస్ టాప్‌లతో కలిపి వినూత్నంగా మార్చడం, పాత లాంప్‌లను ఎల్ఈడీ లైట్లతో రీక్రియేట్ చేయడం వంటి ఫ్యూజన్ డిజైన్‌లు ఇప్పుడు సిటిజనులు అనుసరించే ఫ్యాషన్‌గా మారుతున్నాయి. ఇలాంటి వస్తువులు ఇల్లు మాత్రమే కాక, కెఫేలు, బొటిక్స్, ఆఫీసుల్లో కూడా ప్రత్యేకమైన వాతావరణాన్ని తీసుకొస్తున్నాయి.

## ధరలు ఇలా..

స్థానిక వ్యాపారులు చెబుతున్న దాని ప్రకారం, చిన్న బిద్రీవేర్ షోపీస్‌లు రూ.500, దీపాలు లేదా గడియారాలు రూ.5,000 నుంచి రూ.50,000 వరకూ వివిధ ధరల్లో అమ్ముడవుతున్నాయి. ప్రత్యేకంగా నిజామీ కాలం నాటి రాయల్ ఫర్నిచర్ లేదా ఇంగ్లాండ్ కాలం నాటి గడియారాలు ఉంటే వాటి ధరలు లక్షలు పలుకుతున్నాయి. అంతేకాకుండా, పాత సిల్వర్ ఆర్టిఫాక్ట్‌లు, గోల్డ్ ప్లేటెడ్ ఫ్రేమ్‌లు అంతర్జాతీయ మార్కెట్‌లో మంచి విలువ పొందుతున్నాయి.



# నో రిటైర్మెంట్.. ఓన్లీ రిఫ్రెష్‌మెంట్..

- 50 ఏళ్లు పైబడిన వారి కోసం 'ఖ్యాల్ 50 అబవ్ 50' కాంటెస్ట్
- ప్రతిభను వెలికితీయడానికి ప్రత్యేక కార్యక్రమాలు
- నగరంలో సీనియర్ సిటిజన్స్ మొట్టమొదటి ఆడిషన్స్

ఉద్యోగ విరమణ అనంతరం ప్రతి ఒక్కరి జీవితంలో నూతన అధ్యాయం మొదలవుతుంది. ఈ దశలో విశ్రాంతి తీసుకుంటూ, కుటుంబంతో సమయం గడుపుతూ, తమకు ఇష్టమైన పనులను ఆనందంగా కొనసాగిస్తారు. అయితే దేశంలో 50 ఏళ్లకు పైబడి ఉన్నవారిలో ఎంతో ప్రతిభవున్నప్పటికీ దానిని ప్రదర్శించడానికి సరైన వేదికలు, అవకాశాలు లేవు. ఈ నేపథ్యంలో వయసు అనే సరిహద్దులను దాటుతూ, సీనియర్ సిటిజన్స్ ప్రతిభను వెలికితీసేలా 50 ఏళ్లు పైబడిన వారికి కళాత్మక వేదిక అందించాలనే లక్ష్యంతో 'ఖ్యాల్ 50 అబౌవ్ 50' అనే వినూత్న వేదిక ప్రారంభించింది. నగరంతో పాటు దేశమంతటా ఖ్యాల్ కమ్యూనిటీ ఈ పోటీలు నిర్వహిస్తున్నారు. 2026 సంవత్సరానికి సంబంధించి మొదటి పోటీ హైదరాబాద్‌లోని 'అమేయా సోషల్' వేదికగా నిర్వహించారు.
- సాక్షి, సిటీ బ్యూరో



కళలు, క్రీడలు, వ్యాపారం, సాంకేతికత, సామాజిక అంశాలు.. ఇలా ఏ రంగానికి చెందిన వారైనా సరే, ఈ వేదికగా కొత్త సవాళ్లను స్వీకరిస్తూ, అంకితభావం, కళాత్మకతతో ఇతరులకు స్ఫూర్తినిచ్చే వారిని సత్కరిస్తుంది ఈ వేదిక. సరికొత్తగా రూపొందిన ఖ్యాల్ 50 అబవ్ 50 కాంటెస్ట్‌లో 50 ఏళ్లకు పైబడిన వారి ప్రతిభను ప్రపంచానికి చూపిస్తుంది. తమకు ఇష్టమైన రంగంలో పాల్గొనవచ్చని ఖ్యాల్ యాజమాన్యం చెబుతోంది. ఈ పోటీల్లో నగరం నుంచి విభిన్న రంగాలకు చెందిన సీనియర్ సిటీజన్స్ పాల్గొని పాటలు, వంటలు, నృత్యం, కథలు, చిత్రాలు వంటి కళలను ప్రదర్శించారు. ఈ ఆడిషన్స్‌లో సింగింగ్, యోగా, నటన వంటి సృజనాత్మక కళలతో ఆడిషన్స్‌లో పాల్గొన్నారు.

### నటినయ్యా.. కానీ సింగింగ్ ఇష్టం..

నాకు సింగింగ్ అంటే ఇష్టం. కానీ నటన పరంగా మంచి అవకాశాలు వచ్చాయి. గాయనిగా సరైన సమయంలో అవకాశాలు అందుకోలేదు. ఈ వేదిక గురించి ఫేస్‌బుక్‌లో తెలుసుకుని వచ్చా. నాకు నచ్చిన కళని ప్రదర్శించా. వ్యక్తిగత ఆశయాలు సాధించుకునే అద్భుత అవకాశంగా భావిస్తున్నా.
- మిర్చి మాధవి, సినీ నటి



### రూ.కోటి నగదు బహుమతులు..

50 ఏళ్లకు పైబడిన వారు తమ జీవితం అక్కడితో ముగిసిందని, ఇంటికే పరిమితం కాకూడదని, కలను నెరవేర్చుకునేందుకు ఈ సంస్థ ఏర్పాటైంది. హిమాన్షు జైన్, ప్రీతిష్ నెల్లెరి ఈ వేదికను స్థాపించారు. ఈ ఆడిషన్స్‌లో 500 మందిని ఎంపిక చేసి అందులో టాప్–10 విజేతలకు ప్రత్యేక బహుమతులు, మిగతా వారికి కన్సోలేషన్ బహుమతులు అందిస్తారు.
- ఎస్.రామ చంద్రన్, ఖ్యాల్ సౌత్ ఇండియా రీజినల్ హెడ్



### ఆరోగ్య కళ.. యోగా..

నేను యోగా సాధకురాలిని, శిక్షకురాలిని. ఆరు పదుల వయసులో యోగా ఒక కళగా ప్రదర్శించడానికి అద్భుతమైన వేదిక లభించింది. వ్యక్తిగత ఆరోగ్య సంరక్షణ, సామాజిక పరిరక్షణ అవసరమని ఈ వేదికలో భాగస్వామ్యం అయ్యా. ఈ వయసులో ఆరోగ్య సంరక్షణ గురించి తెలియజేసేలా అవకాశాన్ని వినియోగించుకుంటున్నా.
- రాజేశ్వరి (60), యోగా నిపుణురాలు



# యంత్రం.. సాగుకు తంత్రం..

- ఆధునికత వైపు రైతన్నల అడుగులు
- డ్రోన్లతో పంటలకు మందుల పిచికారి
- ఎకరాకు కేవలం పది నిమిషాల్లో పూర్తి
- టెక్నాలజీ బాటలో ఉమ్మడి శామీర్‌పేట రైతులు



యంత్రం.. సాగుకు తంత్రం అన్న విషయాన్ని ఉమ్మడి శామీర్‌పేట రైతులు గుర్తించారు. దీంతో వ్యవసాయానికి ఆధునిక టెక్నాలజీని ఉపయోగించి మేలైన దిగుబడులను రాబడుతున్నారు. ఎకరాకు గంటల సమయం పట్టే మందుల పిచికారీకి డ్రోన్ల సాయంతో కేవలం పది నిమిషాల్లోనే పూర్తిచేస్తున్నారు. అందుబాటులో ఉన్న టెక్నాలజీని అందిపుచ్చుకుంటున్నారు. దుక్కుల నుంచి మొదలు కోతల వరకూ అన్ని రకాల యంత్రాలు అందుబాటులో ఉన్నాయి. వరి నాట్లకు రైస్ ట్రాన్స్ ప్లాంటర్, డ్రమ్ సీడర్, మందు పిచికారీకి డ్రోన్‌లు, స్ప్రేయర్లు వంటివి వినియోగిస్తున్నారు. - శామీర్‌పేట

ఉమ్మడి శామీర్‌పేట మండలంలో రైతులు వరి, మొక్కజొన్న పంటలతోపాటు కూరగాయల సాగు పెరిగింది. అధిక వర్షాలకు పంట రంగు మారుతుండడంతో మందులు పిచికారీ చేయాల్సి వస్తోంది. అయితే కూలీల కొరత, పెరిగిన పెట్టుబడులతో రైతులకు ఇబ్బందులు తప్పడం లేదు. ఈ క్రమంలో కొంత మంది రైతులు డ్రోన్ల సహాయంతో పంటలకు మందులు పిచికారీ చేయిస్తున్నారు. కొంత మంది డ్రోన్లు అద్దెకు నడుపుతున్నారు. డ్రోన్లు ఎకరా పంటకు కేవలం పది నిమిషాల్లో పిచికారీ చేస్తున్నాయి. నేరుగా మొక్కలపై మందులను పిచికారీ చేయడంతో మందులు కూడా వృథా కావడం లేదు. ఇద్దరు, ముగ్గురు కూలీలు చేసే పని ఒక్క డ్రోన్ చేస్తుంది. దీంతో ఇటు సమయం .. ఆటు డబ్బు రెండూ ఆదా అవుతున్నాయని రైతులు చెబుతున్నారు.

### ఎకరాకు 10 నిమిషాలు..



డ్రోన్ సహాయంతో ఎకరా పంటకు 10 నిమిషాల్లో మందులు పిచికారి పూర్తవుతుంది. నేను నాలుగు ఎకరాల్లో వరి పంట సాగుచేస్తున్నాను. దీనికి యూరియా స్ప్రే చేయించాలంటే ఇద్దరు కూలీలు ఒక రోజంతా కష్టపడాలి. డ్రోన్ సాయంతో నాలుగు ఎకరాలకు గంటలో పూర్తిచేశాం. ఎకరాకు డ్రోన్ అద్దె రూ.400 చెల్లించాల్సి ఉంటుంది.
- సంజీవరెడ్డి, రైతు, అలియాబాద్

### డ్రోన్స్‌తో రైతులకు మేలు..

వ్యవసాయ పనులకు కూలీల కొరత ఏర్పడింది. పొరుగు జిల్లాతో పాటు ఇతర రాష్ట్రాల నుండి వలస కూలీలపై ఆధారపడాల్సి వస్తోంది. డ్రోన్ స్ప్రే ద్వారా ఎకరాకు 10 నిమిషాల్లో పూర్తవుతుంది. సమయం ఆదాతో పాటు కూలీల సమస్య తీరుతుంది. డ్రోన్ అద్దెకు తీసుకోవడంతో ఖర్చులు తగ్గుతాయి.



- రమేష్, వ్యవసాయ అధికారి, శామీర్‌పేట



## విద్యార్థులెవరూ సవాల్ చేయలేదు

- 'తెలుగు తప్పనిసరి'పై ఎలాంటి ఆదేశాలివ్వలేమన్న హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పాఠశాలల్లో దశల వారీగా తెలుగును ద్వితీయ భాషగా అమలు చేయడానికి సర్కార్ తీసుకున్న చర్యలను సవాల్ చేస్తూ ఒక్క విద్యార్థి కూడా పిల్‌లో ఇంప్లీడ్ కాలేదని హైకోర్టు సీజే ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ విద్యా సంవత్సరానికి 10వ తరగతి విద్యార్థులకు మినహాయింపు ఉందని, 9వ తరగతి విద్యార్థులకు కూడా మినహాయింపు ఇవ్వాలని ప్రభుత్వం ఆలోచిస్తోందని రాష్ట్రం తరఫు న్యాయవాది చెప్పారని వ్యాఖ్యానించింది. పలు ప్రైవేట్ స్కూళ్లకు చెందిన కొందరు విద్యార్థులు వేసిన రిట్ పిటిషన్ సింగిల్ జడ్జి వద్ద పెండింగ్‌లో ఉందని, దీనిపై ఇప్పటికే మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారన్నారు. ఈ విషయంలో ఎటువంటి అత్యవసర పరిస్థితి లేదని, ఎలాంటి తక్షణ ఆదేశాలు అవసరం లేదని అభిప్రాయపడింది. తదుపరి విచారణ ఆరు వారాలకు వాయిదా వేసింది. సీబీఎస్ఈ, ఐసీఎస్ఈ సహా అన్ని పాఠశాలల్లో తెలుగును ద్వితీయభాషగా తప్పనిసరి చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం 2024, డిసెంబర్‌లో ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను సవాల్ చేస్తూ హైదరాబాద్‌కు చెందిన ప్రమీలాపాఠక్ హైకోర్టులో ప్రజాప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలు చేశారు. ఈ పిల్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్ సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. 6వ తరగతికి తప్పనిసరిగా తెలుగును ప్రారంభించి.. తర్వాతి ఏడాదికి పెంచుతూ రావాలని పిటిషనర్ తరఫు న్యాయవాది బి.విష్ణువర్ధన్‌రెడ్డి వాదించారు. ఇతర భాషలు చదివిన వారికి తెలుగును ఒకేసారి చేర్చడంతో నష్టం వాటిల్లుతుందన్నారు. జనాభా లెక్కల ప్రకారం 42 శాతం మంది ఉర్దూ జనాభా ఉన్నారని చెప్పారు. కొందరు తల్లిదండ్రులు కోర్టును ఆశ్రయిస్తే తప్పనిసరిగా తెలుగును ద్వితీయభాషగా అమలు చేయాలని ఒత్తిడి తీసుకురావొద్దని సింగిల్ జడ్జి ఉత్తర్వులు జారీ చేసిన విషయాన్ని ధర్మాసనం దృష్టికి తెచ్చారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ రాహుల్‌రెడ్డి వాదనలు వినిపిస్తూ.. ప్రభుత్వ, అన్‌ఎయిడెడ్ సహా 80 శాతం ప్రైవేట్ పాఠశాలల్లో సర్కార్ ఉత్తర్వులు అమలవుతున్నాయని చెప్పారు. ఒకటి నుంచి 8వ తరగతి వరకు అమలవుతుండగా, 9, 10వ తరగతులకు 2024-25 ఏడాదికి, 10వ తరగతికి 2025-26 ఏడాదికి మినహాయింపు ఇచ్చినట్టు నివేదించారు. వాదనలను విన్న ధర్మాసనం.. తక్షణ ఆదేశాలు అవసరం లేదంటూ విచారణ వాయిదా వేసింది.

# ష్.. గుట్టు విప్పొద్దు!

## నకిలీ మద్యం కేసు పక్కదారి పట్టిస్తాం... మేం చూసుకుంటాం

### నకిలీ మద్యం రింగ్ లీడర్లను బుజ్జగిస్తున్న ఏపీ ప్రభుత్వ పెద్దలు

- జయచంద్రారెడ్డి, జనార్ధన్‌రావు గుప్పిట్లో దందా గుట్టు

సాక్షి, అమరావతి: బహుళ జాతి కూల్ డ్రింక్ కంపెనీలు ప్రపంచవ్యాప్తంగా తమ ఉత్పత్తుల కోసం ఫ్రాంచైజీలు ఇస్తాయి! ఆ కంపెనీలు కూల్ డ్రింక్ తయారీకి అవసరమైన మిశ్రమాన్ని సరఫరా చేస్తే... ఫ్రాంచైజీలు ఆ మిశ్రమంతో కూల్‌డ్రింకులు తయారు చేసి మార్కెట్‌లో విక్రయిస్తాయి. ఇలా తయారయ్యే ప్రతి బాటిల్‌పై ఫ్రాంచైజీలు కూల్ డ్రింక్ కంపెనీకి కమీషన్ చెల్లించాలి. ఇదీ వ్యాపారం..! సరిగ్గా అదే వ్యాపార సూత్రంతో ఏపీ ప్రభుత్వ పెద్దలు రాష్ట్రంలో నకిలీ మద్యం దందా సాగిస్తుండటం విభ్రాంతి కలిగిస్తోంది. కరకట్ట బంగ్లాకు 30 శాతం కమీషన్.. అంటే ఏడాదికి రూ.3వేల కోట్లు చెల్లించాలనే ఒప్పందం కుదరడంతో నకిలీ మద్యం ఫ్రాంచైజీ రాకెట్ రాష్ట్రవ్యాప్తంగా వేళ్లానుకుంది. చినబాబు అండదండలతో అన్నమయ్య జిల్లా తంబళ్లపల్లె టీడీపీ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, ఆయన ప్రధాన అనుచరుడు అద్దేపల్లె జనార్ధన్‌రావు నకిలీ మద్యం తయారీ ఫార్ములాను ఆఫ్రికా దేశాల నుంచి దిగుమతి చేయగా... టీడీపీ నేతల కుటుంబాలు ప్రాంతాలవారీగా ఆ ఫ్రాంచైజీలు తీసుకున్నాయి. ఏడాదిగా సాగుతున్న ఈ దందా ములకలచెరువులో వెలుగు చూసిన రాకెట్‌తో అనూహ్యంగా బయటపడింది. తమను ఈ కేసు నుంచి తప్పించకుంటే మొత్తం బండారం బయటపెడతామని జయచంద్రారెడ్డి, జనార్ధన్‌రావు బెదిరిస్తుండటంతో పెదబాబు, చినబాబు బెంబేలెత్తుతున్నారు. ఆ కేసు తప్పిస్తాం..! కంగారు పడొద్దు...! తమ గుట్టు విప్పొద్దని రాయబేరాలు సాగిస్తున్నారు.

### మమ్మల్ని కెలికితే... బండారం బయటపెడతా

ఈ నకిలీ మద్యం రాకెట్‌లో అడ్డంగా దొరికిన టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ జయచంద్రారెడ్డి, ఆయన వ్యాపార భాగస్వామి అద్దేపల్లి జనార్ధన్‌రావు ఎదురు తిరగడంతో ప్రభుత్వ పెద్దలు హడలిపోతున్నారు. ఈ కేసు నుంచి తమను బయటపడేయాలని, లేకపోతే రాష్ట్ర స్థాయిలో సాగుతున్న నకిలీ మద్యం దందా గుట్టును బహిర్గతం చేస్తామని



ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నంలో టీడీపీ నేత పెట్టిన ప్లాంటులోని నకిలీ మద్యం బాటిళ్లు

వారు తేల్చి చెప్పినట్లు సమాచారం. తామేమీ ప్రభుత్వ పెద్దలకు తెలియకుండా నకిలీ మద్యం తయారు చేయడం లేదు కదా? అని వారిద్దరూ నిలదీయడంతో పెదబాబు, చినబాబులకు నోట మాట రాలేదు! 'ఎన్నికల ముందు కుదిరిన ఒప్పందం ప్రకారం టీడీపీ అధికారంలోకి రాగానే రాష్ట్రస్థాయిలో నకిలీ మద్యం దందాను వ్యవస్థీకృతం చేశాం. అందుకు ఎంతో ఖర్చు పెట్టాం. ఈ రాకెట్‌ను మేం పర్యవేక్షిస్తున్నాం... కానీ అందులో చాలా మంది టీడీపీ పెద్దలు

### కరకట్ట బంగ్లా వాటా 30 శాతం...

ఏడాదిగా రాష్ట్రంలో జరుగుతున్న మద్యం విక్రయాల్లో మూడో వంతు నకిలీదేనని ఎక్సైజ్ శాఖ అనధికారికంగా వెల్లడిస్తుండటం గమనార్హం. ఆ విధంగా టీడీపీ కూటమి ప్రభుత్వం తొలి ఏడాదిలోనే రూ.5,280 కోట్ల మేర నకిలీ మద్యం అమ్మకాలు సాగాయి. మొత్తం అమ్మకాల్లో నకిలీ మద్యం వాటాను 50 శాతం దాటించాలన్నది ఈ సిండికేట్ లక్ష్యంగా పెట్టుకుంది. అంటే రానున్న నాలుగేళ్లలో ఏడాదికి రూ.10 వేల కోట్లు చొప్పున రూ.40 వేల కోట్లు కొల్లగొట్టేందుకు పన్నాగం వేసింది. అందులో 30 శాతం అంటే రూ.12 వేల కోట్లు కరకట్ట నివాసానికి కమీషన్‌గా చెల్లించాలన్నది ఒప్పందం. ప్రాంతాలవారీగా పర్యవేక్షిస్తున్న టీడీపీ సీనియర్ నేతలకు 50 శాతం, మద్యం దుకాణాలు, బార్లు నిర్వహిస్తున్న టీడీపీ సిండికేట్‌కు 20 శాతం వాటా దక్కనుంది.

### నకిలీ మద్యం భారీ డంపు

- ఇబ్రహీంపట్నంలో రెండు చోట్ల పెద్ద ఎత్తున పట్టుబడ్డ బాటిళ్లు, తయారీ యంత్రాలు
- ఉమ్మడి కృష్ణా, కోస్తా జిల్లాల్లోని వైన్స్, బెల్ట్ షాపులకు సరఫరా
- స్థానిక ప్రజా ప్రతినిధి అండదండతో జనావాసాల్లోనే యథేచ్ఛగా తయారీ
- జనార్ధన్ బార్‌ను సీజ్ చేసిన ఎక్సైజ్ శాఖ

వివరాలకు ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి

ఉన్నారు కదా..! అంతకంటే పెద్దలకు కమీషన్లు వెళ్తున్నాయి కదా..?'అని జయచంద్రారెడ్డి, జనార్ధన్‌రావు ఉమ్మడి చిత్తూరు జిల్లాకు చెందిన ఓ టీడీపీ సీనియర్ ప్రజాప్రతినిధి ద్వారా కబురు పంపినట్లు విశ్వసనీయ సమాచారం.

### మిమ్మల్ని మేం చూసుకుంటాం... నోరెత్తొద్దు

నకిలీ మద్యం దందా బండారం మొత్తం బయటపెడతామని జయచంద్రారెడ్డి, జనార్ధన్‌రావు బెదిరించడంతో పెదబాబు, చినబాబు షాక్ తిన్నారు. దాంతో తమకు సమాచారం ఇచ్చిన మధ్యవర్తుల ద్వారానే జయచంద్రారెడ్డి, జనార్ధన్‌రావులతో రాయబేరాలు సాగించారు. 'మీరు ఇప్పుడు మొత్తం గుట్టు విప్పితే మీకూ నష్టం... మాకూ నష్టం... పార్టీకి పూర్తిగా నష్టం.. ఎవరికి ప్రయోజనం ఉండదు..'అని సర్ది చెబుతున్నట్లు తెలుస్తోంది. 'అయినా అధికారంలో ఉన్నది మన ప్రభుత్వమే. కేసు దర్యాప్తు ముందుకు సాగకుండా చూస్తాం. మీవరకు రానివ్వకుండా పక్కదారి పట్టిస్తాం.. మీరేమీ ఆందోళన చెందవద్దు..'అని హామీ ఇచ్చినట్లు తెలుస్తోంది. అంతే కాదు.. ఈ నకిలీ మద్యం వ్యవహారంలో టీడీపీ నేతల ప్రమేయం లేదని వీడియో ద్వారా ప్రకటించాలని జనార్ధన్‌రావును చినబాబు ఆదేశించినట్లు పార్టీ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

### పెదబాబులో గుబులు.. చినబాబు బెంబేలు!

టీడీపీ నేతలు జయచంద్రారెడ్డి, జనార్ధన్‌రావు హెచ్చరికలతో పెదబాబు, చినబాబు బెంబేలెత్తుతున్నారు. ఏడాదిగా రాష్ట్రవ్యాప్తంగా తాము వ్యవస్థీకృతం చేసిన నకిలీ మద్యం రాకెట్ వెనుక గూడుపుఠాణి బట్టబయలవుతుందని ఆందోళన చెందుతున్నారు. అసలు ఈ మొత్తం దందా చినబాబు అండదండలతోనే సాగుతోంది. ఆయనకు సన్నిహితుడైన అన్నమయ్య జిల్లాకు చెందిన ప్రభుత్వ కీలక నేత ఈ నకిలీ మద్యం రాకెట్‌కు సమన్వయకర్తగా వ్యవహరిస్తున్నారు. ఆ కీలక నేతకు సన్నిహితులైన జయచంద్రారెడ్డి, జనార్ధన్‌రావు, కట్టా సురేంద్రబాబు ఆఫ్రికా దేశాల్లో అనుసరించే నకిలీ మద్యం తయారీ విధానాన్ని రాష్ట్రంలోకి తీసుకొచ్చారు. చినబాబు ఆదేశాలతో ఆయనకు సన్నిహితులైన టీడీపీ నేతలను వ్యాపార భాగస్వాములుగా చేసుకున్నారు. రాష్ట్రాన్ని ప్రాంతాలవారీగా పంచుకుని నకిలీ మద్యం దందా సాగిస్తున్నారు. జయచంద్రారెడ్డి, జనార్ధన్‌రావు ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా నకిలీ మద్యం తయారీ యూనిట్లను నెలకొల్పారు. అన్నమయ్య జిల్లాకు చెందిన కీలక నేత రాయలసీమలో... నర్సీపట్నానికి చెందిన సీనియర్ నేత కుటుంబం ఉత్తరాంధ్రలో... రెవెన్యూ, పోలీసు అధికారులపై దాడులకు దిగిన చరిత్ర కలిగిన ఏలూరు జిల్లాకు చెందిన వివాదాస్పద ఎమ్మెల్యే ఉమ్మడి గోదావరి జిల్లాల్లో... బాపట్ల జిల్లా కీలక నేత ఉమ్మడి కృష్ణా, గుంటూరు జిల్లాలో.. జయచంద్రారెడ్డి స్వయంగా రాయలసీమలో నకిలీ మద్యం రాకెట్‌ను నిర్వహిస్తున్నారు. టీడీపీ సిండికేట్ ఆధ్వర్యంలోని మద్యం దుకాణాలు, బెల్ట్ దుకాణాలు, బార్లలో యథేచ్ఛగా నకిలీ మద్యాన్ని విక్రయిస్తున్నారు.

## ఉద్యోగులకు మీరు ఇచ్చిన హామీలు ఏమిటి..? చేస్తున్నది ఏమిటి..?

- తీపితీపి మాటలతో వారికి అరచేతిలో వైకుంఠం చూపి... ఇప్పుడు మోసం చేస్తారా?
- ఉద్యోగులకు సీఎం చంద్రబాబు చేసిన మోసాలపై వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ ఆగ్రహం



సాక్షి, అమరావతి: ఎన్నికలకు ముందు ఉద్యోగులకు మీరు ఇచ్చిన హామీలు ఏమిటి? ఇప్పుడు మీరు చేస్తున్నదేమిటి? అంటూ సీఎం చంద్రబాబునాయుడును వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు, మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నిలదీశారు. తీపితీపి మాటలతో ఉద్యోగులకు అరచేతిలో వైకుంఠం చూపి... తీరా ఇప్పుడు వారిని మోసం చేస్తారా? రోడ్డు మీద నిలబెడతారా? ఇందుకేనా మీరు అధికారంలోకి వచ్చింది? అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. పీఆర్సీ బకాయిలు, పెండింగ్ డీఏలు, జీపీఎఫ్, ఏపీజీఎల్ఐ, మెడికల్ రీయింబర్స్‌మెంట్, రిటైర్మెంట్ బెనిఫిట్స్, సరెండర్ లీవ్స్ లేదా ఎన్‌క్యాష్‌మెంట్ లీవ్‌ల కింద ఉద్యోగులకు దాదాపు రూ.31 వేల కోట్ల బకాయిలు పెట్టారని ఎత్తిచూపారు. తమకు రావాల్సిన వాటి కోసం ఉద్యోగులు ఎదురుచూస్తున్నా ప్రభుత్వం ఒక్క పైసా కూడా ఇవ్వకపోవడంతో వారందరూ నరకయాతన అనుభవిస్తున్నారని వైఎస్ జగన్ ఆవేదన వ్యక్తం చేశారు. మీరు పెట్టే బాధలు భరించలేకే ఇప్పుడు ఉద్యోగులంతా రోడ్డు మీదకు వస్తున్నారంటూ సీఎం చంద్రబాబుపై నిప్పులు చెరిగారు. ఉద్యోగులకు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో చేసిన మేళ్లను.. ఎన్నికలకు ముందు చంద్రబాబు ఇచ్చిన హామీలను జత చేస్తూ, చంద్రబాబు చేసిన మోసాలను ప్రశ్నిస్తూ తన 'ఎక్స్'ఖాతాలో సోమవారం వైఎస్ జగన్ పోస్టు చేశారు.

## ప్రధాన న్యాయమూర్తిపై దాడి కలచివేసింది

### 'ఎక్స్' వేదికగా ఖండించిన మాజీ సీఎం వైఎస్ జగన్

సాక్షి, అమరావతి: సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్‌పై జరిగిన అవమానకరమైన దాడి ఘటన తనను తీవ్రంగా కలచివేసిందని మాజీ సీఎం, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. సామాజిక మాధ్యమం 'ఎక్స్'వేదికగా సోమవారం ఆయన స్పందిస్తూ ఈ దాడి ఘటనను తీవ్రంగా ఖండించారు. 'ఇది ఒక వ్యక్తిపై జరిగిన దాడి మాత్రమే కాదు. మన అత్యున్నత న్యాయ వ్యవస్థ గౌరవానికి జరిగిన అవమానం. మన న్యాయ సంస్థల సమగ్రతను కాపాడుకోవడంలో మనం ఐక్యంగా నిలబడాలి. పరిణతి, బాధ్యతతో ప్రవర్తించాలి'.. అని జగన్ తెలిపారు.

## కౌంటర్ వేస్తారా.. జరిమానా విధించాలా?

- 'ఉస్మానియా' తరలింపుపై హెచ్ఎండీఏకు హైకోర్టు ఆదేశం
- కౌంటర్ వేసేందుకు 2 వారాలు గడువిచ్చిన సీజే ధర్మాసనం



సాక్షి, హైదరాబాద్: ఉస్మానియా జనరల్ ఆస్పత్రిని గోషామహల్ స్టేడియానికి తరలించే పనులపై కౌంటర్ వేస్తారా.. లేక జరిమానా విధించాలా? అని హైదరాబాద్ మెట్రో డెవలప్‌మెంట్ అథారిటీ (హెచ్ఎండీఏ)పై హైకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. రెండు వారాలు గడువు ఇస్తున్నామని, ఆలోగా కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది. ఉస్మానియా ఆస్పత్రిని గోషామహల్‌కు తరలించడాన్ని సవాల్ చేస్తూ స్థానికుడు జి.రాము హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌పై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్ కుమార్ సింగ్, జస్టిస్ మోహియుద్దీన్ ధర్మాసనం సోమవారం విచారణ చేపట్టింది. పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది ఎల్. రవిచందర్ వాదనలు వినిపిస్తూ.. స్టేడియం, అక్కడి భూమిని వైద్యారోగ్య శాఖకు బదిలీ చేయడం చట్టవిరుద్ధమని పిటిషనర్ తరఫు న్యాయవాది పేర్కొన్నారు. గత నెల 26లోగా కౌంటర్ దాఖలు చేయాలని కోర్టు హెచ్ఎండీఏను ఆదేశించినా ఇప్పటివరకు చేయలేదన్నారు. ప్రభుత్వం తరఫున స్పెషల్ జీపీ ఆడెపు దివ్య హాజరయ్యారు. వాదనలు విన్న ధర్మాసనం.. రెండు వారాల్లో కౌంటర్ దాఖలు చేయాలని హెచ్ఎండీఏను ఆదేశిస్తూ, విచారణను వాయిదా వేసింది.


నగర వార్తలు

### నగరంలో నేడు

- బంజారాహిల్స్ రోడ్ నెం.1లోని హోటల్ తాజ్ కృష్ణాలో ఆకృతి ఎలైట్ నిర్వహిస్తున్న లైఫ్‌స్టైల్ ఎగ్జిబిషన్ ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్ గ్యాలరీలో శివోహం పేరిట కళాకారిణి శిల్పా కాను వేసిన చిత్రాల ప్రదర్శన ఉదయం 10.30 నుంచి రాత్రి 7 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్‌లోని శిల్పారామంలో ఏర్పాటు చేసిన హస్తకళా మ్యూజియం ఉదయం 10.30 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.
- మాదాపూర్ శిల్పారామం సమీపంలోని ఇందిరా మహిళా శక్తి బజార్‌లో చేనేత ఉత్పత్తుల ప్రదర్శన ఉదయం 11 నుంచి రాత్రి 8 గంటల వరకు అందుబాటులో ఉంటుంది.

గ్రేటర్ సిటీ నలుమూలలా ప్రతిరోజూ నిర్వహించే ఈవెంట్ల వివరాలను ఒక రోజు ముందే మాకు పంపండి. 'సాక్షి' ఎంగేజ్‌మెంట్ కాలం (నగరంలో నేడు)లో ప్రచురిస్తాం. మీ ఈవెంట్ల వివరాలను sakshiupdates123@gmail.comకు మెయిల్ చేయగలరు.

### 10 నుంచి హైటెక్స్‌లో నరెడ్కో ప్రాపర్టీ షో



సమావేశంలో నరెడ్కో రాష్ట్ర అధ్యక్షుడు విజయసాయి తదితరులు

బంజారాహిల్స్: హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో 15వ నరెడ్కో తెలంగాణ ప్రాపర్టీ షో-2025ను ఈ నెల 10 నుంచి 12వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ తెలంగాణ అధ్యక్షుడు విజయసాయి మేకా, సెక్రటరీ జనరల్ కె.శ్రీధర్‌రెడ్డి తెలిపారు. బంజారాహిల్స్‌లోని హయత్ ప్లేస్ హోటల్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. ఈ ప్రదర్శన కస్టమర్ల అవసరాలను తీర్చడానికిగాను నివాస, కార్యాలయ, వాణిజ్య, రిటైల్ వాణిజ్యంసహా ఆస్తులను ప్రదర్శిస్తుందని అన్నారు. డెవలపర్లు, ప్రభుత్వ విభాగాలు, నిర్మాణ సామగ్రి సరఫరాదారులు, ఆర్థిక సంస్థలు ఈ ప్రాపర్టీ షోలో తమ ఉత్పత్తులు, ఆధునిక సాంకేతికతలను ప్రదర్శించనున్నాయని పేర్కొన్నారు. రియల్ ఎస్టేట్‌లో పెట్టుబడులకు నగరం అత్యంత ఆకర్షణీయమైన గమ్యస్థానాల్లో ఒకటిగా నిలిచిందన్నారు. ఈ ప్రాపర్టీ షో గృహ కొనుగోలుదారులకు విభిన్న అవసరాలను తీర్చే విస్తృత శ్రేణి ఆస్తులను ఒకచోట చేరుస్తుందని తెలిపారు.

## కార్పొరేట్‌కు దీటుగా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్

### ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల భవనం ప్రారంభోత్సవంలో మంత్రి కోమటిరెడ్డి

పంజగుట్ట: రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం నడుస్తోందని, ప్రతి ఒక్కరికీ ప్రాథమిక విద్య, ప్రాథమిక వైద్యం అందించడమే లక్ష్యంగా ముందుకు సాగుతోందని రాష్ట్ర రోడ్లు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. తాము ఎన్నికల్లో హామీ ఇవ్వకున్నా రూ.20 వేల కోట్లతో కార్పొరేట్‌కు దీటుగా ఇంటిగ్రేటెడ్ పాఠశాలల ఏర్పాటుకు కృతనిశ్చయంతో ఉన్నామని, ఇప్పటికే 50 పాఠశాలల టెండర్ ప్రక్రియ పూర్తయిందని అన్నారు. ఎర్రమంజిల్‌లో నిర్మించిన ఎర్రమంజిల్ ప్రభుత్వ పాఠశాల నూతన భవనాన్ని ఆయన సోమవారం రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్, ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్, హైదరాబాద్ కలెక్టర్ హరిచందన, డిప్యూటీ మేయర్ శ్రీలతారెడ్డి, ఖైరతాబాద్ కార్పొరేటర్ పి.విజయారెడ్డి, నిమ్స్ డైరెక్టర్ డాక్టర్ బీరప్పలతో కలిసి ప్రారంభించారు. గతంలో ఈ పాఠశాల ఉన్న స్థలాన్ని నిమ్స్ అభివృద్ధికి కేటాయించారు. నిమ్స్‌కు కొత్త భవనాలు నిర్మిస్తున్న మెఘా ఇంజనీరింగ్ సంస్థ ఈ పాఠశాలకు బంజారాహిల్స్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పక్కనే ఉన్న ఖాళీ స్థలంలో అత్యాధునిక భవనం నిర్మించింది. ఈ సందర్భంగా మంత్రి కోమటిరెడ్డి మాట్లాడుతూ 'మంచి స్కూల్ వచ్చిందని సంతోషపడటమే కాదు, హరిచందన మాదిరిగా కలెక్టర్‌గా ఎందుకు కాకూడదనే పెద్దపెద్ద ఆలోచనలు విద్యార్థులకు ఉండాలి'అని అన్నారు. ఎర్రమంజిల్ పాఠశాలలోని అన్ని తరగతుల్లో డిజిటల్ క్లాస్ రూంలు, ఏసీలు ఏర్పాటు చేయించి కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా తీర్చిదిద్దుతామని చెప్పారు.



పాఠశాల భవనం ప్రారంభిస్తున్న మంత్రి కోమటిరెడ్డి, ఎంపీ, ఎమ్మెల్యే, కలెక్టర్

### 31న సనత్‌నగర్ టిమ్స్ ప్రారంభం

సనత్‌నగర్ టిమ్స్‌ను అక్టోబర్ 31వ తేదీన ప్రారంభిస్తామని, అత్యాధునిక వైద్య పరికరాలు సమకూరుస్తున్నామని మంత్రి కోమటిరెడ్డి తెలిపారు. అల్వాల్ ఆసుపత్రి వచ్చే సంవత్సరం మార్చి నాటికి, ఎల్‌బీనగర్ ఆసుపత్రి కూడా జూన్ నాటికి అందుబాటులోకి వస్తుందని చెప్పారు. నిమ్స్ ఆసుపత్రిలో రెండు వేల కోట్ల రూపాయలతో అత్యాధునిక టవర్స్ నిర్మిస్తున్నామని, వచ్చే డిసెంబర్‌లోపు వాటిని ప్రారంభిస్తామని, వరంగల్ ఆసుపత్రిని ఈ సంవత్సరం డిసెంబర్ లోగా అందుబాటులోకి తీసుకువస్తామని అన్నారు. ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ మాట్లాడుతూ తన ఎంపీ నిధుల నుంచి ఈ పాఠశాలకు వాటర్‌ప్లాంట్ అందించేందుకు రూ.25 లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమానికి 1975 నాటి పూర్వవిద్యార్థులు హాజరై మంత్రితో ఫొటోలు దిగారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## జీవో 9కి రాజ్యాంగపరంగా బలమైన ఆధారాలు

### హైకోర్టులో కేసు వేసిన ఆర్.కృష్ణయ్య

ముషీరాబాద్: బీసీల 42 శాతం రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ వేసిన కేసును సవాల్ చేస్తూ రాజ్యసభ సభ్యుడు, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య సోమవారం హైకోర్టులో కేసు వేశారు. ఈ కేసు ఈ నెల 8న విచారణకు రానుంది. ప్రముఖ న్యాయవాది, మాజీ అడ్వకేట్ జనరల్ ప్రసాద్ వాదించనున్నారు. 42 శాతం రిజర్వేషన్లు పెంపు జీవో నంబర్ 9కు బలమైన ఆధారాలు ఉన్నాయని, ఇది వరకు వచ్చిన జీవోలకు, దీనికి చాలా తేడా ఉందని, దీనికి రాజ్యాంగపరంగా, చట్టపరంగా, న్యాయపరంగా బలమైన ఆధారాలు ఉన్నాయని ఆర్.కృష్ణయ్య తెలిపారు. 42 శాతం బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా సుప్రీం కోర్టులో వంగా గోపాల్‌రెడ్డి వేసిన కేసును కొట్టివేయడం పట్ల ఆర్.కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. బీసీ రిజర్వేషన్లను వ్యతిరేకిస్తూ కేసు వేసి తోటి సోదరులైన బీసీలను అవమానపరచొద్దని ఆర్.కృష్ణయ్య కోరారు. 1990లో మండల కమిషన్ ఉద్యమం సందర్భంగా రిజర్వేషన్లు వ్యతిరేకించిన వారికి ఏ గతి పట్టిందో ఒకసారి చరిత్ర తెలుసుకోవాలని, రిజర్వేషన్లు వ్యతిరేకించే వారిని తరిమికొట్టినట్లు తెలిపారు. రిజర్వేషన్లను వ్యతిరేకించేవారిని గ్రామాల్లో తిరగకుండా వెళ్లగొట్టాలని పిలుపునిచ్చారు. సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షులు గుజ్జ కృష్ణ, కోలా జనార్దన్, రామకోటి, అంజి, సతీష్, వరప్రసాద్ యాదవ్, అభిగౌడ్, రాకేష్, అశీష్‌గౌడ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్.కృష్ణయ్య

## 8న ఎంబీఏ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ స్పాట్ అడ్మిషన్స్

బంజారాహిల్స్: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ 2025-26 విద్యా సంవత్సరానికిగాను ఎంబీఏ (హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్), హాస్పిటల్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ కోర్సుల్లో చేరేందుకు ఈ నెల 8వ తేదీన ఉదయం 10.30 గంటలకు అడ్మిషన్ల కౌన్సెలింగ్ జూబ్లీహిల్స్ క్యాంపస్‌లో నిర్వహిస్తామని విద్యార్థి సేవల విభాగం డైరెక్టర్ డాక్టర్ వై.వెంకటేశ్వర్లు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కౌన్సెలింగ్ అడ్మిషన్ కోసం దరఖాస్తు చేసుకునేవారు 2025-26 తెలంగాణ ఐసెట్ గానీ, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఓపెన్ వర్సిటీ నిర్వహించిన ఎంబీఏ/ఎంబీఏ హాస్పిటల్ హెల్త్‌కేర్ మేనేజ్‌మెంట్ సీఈటీలోగానీ తప్పనిసరిగా ఉత్తీర్ణత సాధించాలన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఉదయం 10.30 గంటల వరకు విద్యార్థి సేవల విభాగంలో సంప్రదించాలన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ. బీఆర్ఏఓయూఆన్‌లైన్.ఇన్ వెబ్‌సైట్‌లో (ఎంబీఏ, హెచ్‌హెచ్‌సీఎం) దరఖాస్తును రిజిస్ట్రేషన్ చేసుకుని ఒరిజినల్ సర్టిఫికెట్‌తో హాజరుకావాలని సూచించారు. మరిన్ని వివరాల కోసం 040-23680280లో సంప్రదించాలన్నారు.

### జీహెచ్ఎంసీ ప్రజావాణికి 157 విన్నపాలు

లక్డీకాపూల్: జీహెచ్ఎంసీ వ్యాప్తంగా నిర్వహించిన 'ప్రజావాణి'కి మొత్తం 157 ఫిర్యాదులు, వినతులు వచ్చాయి. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో సోమవారం జరిగిన ప్రజావాణి కార్యక్రమానికి 70 విన్నపాలు, జీహెచ్ఎంసీ పరిధిలోని ఆరు జోన్లలో మొత్తం 87 అర్జీలు వచ్చాయి. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలోని ప్రజావాణికి టౌన్ ప్లానింగ్ విభాగానికి 32, ఇంజనీరింగ్ 26, రెవెన్యూ 5, హెల్త్ అండ్ శానిటేషన్ 3, యు.బి.డి 2, యు.సి.డి, స్పోర్ట్స్ విభాగాలకు ఒక్కొక్కటి చొప్పున ఫిర్యాదులు అందాయి. ప్రజావాణిలో ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులు, వినతులను స్వీకరించిన జీహెచ్ఎంసీ అధికారులు సత్వర పరిష్కారం నిమిత్తం సంబంధిత విభాగాల అధికారులకు అందజేశారు. కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్లు రఘుప్రసాద్, వేణుగోపాల్, సుభద్రాదేవి, అలివేలు మంగతాయారు, సీసీపీ శ్రీనివాస్, మెయింటెనెన్స్ చీఫ్ ఇంజనీర్ సహదేవ్ రత్నాకర్, ఇరిగేషన్ సీఈ నిత్యానంద, అడిషనల్ సీసీపీలు ప్రదీప్, రంజిత్ పాల్గొన్నారు.

### పీజీ, పీహెచ్‌డీ ప్రవేశాల గడువు పొడిగింపు

ఏజీ వర్సిటీ: ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయంలో 2025-2026 విద్యా సంవత్సరానికి (రెగ్యులర్, ప్రత్యేక కోటా) పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశాల దరఖాస్తు గడువు పొడిగించినట్లు రిజిస్ట్రార్ విద్యాసాగర్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 6 వరకున్న గడువును 12వ తేదీ వరకు పొడిగించినట్లు పేర్కొన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని, పూర్తి వివరాల కోసం వర్సిటీ వెబ్‌సైట్‌ను చూడాలని సూచించారు.

## ఆర్ట్‌గ్యాలరీ నిర్వహణను మెరుగుపర్చాలి

### సమీక్ష సమావేశంలో మంత్రి జూపల్లి



మాదాపూర్: ఆర్ట్ గ్యాలరీని సమర్థవంతంగా వినియోగించుకోవాలని, దాని నిర్వహణను మరింత మెరుగుపరచాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు అన్నారు. మాదాపూర్‌లోని చిత్రమయి స్టేట్ ఆర్ట్‌గ్యాలరీ, సాంస్కృతిక కళాసారథి కార్యకలాపాలపై సోమవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆర్ట్ గ్యాలరీని మరింత ప్రాచుర్యంలోకి తీసుకురావడానికి సమగ్ర ప్రణాళిక సిద్ధం చేయాలన్నారు. చిత్రకారులు, కళాకారులు దీనిని మరింత సద్వినియోగం చేసుకునేలా, కళాప్రియులు, ప్రజలు, పర్యాటకులు ఎక్కువగా సందర్శించేలా ప్రత్యేక కార్యక్రమాలు, ప్రదర్శనలు, ఈవెంట్లు నిర్వహించాలని దిశానిర్దేశం చేశారు. కళాకారుల సేవలకు గౌరవం ఇవ్వడం ప్రభుత్వ ధర్మమని, అందుకోసం అవసరమైన కన్సల్టెంట్ నిపుణుల సేవలను వినియోగించుకోవాలని కోరారు. ఈ సందర్భంగా మంత్రి ఆర్ట్ గ్యాలరీ, సాంస్కృతిక కళాసారథి కార్యాలయాలను సందర్శించారు. సమావేశంలో ఆర్ట్ గ్యాలరీ డైరెక్టర్ డాక్టర్ కె.లక్ష్మి, భాషా, సాంస్కృతిక శాఖ డైరెక్టర్ నరసింహారెడ్డి, సాంస్కృతిక కళాసారథి చైర్‌పర్సన్ వెన్నెల గద్దర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎన్నికల్లో సెక్టార్ అధికారుల పాత్ర కీలకం

### జీహెచ్ఎంసీ కమిషనర్ కర్ణన్

లక్డీకాపూల్: ఎన్నికల ప్రక్రియలో పాయింట్ ఆఫ్ కాంటాక్ట్ పర్సన్లుగా సెక్టార్ అధికారుల పాత్ర అత్యంత కీలకమని, వారు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. జూబ్లీహిల్స్ అసెంబ్లీ ఉప ఎన్నిక నేపథ్యంలో నియోజకవర్గానికి సంబంధించిన సెక్టార్ అధికారుల శిక్షణ కార్యక్రమాన్ని సోమవారం జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయంలో నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ సెక్టార్ అధికారులు తమ పరిధిలోని అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల్లో ఈసీఐ మార్గదర్శకాల ప్రకారం తాగునీరు, లైటింగ్, ఫ్యాన్లు, మరుగుదొడ్లు, సరైన విద్యుత్ ఏర్పాట్లు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నిక్కచ్చిగా విధులు నిర్వర్తించాలని సూచించారు. సాయంత్రం జీహెచ్ఎంసీ హెడ్ ఆఫీస్ పన్వర్ హాల్‌లో ఎన్నికల నోడల్ అధికారుల సమావేశం నిర్వహించారు. ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా ఉప ఎన్నిక జరిగేలా పర్యవేక్షించాలని సూచించారు. కార్యక్రమంలో జోనల్ కమిషనర్లు అనురాగ్ జయంతి, హేమంత్ కేశవ్ పాటిల్, అపూర్వ చౌహాన్, హేమంత్ సహదేవరావు, రవి కిరణ్, ఎంసీసీ నోడల్ అధికారి నరసింహారెడ్డి, చీఫ్ హార్టికల్చర్ ఆఫీసర్ సునంద, విద్యుత్ శాఖ ఈఈ మమత తదితరులు పాల్గొన్నారు.

## గాంధీ ఏఆర్‌టీ సెంటర్ సేవలు భేష్

### 360 డిగ్రీ రివ్యూ చేసిన నాకో ఉన్నతాధికారులు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీ ఆస్పత్రిలోని యాంటిరిట్రోవల్ థెరఫీ(ఏఆర్‌టీ) సెంటర్ అందిస్తున్న సేవలు బేషుగ్గా ఉన్నాయని నేషనల్ ఎయిడ్స్ కంట్రోల్ ఆర్గనైజేషన్(నాకో) ఉన్నతాధికారులు కితాబు ఇచ్చారు. నాకో డిప్యూటీ డైరెక్టర్ జనరల్ డాక్టర్ తంజిమ్ డికిడ్, న్యూఢిల్లీ అధికార ప్రతినిధి డాక్టర్ రాజీవ్ తివారీ నేతృత్వంలో ప్రత్యేక బృందం సోమవారం గాంధీ ఏఆర్‌టీ సెంటర్‌ను సందర్శించింది. ఏఆర్‌టీ సెంటర్‌లో రోగులకు అందిస్తున్న వైద్యసేవలు, టెస్టింగ్, ఎడ్యుకేషన్, కౌన్సెలింగ్, సీఓఈ, ఐసీటీసీ, ఓఎస్టీ, డీఎస్ఆర్‌సీ, ఎస్‌టీడీ క్లినిక్, పీపీటీసీ తదితర అంశాలపై 360 డిగ్రీ రివ్యూ చేసి సంతృప్తి వ్యక్తం చేసింది. హెచ్ఐవీ సంబంధిత వ్యాధులు, తీసుకోవాల్సిన ముందుజాగ్రత్తలు, గాంధీ ఏఆర్‌టీ సెంటర్‌లో అందిస్తున్న వైద్యసేవలను గాంధీ ఆసుపత్రి అధికారులు వారికి వివరించారు. అనంతరం ఆసుపత్రి సూపరింటెండెంట్ ప్రొఫెసర్ వాణి, సీఓఈ డిప్యూటీ ప్రోగ్రామ్ డైరెక్టర్ డాక్టర్ దీపక్, గాంధీ జనరల్ మెడిసిన్ హెచ్ఓడీ ప్రొఫెసర్ సునీల్ కుమార్, మెడికల్ ఆఫీసర్ డాక్టర్ రాధిక అవిశెట్టి తదితరులతో సమీక్ష సమావేశం నిర్వహించి రోగులకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. కార్యక్రమంలో తెలంగాణ ఎయిడ్స్ కంట్రోల్ సొసైటీ (టీజీ సేక్స్) ప్రతినిధులు సరస్వతి, సంజీవ్, శ్రీకాంత్, గాంధీ ఆర్ఎంఓ-1 శేషాద్రి, జనరల్ మేనేజర్ సంతోష్ వెంకటరమణ, అసిస్టెంట్ జనరల్ మేనేజర్ శివరామ్‌రెడ్డి, దిశ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



గాంధీ ఆసుపత్రి పాలనాయంత్రాంగంతో సమీక్ష నిర్వహిస్తున్న నాకో ఉన్నతాధికారులు

# స్పోర్ట్స్



## ఫైనల్లో హుసాముద్దీన్

భారత బాక్సింగ్ సమాఖ్య (బీఎఫ్ఐ) కప్ టోర్నమెంట్‌లో సర్వీసెస్‌కు ప్రాతినిధ్యం వహిస్తున్న తెలంగాణ బాక్సర్ మొహమ్మద్ హుసాముద్దీన్ (60 కేజీలు) ఫైనల్లోకి దూసుకెళ్లాడు. చెన్నైలో సోమవారం జరిగిన సెమీఫైనల్లో హుసాముద్దీన్ 5-0తో మితేశ్ దేశ్వాల్ (రైల్వేస్)పై విజయం సాధించాడు. 55 కేజీల విభాగంలో ఆసియా క్రీడల స్వర్ణ పతక విజేత అమిత్ పంఘాల్ (సర్వీసెస్)కు చుక్కెదురైంది. సెమీఫైనల్లో అమిత్ 1-4తో సర్వీసెస్‌కే చెందిన ఆశిష్ చేతిలో ఓడిపోయాడు.



## హృతిక్ శుభారంభం

ఫెనెస్టా ఓపెన్ జాతీయ టెన్నిస్ చాంపియన్‌షిప్ అండర్-16 బాలుర సింగిల్స్ విభాగంలో హైదరాబాద్ ప్లేయర్ హృతిక్ కటకం శుభారంభం చేశాడు. న్యూఢిల్లీలో సోమవారం జరిగిన తొలి రౌండ్‌లో ఆరో సీడ్ హృతిక్ 6-2, 6-1తో రుద్రా బాథమ్ (మధ్యప్రదేశ్)పై గెలుపొందాడు. 70 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో హృతిక్ తన ప్రత్యర్థి సర్వీస్‌ను ఐదుసార్లు బ్రేక్ చేశాడు. గత వారం న్యూఢిల్లీలోనే జరిగిన జాతీయ చాంపియన్‌షిప్‌లో అండర్-18 సింగిల్స్‌లో హృతిక్ రన్నరప్‌గా నిలిచాడు.

## భారత్ బోణీ

గువాహటి: ప్రపంచ జూనియర్ బ్యాడ్మింటన్ మిక్స్‌డ్ టీమ్ చాంపియన్‌షిప్‌లో ఆతిథ్య భారత జట్టు గెలుపు బోణీ కొట్టింది. గ్రూప్ 'హెచ్'లో భాగంగా సోమవారం జరిగిన తొలి లీగ్ మ్యాచ్‌లో భారత్ 45-18, 45-17తో నేపాల్ జట్టును ఓడించింది. భారత్‌తోపాటు 14 సార్లు చాంపియన్ చైనా, మాజీ విజేతలు దక్షిణ కొరియా, ఇండోనేసియా జట్లు కూడా తొలి లీగ్ మ్యాచ్‌ల్లో విజయం సాధించాయి. 'బెస్ట్ ఆఫ్ త్రీ రిలే స్కోరింగ్' కొత్త ఫార్మాట్‌లో మిక్స్‌డ్ టీమ్ మ్యాచ్‌లను నిర్వహిస్తున్నారు. ప్రతి మ్యాచ్‌లో 45 పాయింట్లతో కూడిన మూడు సెట్‌లు ఉంటాయి. రెండు సెట్‌లు గెలిచిన జట్టుకు విజయం ఖాయమవుతుంది. ప్రతి సెట్‌లో పురుషుల సింగిల్స్, డబుల్స్, మహిళల సింగిల్స్, డబుల్స్, మిక్స్‌డ్ డబుల్స్ మ్యాచ్‌లను నిర్వహిస్తారు.

## ముంబై మెటియోర్స్ గెలుపు

సాక్షి, హైదరాబాద్: ప్రైమ్ వాలీబాల్ లీగ్ (పీవీఎల్) నాలుగో సీజన్‌లో ముంబై మెటియోర్స్ జట్టు ఖాతాలో వరుసగా రెండో విజయం చేరింది. గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో సోమవారం జరిగిన మ్యాచ్‌లో ముంబై మెటియోర్స్ 15-9, 15-8, 15-12తో డిఫెండింగ్ చాంపియన్స్ కాలికట్ హీరోస్‌ను బోల్తా కొట్టించింది. ఈ లీగ్‌లో కాలికట్ హీరోస్‌కిది వరుసగా రెండో ఓటమి కావడం గమనార్హం. ముంబై ఆటగాడు అమిత్ గులియా నిలకడగా రాణించి 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు గెల్చుకున్నాడు.

## కాకతీయ నైట్స్ తొలి విజయం

న్యూఢిల్లీ: ఆర్చరీ ప్రీమియర్ లీగ్‌లో కాకతీయ నైట్స్ టీమ్ గెలుపు బోణీ చేసింది. సోమవారం జరిగిన పోరులో కాకతీయ జట్టు 75-75, 75-70, 73-75, 77-75 స్కోరుతో చోళా చీఫ్స్‌పై విజయం సాధించింది. కాకతీయ టీమ్ తరఫున వెన్నం జ్యోతిసురేఖ, నికో మెరుగైన ప్రదర్శన కనబర్చగా... చీఫ్స్ తరఫున తరుణ్‌దీప్ రాయ్, యాదవ్ ఆకట్టుకున్నారు. మరో మ్యాచ్‌లో రాజ్‌పుతానా రాయల్స్ షూటాఫ్‌లో చేరో ఆర్చర్స్‌ను ఓడించింది. 69-74, 77-74, 77-76, 74-77తో స్కోరు 4-4తో సమం కావడంతో 'షూటాఫ్' అనివార్యమైంది. వరుసగా ఐదో గెలుపుతో రాయల్స్ తమ అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. మరో మ్యాచ్‌లో మైటీ మరాఠాస్ 6-2తో పృథ్వీరాజ్ యోధాస్‌ను చిత్తు చేసింది.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

# మెరిసిన దక్షిణాఫ్రికా

### 6 వికెట్లతో న్యూజిలాండ్‌పై ఘన విజయం

- బ్రిట్స్ సెంచరీ, రాణించిన లూస్
- ఎంలాబాకు నాలుగు వికెట్లు
- గురువారం భారత్‌తో దక్షిణాఫ్రికా పోరు

**వన్డే ప్రపంచకప్‌లో దక్షిణాఫ్రికా మహిళల జట్టు తమ స్థాయికి తగ్గ ప్రదర్శనను కనబర్చింది. తొలి మ్యాచ్‌లో ఇంగ్లండ్ చేతిలో అనూహ్యంగా 69 పరుగులకే కుప్పకూలి తీవ్ర విమర్శలపాలైన సఫారీ టీమ్ వెంటనే కోలుకుంది. టోర్నీ ఫేవరెట్‌లలో ఒకటైన న్యూజిలాండ్ జట్టును ఓడించి టోర్నీలో గెలుపు బోణీ చేసింది. బౌలింగ్‌లో ఎంలాబా ప్రదర్శనకు తోడు బ్యాటింగ్‌లో తజ్మీన్ బ్రిట్స్ సెంచరీ, సూన్ లూస్ కీలక ఇన్నింగ్స్ కలిపి జట్టుకు విజయాన్ని అందించాయి.**


తజ్మీన్ బ్రిట్స్

ఇండోర్: మహిళల వన్డే వరల్డ్ కప్‌లో దక్షిణాఫ్రికా కీలక విజయాన్ని అందుకుంది. బలమైన జట్లలో ఒకటైన న్యూజిలాండ్... సఫారీ సమష్టి ప్రదర్శన ముందు తలవంచింది. సోమవారం జరిగిన ఈ పోరులో దక్షిణాఫ్రికా 6 వికెట్ల తేడాతో కివీస్‌ను ఓడించింది. టాస్ గెలిచి ముందుగా బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ 47.5 ఓవర్లలో 231 పరుగులకు ఆలౌటైంది. అనంతరం దక్షిణాఫ్రికా 40.5 ఓవర్లలో 4 వికెట్లకు 234 పరుగులు సాధించి గెలిచింది. ఈ టోర్నీలో న్యూజిలాండ్‌కిది వరుసగా రెండో ఓటమి. దక్షిణాఫ్రికా తమ తర్వాతి మ్యాచ్‌లో గురువారం విశాఖపట్నంలో భారత్‌తో తలపడుతుంది. అంతర్జాతీయ కెరీర్‌లో 350వ మ్యాచ్ ఆడిన కివీస్ ఓపెనర్ సుజీ బేట్స్ ఈ ఘనత సాధించిన తొలి మహిళా క్రికెటర్‌గా నిలిచింది. అయితే దురదృష్టవశాత్తూ ఈ మైలురాయి మ్యాచ్‌లో ఇన్నింగ్స్ తొలి బంతికే (0) వెనుదిరిగింది. అయితే ఆ తర్వాత మూడు భాగస్వామ్యాలతో కివీస్ జట్టు కోలుకుంది. జార్జియా ప్లిమ్మర్ (68 బంతుల్లో 31; 4 ఫోర్లు), అమేలియా కెర్ (42 బంతుల్లో 23; 4 ఫోర్లు) రెండో వికెట్‌కు 44 పరుగులు జోడించారు. ఆ తర్వాత కెప్టెన్ సోఫీ డివైన్ (98 బంతుల్లో 85; 9 ఫోర్లు) ముందుండి ఇన్నింగ్స్‌ను నడిపించింది. డివైన్ మూడో వికెట్‌కు అమేలియాతో 57 పరుగులు, నాలుగో వికెట్‌కు బ్రూక్ హాలిడే (37 బంతుల్లో 45; 6 ఫోర్లు)తో 86 పరుగులు జత చేసింది. అయితే తర్వాతి బ్యాటర్లంతా విఫలం కావడంతో కివీస్ సాధారణ స్కోరుకే పరిమితమైంది. 44 పరుగుల తేడాతో కివీస్ జట్టు చివరి 7 వికెట్లు చేజార్చుకుంది. దక్షిణాఫ్రికా లెఫ్టార్మ్ స్పిన్నర్ నాన్‌కులులెకో ఎంలాబా (4/40) ప్రత్యర్థిని దెబ్బ తీసింది. అనంతరం ఛేదనలో దక్షిణాఫ్రికా కెప్టెన్ లారా వోల్‌వార్ట్ (14) ఆరంభంలోనే అవుటైంది. అయితే 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' తజ్మీన్ బ్రిట్స్ (89 బంతుల్లో 101; 15 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీతో చెలరేగి జట్టు విజయానికి బాటలు వేసింది. బ్రిట్స్, సూన్ లూస్ (114 బంతుల్లో 83 నాటౌట్; 10 ఫోర్లు, 1 సిక్స్) రెండో వికెట్‌కు 170 బంతుల్లో 159 పరుగులు జోడించి జట్టును గెలుపునకు చేరువగా తీసుకొచ్చారు. ఆ తర్వాత బ్రిట్స్‌తో పాటు మరిజాన్ కాప్ (14), అనెక్ బాష్ (0) తక్కువ వ్యవధిలో అవుటైనా... లూస్ అజేయంగా నిలిచి విజయం పూర్తి చేసింది.




**350** న్యూజిలాండ్ ప్లేయర్ సుజీ బేట్స్‌కు ఇది 350వ అంతర్జాతీయ మ్యాచ్. అత్యధిక మ్యాచ్‌లు ఆడిన జాబితాలో బేట్స్ అగ్ర స్థానంలో ఉండగా... ఆ తర్వాత వరుసగా హర్మన్‌ప్రీత్ కౌర్ (342), ఎలైస్ పెరీ (341), మిథాలీ రాజ్ (333), చార్లెట్ ఎడ్వర్డ్స్ (309) ఉన్నారు. ఇదే మ్యాచ్‌లో కివీస్ కెప్టెన్ సోఫీ డివైన్ 300 అంతర్జాతీయ మ్యాచ్‌లు పూర్తి చేసుకొని ఈ జాబితాలో డానీ వ్యాట్ (300)తో సమంగా ఆరో స్థానంలో నిలిచింది.

| ప్రపంచకప్‌లో నేడు |
| --- |
| ఇంగ్లండ్ X బంగ్లాదేశ్ |
| వేదిక: గువాహటి |
| మధ్యాహ్నం 3 గంటల నుంచి |
| స్టార్ స్పోర్ట్స్, హాట్ స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం |

# విశాఖ స్టేడియంలో మిథాలీ స్టాండ్

### ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ నిర్ణయం



సాక్షి, విశాఖపట్నం: భారత మహిళా క్రికెట్ దిగ్గజం, మాజీ కెప్టెన్ మిథాలీ రాజ్‌ను సముచిత రీతిలో గౌరవించేందుకు ఆంధ్ర క్రికెట్ అసోసియేషన్ (ఏసీఏ) సిద్ధమైంది. నగరంలోని ఏసీఏ-వీడీసీఏ స్టేడియంలో ఒక స్టాండ్‌కు మిథాలీ రాజ్ పేరు పెట్టనున్నారు. ఈ నెల 12న ఈ స్టేడియంలో భారత్, ఆస్ట్రేలియా మధ్య జరిగే ప్రపంచ కప్ మ్యాచ్ సందర్భంగా అధికారికంగా ఈ స్టాండ్‌ను ఆవిష్కరిస్తారు. 23 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో మిథాలీ 333 అంతర్జాతీయ మ్యాచ్‌లు ఆడింది. 232 వన్డేల్లో 7805 పరుగులు చేసిన మిథాలీ... ఈ ఫార్మాట్‌లో అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా కొనసాగుతోంది. వీటిలో 155 మ్యాచ్‌లకు ఆమె కెప్టెన్‌గా వ్యవహరించడం విశేషం. మిథాలీ మరో 12 టెస్టులు, 89 అంతర్జాతీయ టి20 మ్యాచ్‌లు కూడా ఆడింది. భారత క్రికెట్‌లో ఒక మహిళా క్రీడాకారిణి పేరుతో స్టాండ్ ఉండటం ఇదే మొదటిసారి కానుంది. 2022లో రిటైర్ అయిన 43 ఏళ్ల మిథాలీ ప్రస్తుతం క్రికెట్ వ్యాఖ్యాతగా కొనసాగుతోంది.

### రావి కల్పన పేరుతోనూ...



ఆంధ్రప్రదేశ్‌కు చెందిన మాజీ క్రికెటర్ రావి కల్పన పేరు కూడా ఇదే మైదానంలో మరో స్టాండ్‌కు పెట్టనున్నారు. వికెట్ కీపర్ అయిన కల్పన 2015-16 మధ్య భారత్ తరఫున 7 వన్డేలు ఆడింది. 29 ఏళ్ల కల్పన క్రికెట్ గణాంకాలు అసాధారణంగా లేకపోయినా ... అతి సాధారణ కుటుంబ నేపథ్యం నుంచి వచ్చి భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించే స్థాయికి ఆమె ఎదిగిన తీరు పలువురు మహిళా వర్ధమాన క్రికెటర్లకు స్ఫూర్తిగా నిలిచింది. దీనినే దృష్టిలో ఉంచుకొని ఆమె పేరుతో కూడా స్టాండ్ ఏర్పాటు చేస్తున్నారు. 2022లో అంతర్జాతీయ క్రికెట్‌కు వీడ్కోలు పలికిన కల్పన దేశవాళీ క్రికెట్‌లో ఆంధ్ర, రైల్వేస్ జట్లకు ప్రాతినిధ్యం వహించింది.



**వైజాగ్‌లో భారత జట్టు**
ఈనెల 9న దక్షిణాఫ్రికాతో, 12న ఆస్ట్రేలియాతో విశాఖపట్నంలో జరిగే ప్రపంచకప్ మ్యాచ్‌ల కోసం భారత జట్టు సోమవారం కొలంబో నుంచి వైజాగ్‌కు చేరుకుంది. కొలంబోలో ఆదివారం పాకిస్తాన్ జట్టుతో ఆడిన భారత జట్టు 88 పరుగుల తేడాతో ఘనవిజయం సాధించిన సంగతి తెలిసిందే.

# సాక్షి సినిమా

## మ్యాచ్ ఇప్పుడు స్టార్ట్ అవుద్ది!


నాగశౌర్య

'నువ్వు బ్యాడ్ బాయ్ అని చెప్పారు... కానీ స్మార్ట్ బాయ్‌లా ఉన్నావ్' అనే డైలాగ్‌తో ప్రారంభం అవుతుంది 'బ్యాడ్ బాయ్ కార్తీక్' సినిమా టీజర్. నాగశౌర్య హీరోగా నటించిన చిత్రం ఇది. ఇందులో కార్తీక్ పాత్ర పోషించారాయన. విధి యాదవ్ హీరోయిన్. రామ్ దేసినా (రమేష్) దర్శకత్వంలో శ్రీ వైష్ణవి ఫిల్మ్స్‌పై శ్రీనివాసరావు చింతలపూడి, విజయ కుమార్ చింతలపూడి, అశోక్ కుమార్ చింతలపూడి నిర్మించిన ఈ చిత్రం త్వరలో విడుదల కానుంది. కాగా ఈ సినిమా టీజర్‌ను సోమవారం విడుదల చేశారు మేకర్స్. 'గురి తప్పలా... తప్పించా...!', 'మీరొచ్చింది నాకోసమే మోనని తెలుసుకుని కొడదామనుకున్నా... కాదని తెలిసిందిగా.. కొట్టి తెలుసుకుంటా..!', 'అసలు మ్యాచ్ ఇప్పుడు స్టార్ట్ అవుద్ది', 'నువ్వు ఫ్లడ్ అయితే నేను వరద.. నువ్వు ఫైర్ అయితే నేను వైల్డ్‌ఫైర్.. ఇలాంటి డైలాగులు అవసరమా నీకు!' వంటి డైలాగ్స్ టీజర్‌లో ఉన్నాయి. నరేష్ వీకే, సాయి కుమార్, సముద్రఖని, మైమ్ గోపి, శ్రీదేవి విజయ్‌కుమార్, 'వెన్నెల' కిషోర్, బ్రహ్మాజీ ఇతర పాత్రలు పోషించిన ఈ సినిమాకు సంగీతం: హారిస్ జైరాజ్.


కాజల్ అగర్వాల్

## లాటరీ కింగ్?



నాగార్జున కెరీర్‌లోని వందో సినిమా చిత్రీకరణ కోసం కొన్ని రోజులుగా సన్నాహాలు జరుగుతున్న సంగతి తెలిసిందే. తమిళ దర్శకుడు ఆర్ఏ కార్తీక్ ఈ చిత్రానికి దర్శకత్వం వహిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ బ్యానర్‌పై అక్కినేని నాగార్జున ఈ సినిమా నిర్మిస్తున్నారు. కాగా, ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ ప్రారంభమైందని తెలిసింది. తొలి షెడ్యూల్‌లో నాగార్జున పాల్గొంటున్నారని సమాచారం. ఈ సినిమాకు 'కింగ్ 100', 'కింగ్ 100 నాటౌట్' అనే టైటిల్స్‌ను మేకర్స్ అనుకుంటున్నారనే టాక్ ఫిల్మ్‌నగర్ సర్కిల్స్‌లో వినిపిస్తోంది. అయితే తాజాగా 'లాటరీ కింగ్' అనే మరో టైటిల్‌ను కూడా మేకర్స్ పరిశీలిస్తున్నారట. అంతేకాదు.. కథ రీత్యా ఈ చిత్రంలో ముగ్గురు హీరోయిన్లు ఉంటారని, దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారని టాక్. ఈ విషయాలపై అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.

నాగార్జున

## ది ఇండియా స్టోరీ పూర్తి

'ది ఇండియా స్టోరీ' సినిమాను పూర్తి చేశారు కాజల్ అగర్వాల్. శ్రేయాస్ తల్పాడే, కాజల్ అగర్వాల్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న హిందీ సినిమా 'ది ఇండియా స్టోరీ'. డీకే చేతన్ దర్శకత్వంలో ఎమ్ఐజీ ప్రొడక్షన్స్ అండ్ స్టూడియోస్ పతాకంపై సాగర్ బి. షిండే నిర్మిస్తున్న ఈ చిత్రం షూటింగ్ పూర్తయినట్లు సోమవారం ప్రకటించారు మేకర్స్. ఈ చిత్రంలో లాయర్‌గా నటించారు కాజల్. రైతుల కష్టాలు, కార్పొరేట్ సంస్థలు తయారు చేసే పంటల పిచికారీ మందుల వ్యాపారాలు వంటి అంశాల నేపథ్యంతో ఈ సినిమా కథనం సాగుతుందని బాలీవుడ్ సమాచారం. మురళీ శర్మ, మనీష్ వాధ్వా, త్రిషా సర్ధా కీలక పాత్రల్లో నటించిన 'ది ఇండియా స్టోరీ'ని ఆగస్టు 15న రిలీజ్ చేయాలనుకున్నా కుదరలేదు. 2026లో ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు తాజాగా ప్రకటించారు మేకర్స్.

## నీ కంటి చూపులతో కలలను ఉరితీశావే!


రవితేజ, శ్రీలీల

'హుడియో హుడియో...' అంటూ శ్రీలీలతో ఆడి పాడుతున్నారు రవితేజ. భాను భోగవరపు దర్శకత్వంలో రవితేజ హీరోగా నటించిన చిత్రం 'మాస్ జాతర'. 'మనదే ఇదంతా' అనేది ట్యాగ్‌లైన్. 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో రవితేజ-హీరోయిన్ శ్రీలీల కలిసి 'మాస్ జాతర' లో రెండోసారి జోడీగా నటించారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ పతాకాలపై సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 31 విడుదల కానుంది. భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించిన ఈ సినిమా నుంచి 'హుడియో హుడియో...' అంటూ సాగే పాట ప్రోమోని విడుదల చేశారు మేకర్స్. 'నా గుండె గాలిపటమల్లే ఎగరేశావే... నీ సుట్టు పక్కల తిరిగేలా గిరి గీశావే... నా కంటి రెమ్మల్లో కలలకు ఎరవేసావే... నీ కంటి చూపులతో కలలను ఉరితీశావే...' అంటూ ఈ పాట సాగుతుంది. హేషమ్ అబ్దుల్ వాహబ్ పాడిన ఈ పూర్తి పాట బుధవారం విడుదల కానుంది. ఈ చిత్రానికి కెమెరా: విధు అయ్యన్న, ఎగ్జిక్యూటివ్ నిర్మాత: ఫణి కె.వర్మ.

## డిసెంబరులో చాంపియన్


రోషన్

క్రిస్మస్ పండక్కి థియేటర్స్‌లోకి వస్తున్నాడు చాంపియన్. నటుడు శ్రీకాంత్ తనయుడు రోషన్ హీరోగా నటిస్తున్న పీరియాడికల్ స్పోర్ట్స్ డ్రామా 'చాంపియన్'. ప్రదీప్ అద్వైతం దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో అనశ్వర రాజన్ హీరోయిన్. జీ స్టూడియోస్ సమర్పణలో స్వప్న సినిమా, ఆనంది ఆర్ట్ క్రియేషన్స్, కాన్సెప్ట్ ఫిల్మ్స్ సంస్థలు నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ జరుగుతోంది. మరోవైపు పోస్ట్ ప్రొడక్షన్ కార్యక్రమాలు కూడా జరుగుతున్నాయి. కాగా, 'చాంపియన్'ని డిసెంబరు 25న రిలీజ్ చేస్తున్నట్లు ప్రకటించి, రోషన్ కొత్త పోస్టర్‌ను విడుదల చేశారు మేకర్స్. ''ఇప్పటి వరకు చేయని ఓ విభిన్నమైన పాత్రలో కనిపించబోతున్నారు రోషన్. ఈ పాత్ర కోసం ఫిజికల్‌గానూ ట్రాన్స్‌ఫర్మేషన్ అయ్యారు'' అని యూనిట్ పేర్కొంది. ఈ సినిమాకు సంగీతం: మిక్కీ జె. మేయర్, కెమెరా: ఆర్. మధి.

## వినోదాల సుందర్


అనిల్ రావిపూడి, సత్య

సత్య వినుగొండ హీరోగా నటించి, స్వీయ దర్శకత్వంలో నిర్మించిన చిత్రం 'వాషింగ్టన్ సుందర్'. అనుశ్రీ, శీతల్‌భట్ హీరోయిన్లుగా నటించారు. త్వరలో విడుదల కానున్న ఈ సినిమాలోని ఓ పాటను దర్శకుడు అనిల్ రావిపూడి విడుదల చేసి, చిత్రయూనిట్‌కు అభినందనలు తెలిపారు. ''బాల్యంలో సొంతూరు నుంచి పారిపోయిన ఓ కుర్రాడు.. 15 సంవత్సరాల తర్వాత మళ్లీ తిరిగొస్తాడు. ఆ తర్వాత మరోసారి సొంత ఊరును వదిలి హైదరాబాద్ వెళ్లిపోతాడు? అతను అలా ఎందుకు వెళ్లాడు? అన్నదే 'వాషింగ్టన్ సుందర్' కథ. మంచి వినోదాత్మక చిత్రం ఇది'' అని తెలిపారు సత్య వినుగొండ. ఈసినిమాకు సంగీతం: నందన్ రాజ్ బొబ్బిలి, సమర్పణ: ప్రేమ్‌కుమార్.

## యాక్షన్ నేపథ్యంలో...


ధ్రువ సర్జా

హీరో అర్జున్ సర్జా కథ అందించడంతో పాటు స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్న తాజా చిత్రం 'సీతా పయనం'. ఐశ్వర్య అర్జున్, నిరంజన్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. అర్జున్, ధ్రువ సర్జా పవర్ ఫుల్ పాత్రల్లో కనిపించనున్నారు. శ్రీ రామ్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ బ్యానర్‌పై ఈ సినిమా రూపొందుతోంది. అక్టోబరు 6న ధ్రువ సర్జా పుట్టినరోజు. ఈ సందర్భంగా ఆయన లుక్‌ని రిలీజ్ చేశారు మేకర్స్. ''సరికొత్త కథాంశంతో యాక్షన్ నేపథ్యంలో రూపొందుతోన్న చిత్రం 'సీతా పయనం'. ధ్రువ సర్జా పాత్ర వైవిధ్యంగా ఉంటుంది. ఇప్పటికే విడుదలైన టీజర్‌కి, పాటలకి అద్భుతమైన స్పందన వచ్చింది'' అని చిత్రయూనిట్ తెలిపింది. సత్యరాజ్, ప్రకాష్ రాజ్, కోవై సరళ నటిస్తున్న ఈ సినిమాకి సంగీతం: అనూప్ రూబెన్స్, కెమెరా: జి. బాలమురుగన్.

## కబడ్డీ కబడ్డీ



'బల్టీ' పోస్టర్

షేన్ నిగమ్, ప్రీతి అస్రానీ, శాంతను భాగ్యరాజ్, సెల్వరాఘవన్, అల్ఫాన్స్ పుదిరన్ ప్రధాన తారాగణంగా రూపొందిన చిత్రం 'బల్టీ'. ఉన్ని శివలింగం దర్శకత్వంలో రూపొందిన ఈ సినిమా తమిళ, మలయాళ భాషల్లో విజయం సాధించింది. ఎల్మా పిక్చర్స్ సంస్థ ఈ చిత్రాన్ని ఈ నెల 10న తెలుగులో విడుదల చేస్తోంది. ఈ సందర్భంగా ఎల్మా పిక్చర్స్ సంస్థ అధినేత ఎన్. ఎథిల్ రాజ్ మాట్లాడుతూ-''తమిళ, మలయాళ భాషల్లో ఘన విజయం సాధించిన మా సినిమాని తెలుగులో డబ్ చేసి, విడుదల చేస్తున్నాం'' అన్నారు. ఉన్ని శివలింగం మాట్లాడుతూ-''తమిళనాడు- కేరళ సరిహద్దులోని వెలంపాళయంలో జరిగే ఔట్ అండ్ ఔట్ రా రస్టిక్ విలేజ్ డ్రామాగా ఈ సినిమా ఉంటుంది. ఆ ఊరిని శాసించే ముగ్గురు పెద్దలు.. వారి మధ్య జరిగే వ్యాపార రాజకీయాల్లో నలుగురు కబడ్డీ ప్లేయర్స్ చిక్కుకుంటారు. ఆపై వచ్చే ఘర్షణలు, భావోద్వేగాల సమాహారంగా ఈ సినిమా ఉంటుంది'' అని తెలిపారు.

## వైవిధ్యమైన మహానాగ


సుమన్, రమాకాంత్, శ్రావణి

సుమన్, రమాకాంత్, శ్రావణి ముప్పిరాల ముఖ్య తారలుగా తెరకెక్కుతున్న 'మహానాగ' సినిమా రెగ్యులర్ షూటింగ్ మొదలైంది. ఉదయ భాస్కర వాగ్దేవి దర్శకత్వంలో భీమవరం టాకీస్ పతాకంపై తుమ్మలపల్లి రామ సత్యనారాయణ నిర్మిస్తున్న 118వ చిత్రం ఇది. ముహూర్తపు సన్నివేశానికి నిర్మాతల మండలి అధ్యక్షుడు కె.ఎల్.దామోదర ప్రసాద్ క్లాప్ కొట్టగా, దర్శకులు రేలంగి నరసింహారావు గౌరవ దర్శకత్వం వహించారు. ''వైవిధ్యమైన కథాంశంతో 'మహానాగ' రూపొందుతోంది. సోమవారం ప్రారంభమైన ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్‌లో భాగంగా మొదటి షెడ్యూల్ హైదరాబాద్‌లో చిత్రీకరిస్తాం. రెండో షెడ్యూల్ తాడేపల్లిగూడెం పరిసర ప్రాంతాల్లో జరుపుకోనుంది'' అని చిత్రబృందం పేర్కొంది.

**స్టాక్ మార్కెట్లు** (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

**దేశీ సూచీలు**

| సెన్సెక్స్ ▲ | నిఫ్టీ ▲ |
|---|---|
| 583 | 183 |
| 81,790 | 25,077 |

**విదేశీ సూచీలు**

| సూచీ | విలువ | | మార్పు |
|---|---|---|---|
| నాస్‌డాక్ | 22,951 | ▲ | 170 |
| డోజోన్స్ | 46,713 | ▼ | 45 |
| ఎఫ్‌టీఎస్‌ఈ 100 | 9,481 | ▼ | 10 |
| డాక్స్ | 24,398 | ▲ | 19 |
| షాంఘై (గత మంగళవారం ముగింపు) | 3,883 | ▲ | 20 |
| నికాయ్ | 47,945 | ▲ | 2,175 |

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

**ఫారెక్స్ రేట్లు** రూ. లలో

| | కరెన్సీ | | కొనుగోలు | అమ్మకం |
|---|---|---|---|---|
| $ | యూఎస్ డాలర్ | ఒకటి | 88.30 | 89.32 |
| £ | బ్రిటన్ పౌండ్ | ఒకటి | 118.02 | 121.00 |
| € | యూరో | ఒకటి | 102.77 | 105.57 |
| ¥ | జపాన్ యెన్ (100) | ఒకటి | 59.28 | 60.80 |
| AU$ | ఆస్ట్రేలియా డాలర్ | ఒకటి | 57.57 | 59.84 |
| S$ | సింగపూర్ డాలర్ | ధామస్‌కుక్ | 66.49 | 70.19 |
| SAR | సౌదీ రియాల్ | ధామస్‌కుక్ | 22.79 | 24.28 |
| UAE D | యూఏఈ దిర్హామ్ | ధామస్‌కుక్ | 23.28 | 24.53 |
| ¥ | చైనా యువాన్ | ధామస్‌కుక్ | 11.59 | 13.41 |

# లలితా జ్యువెల్లరి ఐపీవోకి సెబీ ఓకే

**రూ. 1,700 కోట్ల సమీకరణ**

**హైదరాబాద్:** లలితా జ్యువెల్లరి మార్ట్ ప్రతిపాదిత ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కి మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ ఆమోదం తెలిపింది. పబ్లిక్ ఇష్యూ ద్వారా కంపెనీ రూ. 1,700 కోట్లు సమీకరించనుంది. ఇష్యూలో భాగంగా రూ. 1,200 కోట్ల విలువ చేసే షేర్లను తాజాగా జారీ చేయనుండగా, ప్రమోటర్ కిరణ్ కుమార్ జైన్ రూ. 500 కోట్ల విలువ చేసే షేర్లను ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో విక్రయించనున్నారు. తాజాగా షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధుల్లో రూ. 1,014.50 కోట్లను కొత్త స్టోర్స్ ఏర్పాటుకు, మిగతా మొత్తాన్ని ఇతరత్రా కార్పొరేట్ అవసరాల కోసం కంపెనీ వినియోగించుకోనుంది. 1985లో చెన్నై టీ నగర్‌లో తొలి స్టోర్ ప్రారంభించిన లలితా జ్యువెల్లరి దక్షిణాదిలో 56 స్టోర్లతో విస్తరించింది. వీటిలో ఆంధ్రప్రదేశ్‌లో 22, తెలంగాణలో 6 స్టోర్స్ ఉన్నాయి. 2023 ఆర్థిక సంవత్సరంలో రూ. 13,316.80 కోట్లుగా ఉన్న ఆదాయం 2024 ఆర్థిక సంవత్సరంలో రూ. 16,788 కోట్లకు చేరగా లాభం రూ. 238.3 కోట్ల నుంచి రూ. 359.8 కోట్లకు చేరింది.

# పసిడి హైజంప్!



**కొత్త రికార్డు స్థాయికి బంగారం**
- ఢిల్లీ మార్కెట్లో రూ.1,23,300
- అంతర్జాతీయంగా ఔన్స్ 3,994 డాలర్లు
- రూ.1,57,400కు చేరిన వెండి

**న్యూఢిల్లీ:** బంగారం ధర మరో రికార్డు గరిష్టానికి చేరింది. ఒక్క రోజే 10 గ్రాములకు (99.9 శాతం స్వచ్ఛత) రూ.2,700 ఎగిసి, ఢిల్లీ మార్కెట్లో సోమవారం రూ.1,23,300 సరికొత్త ఆల్‌టైమ్ గరిష్ట స్థాయిని నమోదు చేసింది. వెండి సైతం కిలోకి రూ.7,400 పెరిగి మరో నూతన జీవిత కాల గరిష్ట స్థాయి రూ.1,57,400కు చేరింది. ముఖ్యంగా డాలర్‌తో రూపాయి బలహీనపడడం బంగారం ధరలకు ఆజ్యం పోసినట్టు ట్రేడర్లు తెలిపారు. 'బంగారం ధరలు సోమవారం నూతన ఆల్‌టైమ్ గరిష్టానికి చేరాయి. రికార్డు స్థాయి ధరల్లోనూ ఇన్వెస్టర్లు బంగారంలో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారు. బలమైన సానుకూల ధోరణితో బులియన్ ధరలు మరింత పెరుగుతాయన్నది వారి అంచనా. అమెరికా ప్రభుత్వం ఎక్కువ రోజుల పాటు షట్‌డౌన్ కావడం ఆర్థిక కార్యకలాపాలను ప్రభావితం చేస్తుందన్న ఆందోళనలు సైతం తాజా డిమాండ్‌కు తోడయ్యాయి' అని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. మరో వైపు అంతర్జాతీయ మార్కెట్లోనూ ఔన్స్‌కు 85 డాలర్లు ఎగసి 3,994 డాలర్లకు కొత్త రికార్డును తాకింది. వెండి ఔన్స్‌కు 1% పెరిగి 48.75 డాలర్ల స్థాయిని తాకింది. 'యూఎస్ ప్రభుత్వం షట్‌డౌన్ ఆరో రోజుకు చేరుకుంది. దీంతో బంగారం సరికొత్త గరిష్టాలను చేరింది' అని కోటక్ సెక్యూరిటీస్ ఏవీపీ కేనత్ చైన్‌వాలా తెలిపారు.

**నాన్ స్టాప్ ర్యాలీ...**

ఈ ఏడాది బంగారం, వెండి ధరలు ఇప్పటి వరకు ఆగకుండా ర్యాలీ చేస్తూనే ఉన్నాయి. 2024 డిసెంబర్ 31న 10 గ్రాముల బంగారం ధర ఢిల్లీ మార్కెట్లో రూ.78,950 వద్ద ఉంది. అక్కడి నుంచి చూస్తే నికరంగా రూ.44,350 పెరిగింది. వెండి ధర సైతం ఈ ఏడాది ఇప్పటి వరకు 75 శాతం ర్యాలీ (కిలోకి నికరంగా రూ.67,700) చేసింది. గత డిసెంబర్ చివరికి కిలో ధర రూ.89,700 వద్ద ఉండడం గమనార్హం. ''2025 సంవత్సరం ఎన్నో అనిశ్చితులకు కేంద్రంగా ఉంది. మొదట రాజకీయ ఉద్రిక్తతలు, ఆ తర్వాత సుంకాల పరమైన అనిశ్చితులు, భౌగోళిక ఉద్రిక్తతలు, రేట్ల కోతపై అస్పష్టత, ఇప్పుడు యూఎస్ ప్రభుత్వం షట్‌డౌన్. వీటన్నింటితో సురక్షిత సాధనమైన బులియన్ ధరలు ఈ ఏడాది దూసుకెళ్లాయి. డాలర్ బలహీనత, సెంట్రల్ బ్యాంకులు పెద్ద ఎత్తున బంగారం కొనుగోలు చేస్తుండడం, గోల్డ్ ఈటీఎఫ్‌లకు పెరుగుతున్న డిమాండ్, హెడ్జింగ్ సాధనంగా రిటైల్ ఇన్వెస్టర్ల నుంచి సైతం డిమాండ్ పెరగడం ధరల ర్యాలీకి కారణం.

# త్వరలో పెట్రోల్ వాహనాల రేట్లకి ఈవీలు

**కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ వెల్లడి**



**న్యూఢిల్లీ:** వచ్చే నాలుగు నుంచి ఆరు నెలల్లో ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) రేట్లు కూడా పెట్రోల్ వాహనాల ధరల స్థాయిలో లభించగలవని అంచనా వేస్తున్నట్లు కేంద్ర రహదారి రవాణా, జాతీయ రహదారుల శాఖ మంత్రి నితిన్ గడ్కరీ తెలిపారు. శిలాజ ఇంధనాల దిగుమతులపై ఆధారపడటమనేది ఆర్థికంగా భారం కావడంతో పాటు పర్యావరణంపరంగానూ ప్రతికూల పరిణామాలకు దారి తీస్తోందన్నారు. ఏటా ఇంధన దిగుమతులపై రూ. 22 లక్షల కోట్లు వెచ్చించాల్సి వస్తోందని 20వ ఫిక్కీ ఉన్నత విద్యా సదస్సు 2025లో పాల్గొన్న సందర్భంగా చెప్పారు. అయిదేళ్లలోగా భారత్‌ను ప్రపంచంలోనే నంబర్ వన్ ఆటోమొబైల్ పరిశ్రమగా నిలపాలని నిర్దేశించుకున్నట్లు ఆయన చెప్పారు. 'నేను రవాణా మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పుడు భారతీయ ఆటోమొబైల్ పరిశ్రమ పరిమాణం రూ. 14 లక్షల కోట్లుగా ఉండేది. ప్రస్తుతం రూ. 22 లక్షల కోట్లకు చేరింది' అని గడ్కరీ తెలిపారు. ప్రస్తుతం రూ. 78 లక్షల కోట్లతో అమెరికా ఆటోమొబైల్ పరిశ్రమ అగ్రస్థానంలోను, రూ. 47 లక్షల కోట్ల పరిమాణంతో చైనా తొలి రెండు స్థానాల్లో ఉండగా, భారత్ మూడో స్థానంలో ఉంది. మరోవైపు, దేశ పురోగతికి స్వచ్ఛ ఇంధనాల వినియోగం చాలా కీలకమని మంత్రి వివరించారు. మొక్కజొన్న నుంచి ఇథనాల్ ఉత్పత్తి చేయడం వల్ల రైతులకు అదనంగా రూ. 45,000 కోట్ల మేర ఆదాయం వచ్చిందని పేర్కొన్నారు. ఇక 2027 నాటికల్లా ఘనవ్యర్థాలను రహదారుల నిర్మాణంలో వినియోగించే ప్రాజెక్టును చేపట్టినట్లు మంత్రి చెప్పారు. ఉన్నత విద్యాభ్యాసం, నైపుణ్యాలను పెంచుకోవడం ప్రస్తుత పరిస్థితుల్లో అత్యంత కీలకంగా మారిందని ఆయన పేర్కొన్నారు.

# ఐటీ, ఫైనాన్స్ షేర్లకు డిమాండ్

**సెన్సెక్స్ లాభం 583 పాయింట్లు**
- మళ్లీ 25,000 స్థాయిపైకి నిఫ్టీ
- సూచీలు మూడో రోజూ ముందడుగే



**ముంబై:** ఐటీ, ఫైనాన్స్ షేర్లు రాణించడంతో దేశీయ స్టాక్ మార్కెట్ మూడో రోజూ లాభపడింది. సెన్సెక్స్ 583 పాయింట్లు పెరిగి 81,790 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 183 పాయింట్లు బలపడి 2 వారాల తర్వాత 25,000 స్థాయిపై 25,077 వద్ద నిలిచింది. ఆసియా మార్కెట్ల నుంచి సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు ఉదయం స్వల్ప లాభాలతో మొదలయ్యాయి. రోజంతా సానుకూల ధోరణితో కదులుతూ స్థిరమైన లాభాలు ఆర్జించాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 639 పాయింట్లు పెరిగి 81,846 వద్ద, నిఫ్టీ 202 పాయింట్లు బలపడి 25,096 వద్ద ఇంట్రాడే గరిష్టాలు అందుకున్నాయి. డాలర్ మారకంలో రూపాయి విలువ 5 పైసలు బలపడి 88.74 వద్ద స్థిరపడింది. జపాన్ కొత్త ప్రధానిగా బాధ్యతలు చేపట్టనున్న లిబరల్ డెమోక్రటిక్ పార్టీ 'సనాయి తకాయిచి' వడ్డీరేట్లను తగ్గించవచ్చనే అంచనాలతో నికాయ్ ఇండెక్స్ 4.5% లాభపడింది. ఇంట్రాడేలో 5% ఎగసి 48,150 వద్ద సరికొత్త రికార్డు గరిష్టాన్ని నమోదు చేసింది. సెలవు కారణంగా చైనా, కొరియా మార్కెట్లు పనిచేయలేదు. యూరప్ మార్కెట్లు 1% వరకు నష్టపోయాయి. అమెరికా సూచీలు 0.50% నష్టాల్లో ట్రేడవుతున్నాయి.

- ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో రుణాలు, డిపాజిట్ల వృద్ధి నమోదుతో బ్యాంకింగ్ రంగ షేర్లకు భారీ డిమాండ్ లభించింది. యాక్సిస్ బ్యాంక్ 2.61%, కోటక్ బ్యాంక్ 2.12%, హెచ్‌డీఎఫ్‌సీ, ఎస్‌బీఐ 1% లాభపడ్డాయి. ఇదే క్యూ2లో మెరుగైన ఆర్థిక ఫలితాలు ప్రకటించవచ్చనే అంచనాలతో ఐటీ షేర్లు రాణించాయి. టీసీఎస్ 3%, టెక్ మహీంద్రా 2.75%, ఇన్ఫోసిస్ 2%, హెచ్‌సీఎల్ టెక్ 1.50%, విప్రో అరశాతం పెరిగాయి.
- బీఎస్‌ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో ఐటీ 2.21%, టెక్ 1.60%, ఫార్మా 1.05%, ఫైనాన్షియల్ సర్వీసెస్ 1% పెరిగాయి. మిడ్ క్యాప్ ఇండెక్స్ 0.68% లాభపడగా, స్మాల్ క్యాప్ సూచీ 0.20% నష్టపోయింది.
- కేంద్ర ప్రభుత్వం సీజీహెచ్‌ఎస్ పథకంలో భాగంగా 2,000 వైద్య విధానాల (మెడికల్ ప్రొసీజర్స్) కొత్త రేట్లను ప్రకటించడంతో హాస్పిటల్స్ షేర్లు రాణించాయి. అపోలో హాస్పిటల్స్ 3%, మాక్స్ హెల్త్‌కేర్ 6.5%, ఫోర్టిస్ హెల్త్‌కేర్ 7.5%, నారాయణ హృదయాలయ 2%, కిమ్స్ 4.5% లాభపడ్డాయి.
- పేస్ డిజిటెక్ లిస్టింగ్ నిరాశపరిచింది. బీఎస్‌ఈలో ఇష్యూ ధర(రూ.219)తో పోలిస్తే 3.58% ప్రీమియంతో రూ.227 వద్ద లిస్టయ్యింది. ఇంట్రాడేలో రూ.231 వద్ద గరిష్టాన్ని, రూ.207 కనిష్టాన్ని నమోదు చేసింది. చివరికి అరశాతం నష్టపోయి రూ.217 వద్ద ముగిసింది. కంపెనీ మార్కెట్ విలువ రూ.4,695 కోట్లుగా నమోదైంది.

**'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..**

| ఆరు ఐపీవోలకు సెబీ గ్రీన్‌సిగ్నల్ | ప్యాసివ్ ఫండ్స్‌కు పెరుగుతున్న ఆదరణ |
|---|---|

# 'దీపావళి' పర్యాటక కళ!

**ప్రయాణాలకు పెరిగిన డిమాండ్**
- దేశ, విదేశీ పర్యటనల పట్ల ఆసక్తి
- ఎక్కువ రోజులు వెళ్లొచ్చేందుకు ప్రణాళిక
- రెట్టింపైన ఫ్లయిట్, హోటల్ బుకింగ్‌లు



**ముంబై:** దీపావళి పండుగ సందర్భంగా ప్రయాణ బుకింగ్‌లకు డిమాండ్ నెలకొంది. దేశీయంగా వేర్వేరు ప్రాంతాల్లో ఉన్న బంధుమిత్రులతో పండుగ సంబరాలు చేసుకునేందుకు.. దేశ, విదేశాల్లోని సుందర ప్రదేశాలు చూసి వచ్చేందుకు.. ఇలా అన్ని రకాల ట్రావెల్ బుకింగ్‌లకు డిమాండ్ ఏర్పడినట్టు పరిశ్రమ వర్గాలు తెలిపాయి. బంధు మిత్రులను కలుసుకోవడం పడుగల సీజన్‌లో ప్రయాణాలకు కీలక డిమాండ్‌గా ఉన్నట్టు మేక్‌మై ట్రిప్ కో ఫౌండర్, గ్రూప్ సీఈవో రాజేష్ మాగోవ్ తెలిపారు. ఈ సమయంలో వేడుకల కోసం స్వస్థలాలకు వెళుతుంటారని చెప్పారు. అత్యధికంగా బుకింగ్‌లు జరిగిన టాప్-10 ప్రదేశాల్లో ఢిల్లీ, ముంబై, బెంగళూరు, హైదరాబాద్, చెన్నై ఉన్నాయంటూ.. పుణ్యక్షేత్రాలకు సైతం డిమాండ్ పెరిగినట్టు పేర్కొన్నారు. అంతర్జాతీయంగా చూస్తే యూఏఈ, సింగపూర్, థాయ్‌లాండ్, వియత్నాంకు బుకింగ్‌లు అధికంగా ఉన్నట్టు చెప్పారు. దీపావళి సందర్భంగా కొత్త ప్రదేశాలకు చూసి వచ్చేందుకు ఆసక్తి పెరుగుతోందని థామస్ కుక్ (ఇండియా) ప్రెసిడెంట్ రాజీవ్ కాలే సైతం తెలిపారు. ''ఒక్కొక్కరు పర్యటన కోసం చేసే సగటు వ్యయం పెరుగుతుండడం ఆసక్తికరం. ప్రయాణికులు ఎక్కువ రోజులు బస చేయడానికి ఆసక్తి చూపిస్తున్నారు. సాధారణంగా కనిపించే మూడు రోజులకు బదులు 6-12 రోజులకు బుక్ చేసుకుంటున్నారు''అని తెలిపారు. యూరప్‌లో స్విట్జర్లాండ్, ఫ్రాన్స్, ఇటలీ, ఆస్ట్రియా, స్పెయిన్, పోర్చుగల్ ప్రధాన బుకింగ్ కేంద్రాలుగా ఉన్నాయి. స్వల్పకాలం కోసం వియత్నాం, ఒమన్, మాల్దీవులు, బాలి, కంబోడియాకు డిమాండ్ నెలకొన్నట్టు రాజీవ్ కాలే తెలిపారు. వీసా పరంగా సులభ ప్రవేశానికి అవకాశం ఉన్న థాయ్‌లాండ్, మలేషియా, శ్రీలంక, నేపాల్, భూటాన్, దుబాయి-అబుదాబి, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్‌కు ఎప్పటి మాదిరే డిమాండ్ కనిపిస్తున్నట్టు చెప్పారు.

**వారణాసికి డిమాండ్..**

దేశీయంగా కేరళ, రాజస్తాన్, ఉత్తరాఖండ్, అండమాన్‌తోపాటు ఆధ్యాత్మిక కేంద్రాలైన చార్‌ధామ్, కైలాస్ మానససరోవర్, అయోధ్య, వారణాసి వెళ్లొచ్చేందుకు ఎక్కువ మంది ఆసక్తి కనబరుస్తున్నట్టు రాజీవ్ కాలే తెలిపారు. ఈ దీపావళి సందర్భంగా ఫ్లయిట్ బుకింగ్‌లు పెరిగినట్టు ఇక్సిగో గ్రూప్ సీఈవో అలోకే బాజ్‌పాయ్ తెలిపారు. గతేడాదితో పోల్చి చూస్తే 60-65 శాతం డిమాండ్ పెరిగినట్టు చెప్పారు. ముఖ్యంగా అయోధ్య, వారణాసికి బుకింగ్‌లు 100 శాతం అధికంగా ఉన్నట్టు తెలిపారు. జెనరేషన్ జెడ్, దంపతులు అయితే క్రూయిజ్ బుకింగ్‌లు ఆసక్తి చూపిస్తున్నట్టు చెప్పారు. ఈ దీపావళి సీజన్‌కు ముందు 4, 5 స్టార్ హోటళ్లలో బుకింగ్‌లు గణనీయంగా పెరిగినట్టు, ముఖ్యంగా 5 స్టార్ కోసం రెండు రెట్లు అధికంగా బుకింగ్‌లు వస్తున్నట్టు క్లియర్‌ట్రిప్ అధికార ప్రతినిధి సైతం తెలిపారు. పండుగలకు ముందు నాటితో పోల్చి చూస్తే ఫ్లయిట్ బుకింగ్ రెండు రెట్లు, హోటల్ బుకింగ్‌లు 3.5 రెట్లు అధికంగా ఉన్నట్టు చెప్పారు.

# భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

**సాయుధ దళాల్లో చాలెంజింగ్ కెరీర్ కోరుకునే యువతకు చక్కటి అవకాశం స్వాగతం పలుకుతోంది. స్టాఫ్ సెలక్షన్ కమిషన్ (ఎస్ఎస్‌సీ).. ఢిల్లీ పోలీస్ విభాగం, సెంట్రల్ ఆర్మ్‌డ్ పోలీస్ ఫోర్సెస్(సీఏపీఎఫ్)లో సబ్ ఇన్‌స్పెక్టర్(ఎస్ఐ) పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది. అర్హులైన పురుషులు, మహిళా అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ రాత పరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్(పీఈటీ) ద్వారా ఎంపిక ప్రక్రియ చేపట్టనున్నారు. ఎంపికైతే సాయుధ బలగాల్లో ఉన్నత కెరీర్‌తోపాటు ఆకర్షణీయ వేతనాలు అందుకోవచ్చు. ఈ నేపథ్యంలో.. ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్‌లో ఎస్ఐ కొలువులపై ప్రత్యేక కథనం..**

# డిగ్రీతో.. సాయుధ దళాల్లో ఎస్ఐ

» ఎస్ఎస్‌సీ-ఢిల్లీ పోలీస్, సీఏపీఎఫ్ పరీక్ష-2025 నోటిఫికేషన్
» ఆన్‌లైన్ రాత పరీక్ష, పీఈటీ, పీఎస్‌టీ ద్వారా ఎంపిక
» నెలకు వేతన శ్రేణి రూ.35,400 నుంచి 1,12,400



ఎస్ఎస్‌సీ జాబ్స్

**పోస్టులు**

ఢిల్లీ పోలీస్‌లో ఎస్ఐ(ఎగ్జిక్యూటివ్), సీఏపీఎఫ్‌లో సబ్ ఇన్స్‌పెక్టర్(జీడీ).

**పోస్టుల వివరాలు**

ఢిల్లీ పోలీస్ విభాగంలో ఎస్ఐ(ఎగ్జిక్యూటివ్) మేల్-142 పోస్టులు, ఢిల్లీ పోలీస్ విభాగంలో ఎస్ఐ(ఎగ్జిక్యూటివ్) ఫీమేల్-70 పోస్టులు, సీఆర్‌పీఎఫ్‌లో ఎస్ఐ(జీడీ)-1029 పోస్టులు, బీఎస్ఎఫ్‌లో ఎస్ఐ(జీడీ)-223 పోస్టులు, ఐటీబీపీలో ఎస్ఐ(జీడీ)-233 పోస్టులు, సీఐఎస్ఎఫ్‌లో ఎస్ఐ(జీడీ)-1294 పోస్టులు, ఎస్ఎస్‌బీలో ఎస్ఐ(జీడీ)-82 పోస్టులు ఉన్నాయి.

**అర్హతలు**

పోస్టును అనుసరించి గుర్తింపు పొందిన యూనివర్సిటీ నుంచి ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. డిగ్రీ ఫైనల్ పరీక్షలకు హాజరైన విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు. **ఎత్తు:** పురుషులు 170 సెం.మీ. మహిళలు 165 సెం.మీ. ఉండాలి. చెస్ట్ 80 నుంచి 85 సెం.మీ.ఉండాలి.

**వయసు**

01.08.2025 నాటికి 20 నుంచి 25 ఏళ్లు ఉండాలి. ఎస్సీ/ఎస్టీలకు ఐదేళ్లు, ఓబీసీలకు మూడేళ్ల గరిష్ఠ వయోపరిమితిలో సడలింపు లభిస్తుంది.

**వేతనం**

నెలకు రూ.35,400 నుంచి రూ.1,12,400 వేతన శ్రేణి లభిస్తుంది.

**ఎంపిక విధానం**

- రాతపరీక్ష, ఫిజికల్ స్టాండర్డ్ టెస్ట్(పీఎస్‌టీ), ఫిజికల్ ఎండ్యూరెన్స్ టెస్ట్(పీఈటీ), డిటెయిల్డ్ మెడికల్ ఎగ్జామినేషన్(డీఎంఈ), సర్టిఫికెట్ల వెరిఫికేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
- రాత పరీక్షలో పేపర్1, పేపర్ 2 ఉంటాయి. ఈ రెండు పేపర్లు కూడా ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నల విధానంలో జరుగుతాయి. పేపర్1లో అర్హత సాధించిన వారికి పీఎస్‌టీ, పీఈటీ పరీక్షలు నిర్వహిస్తారు. ఇవి అర్హత పరీక్షలు మాత్రమే. వీటి స్కోర్‌ను తుది ఎంపికలో పరిగణనలోకి తీసుకోరు.
- పీఎస్‌టీ, పీఈటీలో అర్హత పొందిన వారికి మాత్రమే పేపర్2 ఉంటుంది. పేపర్2 పరీక్షలో అర్హత సాధించిన అభ్యర్థులందరికీ మెడికల్ ఎగ్జామినేషన్ నిర్వహిస్తారు. పేపర్ 1, పేపర్ 2లో చూపిన ప్రతిభ ఆధారంగా తుది ఎంపిక చేపడతారు.
- పేపర్1, పేపర్2లో కనీస అర్హత మార్కులు పొందాల్సి ఉంటుంది. అన్ రిజర్వ్‌డ్ అభ్యర్థులు కనీసం 30 శాతం, ఓబీసీ/ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులు కనీసం 25 శాతం, మిగతా అన్ని కేటగిరీల అభ్యర్థులు కనీసం 20 శాతం మార్కులు పొందాలి.

**200 మార్కులకు పేపర్1**

- ఎంపిక ప్రక్రియలో ఎంతో కీలకమైన రాత పరీక్ష పేపర్1.. 200 ప్రశ్నలు-200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో ఆబ్జెక్టివ్ తరహాలో మల్టిపుల్ చాయిస్ విధానం(ఎంసిక్యూ)లో ప్రశ్నలు ఉంటాయి. జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ విభాగంలో 50 ప్రశ్నలు-50 మార్కులకు, జనరల్ నాలెడ్జ్ అండ్ జనరల్ అవేర్‌నెస్ 50 ప్రశ్నలు-50 మార్కులకు, క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ 50 ప్రశ్నలు-50 మార్కులకు, ఇంగ్లిష్ కాంప్రెహెన్సన్ 50 ప్రశ్నలు-50 మార్కులకు ఉంటాయి. పరీక్ష సమయం 2గంటలు.
- పేపర్ 2(ఇంగ్లిష్ నైపుణ్యాలపై) కూడా ఆబ్జెక్టివ్ తరహాలో 200 ప్రశ్నలు-200 మార్కులకు నిర్వహిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు.
- పేపర్1, పేపర్ 2 రెండింటిలోనూ నెగిటివ్ మార్కుల నిబంధన ఉంది. ప్రతి తప్పు సమాధానానికి 0.25 మార్కును తగ్గిస్తారు.

**రాత పరీక్షలో రాణించేలా**

- పేపర్-1లో మంచి మార్కులు సాధించాలంటే.. ముందుగా సిలబస్‌లో పేర్కొన్న సబ్జెక్ట్‌లకు సంబంధించి ఆరు నుంచి 12వ తరగతి వరకు ఎన్‌సీఈఆర్‌టీ పుస్తకాలను అధ్యయనం చేయాలి. దీనివల్ల అన్ని అంశాల బేసిక్స్, ఫార్ములాలపై అవగాహన ఏర్పడుతుంది.
- కరెంట్ అఫైర్స్ కోసం ఆర్థిక-రాజకీయ పరిణామాలపై దృష్టి సారించడం ఉపకరిస్తుంది. దీంతోపాటు చరిత్రలో ప్రధానంగా స్వాతంత్ర్య పోరాటం..ఆ పోరాటంలోని ముఖ్య ఘట్టాలు-వ్యక్తులపై పరిజ్ఞానం పెంచుకోవాలి. ఇటీవల కాలంలో దేశ రక్షణ, భద్రత విభాగాల్లో చోటు చేసుకున్న తాజా పరిణామాలు, కొత్త క్షిపణుల ప్రయోగాలు, దేశ రక్షణ-భద్రతకు సంబంధించి పలు దేశాలతో కుదుర్చుకున్న ఒప్పందాలపై పూర్తి అవగాహన పొందడం మరింత మేలు చేస్తుంది.
- క్వాంటిటేటివ్ ఆప్టిట్యూడ్ విభాగంలో రాణించాలంటే.. అర్థమెటిక్ అంశాలతోపాటు క్వాడ్రాటిక్ ఈక్వేషన్స్, డేటా ఇంటర్‌ప్రిటేషన్, సింప్లిఫికేషన్స్, అప్రాక్సిమేషన్స్ అంశాలను అధ్యయనం చేయాలి.
- జనరల్ ఇంటెలిజెన్స్ అండ్ రీజనింగ్ విభాగంలో.. మార్కుల సాధనకు కోడింగ్ - డీకోడింగ్, బ్లడ్ రిలేషన్స్, డైరెక్షన్, సిలాజిజమ్ తదితర అంశాలకు సంబంధించిన ప్రశ్నలను బాగా ప్రాక్టీస్ చేయాలి.
- పేపర్-2లో స్కోర్ కోసం అభ్యర్థులకు బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్‌పై పట్టుతోపాటు, భావ వ్యక్తీకరణ నైపుణ్యాలు అవసరం. ఇందుకోసం ఇంగ్లిష్ దినపత్రికల్లోని ఎడిటోరియల్స్, ఇతర వ్యాసాలు చదివి.. భాషపై పట్టు సాధించాలి. ఇందులో ఎర్రర్ రికగ్నిషన్, ఫిల్ ద బ్లాంక్స్ నుంచి ప్రశ్నలు అడుగుతారు. వెర్బ్స్, ప్రిపొజిషన్స్, ఆర్టికల్స్, సినానిమ్స్, యాంటోనిమ్స్, వొకాబులరీ, గ్రామర్, స్పెల్లింగ్స్, సెంటెన్స్ స్ట్రక్చర్, సెంటెన్స్ కంప్లీషన్, ఇడియమ్స్, ఫ్రేజెస్ నుంచి ప్రశ్నలు ఎదురవుతాయి.
- ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో రాణించడానికి అభ్యర్థులు రాత పరీక్ష ప్రిపరేషన్ దశ నుంచే ఆ దిశగా కృషి చేయాలి. ప్రతిరోజు కనీసం రెండు గంటలు ఫిజికల్ ఎఫిషియన్సీ టెస్ట్‌లో పేర్కొన్న అంశాలపై శిక్షణ పొందాలి.

**ముఖ్య సమాచారం**

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
- ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది: 26.09.2025.
- ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది: 16.10.2025.
- దరఖాస్తు ఫీజు చెల్లించడానికి చివరితేది: 17.10.2025.
- దరఖాస్తు సవరణ తేదీలు: 24.10.2025 నుంచి 26.10.2025 వరకు
- వెబ్‌సైట్: https://ssc.gov.in

## విద్య, ఉద్యోగ సమాచారం

### యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్‌లో 52 నాన్ టీచింగ్ పోస్టులు

యూనివర్శిటీ ఆఫ్ హైదరాబాద్(యూవోహెచ్) నాన్‌టీచింగ్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 52.
» **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ లైబ్రేరియన్-04, అసిస్టెంట్ రిజిస్ట్రార్-01, సిస్టమ్ ప్రోగ్రామర్-02, సీనియర్ అసిస్టెంట్-05, ఆఫీస్ అసిస్టెంట్-07, ల్యాబ్ అసిస్టెంట్-10, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్-15, ల్యాబ్ అటెండెంట్-05, లైబ్రరీ అటెండెంట్-03.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఇంటర్, డిగ్రీ, పీజీ, బీటెక్, ఎంటెక్ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
» **వయసు:** అసిస్టెంట్ లైబ్రేరియన్‌కు 62 ఏళ్లు, అసిస్టెంట్ రిజిస్ట్రార్, సిస్టమ్ ప్రోగ్రామర్‌కు 40 ఏళ్లు, సీనియర్ అసిస్టెంట్‌కు 35 ఏళ్లు, మిగతా పోస్టులకు 32 ఏళ్లలోపు ఉండాలి.
» **వేతనం:** నెలకు అసిస్టెంట్ లైబ్రేరియన్, రిజిస్ట్రార్, సిస్టమ్ ప్రోగ్రామర్‌కు రూ.57,700 నుంచి రూ.1,82,400, సీనియర్ అసిస్టెంట్‌కు రూ.35,400 నుంచి రూ.1,12,400, ఆఫీస్, ల్యాబ్ అసిస్టెంట్‌కు రూ.25,500 నుంచి రూ.81,100, ల్యాబ్, లైబ్రరీ అటెండెంట్‌కు రూ.18,000 నుంచి రూ.56,900, జూనియర్ ఆఫీస్ అసిస్టెంట్‌కు రూ.19,900 నుంచి రూ.63,200.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 24.09.2025
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**24.10.2025
» **వెబ్‌సైట్:** https://uohyd.ac.in

### ఎయిమ్స్ మంగళగిరిలో 121 పోస్టులు

ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ (ఎయిమ్స్) మంగళగిరిలో రెగ్యులర్ ప్రాతిపదికన ఫ్యాకల్టీ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 121.
» **పోస్టుల వివరాలు:** ప్రొఫెసర్-10, అడిషనల్ ప్రొఫెసర్-08, అసోసియేట్ ప్రొఫెసర్-20, అసిస్టెంట్ ప్రొఫెసర్-83.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో కనీసం 60 శాతం మార్కులతో ఎంబీబీఎస్, ఎంఎస్, ఎండీ, ఎంహెచ్‌లో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
» **వయసు:** 58 ఏళ్లు మించకూడదు.
» **వేతనం:** నెలకు ప్రొఫెసర్‌కు రూ.1,68,900, అడిషనల్ ప్రొఫెసర్‌కు రూ.1,48,200, అసోసియేట్ ప్రొఫెసర్‌కు రూ.1,38,300, అసిస్టెంట్ ప్రొఫెసర్‌కు రూ.1,01,500.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**26.10.2025
» **వెబ్‌సైట్:** www.aiimsmangalagiri.edu.in

### ఏపీ వైద్య ఆరోగ్య శాఖలో 12 ఫార్మసి ఆఫీసర్ పోస్టులు

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖకు చెందిన రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్ (ఆర్‌డీఎంహెచ్‌ఎస్) రాజమహేంద్రవరంలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో ఒప్పంద ప్రాతిపదికన ఫార్మసి ఆఫీసర్(ఫార్మసిస్ట్ గ్రేడ్-2) పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం పోస్టుల సంఖ్య:** 12.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో పదో తరగతి, డీఫార్మసీ/బీఫార్మసీలో ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 42 నుంచి 52 ఏళ్లు ఉండాలి.
» **వేతనం:** నెలకు రూ.32,670.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును రీజనల్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ అండ్ హెల్త్ సర్వీసెస్, జోన్-2, రాజమహేంద్రవరం చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తు ప్రారంభతేది:** 03.10.2025.
» **దరఖాస్తులకు చివరితేది:** 15.10.2025.
» **వెబ్‌సైట్:** https://krishna.ap.gov.in

### టీఐఎఫ్ఆర్, ముంబైలో ట్రేడ్స్‌మ్యాన్ ట్రైనీ అప్రెంటిస్‌లు

ముంబైలోని టాటా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్(టీఐఎఫ్ఆర్).. ట్రేడ్స్‌మ్యాన్ ట్రైనీ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 02.
» **ఖాళీల వివరాలు:** మెషినిస్ట్-01, ఎలక్ట్రీషియన్-04.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 01.07.2025 నాటికి 28 ఏళ్లు మించకూడదు.
» **స్టైపెండ్:** నెలకు రూ.18,500.
» **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఇంటర్వ్యూ తేది:** 15.10.2025.
» **వెబ్‌సైట్:** https://www.tifr.res.in

**కెరీర్ కౌన్సెలింగ్**
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

**నేటి భవిత ఈ పేపర్‌లో..**
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం - ఇండియన్ హిస్టరీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం - తెలుగు
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం - బయాలజీ » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం - రీజనింగ్

## క్లుప్తంగా...



### రెజ్లింగ్ జట్టుకు డీజీపీ అభినందన

సాక్షి, హైదరాబాద్: హరియాణాలోని మధుబన్ కర్నాల్‌లో సెప్టెంబర్ 20 నుంచి 24 వరకు జరిగిన 74వ ఆల్ ఇండియా పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ 2025–26 పోటీల్లో పతకాలు గెలిచిన తెలంగాణ పోలీస్ రెజ్లింగ్ క్లస్టర్ జట్టు సభ్యులను డీజీపీ శివధర్‌రెడ్డి అభినందించారు. ఈ మేరకు ఐజీ రమేశ్‌రెడ్డితో కలిసి సోమవారం తన కార్యాలయంలో విజేతలను అభినందించారు. డీజీపీని కలిసి వారిలో విజేతలు కానిస్టేబుళ్లు ఎస్.జశ్వంత్ జి.రాధిక, కోచ్‌లు, స్పోర్ట్స్ డీఎస్పీ డాక్టర్ ఆర్.వి.రామారావు ఉన్నారు.

### 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ చాలెంజ్'కు అపూర్వ స్పందన

సాక్షి, హైదరాబాద్: 'బతుకమ్మ యంగ్ ఫిలిం మేకర్స్ చాలెంజ్–2025'కు అపూర్వ స్పందన వచ్చిందని తెలంగాణ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీఎఫ్‌డీసీ) చైర్మన్ దిల్‌రాజు తెలిపారు. హైదరాబాద్‌లో సోమవారం టీఎఫ్‌డీసీ చైర్మన్ దిల్‌రాజు, ఎఫ్‌డీసీ ఎండీ సీహెచ్ ప్రియాంక మాట్లాడారు. ప్రజాపాలనపై సామాజిక అవగాహన కలిగించే షార్ట్ ఫిల్మ్స్‌తోపాటు, తెలంగాణ చరిత్ర, సాంస్కృతిక వారసత్వాన్ని, బతుకమ్మ పండుగను ప్రతిబింబించేలా వీడియో సాంగ్స్ రూపొందించి పంపాలనే ఆహ్వానానికి రాష్ట్రవ్యాప్తంగా 500కు పైగా దరఖాస్తులు వచ్చాయన్నారు. త్వరలోనే ప్రముఖుల సమక్షంలో బహుమతుల ప్రదానోత్సవం నిర్వహిస్తామని వెల్లడించారు.


### బాధ్యతలు స్వీకరించిన టీజీపీఎస్సీ సభ్యులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీజీపీఎస్సీ) సభ్యులుగా నూతనంగా నియమితులైన మాజీ ఐపీఎస్ అధికారి విశ్వప్రసాద్, సి.చంద్రకాంత్‌రెడ్డి సోమవారం టీజీపీఎస్సీ కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కమిషన్ చైర్మన్ బుర్రా వెంకటేశం నూతన సభ్యులతో ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో కమిషన్ సభ్యులు అమిల్‌ఉల్లా ఖాన్, యాదయ్య, పాల్వాయి రజిని, ఎల్‌బీ లక్ష్మీకాంత్ రాథోడ్, కార్యదర్శి ప్రియాంక ఆలా తదితరులు పాల్గొన్నారు.

## సికింద్రాబాద్ - కాజీపేట మధ్య

# 4 లైన్ల రైల్వే కారిడార్

- పచ్చజెండా ఊపిన కేంద్రం
- 110 కి.మీ. నిడివి, రూ. 2,837 కోట్ల వ్యయం
- ఒకేసారి మూడు, నాలుగు లైన్ల నిర్మాణం.. నాలుగేళ్లలో అందుబాటులోకి
- ఎట్టకేలకు 'హైలీ యుటిలైజ్డ్ నెట్‌వర్క్'కు మోక్షం



సాక్షి, హైదరాబాద్: ఒకటి కాదు రెండు కాదు, సికింద్రాబాద్ నుంచి ఏకంగా రోజుకు కనీసం 150 అదనపు రైళ్లు నడిపేందుకు వీలు కలిగించే కీలక నిర్ణయం తీసుకుంది కేంద్ర ప్రభుత్వం. సికింద్రాబాద్ నుంచి కాజీపేట వరకు ఉన్న రెండు వరుసల రైల్వే మార్గాన్ని నాలుగు లైన్లకు విస్తరించబోతోంది. ఉత్తర–దక్షిణ భారత్‌లను రైల్వే మార్గంతో జోడించే గ్రాండ్ ట్రంక్ రూట్‌తో ఇది అనుసంధానం కాబోతోంది. గ్రాండ్ ట్రంక్ రూట్‌లో మూడో లైన్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చినందున త్వరలో అందుబాటులోకి రానుంది. ఆ మార్గాన్ని నాలుగు లైన్ల రూట్‌గా మార్చాలని కేంద్రం ప్రయత్నిస్తున్న నేపథ్యంలో, దానికి అనుసంధానమయ్యే సికింద్రాబాద్–కాజీపేట మార్గాన్ని నాలుగు వరుసలకు విస్తరించాలని నిర్ణయించినట్టు విశ్వసనీయంగా తెలిసింది. ఒకేసారి రెండు అదనపు లైన్లను నిర్మించేందుకు రూ.2,837 కోట్లు అవసరమవుతాయని దక్షిణ మధ్య రైల్వే రూపొందించిన డీపీఆర్‌లో పేర్కొంది. అదనంగా రెండు లైన్లను నిర్మించేందుకు దాదాపు నాలుగేళ్ల సమయం పడుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే ప్రస్తుతం హైదరాబాద్ మీదుగా నిత్యం నడుస్తున్న 200 రైళ్లకు (గూడ్సు సహా)అదనంగా మరో 150 రైళ్లను నడపొచ్చు. దేశంలో అతి కీలక లైన్లు అయిన హైలీ యుటిలైజ్డ్ నెట్‌వర్క్ (హెచ్‌యూఎన్)లలో సికింద్రాబాద్–కాజీపేట మార్గం ఒకటి. ఈ మార్గంలో సామర్థ్యానికి మించి రైళ్లు నడుస్తున్నాయి. ప్రస్తుతం ఆ సాంద్రత 150 శాతంగా ఉంది. ఇది ప్రమాదకర పరిస్థితిగా భావిస్తారు. సిగ్నలింగ్‌కు సంబంధించి ఏమాత్రం ఏమరపాటుగా ఉన్నా భారీ ప్రమాదాలకు ఆస్కారం ఉంటుంది. ఈ తరుణంలో కొత్త రైళ్లను ప్రవేశపెట్టడం దాదాపు అసాధ్యంగా మారింది. హైదరాబాద్ నుంచి బిహార్, ఉత్తరప్రదేశ్, పశ్చిమ బెంగాల్‌లకు రోజుకు అదనంగా 40కి పైగా రైళ్లు అవసరమున్నాయి. ఆయా ప్రాంతాలకు చెందిన వలస కూలీలు రాష్ట్రంలో అధికసంఖ్యలో పనిచేస్తుండటమే దీనికి కారణం, ఇక ముంబై, ఢిల్లీ, చెన్నై, బెంగళూరు, అహ్మదాబాద్, తదితర ప్రాంతాలకు కూడా అధికంగా రైళ్ల అవసరం ఉంది. తిరుపతి, విజయవాడలకు కూడా మరిన్ని రైళ్లు తిప్పాల్సి ఉంది. వెరసి కనీసం మరో వందకుపైగా రైళ్లు నడపాల్సిన డిమాండ్ ఉన్నా, ట్రాక్ సామర్థ్యం సరిపోక నడపటం లేదు. ఇప్పుడు మూడు, నాలుగు లైన్లు అందుబాటులోకి వస్తే ఆ కొరత తీరిపోతుంది.

**ఎంఎంటీఎస్–2కు వెసులుబాటు**

ప్రస్తుతం ఎంఎంటీఎస్ రెండో దశ పనులు జరుగుతున్నాయి. నగరం నుంచి ఘట్‌కేసర్‌కు వరకు రెండు మార్గాల్లో కలిపి నాలుగు లైన్లు అందుబాటులో ఉన్నాయి. ప్రధాన మార్గంలో రెండు లైన్లు, అమ్ముగూడ మీదుగా నిర్మించిన బైపాస్ లైన్‌లో రెండు లైన్లు ఉన్నాయి. ఘట్‌కేసర్ నుంచి యాదాద్రి వరకు ఎంఎంటీఎస్ ప్రాజెక్టులో భాగంగా మూడో లైన్ నిర్మిస్తున్నారు. ఇప్పుడు కాజీపేట వరకు ప్రధాన లైన్‌ను నాలుగు వరుసలకు విస్తరించనున్నందున, ఎంఎంటీఎస్‌కు నాలుగో లైన్ కూడా అందుబాటులోకి వచ్చినట్టవుతుంది.

**అటు వాడీ, ఇటు బల్లార్షా – విజయవాడ.. నాలుగు లైన్లతో..**

కాజీపేట నుంచి బల్లార్షా, కాజీపేట నుంచి విజయవాడ మధ్య మూడో లైన్ నిర్మాణం పూర్తి కావొచ్చింది. ఇది గ్రాండ్ ట్రంక్ రూట్ అయినందున, ఈ మార్గంలో నాలుగో లైన్ కూడా నిర్మించాలని కేంద్రం నిర్ణయించింది. ఇక సికింద్రాబాద్–వాడీ మధ్య ఒకేసారి మూడో, నాలుగో లైన్లు మంజూరయ్యాయి. త్వరలో పనులు మొదలవుతాయి. వెరసి ఈ కీలక మార్గాల్లో నాలుగో లైన్ వస్తున్నందున, విరివిగా రైళ్లను పరిగెత్తించే వీలుంది. దానికి సమతూకం చేయాలంటే సికింద్రాబాద్ నుంచి కాజీపేట మధ్య కూడా నాలుగో లైన్ అవసరమవుతుంది. అప్పుడు హైదరాబాద్ మీదుగా అటు బల్లార్షా నుంచి ఢిల్లీ వైపు, విజయవాడ మీదుగా చెన్నై, ఒడిశా, బెంగాల్ వైపు, వాడీ మీదుగా ముంబై వైపు వీలైనన్ని రైళ్లను నడపొచ్చు.

**160 కి.మీ. వేగంతో...**

పస్తుతం ఉన్న రెండు లైన్ల మీద రైళ్ల గరిష్ట వేగం 130 కి.మీ. మాత్రమే. ఇప్పుడు కొత్తగా ప్రతిపాదించిన రెండు లైన్లను 160 కి.మీ. వేగ సామర్థ్యంతో నిర్మించనున్నారు. అప్పుడు ఈ మార్గంలో నడిచే వందేభారత్ రైళ్లు తమ గరిష్ట వేగాన్ని (160కి.మీ.) అందుకొని ప్రయాణిస్తాయి. దీంతో మరింత తొందరగా గమ్యం చేరుకుంటాయి.

**పచ్చజెండా ఊపేందుకు సిద్ధం**

రైళ్ల రద్దీ పెరిగి రూట్ ఇరుకుగా మారిన నేపథ్యంలో సికింద్రాబాద్–కాజీపేట మధ్య మూడో లైన్ నిర్మించాలని దాదాపు పదిహేనేళ్లుగా ప్రతిపాదనలు మూలుగుతున్నాయి. ఈ నేపథ్యంలో 2023లో ప్రాజెక్టు మంజూరై సర్వేకు సూచించారు. ఆ సమయంలోనే ఒకేసారి మూడు, నాలుగు లైన్లను నిర్మించాలని కేంద్రం భావించి ఆ సంవత్సరం జూలైలో ఫైనల్ లొకేషన్ సర్వే మంజూరు చేసింది. సర్వే పూర్తి చేసి గత ఏప్రిల్‌లో రైల్వే బోర్డుకు డీపీఆర్ సమర్పించారు. దాన్ని పరిశీలించిన కేంద్రం ప్రాజెక్టుకు పచ్చజెండా ఊపినట్టు తెలిసింది. త్వరలో అధికారిక ఆదేశాలు వెలువడనున్నాయి. అదనపు రెండు లైన్ల నిర్మాణానికి 124 హెక్టార్ల భూమిని సేకరించాలని నిర్ణయించారు. త్వరలో ఆ మేరకు నోటిఫికేషన్ జారీ కానుంది. ఈ రైల్వే లైన్ తెలంగాణలోని మేడ్చల్ – మల్కాజిగిరి, యాదాద్రి భువనగిరి, జనగామ, హనుమకొండ జిల్లాల మీదుగా సాగుతుంది. ఈ రైలు మార్గంలో రెండు రైల్వే ఓవర్ బ్రిడ్జీలు (ఆర్‌ఓబీ), 27 రైల్వే అండర్ బ్రిడ్జ్‌లు (ఆర్‌యూబీ) ఉన్నాయి. ఘట్‌కేసర్, కాజీపేటతో సహా మొత్తం 16 స్టేషన్లు ఈ రూట్‌లో ఉన్నాయి.

## నౌకాదళం అమ్ములపొదిలో

# మరో అస్త్రం

**సాగర్ జలాల్లోకి యుద్ధనౌక 'ఆంద్రోత్'**



భారత నౌకాదళం అమ్ముల పొదిలో మరో అస్త్రం చేరింది. రెండో యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్ షాలో వాటర్‌క్రాఫ్ట్ యుద్ధనౌక ఐఎన్‌ఎస్ ఆంద్రోత్‌ను విశాఖలోని నేవల్ డాక్‌యార్డులో తూర్పు నౌకా దళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెందార్కర్ సోమవారం ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. యుద్ధ విమానాలు, సబ్‌మెరైన్‌లు, ఎయిర్‌క్రాఫ్ట్ క్యారియర్ల నిర్మాణంతో ఆత్మనిర్భర్ భారత్‌లో భారత నౌకాదళం నంబర్ వన్‌గా దూసుకుపోతోందని చెప్పారు. 80 శాతం కంటే ఎక్కువ స్వదేశీ పరిజ్ఞానంతో ఆత్మనిర్భర్ భారత్‌లో భాగంగా కోల్‌కతాలో ఈ యుద్ధనౌకను తీర్చిదిద్దారని తెలిపారు. వరుసగా భారత్‌లో తయారు చేసిన యుద్ధ నౌకలు అందుబాటులోకి రావడం సరికొత్త చరిత్రగా అభివర్ణించారు. ఆంద్రోత్ రాకతో సముద్ర రక్షణ మరింత బలోపేతమైందని తెలిపారు. లక్షదీవుల సమూహంలో ఉత్తరాన ఉన్న ప్రముఖ ద్వీపం 'ఆంద్రోత్' పేరును ఈ యుద్ధ నౌకకు పెట్టినట్టు వివరించారు.

– సాక్షి, విశాఖపట్నం

**శత్రుదేశాల సబ్‌మెరైన్లు ఎక్కడ దాక్కున్నా పట్టేస్తుంది**

సముద్ర నిఘా, శోధన, రెస్క్యూ, తీరప్రాంత రక్షణ కార్యక్రమాల్లో ఆంద్రోత్ చురుగ్గా వ్యవహరిస్తుందని పెందార్కర్ చెప్పారు. శత్రుదేశాల సబ్‌మెరైన్‌లు ఎక్కడ దాక్కున్నా పసిగట్టేలా అధునాతన సెన్సార్లు, అత్యాధునిక ఆయుధాలు, కమ్యూనికేషన్ వ్యవస్థలతో ఈ వార్‌షిప్ నిర్మించినట్టు తెలిపారు. తూర్పు తీర సముద్ర రక్షణ విషయంలో తూర్పు నౌకాదళం రాజీలేని పోరాటం చేస్తోందని పునరుద్ఘాటించారు. ఆంద్రోత్ భారత నౌకాదళ అమ్ముల పొదిలో చేరిన తర్వాత.. యాంటీ సబ్‌మెరైన్ వార్‌ఫేర్‌లో నావికాదళ సామర్థ్యాన్ని బలోపేతం చేసినట్టేనని తెలిపారు. లోతు తక్కువగా ఉన్న జలాల్లోని శత్రుదేశాల సబ్‌మెరైన్లని ఆంద్రోత్ వేటాడుతుందనీ.. తీరప్రాంతానికి చేరువలోని జలాలపై నిఘావేసే సామర్థ్యంతో పాటు విమానాలతో సమన్వయం చేసుకుంటూ శత్రు జలాంతర్గాముల్ని వేటాడే సత్తా ఆంద్రోత్ సొంతమని వివరించారు. ఈ కార్యక్రమంలో తూర్పు నౌకాదళాధికారులు, జీఆర్‌ఎస్‌ఈ అధికారులు పాల్గొన్నారు.

**'ఆంద్రోత్' విశేషాలు ఇవీ..**

| | |
|---|---|
| పొడవు: 77.6 మీటర్లు | సామర్థ్యం: ఏకధాటిగా 100 నాటికల్ మైళ్లు |
| వెడల్పు: 10.5 మీటర్లు | |
| డ్రాఫ్ట్: 2.7 మీటర్లు | ఎక్కడ తయారు చేశారు: కోల్‌కతాలోని గార్డెన్ రీచ్ షిప్‌బిల్డర్స్ అండ్ ఇంజనీర్స్ (జీఆర్‌ఎస్‌ఈ) |
| బరువు : 1,500 టన్నులు | |
| వేగం : గంటకు 25 నాటికల్ మైళ్లు | |

వ్యయం : రూ.789 కోట్లు
పనులు ప్రారంభం : 2023 మార్చిలో
సిబ్బంది : ఏడుగురు అధికారులు, 50 మంది సెయిలర్స్ (మొత్తం 57 మంది)
లక్ష్యం: సముద్రం లోపల దాగివున్న శత్రు జలాంత ర్గాముల్ని గుర్తించడం, వాటిని ట్రాక్ చేసి నాశనం చేయడం

అదనపు విధులు: సముద్ర నిఘా, పరిశోధన, విపత్తు, యుద్ధ సహాయక చర్యలు, తీరప్రాంత పరిరక్షణ
సెన్సార్ వ్యవస్థ: డీఆర్‌డీవో కాంబాట్ సూట్, తక్కువ లోతులో సబ్‌మెరైన్‌లను గుర్తించే ఎల్‌ఎఫ్‌వీడీ సోనార్
ఆయుధ సంపత్తి: 30 ఎంఎం సర్ఫేస్ గన్, 6,000 యాంటీ సబ్‌మెరైన్ రాకెట్ ఒకటి, 2 ట్రిపుల్ లైట్ వెయిట్ టార్పెడో లాంచర్లు, యాంటీ సబ్‌మెరైన్ మైన్స్, 2 ఓఎఫ్‌టీ రిమోట్ కంట్రోల్ గన్స్



Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

# కోల్ గ్యాసిఫికేషన్‌కు సింగరేణి సిద్ధం

- ప్రక్రియకు అనుగుణంగా 'గోదావరి లోయ'
- మూతపడిన గనుల దగ్గర పైలట్ ప్రాజెక్ట్

**సాక్షి ప్రతినిధి, భద్రాద్రి కొత్తగూడెం:** బొగ్గు వేలంలో పాల్గొనేందుకు సంసిద్ధత వ్యక్తం చేసిన సింగరేణి ఇప్పుడు మరో అడుగు ముందుకేయనుంది. రెండు దశాబ్దాలు ఇదిగో.. అదిగో అంటూ ప్రకటనలకే పరిమితమైన కోల్ గ్యాసిఫికేషన్ ప్రక్రియను పట్టాలెక్కించేందుకు పదును పెడుతోంది. కోల్ ఇండియాతో పాటు క్లీన్ ఎనర్జీ ఉత్పత్తి దిశగా అడుగులు వేస్తోంది.

### ఏమిటీ కోల్ గ్యాసిఫికేషన్..?

సాధారణంగా బొగ్గును మండించినప్పుడు ఉష్ణశక్తి విడుదలవుతుంది. ఈ ఉష్ణశక్తిని ఉపయోగించుకుని పారిశ్రామిక వర్గాలు విద్యుత్, సిమెంట్ తదితర ఉత్పత్తులను తయారు చేస్తున్నాయి. కోల్ గ్యాసిఫికేషన్ ప్రక్రియలో బొగ్గులో ఉండే ఉష్ణశక్తిని వాయువు రూపంలో బయటకు తీసుకుంటారు. ఈ వాయువు (ప్రధానంగా హైడ్రోజన్) ఉపయోగించడం ద్వారా పారిశ్రామిక అవసరాలను తీర్చవచ్చు. తక్కువ కాలుష్యంతో ఎక్కువ ఉత్పత్తి సాధనకు ఈ విధానం ఉపయోగపడుతుంది. కోల్ గ్యాసిఫికేషన్ ప్రక్రియ మొదలు పెట్టాలంటూ కోల్‌ఇండియా, సింగరేణికి కేంద్రం సూచనలు చేసింది. ఈ ప్రక్రియ మొదలు పెట్టే సంస్థలకు భారీగా ప్రోత్సాహకాలు అందిస్తామని సైతం ప్రకటించింది.

### సింగరేణిలో..

బొగ్గు ఉత్పత్తి రంగంలో సింగరేణికి వందేళ్లకు పైగా అనుభవం ఉంది. అయితే వందేళ్ల క్రితం సాంకేతిక పరిజ్ఞానం ప్రస్తుతం ఉన్న స్థాయిలో లేదు. అందుకే గతంలో ప్రారంభించిన అనేక భూగర్భ గనుల్లో లక్షలాది టన్నుల బొగ్గు వెలికి తీయకుండా వదిలేయాల్సి వచ్చింది. ఇలాంటి గనులు ఇల్లెందు, కొత్తగూడెం, బెల్లంపల్లి, రామగుండం-1 ఏరియాల్లో ఎక్కువగా ఉన్నాయి. అంతే కాక భూమి లోపలి పొరల్లో 300 మీటర్ల కంటే లోతులో బొగ్గు నిక్షేపాలు ఉంటే వాటిని భూగర్భ గని ద్వారా.. అంతకంటే పైకి ఉంటే ఉపరితల గని ద్వారా వెలికి తీస్తున్నారు. అయితే భూగర్భ గనితో పోల్చినప్పుడు ఉపరితల గనిలో ఉత్పత్తి వ్యయం తక్కువగా ఉంటోంది. అందువల్ల భూగర్భ గనులు ప్రారంభించేందుకు సింగరేణి ఆసక్తి చూపించడం లేదు. ఫలితంగా ఇప్పటికే 300 మీటర్ల లోతులో గుర్తించిన అనేక బ్లాక్‌ల్లో బొగ్గు నిక్షేపాలను వెలికితీయకుండా వదిలేసింది. మరోవైపు గోదావరి లోయ ప్రాంతంలో నిక్షిప్తమైన బొగ్గులో ఎక్కువ బూడిద శాతం ఉంటోంది. ఇలాంటి బొగ్గుకు మార్కెట్‌లో మంచి ధర రావడం లేదు. దీంతో ఇలాంటి నిక్షేపాల దగ్గర సింగరేణి మైనింగ్ చేయడం లేదు. ఇలాంటి ప్రదేశాలు కోల్ గ్యాసిఫికేషన్ టెక్నాలజీ ఉపయోగించేందుకు అనువైన ప్రదేశాలుగా ప్రాథమిక నిర్ధారణకు వచ్చారు.

## కోల్‌ఇండియా సూచనలు.. కేంద్రం ప్రోత్సాహకాలు



### పైలట్ ప్రాజెక్టుగా..

**కోల్ గ్యాసిఫికేషన్ టెక్నాలజీని ప్రోత్సహించాలని కేం**ద్రం నిర్ణయించింది. వచ్చే 2030 నాటికి కోల్ గ్యాసిఫికేషన్ లక్ష్యం వంద టన్నులుగా పెట్టుకుంది. ఇందుకోసం ప్రయత్నించే కంపెనీలకు రూ.8,500 కోట్ల ప్రోత్సాహకాలు అందిస్తామని ప్రకటించింది. దీంతో అన్ని పెద్ద కంపెనీలు ఇటువైపు అడుగులు వేయక తప్పని పరిస్థితులు నెలకొన్నాయి. అయితే కోల్ ఇండియాతో పోలిస్తే సింగరేణి విస్తరించిన గోదావరి లోయ ప్రాంతంలో ఉన్న భౌగోళిక పరిస్థితులు, భూమి లోపలి పొరల్లో ఉన్న బొగ్గు నిక్షేపాలు, వాటిలో అధికంగా ఉన్న బూడిద శాతం వంటి అంశాలు సింగరేణికే ఎక్కువ ప్రయోజనకారిగా ఉన్నాయి. దీంతో కోల్ గ్యాసిఫికేషన్ వైపు దృష్టి సారించాలని సింగరేణి నిర్ణయించింది.

### రాబోయే రెండేళ్లలో..

రాబోయే రెండేళ్లలో ఇల్లెందు, బెల్లంపల్లి, కొత్తగూడెం ఏరియాల్లో మూసివేసిన గనులు, గోదావరి వ్యాలీలోని బొగ్గు నిక్షేపాలు గుర్తించిన ప్రాంతాల్లో ఏ సైట్ కోల్ గ్యాసిఫికేషన్ ప్రక్రియకు అనువుగా ఉంటుందనే అంశాలను నిర్ధారించనున్నారు. ఆ తర్వాత ఎంపిక చేసిన సైటులో రెండేళ్ల పాటు వివిధ సాంకేతిక పరీక్షలు జరిపి పైలట్ ప్రాజెక్టు చేపట్టనున్నారు. అక్కడ వచ్చే ఫలితాల ఆధారంగా తదుపరి నిర్ణయం తీసుకోనున్నట్టు సమాచారం. థర్మల్, సౌర విద్యుత్ రంగంలో ఇప్పుడిప్పుడే సింగరేణి స్థిరపడుతోంది. పంప్డ్ స్టోరేజీ, బ్యాటరీ స్టోరేజీ విద్యుత్ ప్లాంట్లు, బొగ్గు బ్లాకుల వేలం ప్రక్రియ ఇప్పుడే మొదలైంది. తెలంగాణ వెలుపల రాజస్థాన్, ఒడిశాలలో సంస్థ అడుగు పెట్టింది. ఈ ప్రాజెక్టులు పట్టాలపైకి ఎక్కగానే కోల్ గ్యాసిఫికేషన్ ప్రక్రియ మొదలు పెట్టనున్నారు. అప్పటి వరకు ఈ రంగంలో పనిచేస్తున్న అంతర్జాతీయ సంస్థల పనితీరును పరిశీలించాలనే యోచనకు సంస్థ వచ్చింది.

## చీరలు రక్షణ కల్పిం'చేను'!



తన పచ్చని చేనుపై ఇతరుల దిష్టి పడకుండా, రోడ్డువెంట వెళ్లే పశువులు చేనులోకి రాకుండా ఒక రైతు చీరలతో రక్షణ కంచె ఏర్పాటు చేశాడు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం వెంకటగిరి గ్రామం నుంచి కాట్రపల్లి వైపు వెళ్లే దారివెంట ఉన్న వరిచేనుకు.. సదరు రైతు దారి పొడవునా రంగురంగుల చీరలను పంట రక్షణ కోసం కట్టాడు. అటు వెళ్లేవారంతా చీరలను ఆసక్తిగా తిలకిస్తున్నారు.

\- కేసముద్రం

## సుప్రీం తీర్పును స్వాగతించిన కాంగ్రెస్

- బీసీలకు రిజర్వేషన్ల కోసం అన్ని రకాలుగా పోరాడుతాం
- హైకోర్టులోనూ సానుకూల తీర్పును ఆశిస్తున్నాం: టీపీసీసీ చీఫ్ మహేశ్‌గౌడ్



**సాక్షి, హైదరాబాద్:** బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా దాఖలైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు కొట్టివేయడాన్ని అధికార కాంగ్రెస్ పార్టీ స్వాగతించింది. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు శుభపరిణామమని టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ బి.మహేశ్‌కుమార్‌గౌడ్ వ్యాఖ్యానించారు. ఆ పిటిషన్‌ను కొట్టివేయడాన్ని స్వాగతిస్తున్నామని, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించే విషయంలో అన్ని రకాలుగా పోరాడుతామని, కచ్చితంగా సాధించి తీరుతామని సోమవారం మీడియాతో మాట్లాడుతూ ధీమా వ్యక్తం చేశారు. ఈనెల 8న హైకోర్టులో కూడా ప్రభుత్వానికి సానుకూల తీర్పు వస్తుందన్న ఆశాభావం వ్యక్తం చేశారు. రాహుల్, రేవంత్, మీనాక్షిలు బీసీలకు రిజర్వేషన్ల కల్పన కోసం నిరంతరం కృషి చేస్తున్నారని, అన్ని వర్గాలు ప్రభుత్వానికి సహకరించాలని మహేశ్‌గౌడ్ కోరారు.

**మా పొట్ట కొట్టొద్దు: వీహెచ్**

సుప్రీంకోర్టు తీర్పును స్వాగతిస్తున్నట్టు కాంగ్రెస్ సీనియర్ నేత, మాజీ ఎంపీ వి.హనుమంతరావు చెప్పారు. ఆయన మీడియాతో మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వడానికి కాంగ్రెస్ పార్టీ కట్టుబడి ఉందన్నారు. రిజర్వేషన్లను అడ్డుకొని బీసీల పొట్ట కొట్టవద్దని విజ్ఞప్తి చేశారు.

**హైకోర్టులోనూ సానుకూల తీర్పు వస్తుంది : గ్రంథాలయ సంస్థ చైర్మన్ రియాజ్**

బీసీల రిజర్వేషన్ల కోసం రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో చట్టబద్ధమైనదని తాము భావిస్తున్నామని, హైకోర్టులో కూడా సానుకూల తీర్పు వస్తుందని రాష్ట్ర గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎండీ.రియాజ్ ఆశాభావం వ్యక్తం చేశారు. తెలంగాణ ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు కట్టుబడి ఉందని చెప్పారు.

**కేటీఆర్ హస్తం ఉంది : చనగాని దయాకర్,**

బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకంగా కోర్టుల్లో పిటిషన్లు దాఖలు చేసిన మాధవరెడ్డి, గోపాల్‌రెడ్డిల వెనుక బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ హస్తం ఉందని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి చనగాని దయాకర్ ఆరోపించారు. స్థానిక సంస్థలకు ఎన్నికలు జరగొద్దనేది బీఆర్ఎస్, బీజేపీ కుట్ర అని, అందుకే ఏదో ఒక విధంగా ప్రభుత్వం తెచ్చిన జీవోను అడ్డుకునే ప్రయత్నం చేస్తున్నారన్నారు.

## బార్బడోస్‌కు మండలి చైర్మన్, అసెంబ్లీ స్పీకర్

**సాక్షి, హైదరాబాద్:** ఈ నెల 11 నుంచి బార్బడోస్ దేశ రాజధాని బ్రిడ్జిటౌన్‌లో జరగనున్న 68వ కామన్వెల్త్ పార్లమెంటరీ అసోసియేషన్ (సీపీఏ) కాన్ఫరెన్స్‌లో మండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పాల్గొంటారు. ఈ మేరకు వారు సోమవారం శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బయల్దేరారు. వారితో పాటు మండలి చైర్మన్ సతీమణి అరుంధతి, డిప్యూటీ చైర్మన్ బండా ప్రకాశ్ ముదిరాజ్, ఆయన సతీమణి అనిత, లెజిస్లేచర్ సెక్రటరీ డాక్టర్ వి.నరసింహాచార్యులు, అధికారులు కూడా పాల్గొంటారు. అనంతరం స్టడీటూర్లో భాగంగా యునైటెడ్ కింగ్‌డమ్, ఫ్రాన్స్, ఇటలీ దేశాలలో తెలంగాణ శాసనమండలి బృందం పర్యటించనుంది.

## సీఎం, మంత్రి పొన్నంలది శిఖండి రాజకీయం

**బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బూర నర్సయ్య**



**సాక్షి, హైదరాబాద్:** బీసీలను అడ్డం పెట్టుకుని సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి పొన్నం ప్రభాకర్ శిఖండి రాజకీయం చేస్తున్నారని బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్ మండిపడ్డారు. హైకోర్టులో రిజర్వేషన్ల అంశంపై విచారణ జరగనుండగా.. సుప్రీంకోర్టులో పడిన కేసుపై మంత్రులు సైతం ఢిల్లీ వెళ్లి రాజకీయ నాటకం నడిపారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ సర్కార్‌కు బీసీల పట్ల ఏమాత్రం చిత్తశుద్ధి లేదని ఆయన ఓ ప్రకటనలో విమర్శించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసమే బీసీ విధానమంటూ, బీసీ రిజర్వేషన్లు అంటూ ఊరిస్తూ ప్రభుత్వం రెండేళ్లు పబ్బం గడిపిందని ధ్వజమెత్తారు. ముందుగా చట్టసవరణ చేయకుండా ఆర్డినెన్స్ తేవడం వంటి చర్యలన్నీ రాజకీయ డ్రామాగానే కనిపిస్తున్నాయని నర్సయ్య విమర్శించారు.

# ఉపాధి ఆశ.. వలస కార్మికుల గోస

## యూఏఈలో పెరుగుతున్న మోసాలు

- పావులుగా మారుతున్న వలస కార్మికులు
- వలస కార్మికుల పేరిట సిమ్ కార్డులు పొంది బ్యాంకు ఖాతాలు తెరిపించి లావాదేవీలు
- బ్యాంకుల నుంచి భారీ మొత్తంలో రుణాలు, క్రెడిట్ కార్డులు తీసుకుని ఎగవేత
- చివరికి జైలు పాలవుతున్న వలస కార్మికులు

**మోర్తాడ్ (బాల్కొండ):**

నిజామాబాద్ జిల్లా మోర్తాడ్‌కు చెందిన బాస గణేశ్ యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ)లోని అబుదాబిలో వ్యవసాయ పనులు చేసేందుకు రెండేళ్ల క్రితం వలస వెళ్లాడు. అతనిపై దుబాయ్‌లోని రషీదియా పోలీసు స్టేషన్‌లో సెల్‌ఫోన్ సిమ్‌కార్డు తీసుకుని బ్యాంకు ఖాతా తెరిచి లావాదేవీలను నిర్వహించినట్లు కేసు నమోదైంది. గణేశ్ ఉండేది అబుదాబిలోనైతే.. దుబాయ్‌లో కేసు నమోదు కావడం గమనార్హం.

వేల్పూర్ మండలం పడగల్‌కు చెందిన గంగాప్రసాద్ మాల్టా వెళ్లడానికి ఏజెంట్లను ఆశ్రయించాడు. మొదట దుబాయ్‌కి తీసుకెళ్లిన ఏజెంట్లు.. అక్కడ అతని పేరుతో ఒక భవనం అద్దెకు తీసుకున్నారు. ఆ భవన యజమానికి ఇచ్చిన చెక్కులు చెల్లుబాటు కాకపోవడంతో అతన్ని అబుదాబి పోలీసులు అరెస్టు చేశారు.

అద్దె ఒప్పందం, చెల్లని చెక్కులు ఇచ్చినందుకు మన కరెన్సీలో తొలి విడతగా రూ.50 వేల జరిమానా చెల్లించాడు. కేసు పూర్తయ్యే వరకూ అతను దుబాయ్ విడిచి ఎక్కడికి వెళ్లకుండా ఆంక్షలు విధించారు. గంగాప్రసాద్ ఇంటికి రావాలంటే కనీసం రూ.3 లక్షల వరకూ జరిమానాను భరించాల్సి ఉంది. గత జూన్ నెల నుంచి గణేశ్ దుబాయ్ పోలీసుల అదుపులో ఉండగా.. గంగాప్రసాద్ జైలు నుంచి బయటకు వచ్చినా ఇంటికి రాలేని స్థితిలో ఉండిపోయాడు.

### ఎందరో బాధితులు

ఇలా.. గణేశ్, గంగా ప్రసాద్ లాంటి ఎంతో మంది యూఏఈలోని వివిధ ప్రాంతాల్లో క్రిమినల్ కేసులను ఎదుర్కొంటున్నారు. కొందరు ఇంటికి రావడం కోసం రూ.లక్షల్లో జరిమానాలను సొంతంగా చెల్లించి బతుకు జీవుడా అంటూ యూఏఈని వీడారు. మరికొందరు మాత్రం యూఏఈ విడిచి ఇంటికి రాలేక నరకయాతన అనుభవిస్తున్నారు. యూఏఈలోని దళారులు కొందరు వలస కార్మికులను లక్ష్యంగా చేసుకుని ఆర్థికంగా దోచుకుంటూ.. నేరాలను మాత్రం వలసదారులపై నెట్టివేస్తున్నారు. మన ప్రాంతంలో సైబర్ మోసాల బారిన పడి ఖాతాలను ఖాళీ చేసుకుంటున్నట్లు.. యూఏఈకి వెళ్లిన వలస కార్మికులు అక్కడ తెలిసీ తెలియక తమ పాస్‌పోర్టు, గుర్తింపు కార్డుల నకలు కాపీలను దళారులకు ఇచ్చి ఆర్థిక దోపిడీ కుట్రకు బలవుతున్నారు. గతంలో ఏజెంట్లు వీసాలు ఇవ్వకుండా మోసం చేయడం, పని చేయించుకుని వేతనాలు ఎగ్గొట్టేవారికి కార్మికులను అప్పగించడం లాంటివి చేసి తమ జేబులు నింపుకొనేవారు. ఇప్పుడు మాత్రం వలస కార్మికులను తరలించి వారి గుర్తింపు పత్రాలతో ఆర్థిక నేరాలకు పాల్పడుతూ ఆ నెపం కార్మికులపై వేసి చేతులు దులుపుకొంటున్నారు. యూఏఈలో దళారుల కుట్రలకు బలైన వలస కార్మికుల సంఖ్య వందకు పైగా ఉంటుందని కార్మిక సంఘాల లెక్కలు వెల్లడిస్తున్నాయి. కార్మికులు అప్రమత్తంగా ఉంటేనే దళారుల కుట్రలకు బలికాకుండా ఉంటారని పలువురు సూచిస్తున్నారు.




అబుదాబి పోలీసుల చెరలో ఉన్న తమ కొడుకును విడిపించాలని ప్రవాసీ ప్రజావాణిలో విన్నవిస్తున్న గణేశ్ తల్లి, సోదరి

### అత్యాశకు పోవడమే పాపమైతుంది..



వలస కార్మికులకు తక్కువ సమయంలో ఎక్కువ డబ్బులు వస్తాయని దళారులు ఆశ చూపుతున్నారు. దళారులు ఆర్థిక నేరాలకు ప్రోత్సహిస్తున్నారు. ఈ కుట్ర వల్ల దళారులు ఎక్కువ డబ్బులు కాజేస్తున్నారు. ఎంతో కొంత వలస కార్మికుల చేతుల్లో పెడుతున్నారు. కొన్నిచోట్ల మొత్తానికి ఇవ్వడం లేదు. వలస కార్మికులు దీనిని గమనించి జాగ్రత్తగా వ్యవహరించాలి.

\- మంద భీంరెడ్డి, గల్ఫ్ వ్యవహారాల విశ్లేషకుడు

## ఆ ఆస్తి పరిరక్షణకు ఆదేశాలివ్వలేం: హైకోర్టు

**డాక్టర్ జాకీర్ హుస్సేన్ నివసించారనేందుకు ఆధారల్లేవని స్పష్టీకరణ**



**సాక్షి, హైదరాబాద్:** పురావస్తు ప్రదేశాల చట్టం లేదా పట్టణాభివృద్ధి సంస్థ నిబంధనల ప్రకారం రూపొందించిన వారసత్వ భవనాల జాబితాలో హైదరాబాద్ బేగంబజార్‌లో మాజీ రాష్ట్రపతి దివంగత జాకీర్ హుస్సేన్ నివసించిన భవన ప్రాంగణాన్ని చేర్చకపోవడాన్ని సవాల్ చేస్తూ దాఖలైన పిటిషన్‌ను హైకోర్టు కొట్టేసింది. ఈ పిటిషన్‌పై జస్టిస్ లక్ష్మీనారాయణ అలిశెట్టి విచారణ చేపట్టారు. పిటిషనర్ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ డాక్టర్ జాకీర్ హుస్సేన్ 1897 ఫిబ్రవరి 8న ఆ భవన ప్రాంగణంలోనే పుట్టడంతోపాటు ఎనిమిదేళ్లు అక్కడే నివసించారన్నారు. ఆ ఆస్తికి చారిత్రక ప్రాముఖ్యత ఉందని, దీని చారిత్రక విలువ, నిర్మాణ ప్రాముఖ్యతపై పలు పత్రికలు కథనాలను ప్రచురించాయన్నారు. భవన యజమానులు దాన్ని కూల్చేసేందుకు ప్రయత్నిస్తున్నందున దీన్ని వారసత్వ భవనంగా గుర్తించాలని ఎమ్మెల్యే మోజంఖాన్ అధికారులకు లేఖ రాసినా స్పందించలేదని నివేదించారు. హెచ్ఎండీఏ తరఫు న్యాయవాది వాదనలు వినిపిస్తూ పిటిషనర్ ఆ ఆస్తిలో కేవలం అద్దెకు ఉంటున్నారని వివరించారు. ఆ ఆస్తిని వారసత్వ భవనంగా ప్రకటించాలని పిటిషన్ దాఖలు చేసే అర్హత ఆమెకు లేదన్నారు. వాదనలు విన్న న్యాయమూర్తి డాక్టర్ జాకీర్ హుస్సేన్ ఆ ఆస్తిలో నివసించారన్న వాదనను ధ్రువీకరించే ఆధారాలు సమర్పించలేదని పేర్కొంటూ పిటిషన్‌ను కొట్టివేస్తూ తుది ఉత్తర్వులు జారీ చేశారు.

## 'జూబ్లీహిల్స్'పై బీజేపీతో బీఆర్ఎస్ అనైతిక అవగాహన

**కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి విమర్శ**



**సాక్షి, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉపఎన్నికలో కాంగ్రెస్ పార్టీ గెలుపు ఖాయమని తేలడంతో బీఆర్ఎస్ పార్టీ అనైతిక అవగాహన కుదుర్చుకునేందుకు కుట్రలు చేస్తోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ విజయశాంతి ఆరోపించారు. 'జూబ్లీహిల్స్ ఎన్నికలో బీజేపీ పోటీ చేస్తున్న కారణంగా మిత్ర ధర్మం కోసం ఈ ఎన్నికల్లో పోటీ నుంచి వైదొలగుతున్నట్టు తెలుగుదేశం పార్టీ ప్రకటించింది. బీజేపీ డమ్మీ అభ్యర్థిని బరిలో కి దింపి తన రహస్య మిత్రపక్షమైన బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు వ్యూహాలు రచిస్తున్నట్టు ప్రచారం జరుగుతోంది. పైకి బీజేపీకి మద్దతిస్తున్నట్టు టీడీపీ ప్రకటించినా, రహస్యంగా బీఆర్ఎస్ గెలుపు కోసం తెలుగుదేశం కార్యకర్తలు పనిచేయాలని సందేశం పంపినట్టు తెలుస్తోంది. కాంగ్రెస్ విజయావకాశాలను దెబ్బతీయాలనే కుట్రతో టీడీపీ మద్దతు బీఆర్ఎస్‌కు లభించే విధంగా బీజేపీ రహస్య అవగాహన కుదిర్చినట్టు సమాచారం. బీఆర్ఎస్, బీజేపీ, టీడీపీల అవకాశవాద రాజకీయాన్ని జూబ్లీహిల్స్ ఓటర్లకు వివరించే బాధ్యతను స్థానికంగా ఉన్న ప్రతి కాంగ్రెస్ కార్యకర్త తీసుకోవాలని కోరుతున్నాను' అని సోమవారం విజయశాంతి ఎక్స్ వేదికగా పిలుపునిచ్చారు.

## సాటి మంత్రిని అవమానిస్తారా?

**మంత్రి పొన్నంను ప్రశ్నించిన సతీశ్ మాదిగ**

**సాక్షి, హైదరాబాద్:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో జరుగుతున్న సమావేశానికి ఆలస్యంగా వచ్చారంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌ను 'దున్నపోతుగాడు' అని మంత్రి పొన్నం ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలు అత్యంత బాధాకరమని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి దేవని సతీశ్ మాదిగ వ్యాఖ్యానించారు. మదమెక్కిన దున్నలాగా పొన్నం ప్రభాకర్ ప్రవర్తించారని, వెంటనే పొన్నంను మంత్రి పదవి నుంచి బర్తరఫ్ చేయాలని సోమవారం ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఇది దళిత జాతికి అవమానమని, దీన్ని సీఎం రేవంత్‌రెడ్డి సీరియస్‌గా తీసుకోవాలని, లక్ష్మణ్‌కు పొన్నం క్షమాపణ చెప్పాలని ఆయన కోరారు.

## కాంగ్రెస్ వైఫల్యాలు బీజేపీపై రుద్దుతారా?

**బీజేపీ కార్యదర్శి రవి**

**సాక్షి, హైదరాబాద్:** కాంగ్రెస్ తన వైఫల్యాలు, చేతగానితనాన్ని, తెలివితక్కువతనాన్ని బీజేపీపై రుద్దాలనుకోవడం.. ఆ పార్టీ అవివేకానికి నిదర్శనమని బీజేపీ కార్యదర్శి తూట్‌పల్లి రవి విమర్శించారు. బీసీ రిజర్వేషన్ల విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ మాటలు దిగజారుడుతనానికి నిదర్శనమని ఒక ప్రకటనలో మండిపడ్డారు. బీజేపీ ఎప్పుడూ బీసీ రిజర్వేషన్లకు మద్దతుగా నిలుస్తుందని రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు పదేపదే స్పష్టం చేస్తున్నా.. కాంగ్రెస్ నేతలు దానిని పక్కదారి పట్టించే ప్రయత్నం చేస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ తొందరపాటుతనంతో కోర్టులో చుక్కెదురయ్యే పరిస్థితులుంటే.. దానిని బీజేపీపై రుద్దడం పొన్నం ప్రభాకర్ అవివేకానికి నిదర్శనమని పేర్కొన్నారు.

## సుప్రీంకోర్టు నిర్ణయం ప్రభుత్వ విజయం కాదు

**ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్న**

**సాక్షి, న్యూఢిల్లీ:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు వర్తింప జేస్తూ తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9పై దాఖ లైన పిటిషన్‌ను సుప్రీంకోర్టు డిస్మిస్ చేయడం ప్రభుత్వ విజ యం కాదని ఎమ్మెల్సీ, తెలంగాణ రాజ్యాధికార పార్టీ అధ్యక్షుడు తీన్మార్ మల్లన్న అన్నారు. దీనిని 'ఆపరేషన్ సక్సెస్ పేషంట్ డెడ్' లాంటి పరిస్థితిగా అభివర్ణించారు. సుప్రీంకోర్టు నిర్ణయం అనంతరం ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడారు. బీసీలను మోసగించే ప్రయత్నం జరుగుతోందని, బీసీ రిజర్వేషన్లను సీఎం రేవంత్‌రెడ్డి అడ్డుకోవాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిన జీవో 9 న్యాయస్థానాల్లో చెల్లదని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్లను అడ్డుకోవాలని కొందరు ప్రయత్నిస్తున్నారని, రెడ్డి సోదరులు అలా చేయవద్దని నవీన్ విజ్ఞప్తి చేశారు.

**బీసీని సీఎం చేయాలి: కేఏ పాల్**

బీసీల సంక్షేమంపై కాంగ్రెస్ పార్టీకి చిత్తశుద్ధి ఉంటే బీసీని సీఎం చేయాలని ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు ప్రాంగణంలో ఆయన మీడియాతో మాట్లాడారు. బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామన్నారు. 52 శాతం ఉన్న బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించడం న్యాయబద్ధమని చెప్పారు.

## రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2,600 కోట్లు బకాయి పడింది

**బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు బస్వ లక్ష్మీనర్సయ్య**

**సాక్షి, హైదరాబాద్:** రాష్ట్ర ప్రభుత్వం రైతులకు రూ.2,600 కోట్లు బకాయి పడిందని బీజేపీ కిసాన్ మోర్చా అధ్యక్షుడు బస్వ లక్ష్మీనర్సయ్య అన్నారు. సోమవారం ఆయన మీడియాతో మాట్లాడుతూ పంట కొనుగోలుకు బోనస్ కింద ఇవ్వాల్సిన మొత్తం కూడా ఇవ్వలేదని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వం ఏ మొహం పెట్టుకొని స్థానిక ఎన్నికల్లో ఓట్లు అడుగుతుందని ప్రశ్నించారు. అధికారులే యూరియాను బ్లాక్ మార్కెట్‌కు తరలించారని ఆరోపించారు. అకాల వర్షాలతో పంటలు దెబ్బతిన్నాయని, ఎకరానికి రూ.10వేలు ఇస్తామని సీఎం రేవంత్‌రెడ్డి చెప్పినా ఈ హామీ కూడా అమలు కాలేదన్నారు. వరిపంట చేతికి వచ్చినా ఎక్కడా కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయలేదని, వాటిని వెంటనే ఏర్పాటు చేయాలంటూ మంగళవారం జిల్లా కలెక్టర్లకు వినతిపత్రాలు సమర్పిస్తామని తెలిపారు.

**మద్దూర్ ఘటనపై విచారణ జరపాలి: బీజేపీ డిమాండ్**

నారాయణపేట జిల్లా మద్దూర్‌లోని ఓ కంటి ఆస్పత్రి నిర్వాహకుడు రాసిన సూసైడ్ నోట్‌పై అన్ని సాక్ష్యాధారాలను సేకరించి వెంటనే సమగ్ర విచారణ చేపట్టాలని బీజేపీ ప్రధాన కార్యదర్శి డా.ఎన్.గౌతంరావు డిమాండ్ చేశారు.మద్దూర్ నివాసి వర్థ రాంచంద్రయ్య సూసైడ్ నోట్, పాత్లవత్ రమేశ్ నాయక్ పేర్కొన్న వివరాల ప్రకారం...ఈ ఘటనలో ఆత్మహత్యకు ప్రేరేపణ, శారీరక హింస, మోసం, బ్లాక్‌మెయిల్, కిడ్నాప్, బలవంతపు మతమార్పిడి (లవ్ జిహాద్), ఎస్సీ, ఎస్టీ దూషణలు, హవాలా/నకిలీ బంగారు నాణేల లావాదేవీలు వంటి తీవ్ర నేరపూర్వక చర్యలు చోటుచేసుకున్నాయని తెలిపారు.

# కళాపోషణ లేక..

● వైభవం కోల్పోతున్న రంగస్థలం ● ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో కొన్నిచోట్లే ప్రదర్శనలు

● చిన్న నాటకాలు, ఆ కళాకారులకు ఆదరణ కరవు

**కొత్తపేట:** కళా'పోషణ' కనుమరుగవుతోంది.. నాటక రంగం పూర్వ వైభవాన్ని కోల్పోతోంది.. కళాకారులకు పూట గడవడమే కష్టమవుతోంది.. ఒకప్పుడు ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాలో ఒక వెలుగు వెలిగిన రంగస్థల పౌరాణిక నాటక రంగంపై క్రమంగా చీకట్లు కమ్ముకుంటున్నాయి. గతంలో ఊరూరా నాటక ప్రదర్శనలతో సందడి నెలకొనేది. అనేక ఉత్సవాల్లో రంగస్థల వేదికలపై పౌరాణిక, జానపద, సాంఘిక నాటకాలతో కళావైభవం కనువిందు చేసేది. ప్రస్తుతం ఇది కొన్ని ఉత్సవ పందిర్లకే పరిమితమైంది. పెద్ద నాటకాల్లో కళాకారులకే ప్రాధాన్యం లభిస్తోంది. చిన్న నాటకాలు, ఆ కళాకారులకు ఉపాధి దూరమైంది. ప్రస్తుతం వారి పరిస్థితి రంగులు వెలిసిన జీవితంగా మారింది. దక్షిణాది రాష్ట్రాల్లో తెలుగు నాటక రంగంలో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లాకు ప్రత్యేక స్థానం ఉంది. జిల్లాకు చెందిన రంగస్థల నటుల్లో పేరు ప్రఖ్యాతులు పొందిన వారెందరో ఉన్నారు. లవకుశ సినిమా రాక ముందే చింతా సుబ్బారావు నేతృత్వంలో లవకుశ డ్రామా ట్రూపు ఉండేదట. అప్పట్లో ఆ నాటకం ప్రేక్షకాదరణ పొందిందని చెబుతూంటారు. తరువాత రాజానగరం మండలం సంపత్ నగరం గ్రామానికి చెందిన పేపకాయల లక్ష్మణరావు (సంపత్ నగరం లక్ష్మణరావు) ఆంజనేయుని పాత్ర పోషించి దక్షిణాది రాష్ట్రాల్లో ప్రదర్శనలు ఇచ్చి అభినవ ఆంజనేయునిగా పేరొందారు. రాష్ట్ర ప్రభుత్వ నంది పురస్కారం అందుకున్నారు. కొత్తపేటకు చెందిన జగత పెద్దకాపు 1960–75 మధ్య కాలంలో దుర్యోధనుడు, విశ్వామిత్రుడు తదితర పాత్రలకు జీవం పోశారు. కోరుకొండకు చెందిన ఎస్వీఎల్ ఆచారి దుర్యోధనుడిగా రాణించారు. కృష్ణుడిగా సత్యంశెట్టి (ద్వారపూడి) సూర్యారావు, ఆయన తనయుడు శేషగిరిరావు, యెరుబండి మందేశ్వరరావు, కోట నాగేశ్వరరావు, సుబ్బిశెట్టిగా పడాల సుందరం (జూనియర్ రేలంగి), మాయల ఫకీర్‌గా బెజవాడ రామారావు, బత్తిన నాగేశ్వరరావు, ధర్మరాజుగా నరేంద్రపురపు గంగరాజు, కొమ్మిశెట్టి పెద వీర్రాజు, అర్జునుడిగా తంబాబత్తుల నాగేశ్వరరావు తదితర నటులు రంగస్థలంపై తమ నటనా కౌశలాన్ని చాటారు. అలాగే ప్రస్తుతం శ్రీరాముడిగా సంపత్ నగరం లక్ష్మణరావు కుమారుడు పి.రామాంజనేయులు, ఆయన తనయుడు జూనియర్ లక్ష్మణరావు ఆంజనేయుడిగా, చింతామణిలో శ్రీహరిగా పుణ్యక్షేత్రం సత్యప్రసాద్ తదితరులు రాణిస్తున్నారు.

### మనుగడ లేని డ్రెస్ కంపెనీలు

ఒకప్పుడు డ్రామా డ్రెస్ కంపెనీలు ఎక్కువగా ఉండేవి. నటులకు వివిధ నాటకాల్లో ధరించే పాత్రలకు సంబంధించిన డ్రెస్‌లు, విగ్గులు, కిరీటాలు, గద, విల్లంబులు, కత్తులు వంటి ఆయుధాల నమూనాలు వంటి సామగ్రి అద్దెకు ఇచ్చేవారు. ప్రదర్శన పూర్తయిన తరువాత ఆ సామగ్రిలో నలిగిన వాటిని బాగు చేసి మరో ప్రదర్శనకు సిద్ధం చేసేవారు. ఇలాంటి డ్రామా డ్రెస్ కంపెనీలు పట్టణాల్లో ఉండేవి. ఒక్క రాజమహేంద్రవరంలోనే 10 వరకూ నిర్వహించేవారు. ప్రస్తుతం నాటకాలకు ఆదరణ తగ్గిపోవడంతో డ్రామా డ్రెస్ కంపెనీలు కనుమరుగయ్యాయి.



సత్యహరిశ్చంద్ర నాటకంలో ఓ సన్నివేశం




దేవనర్తకి నాటకంలో చింతామణి నృత్య సన్నివేశం

### హార్మోనిస్టుల పాత్ర కీలకం

రంగస్థల నాటకానికి హార్మోనియం ప్రధానం. నాటక కళాకారుడు ఎంత బాగా పాడినా, పద్య రాగాలాపన చేసినా దానికి హార్మోనియం, డోలక్, క్లారినెట్ సహకారం అవసరం. వేదికపై నటుడి కృషి ఎంతో ఉంటుందో, స్టేజీ ముందు హార్మోనియం, డోలక్, క్లారినెట్ కళాకారుల కృషి కూడా అంతే ఉంటుంది. ఇటువంటి కళాకారులు జిల్లాలో ఎంతో మంది ప్రతిభ చూపి తెర మరుగయ్యారు. ప్రస్తుతం రాజమహేంద్రవరానికి చెందిన కలిగట్ల వెంకటరమణ, సత్తిబాబు, సీతానగరం మండలం రఘుదేవపురానికి చెందిన మైలవరపు శ్రీనివాస్ నాయుడు, కోరుకొండకు చెందిన సుబ్రహ్మణ్యం, నరేంద్రపురానికి చెందిన టేకి వీరబాబు తదితరులు హార్మోనిస్టులుగా రాణిస్తున్నారు.

### ఎందరున్నా కొందరికే..

ప్రస్తుత తరం నటీనటుల్లో కేవలం కొందరికే నాటక అవకాశాలు లభిస్తున్నాయి. ఉమ్మడి జిల్లాలో రాజమహేంద్రవరం, అమలాపురం, కొత్తపేట, కడియం, వాడపాలెం, వానపల్లి, అవిడి, రామచంద్రపురం, తుని, ద్రాక్షారామ, తుని, జగ్గంపేట, కాకినాడ, యానాం, తాళ్లరేవు, చల్లపల్లి, సీతానగరం, అనపర్తి, రాజోలు, రాజానగరం, బిక్కవోలు, పెద్దాపురం, సామర్లకోట, మండపేట, ముమ్మిడివరం తదితర అనేక ప్రాంతాల్లో గణపతి నవరాత్రులు, దేవీ నవరాత్రులతో పాటు శ్రీరామ నవమి, శ్రీకృష్ణాష్టమి, సుబ్రహ్మణ్య షష్ఠి, ముక్కోటి ఏకాదశి వంటి పర్వదినాలను పురస్కరించుకుని వరుసగా 9, 10 రోజులు నాటక ప్రదర్శనలు నిర్వహించేవారు. దానితో రాష్ట్రవ్యాప్తంగా పేరొందిన పెద్ద కళాకారులకే కాక చిన్న కళాకారులకు కూడా అవకాశాలు లభించేవి. కాలక్రమేణా పందిర్ల లైటింగ్, తదితర ఏర్పాట్లు, ఉత్సవాల ఖర్చు పెరగడంతో పాటు ఆర్టిస్టుల పారితోషికం అధికమవడంతో అనేక పందిర్లలో నాటక ప్రదర్శనలకు స్వస్తి చెప్పారు. రాజమహేంద్రవరం దేవీచౌక్, చాగల్లు, అమలాపురం, కడియం వంటి పలు పందిర్లలో ఐదారు నాటకాలు ప్రదర్శిస్తుండగా, మరో ఐదారు పందిర్లలో కళా ప్రోత్సాహకుల ఆర్థిక సహకారంతో కేవలం ఒకటి, రెండు ప్రోగ్రామ్స్ పెడుతున్నారు. అవీ రాష్ట్రవ్యాప్తంగా ప్రముఖ నటులను తీసుకువచ్చి నాటకాలు వేయిస్తున్నారు. ఆ నాటకాల్లో ఒక్కో నటుడు రూ.20 నుంచి రూ.50 వేల వరకూ పారితోషికం తీసుకుంటున్నారు. అలా ఒక్కో నాటకానికి రూ.1.5 లక్షల నుంచి రూ.2 లక్షల వరకూ అవుతుంది.

### • ఉపాధి దూరమైంది



నేను డ్రామాలకు హార్మోనియం ఆర్టిస్టుగా జీవనం సాగిస్తున్నాను. ఒకప్పుడు జిల్లా వ్యాప్తంగా అనేక నాటక ప్రదర్శనలు ఇచ్చేవారు. నవరాత్రుల్లో ఖాళీ లేకుండా ప్రదర్శనలు ఉండేవి. కాలక్రమేణా ప్రేక్షకాదరణ తగ్గటంతో పాటు నాటకాల వ్యయం పెరిగిపోవడంతో అనేక ఉత్సవ కమిటీలు అంతగా ఆసక్తి చూపడం లేదు. దానితో ఎందరో కళాకారులకు ఉపాధి కరువైంది.

– కలిగట్ల వెంకటరమణ, హార్మోనియం కళాకారుడు, రాజమహేంద్రవరం

### • ప్రభుత్వం ప్రోత్సహిస్తేనే మనుగడ



నేను కురుక్షేత్రం నాటకంలో పలు పాత్రలు పోషిస్తాను. ప్రస్తుతం అవకాశాలు అంతంత మాత్రమే. ఉత్సవ కమిటీలతో పాటు ప్రభుత్వం పౌరాణిక రంగస్థల నాటక రంగానికి ప్రాధాన్యం ఇస్తేనే మాలాంటి చిన్న నటులు మనుగడ సాగించేందుకు అవకాశం ఉంటుంది. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో అనేక ప్రముఖ పుణ్యక్షేత్రాలున్నాయి. అక్కడ ఏటా వివిధ ఉత్సవాల్లో నాటక ప్రదర్శనలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి.

– అన్నందేవుల నారాయణరావు, రంగస్థల కళాకారుడు, కేశవరం, మండపేట మండలం

### • అవకాశాలు లేకుంటే పస్తులే



30 ఏళ్ల నుంచి రంగస్థల నాటక రంగంలో నటులకు అలంకరణ, డ్రెస్‌లు, సామగ్రి సప్లై చేస్తూ జీవనం సాగిస్తున్నాం. వేషాల సామగ్రి స్థానికంగా తయారు చేయడంతో పాటు చెన్నై వంటి నగరాల నుంచి కొన్ని తీసుకు వస్తాం. నాతో పాటు మరో ఐదుగురు పని చేస్తారు. గతంలో మాదిరిగా ఇప్పుడు అవకాశాలు లేవు. వేరే వృత్తిలోకి వెళ్లలేక అవకాశాలు ఉన్నప్పుడు తింటున్నాం. లేకుంటే పస్తులుంటున్నాం.

– తూము రమేష్, మేకప్ ఆర్టిస్ట్, డ్రామా డ్రెస్ కంపెనీ, రాజమహేంద్రవరం

## క్లుప్తంగా...

### ఎంజేపీ స్కూళ్ల అభివృద్ధికి సహకరించండి

**కేంద్రమంత్రి రాందాస్ అథవాలేకి మంత్రి సవిత వినతి**

**సాక్షి, అమరావతి:** రాష్ట్రంలో మహాత్మా జ్యోతిరావు పూలే బీసీ గురుకుల పాఠశాలల(ఎంజేపీ స్కూళ్ల) అభివృద్ధికి సహకరించాలని కేంద్ర సామాజిక న్యాయం, సాధికారిత శాఖ సహాయమంత్రి రాందాస్ అథవాలేకు రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత విజ్ఞప్తి చేశారు. విజయవాడ వచ్చిన కేంద్ర మంత్రిని సోమవారం కలిసిన సవిత రాష్ట్రంలో ఎంజేపీ స్కూళ్ల అభివృద్ధికి రూ.66 కోట్లు మంజూరు చేయాలని కోరారు. స్వయం ఉపాధి కోసం డీఎన్టీ కులాల లబ్ధిదారులు 3,700లకు పైగా దరఖాస్తులు చేసుకున్నారని, వాటికి కూడా పరిష్కారం చూపాలని కోరారు. మంత్రి సవిత వెంట రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ కార్యదర్శి ఎస్.సత్యనారాయణ, ఇతర బీసీ సంక్షేమ శాఖ అధికారులు ఉన్నారు.

### ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ నిధులు విడుదల చేయండి

**కేంద్ర మంత్రి రాందాస్ అథవాలేని కోరిన మంత్రి స్వామి**

**సాక్షి, అమరావతి:** రాష్ట్రానికి రావాల్సిన ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ పెండింగ్ నిధులు రూ.34 కోట్లు విడుదల చేయాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయస్వామి కేంద్రాన్ని కోరారు. విజయవాడకు వచ్చిన సోషల్ జస్టిస్, ఎంపవర్మెంట్ కేంద్ర సహాయ మంత్రి రాందాస్ అథవాలేని రాష్ట్ర మంత్రి స్వామి సోమవారం కలిశారు. అంబేడ్కర్ విదేశీ విద్య పథకానికి కేంద్రం 50 శాతం సబ్సిడీ నిధులు ఇవ్వాలని కోరారు.

### జీఎస్టీపై విద్యార్థులకు పోటీలు

**సాక్షి, అమరావతి:** ఉన్నత పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు జీఎస్టీ 2.0పై పోటీలు నిర్వహించాలని విద్యాశాఖ ఆదేశించింది. ఈ కొత్త పన్ను వ్యవస్థపై 6–10 తరగతుల విద్యార్థులకు మంగళవారం వక్తృత్వ, వ్యాస రచన, క్విజ్ పోటీలు నిర్వహించాలంది. రాష్ట్రంలోని 8,197 ఉన్నత పాఠశాలల్లో పోటీల నిర్వహణ కోసం పాఠశాల, సచివాలయం వారీగా జీఎస్టీ ఛాంపియన్లను నియమించామని, జిల్లా జీఎస్టీ నోడల్ అధికారుల సమన్వయంతో పనిచేయాలని ఆర్జేడీలు, డీఈవోలను పాఠశాల విద్యాశాఖ డైరెక్టర్ విజయ్ రామరాజు ఆదేశించారు.

### ఏపీకి 25 లక్షల పీఎంయూవై గ్యాస్ కనెక్షన్లు మంజూరు

**సాక్షి, అమరావతి:** పీఎంయూవై కింద రాష్ట్రానికి 25 లక్షల అదనపు గ్యాస్ కనెక్షన్లు మంజూరు చేసినట్టు పౌరసరఫరాల శాఖ ఎక్స్ అఫీషియో కార్యదర్శి సౌరబ్‌గౌర్ సోమవారం వెల్లడించారు. పీఎంయూవై అమలు, పర్యవేక్షణకు కలెక్టర్లు చైర్మన్లుగా జిల్లా ఉజ్వల కమిటీలను నియమిస్తూ ఉత్తర్వులిచ్చారు. దీపం–2 పథకంతోపాటు పీఎంయూవై అమలు కోసం కలెక్టర్లు లేదా వారు నియమించిన సీనియర్ అధికారి చైర్మన్‌గా, ఆయిల్ కంపెనీల నుంచి నోడల్ ఆఫీసర్ మెంబర్ కో–ఆర్డినేటర్‌గా, ఆయిల్ కంపెనీల అధికారులు ఇద్దరు సభ్యులుగా, జిల్లా పౌరసరఫరాల శాఖ అధికారి ఒక సభ్యుడిగా, మరో ఇద్దరు నాన్ అఫీషియల్ వ్యక్తులకు ఈ కమిటీలో చోటు కల్పించారు.

## అదిగదిగో జీరంగి




జీరంగి.. ఇప్పటి తరానికి మినహా అందరికీ తెలిసిందే. 30 ఏళ్ల క్రితం పిల్లలు పొలాలు, కొండ గుట్టల వెంట తిరుగుతూ చెట్లపై ఉన్న జీరంగులను పట్టుకుని ఆడుకునే వారు. వీటిని అగ్గి పెట్టెలో దాచి తుమ్మ ఆకు వేసి దాచి పెట్టేవారు. ఇవి గుడ్లు పెడుతూ ఉంటే వాటిని చూసి సంతోషపడుతూ ఉండేవారు. వర్షాకాలం వస్తే చెట్లపై ఇవి విపరీతంగా కనిపించేవి. ప్రస్తుత వాతావరణ పరిస్థితులు, రేడియేషన్ ప్రభావంతో రోజురోజుకూ అంతరించి పోతున్నాయి. కర్నూలు జిల్లా తుగ్గలి మండలంలోని ఆముదం పొలంలో ఆదివారం ఒకటి కనిపించింది. గంటల తరబడి ఏకధాటిగా శబ్దం చేసింది. సూర్యుని కిరణాలు దీనిపై పడటంతో బాగా కనిపించింది.

– తుగ్గలి, కర్నూలు జిల్లా

## జాడలేని బట్టమేక పక్షి

**వాతావరణ మార్పులే కారణమా?**



**నందికొట్కూరు:** ప్రతి ఏడాది సెప్టెంబర్ నెలలో అరుదైన బట్టమేక పక్షి.. రాజస్థాన్, కర్ణాటక రాష్ట్రాల నుంచి కర్నూలు జిల్లా నందికొట్కూరుకి వచ్చి కొన్ని నెలల పాటు ఉంటుంది. కొన్ని సందర్భాల్లో ఆ పక్షులు ఇక్కడే గుడ్లు పెడుతుంటాయి. అయితే ఈ ఏడాది ఇంత వరకు అభయారణ్యంలో బట్టమేక పక్షుల జాడ కనిపించలేదని అధికారులు చెబుతున్నారు. వీటితో పాటు సుమారు 80 నుంచి 100 పక్షి జాతులు ఇక్కడికి వస్తుంటాయి. కొల్లేరు ప్రాంతంలో అరుదుగా కనిపించే ఫ్లవింగ్ బర్డ్స్ కూడా ఇక్కడికి వస్తాయి. ఈ ఏడాది అధిక వర్షాలు కురవడం, వాతావరణంలో మార్పులు రావడంతో కొన్ని పక్షులు సమయానికి రాలేదని తెలుస్తోంది. అందువల్లే బట్టమేక పక్షి కూడా రావడానికి ఆలస్యం అయ్యి ఉంటుందన్నారు. పక్షి జాతులపై అధ్యయనం చేయడానికి చెన్నై, హైదరాబాద్, బెంగళూరు తదితర ప్రాంతాల నుంచి శాస్త్రవేత్తలు, జంతు ప్రేమికులు ప్రతి శని, ఆదివారాల్లో వస్తుంటారు. వచ్చిన వారికి వసతి కోసం రెండు గదులు ఉన్నాయి. మరిన్ని వసతులు కల్పిస్తే పక్షులను, జింకలను చూసేందుకు జంతు ప్రేమికులు, పాఠశాలల విద్యార్థులు వచ్చే అవకాశముంది. పక్షులను చూసేందుకు అభయారణ్యంలోకి వెళ్లాలంటే తప్పనిసరిగ్గా ఉన్నతాధికారుల అనుమతులు ఉండాలి.

### శ్రీవారి దర్శనానికి 24 గంటలు

**తిరుమల:** తిరుమలలో సోమవారం భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో అన్ని కంపార్ట్‌మెంట్లు నిండిపోయాయి. క్యూలైన్ శిలాతోరణం వద్దకు చేరుకుంది. ఆదివారం అర్ధరాత్రి వరకు 83,412మంది స్వామివారిని దర్శించుకున్నారు. 33,058 మంది భక్తులు తలనీలాలు అర్పించుకున్నారు. స్వామివారికి కానుకల రూపంలో హుండీలో రూ.3.89 కోట్లు సమర్పించారు. టైంస్లాట్ టిక్కెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనం లభిస్తోంది. దర్శన టిక్కెట్లు లేని వారు స్వామిని దర్శించుకునేందుకు 24 గంటల సమయం పడుతోంది. ప్రత్యేక ప్రవేశ దర్శనం టిక్కెట్లు కలిగిన వారికి 3 గంటల్లో దర్శనం లభిస్తోంది. ఇదిలా ఉంటే సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులు నిర్దేశించిన సమయానికి క్యూలోకి వెళ్లాలని టీటీడీ విజ్ఞప్తి చేస్తోంది. కేటాయించిన సమయానికంటే ముందు వెళ్లిన వారిని క్యూలోకి అనుమతించరని స్పష్టం చేసింది.

# ఆపద అంటే ఆ..పద అంటూ

**ఆపద అంటే ఆ..పద అంటూ యువత నిండు గుండెతో స్పందిస్తున్నారు.** ఆపత్కాలంలో ఆపద్బాంధవుల్లా వ్యవహరిస్తున్నారు. నీరు, కన్నీరు కలిసి ప్రవహించిన వరదకు ఎదురొడ్డి నిలబడుతున్నారు. కష్టంలో తడిచిన బతుకులకు భుజాన్ని సాయంగా అందిస్తున్నారు. అధికారుల కోసమో, నాయకుల కోసమో ఎదురు చూడకుండా తాము స్వయంగా రంగంలోకి దిగి సేవ అనే పవిత్ర యాగాన్ని కొనసాగిస్తున్నారు.

- యువతలో పెరుగుతున్న సేవాభావం
- విపత్తుల వేళ స్వచ్ఛందంగా చేయూత
- వరద సమయాల్లో అత్యవసర సాయం
- అధికారుల కోసం ఎదురుచూడకుండా రంగంలోకి దిగుతున్న వైనం

టెక్కలి:

యువతలో సామాజిక దృక్పథం పెరుగుతోంది. సెల్‌ఫోన్ వదలడం లేదని, ఉత్తి పుణ్యానికే సహనం కోల్పోతున్నారని, వయసుకు తగ్గ పరిపక్వత ఉండడం లేదని యువకులపై వస్తున్న విమర్శలను తాజా వరద కడిగి పారేసింది. శ్రీకాకుళం జిల్లాను ముంచెత్తిన వరదలకు యువత అడ్డుగా నిలబడ్డారు. కష్టాల్లో ఉన్న వారికి సాయం చేస్తూ స్ఫూర్తి రగిలించారు. అత్యవసర సమయాల్లో అధికార యంత్రాంగం కోసం ఎదురు చూడకుండా వారే సేవకులుగా మారుతున్నారు.

### ఆదుకునే మనసు ఉండాలి



విపత్తులు, ప్రమాదాలు సంభవించే సమయాల్లో ప్రతి గ్రామంలో యువత సాయం చేయడానికి ముందుకు రావాలి. అధికారులు వస్తారని ఎదురుచూడకుండా తక్షణ సాయం చేయాలి. మా గ్రామంలో యువకులంతా అదే పని చేశాం. గ్రామానికి రాకపోకలు నిలిచిపోయే విధంగా వరద నీరు పోటెత్తిన సమయంలో ఓ వృద్ధుడికి అత్యవసరంగా వైద్య సేవలు అవసరమయ్యాయి. అంతా కలిసి అతడిని ఆస్పత్రికి తరలించాం.


– రెళ్ల అప్పారావు, ఉయ్యాలపేట, నందిగాం మండలం.

ఇటీవల తుఫాన్ ప్రభావంతో జిల్లా వ్యాప్తంగా విస్తారంగా వర్షాలు కురిశాయి. దీంతో జిల్లాలో వంశధార, మహేంద్రతనయ, నాగావళి, బాహుదా వంటి నదులతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో చెరువులు, గెడ్డలు, వాగులు పొంగి పొర్లి గ్రామాల్లోకి వరద నీరు చేరి భయానక పరిస్థితులు చోటు చేసుకున్నాయి. జిల్లాలో వివిధ చోట్ల వరదల్లో చిక్కుకున్న వారికి తమకు తోచిన విధంగా స్థానిక యువత సేవా కార్యక్రమాలను చేపట్టారు. నందిగాం మండలం ఉయ్యాలపేట గ్రామం వద్ద ఓ వృద్ధుడికి అత్యవసరంగా వైద్య సేవలు అవసరం కావడంతో స్థానిక యువత వరద నీటి నుంచి ఆ వృద్ధుడిని రక్షించింది. అలాగే జలుమూరు మండలం రామకృష్ణాపురం గ్రామంలో కూలిపోయిన ఇంటి నుంచి వృద్ధులను స్థానిక యువకులే కాపాడారు. జి.సిగడాం మండలం ధవళపేట వద్ద రోడ్డుకు అడ్డంగా పడిపోయిన చెట్టును అక్కడి వారే తొలగించారు. వజ్రపుకొత్తూరు మండలం శివరాంపురం గ్రామంలో వరద నీటి నుంచి తాడు సాయంతో గ్రామస్తులను తరలించారు. విపత్తుల సమయాల్లో అధికారుల కోసం ఎదురు చూడకుండా ప్రాణాలు ఫణంగా పెట్టి సాయం అందజేస్తూ పలువురు ప్రశంసలు పొందుతున్నారు.



నందిగాం మండలం ఉయ్యాలపేటలో వరద నీటి ప్రవాహం నుంచి వృద్ధుడిని ఆస్పత్రికి తరలిస్తున్న యువకులు (ఫైల్)

### ప్రయాణికుల కష్టాలు చూశాను..



వానలో ప్రయాణికుల కష్టాలు కళ్లారా చూశాను. చిన్నపిల్లలు, వృద్ధులను దృష్టిలో ఉంచుకుని నా సొంత నిధులతో యంత్రాలను తెప్పించి చెట్టును తొలగించాం. నాకు ఇలాంటి సేవ చేయడం ఎంతో ఆనందంగా ఉంది.


– వడిశ మహేశ్వరరావు, సర్పంచ్, దవళపేట, జి.సిగడాం

### ఎవరూ ఆదుకోలేదు

మా గ్రామానిది దుర్భర పరిస్థితి. ఎప్పుడు వరద వచ్చినా బెండి గెడ్డ ఉప్పుటేరు వల్ల గ్రామం మునుగుతుంది. గ్రామం చుట్టూ రొయ్యల చెరువులు నిర్మించడంతో వరద గ్రామంపై పడింది. దీంతో దీంతో 20 మంది యువకులం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు తాడుతో వరదలో చిక్కుకున్న జనాలను తరలించాం. వరద నీటిలో వృద్ధులు నడవలేక అవస్థలు పడ్డారు. ఒకరైతే కొట్టుకుపోయే వారే. చిన్నారులు, గర్భిణులు చాలా బాధపడ్డారు.

– ఇప్పిలి తిరుపతి, యువకుడు, శివరాంపురం, వజ్రపుకొత్తూరు


### శ్రమించి చెట్టును తొలగించాం




తుఫాన్ ధాటికి మా గ్రామ ప్రధాన రోడ్డుపై పెద్ద చింత చెట్టు కూలిపోయింది. చెట్టు కొమ్మలు పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌పై పడ్డాయి. దీంతో గ్రామం చీకటిగా మారిపోయింది. ఊరికి రాకపోకలు నిలిచిపోయాయి. ఊరివారమంతా శ్రమించి చెట్టును తొలగించాం.

– దుంపల వేణుగోపాల్, యువకుడు, సీతాపురం, వజ్రపుకొత్తూరు

### కాళ్లు కనిపించాయి





మా గ్రామంలో ఇల్లు కూలిపోయిందని తెలిసింది. వెంటనే అక్కడకు వెళ్లాం. ఇద్దరు వృద్ధులు మట్టిలో పడి ఉన్నారు. అందులో బుద్దయ్య కాళ్లు కనిపించాయి. వెంటనే వెళ్లి వారికి బయటకు తీశాం. అప్పటికి వారు ఊపిరితోనే ఉన్నారు. ఏమీ కాదనే అనుకున్నాం. కానీ ఆస్పత్రికి వెళ్లాక ఇద్దరూ చనిపోవడం బాధాకరం. – సవర కృష్ణారావు, సవర ముకుందరావు, సవరటబ్బూరు, మందస మండలం

### సొంత నిధులు వెచ్చించి..



కూలిన చెట్టును తొలగిస్తున్న దవళపేట గ్రామ సర్పంచ్ వడిశ మహేశ్వరరావు

**జి.సిగడాం:** తుఫాన్ వర్షాలకు శ్రీకాకుళం–రాజాం ప్రధాన రహదారిలో సంతవురిటి గ్రామ సమీపంలో భారీ వృక్షం రోడ్డుపై పడిపోవడంతో సుమారుగా 2 గంటల పాటు ట్రాఫిక్ అంతరాయం కలిగింది. దీంతో ప్రయాణికుల ఇబ్బందులు గమనించిన వైఎస్సార్‌సీపీ నాయకుడు, దవళపేట సర్పంచ్ వడిశ మహేశ్వరరావు సొంత నిధులతో యంత్రాలను ఏర్పాటు చేసి చెట్టును తొలగించారు. విషయం తెలుసుకున్న ఎస్‌ఐ వై.మధుసూదనరావు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరు కుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. మహేశ్వరరావును ఎస్‌ఐతోపాటు సంతవురిటి సర్పంచ్ బుడారి లక్ష్మణరావు, మాజీ ఎంపీపీ బాలబొమ్మ వెంకటేశ్వరరావు, బీసీ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ వాంద్రంగి వెంకటేష్ అభినందించారు.

### ఐదు గంటల శ్రమ

**వజ్రపుకొత్తూరు:** చినుకులు సూదుల్లా గుచ్చుతున్నా, వాన దంచి కొడుతున్నా శివరాంపురం యువత చలించలేదు. విజయదశమి రోజు కురిసిన కుండపోత వర్షానికి ఊరికి బయట ప్రపంచానికి సంబంధాలు తెగిపోయాయి. దీంతో గ్రామానికి చెందిన ఇప్పిలి తిరుపతి, రమేష్, ఎరకారావు, లక్ష్మణరావు, దట్టి వాసుదేవరావుతో పాటు సుమారు 20 మంది వరకు యువకులు ఆ వరద నీటిలో ఐదు గంటల పాటు తాడు పట్టుకుని నిత్యావసరాలు తెచ్చుకునేలా, అవసరమైన వారు రాకపోకలు సాగించేలా చర్యలు తీసుకున్నారు. తమ గ్రామానికి పూండి గ్లోబీ రహదారి నుంచి పక్కా రహదారి నిర్మించాలని ఎంతమందిని విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదని వారు తెలిపారు.



తాడుతో సహాయం చేస్తున్న శివరాపురం యువత

**దేహంలో మరే అవయవానికి గాయం అయినా కొన్నాళ్లలో అది తగ్గాక అంతా నార్మల్ అయ్యేందుకు అవకాశాలెక్కువ. కంటికి ఆ అవకాశం పెద్దగా ఉండదు. కన్నుగాయపడి... అందులో చూపును ఇచ్చే కార్నియా, రెటీనా, ఆప్టిక్ నర్వ్ వంటి కీలకమైన భాగాలు గానీ దెబ్బతింటే... ఆ గాయం మానాక కూడా చూపు రావడం కష్టమవుతుంది. అందుకే కంటి గాయాల నుంచి రక్షించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంటుంది. అందునా ఈ నెల (అక్టోబరు) 9న ప్రపంచ చూపు దినోత్సవం (వరల్డ్ సైట్ డే) సందర్భంగా చూపును కాపాడుకునే స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ పెంపొందించుకోవాల్సిన అవసరముంది. ఈ ఏడాది థీమ్ కూడా అందుకు తగ్గట్టుగానే ఉంది. 'మీ కళ్లను ప్రేమించండి' (లవ్ యువర్ ఐస్) అనే థీమ్ క్యాంపెయిన్ మేరకు... ప్రతి ఒక్కరూ అందుకు ఉపయుక్తమయ్యేలా కంటి విషయంలో 'స్వీయ రక్షణ చర్యలు' (ప్రోయాక్టివ్ సెల్ఫ్‌కేర్), ఈ రక్షణ చర్యల కోసం పాటుపడటం / పూనుకోవడం (అడ్వకసీ ఫర్ ఐ కేర్), ఇందుకు మానవాళి పూనుకోవడం వల్ల వచ్చే ఫలితం (హ్యూమన్ ఇంపాక్ట్) దాంతో ఈ అంశాల పట్ల సమాజంలోని ప్రతి ఒక్కరూ తీసుకోవాల్సిన భాగస్వామ్యం (కమ్యూనిటీ ఇన్‌వాల్వ్‌మెంట్) వంటి పలు అంశాలపై అవగాహన పెంపొందించుకుని మనం చంటి పాపలను ఎంతగా ప్రేమిస్తామో మన కంటి పాపలనూ అలాగే ప్రేమించాలని చెప్పేదే ఈ కథనం...**





● అక్టోబరు 9
వరల్డ్ సైట్ డే
లవ్ యువర్ ఐస్

# కంటి పాపలను... చంటి పిల్లల్లా..!

కంటి చూపును పరిరక్షించుకోడానికి ప్రతి ఒక్కరూ వారు పల్లెవాసులైనా, పట్టణవాసులైనా లేదా నగరాల్లో ఉండేవాళ్లైనా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. వ్యవసాయ పనుల్లో ఉండేవారికీ, పల్లెల్లో కూలీ పనులు చేసేవారికి పెద్దగా కంటికి గాయాల వంటివి ఉండవని చాలామంది అపోహపడుతుంటారు. పట్టణాల్లో, నగరాల్లో జరిగే ప్రమాదాల్లోనే అవి ఎక్కువని భావిస్తుంటారు. నిజానికి వ్యవసాయ, కూలి పనుల్లోనే కంటికి గాయాలయ్యే అవకాశాలెక్కువ. ఉదాహరణకు ఓ వ్యవసాయదారు పొలంలో కంపకొడుతుంటాడు. అకస్మాత్తుగా ఏ కంపముల్లో కంట్లో తగిలే అవకాశాలెక్కువ. ఎడ్లబండి తోలుతూ రైతు డొంకదారిన వస్తున్నప్పుడు దార్లోకి ఒంగి ఉన్న తుమ్మముల్లు కంటికి తగిలే అవకాశాలెక్కువ. ఇలాంటి గాయాలతో ప్రతిరోజూ ఎందరో పల్లెవాసులు, అలాగే ఇతరత్రా కారణాలతో మిగతా పట్టణ, నగరవాసులూ చూపు కోల్పోతున్నారు. గాయం తగిలిన వెంటనే చికిత్స అందితే ఈ అంధత్వాలను చాలావరకు నివారించవచ్చు. కంటికి అయ్యే గాయాలెటువంటివీ, ముందుగా ఎలాంటి ప్రథమచికిత్సలు, ఆ తర్వాత ఏ ప్రధాన చికిత్సలు అవసరం లాంటి అనేక విషయాలను తెలిపేదే ఈ కథనం.

## కంటి గాయాలూ... వాటి రకాలు...

కంటికి ప్రధానంగా రెండు రకాలుగా గాయాలయ్యే అవకాశాలుంటాయి.
1) భౌతికంగా అయ్యే గాయాలు. 2) రసాయనిక ప్రమాదాలు



డాక్టర్ రవికుమార్ రెడ్డి
సీనియర్
కంటి వైద్య నిపుణులు

## భౌతికంగా అయ్యే గాయాలు...

వ్యవసాయ, ఇతరత్రా పనుల్లో : పొలాల్లో, డొంకదారుల్లో ఉండే ముళ్లచెట్లతో వంటి వాటితో వ్యవసాయదారులకు గాయాలయ్యే అవకాశాలు ఎక్కువని చెప్పుకున్నాం. అలాగే కట్టెలు కొట్టే సమయాల్లో చెక్కపేడు వంటివి ఎగిరివచ్చి కంట్లో గుచ్చుకోవచ్చు. రాళ్లు కొట్టేవారు సుత్తిని ఉపయోగిస్తున్నప్పుడు, ఇటుక, ఇతరత్రా బట్టీలో పెళ్లలు ఎగిరొచ్చి కంట్లో పడవచ్చు. ఇక పట్టణాల్లో వెల్డింగ్ వంటి వర్క్‌షాపుల్లో, పెద్ద పెద్ద నగరాల్లోని పారిశ్రామిక వాడల్లో జరిగే ప్రమాదాల్లో రసాయనాలూ, వాటి ఆవిరులు (ఫ్యూమ్స్) వంటి వాటితో కంటికి గాయాలయ్యే అవకాశాలెక్కువ.

● **రోడ్డు / ఇతరత్రా ప్రమాదాల్లో :** రోడ్డు మీద హెల్మెట్ లేకుండా వాహనం మెల్లగానే నడుపుతున్నప్పటికీ రోడ్డు మీదికి ఓరగా ఒంగిన చెట్ల కొమ్మలు కంట్లో కొట్టుకుని గాయాలయ్యే ప్రమాదాలెక్కువ. రాత్రివేళల్లో వాహనంపై ప్రయాణం చేసేవారికి పురుగులు లేదా చిన్న గులకరాళ్ల వంటివి (ఫ్లైయింగ్ ఆబ్జెక్ట్స్) ఎగిరివచ్చి కంట్లో పడవచ్చు. కొన్ని యాక్సిడెంట్లలో కంటికి లేదా కనుగుడ్డు అమరి ఉండే గూడు (ఆర్బిట్)కు గానీ లేదా తలకు అయ్యే గాయాల వల్ల కంటిచూపు ప్రభావితమయ్యే ప్రమాదాలుంటాయి.

● **ఆటల్లో :** కంట్లో బంతి తగలడం, షటిల్‌కాక్ వంటివి బలంగా తగలడం వల్ల; అలాగే పిల్లలు పదునైన ఉపకరణాలతో లేదా బాణాల వంటి పదునైన వస్తువులతో ఆడుకుంటున్నప్పుడు; బాణాసంచా వంటివి ఒకరిపై ఒకరు విసురుకుంటున్నప్పుడు.

● **పండుగలూ, వేడుకల్లో :** దీపావళి, హోలీ వంటి పండగల్లో.

● **ఎగిరి వచ్చే పదార్థాల వల్ల (ఫ్లైయింగ్ ఆబ్జెక్ట్స్) :** చిన్న చిన్న రాతిముక్కలు, గాజు ముక్కలు, లోహపు పదార్థాలు, కలప వంటి వాటితో పాటు, పురుగులు కంట్లో బలంగా కటిని తాకడం వల్ల. సర్రున ఎగిరివచ్చి తాకే ఎలాంటి వస్తువుల వల్లనైనా.

● **పేలుళ్లు :** ఈ తరహా ప్రమాదాలలో రెండు రకాలుగా కన్ను గాయపడుతుంది. ఒకటి నిప్పురవ్వలూ, మంటల్లో కన్ను దెబ్బతినడం. రెండోది... పేలుడు ధాటికి చిన్న చిన్న రాతి/ఇతరత్రా రవ్వలు కంటిని బలంగా తాకడం.

## రసాయనిక ప్రమాదాలు...

భౌతికంగా అయ్యే గాయాల గురించి తెలుసుకున్నాక ఇప్పుడు రసాయన ప్రమాదాలెలా జరుగుతాయో చూద్దాం. సాధారణంగా వ్యవసాయ పనుల్లో పెద్దగా కంటి ప్రమాదాలు జరగవనే అపోహలాంటిదే... ఈ రసాయనిక ప్రమాదాలూ పల్లెల్లో / పల్లెవాసులకు పెద్దగా జరగవనే భావన కూడా. కానీ పొలంలో ఆర్గానోఫాస్ఫరస్ (అంటే ఎండ్రిన్ వంటి) మందుల పిచికారీలూ, ఎరువులు వేస్తున్నప్పుడు రసాయనాలు కంట్లోకి వెళ్లే ప్రమాదాలు చాలా ఎక్కువ. దాంతోపాటు పొలానికి మందు కొట్టిన సందర్భాల్లో చేతులు కడుక్కోకుండా వాటితోనే కళ్లనులుముకోవడం వంటి చర్యలతోనూ కళ్లలోకి రసాయనాలు చేరుతాయి. ఇక పట్టణాలూ, నగరాల్లోని రకరకాల పారిశ్రామిక కేంద్రాలూ, ఫౌండ్రీలలో కొన్ని రకాల ఆమ్లాలు / క్షారాల వంటి రసాయన కంట్లో పడి ప్రమాదాలు జరుగుతాయి. ఇలాంటప్పుడు వీలైనంత త్వరగా చికిత్స జరిగితే శాశ్వత అంధత్వాన్ని చాలావరకు నివారించవచ్చు.

● **ఇళ్లలో సైతం రసాయన ప్రమాదాలకు అవకాశం :** మన ఇళ్లలో ఉండే సుగంధద్రవ్యాలను స్ప్రే రూపంలో చిమ్ముకుంటున్నప్పుడు కూడా ఈ తరహా రసాయన ప్రమాదాలు జరగవచ్చు. అందుకే చిన్నపిల్లల పర్‌ఫ్యూమ్స్‌ను దూరంగా ఉంచాలి. ఇక ఇళ్లలో జరిగే రసాయనాలతో గాయాల్లో.... సిమెంట్ పని చేస్తున్నప్పుడు, ఇంటికి సున్నాలు/కలర్స్ వేయిస్తున్నప్పుడు, పాన్‌లో వాడే సున్నాన్ని పిల్లలు కళ్లల్లో పెట్టుకున్నప్పుడు, బాత్‌రూమ్‌ల వంటి చోట్ల యాసిడ్ వంటి రసాయనాలతో పనిచేస్తున్నప్పుడు కంట్లోకి సున్నం లేదా యాసిడ్ వంటి రసాయనాలు వెళ్లే అవకాశాలెక్కువ.

● **రసాయన ప్రమాదాలతో కంటికి గాయాలిలా :** రసాయనాల కారణంగా జరిగే ప్రమాదాలతో కెమికల్స్‌కు సహజంగానే తినేసే గుణం (కాస్టిక్ ఎఫెక్ట్) ఉంటుంది. పైగా అందులోని రసాయనాలు కంటిలోని కణాలూ, ఎంజైముల, ప్రోటీన్ల పనితీరును ప్రభావితం చేస్తాయి. సాధారణంగా ఆ రసాయనాలు... కార్నియా, కంజెంక్టివా వంటి కంటి పొరలను దెబ్బతీస్తాయి. ఫలితంగా చూపుకోల్పోయే ప్రమాదాలెక్కువ.

● **రసాయన ప్రమాదాల్లో తక్షణం అందించాల్సిన చికిత్స :** కంటిలో పడే రసాయన గాఢతను వీలైనంతగా తగ్గించాలి (డైల్యూట్ చేయాలి). అందుకోసం రసాయనాలకు ఎక్స్‌పోజ్ అయిన కంటిని దాదాపు 30 నిమిషాల పాటు పరిశుభ్రమైన నీటితో కడగాలి. రోగి అయోమయంలో ఉంటే ప్రమాదస్థలంలోని ఎవరైనా ఈ పని చేయవచ్చు.





## అపోహలు...

● కంటికి గాయాలు కావడం సాధారణం అనుకోవడం. కాళ్లు చేతులకు లాగానే కళ్లకూ ఎప్పుడో ఒకప్పుడో దెబ్బతగులుతుంది కదా అని భావించడం ● అమాయకత్వం (ఇన్నోసెన్స్), తెలియనితనం (ఇగ్నోరెన్స్), నిర్లక్ష్యం... కారణంగా అద్దాలు పెట్టుకోకపోవడం. ఐ-వేర్ ధరించడం అంటే నామోషీ ● అద్దాలు పెట్టుకుంటే ఎంతో కొంత చూపు తగ్గుతుందని అనుకోవడం ● కంటి అద్దాలు, షీల్డ్‌లు చాలా ఖరీదైనవనే భావన. అదో డబ్బు, సమయం వృథా చేసే వ్యవహారమని అనుకోవడం.

## గాయాలు నివారించే జాగ్రత్తలివి...

సాధారణంగా కంటికి అయ్యే గాయాల్లో దాదాపు 90శాతం నివారింపదగినవే. అందునా 80 శాతం గాయాల్లో డాక్టర్‌ను సరైన సమయంలో సంప్రదిస్తే, చూపు పోకుండా కాపాడుకోవచ్చు.

● కర్షకులూ, కార్మికులూ, నిర్మాణరంగంలోని పనివారూ ఎండ వేడిమి నుంచి కంటిని రక్షించుకోవాలి. ఎందుకంటే సూర్యరశ్మిలో యూవీఏ, యూవీబీ కిరణాలుంటాయి. అవి టెరిజియమ్, క్యాటరాక్ట్, మాక్యులార్ డీజనరేషన్ వంటి కంటి సమస్యలకు కారణమవుతాయి. పరిశ్రమల్లో పనిచేసే వారికి యూవీఏ, యూవీబీ కిరణాలతో ముప్పు మరింత ఎక్కువ. పొలాల్లో పనిచేసేవారికి కళ్లజోడేమిటి అనే సందేహాలూ, నామోషీలు లేకుండా ప్లెయిన్ గ్లాసెస్ వాడాలి. దాంతో వ్యవసాయం, రాతికొట్టుడు వంటి పనుల్లో కన్ను గాయపడకుండా ఉంటుంది. వ్యవసాయదారులే కాదు.. హాబీగా గార్డెనింగ్ చేసేవారు కూడా ఎప్పుడూ ప్రొటెక్టివ్ గాగుల్స్ ధరించాలి.

## పరీక్షలు...

ముందుగా సాధారణ కంటి పరీక్షలు చేయించాలి. ఒక్కోసారి అనస్థీషియా ఇచ్చి కూడా కొన్ని పరీక్షలు చేయించాల్సి రావచ్చు. ఇక అవసరాన్ని బట్టి ● అల్ట్రాసౌండ్ ● ఎక్స్-రే ● సీటీ స్కాన్ ● ఎమ్మారై స్కాన్ వంటి పరీక్షలు అవసరం.

## స్పోర్ట్స్ ఇంజ్యూరీ...

ఆటల్లో కన్ను గాయపడకుండా ఉండేందుకు పాలీకార్బనేట్ కళ్లజోళ్లు వాడాలి. (ఇది ప్లాస్టిక్ వంటిది. పగలదు). హెల్మెట్స్, కంటి షీల్డ్‌లతో స్పోర్ట్స్ ఇంజ్యూరీస్ నివారించవచ్చు.

● **ఇంట్లో :** ఇంట్లో అనేక రకాల పదునైన వస్తువులతో కంటిగాయాలయ్యే అవకాశాలుంటాయి. ఉదాహరణకు పదునైన మూలలు ఉండే మంచాలు, చిలక్కొయ్యలూ, హ్యాంగర్స్‌గా వాడుకునే ఇనుప కొక్కేల వంటి వాటితో కూడా కంటి గాయాలయ్యే అవకాశాలున్నాయి. ఇంటివస్తువులు పదునుగా ఉండకుండా చూసుకోవాలి. ఇళ్లలో కూల్‌డ్రింక్ ఓపెన్ చేసేటప్పుడు ఆ సీసామూతను బయటికి వైపునకు 45 డిగ్రీల ఏటవాలుగా ఉంచి తెరవాలి. అప్పుడు కన్ను గాయపడే అవకాశం ఉండదు.

● ఆర్గానోఫాస్ఫరస్ (ఎండ్రిన్ వంటివి) చల్లేటప్పుడు నోరు, ముక్కులకు మాస్క్‌తో పాటు కళ్లకు ప్రొటక్టివ్ గాగుల్స్ తప్పకుండా పెట్టుకువాలి. కార్ఖానాల్లో రసాయనాలను అంటుకునే ముందు, అంటుకున్న తర్వాత చేతులు కడుక్కోకుండానే కళ్లనులుముకోవడం సరికాదు.

● పిల్లల ఆటల్లో విల్లుబాణాలూ అస్సలు వద్దు. బాణాసంచా కాల్చేటప్పుడు పెద్దవాళ్లు చిన్నారుల పక్కనే ఉండి జాగ్రత్తగా చూసుకోవాలి.

● టూవీలర్స్ నడిపేవారు ఐ వేర్, ఐ షీల్డ్, హెల్మెట్ ధరించి తీరాలి. నిజానికి వ్యవసాయం, నిర్మాణ పనివాళ్లు, రాతి పనివాళ్లు, స్టోన్ కట్టర్స్, ట్రాక్టర్ డ్రైవర్లు... వీళ్లంతా పనివేళల్లో కంటికి అద్దాలు, ఐ షీల్డ్ ధరించాలి. హెల్మెట్ తరహాలోనే ఈ మేరకు చట్టం రావడమూ చాలావరకు మేలు చేసే అంశమే.

● పిల్లలకు రొమ్ముపాలు పట్టే తల్లులు తమ బ్లౌజ్‌హుక్స్‌తో జాగ్రత్తగా ఉండాలి. ఆ హుక్స్ కారణంగా కన్ను గాయపడి కంటి డాక్టర్ల వద్దకు వచ్చే కేసులు ఎక్కువే ఉంటాయి. అందువల్ల తల్లిపాలు పట్టే మాతృమూర్తులు పిల్లలకు పాలు పట్టే సమయాల్లో మెటాలిక్ బ్లౌజ్ హుక్స్‌కు బదులు బటన్స్ వంటివి ఉండే దుస్తులు ధరించడం మేలు.

● కంటికి గాయం అయినప్పుడు చేయాల్సిన ప్రథమచికిత్సపై అవగాహన పెంచుకోవాలి.

● కంటి గాయాలైనప్పుడు బాధితులను ఆసుపత్రికి తీసుకెళ్లడంలో ఆలస్యం జరగకూడదు.

## గాయం కనిపించకున్నా.... డాక్టర్ చెప్పే వరకు ఫాలో అప్ కావాల్సిందే

కంటికి గాయం అయి, అది పైకి కనిపించకపోయినా, చూపు బాగానే కనిపిస్తున్నట్లుగా అనిపించినా డాక్టర్ చెప్పేవరకు క్రమం తప్పకుండా ఫాలోఅప్ అవసరం. ఎందుకంటే... కంటిగాయాల్లో అప్పటికప్పుడు ఏ లక్షణాలూ కనిపించకపోయినా, కొన్ని సందర్భాల్లో ఆలస్యంగా కూడా కొన్ని పరిణామాలు కనిపించవచ్చు. అందుకే ఈ జాగ్రత్త పాటించాలి.

## గాయమైన వెంటనే...

కంటికి గాయం తగలగానే తక్షణం ఓ శుభ్రమైన మెత్తటి గుడ్డ సహాయంతో రెండు కళ్లనూ మూసి ఉంచాలి. వీలైనంతగా కనుగుడ్లు కదలకుండా చూసుకోవాలి. సాధ్యమైనంత త్వరగా డాక్టర్‌కు చూపించాలి. కంటికి గాయాలను స్వయంగా పరిశీలించుకోవడం, సొంత చికిత్స చేసుకోవడం చాలా ప్రమాదం. అలా ఎట్టిపరిస్థితుల్లోనూ చేయకూడదు. కెమికల్స్ పడ్డాయని తెలియగానే... చేతులను సబ్బు, మంచినీళ్లతో శుభ్రంగా కడగాలి. దొరికితే ప్రిజర్వేటివ్ ఫ్రీ యాంటీబయాటిక్ డ్రాప్స్, ల్యూబ్రికెంట్స్ వేసుకోవాలి. కళ్లనలపకూడదు. కంటి మీద ఒత్తిడి పడనివ్వకూడదు. బయటి నుంచి కళ్లలో పడ్డ నలకలను (ఫారిన్‌బాడీని) మనంతట మనమే తీయకూడదు. వీలైనంత త్వరగా కంటి డాక్టర్‌తో చికిత్స తీసుకోవాలి. అవసరమైతే వారి సలహా మేరకు పెద్ద ఆసుపత్రుల్లో కంటి వైద్యనిపుణులకు చూపించుకోవాలి.

## డాక్టర్‌ను కలవాల్సింది ఎప్పుడు?

● కన్ను నొప్పి, నీళ్ల కారడం, వెలుగు చూడలేకపోవడం, చూపు తగ్గడం, ఎర్రబారడం, తలనొప్పి, కళ్ల (కనుగుడ్లు) కదలిస్తున్నప్పుడు నొప్పి ఉంటే తప్పనిసరిగా డాక్టర్‌ను సంప్రదించాలి.

## చికిత్స...

● ఫస్ట్ ఎయిడ్ చికిత్స ఇంట్లో, పనిచేసే ప్రదేశంలో అందుబాటులో ఉండేలా చూసుకోవాలి. అంటే ఉదాహరణకు... సున్నం, సిమెంట్, బాత్‌రూమ్ యాసిడ్ వంటివి పడ్డప్పుడు వెంటనే కన్ను శుభ్రంగా కడుక్కుని, ఆ వెంటనే కంట్లో చుక్కల మందులు అయిన ప్రిజర్వేటివ్-ఫ్రీ యాంటిబయాటిక్ ఐ డ్రాప్స్ అందుబాటులో ఉంచుకోవాలి. ఇక కన్ను కడుక్కోడానికి పరిశుభ్రమైన నీరు (ప్లేన్ వాటర్) వాడాలి. అదంత శుభ్రంగా ఉండదనుకుంటే ప్యాకేజ్‌డ్ వాటర్‌బాటిల్ నీళ్లు వాడుకోవచ్చు.

ఇక గాయాన్ని బట్టి చేయాల్సిన చికిత్స ఆధారపడి ఉంటుంది. అయితే ఎంత త్వరగా చికిత్స అందిస్తే చూపు దక్కే అవకాశం అంత ఎక్కువగా ఉంటుందన్న విషయాన్ని అందరూ తెలుసుకోవాలి.



**చివరగా...** పైన పేర్కొన్న అంశాలన్నింటిపైనా తగినంత అవగాహన పెంచుకుని, ఈ ఏడాది వరల్డ్ సైట్ డే థీమ్ ప్రకారం మన కళ్లను మనం ప్రేమించడం (లవింగ్ అవర్ ఐస్) మొదలుపెడితే అందరి కంటి చూపు పదికాలాలపాటు పదిలంగా ఉంటుంది.

నిర్వహణ:
యాసీన్

## బిజినెస్ రీల్

### ఫిస్‌డమ్... గ్రో సొంతం
వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలోకి ఎంట్రీ




**న్యూఢిల్లీ:** పబ్లిక్ ఇష్యూ సన్నాహాల్లో ఉన్న గ్రో తాజాగా వెల్త్–టెక్ స్టార్టప్ ఫిస్‌డమ్ కొనుగోలు ప్రక్రియను పూర్తి చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. దీంతో రిటైల్ ఇన్వెస్టింగ్, మ్యుచువల్ ఫండ్స్‌తో పాటు వెల్త్ మేనేజ్‌మెంట్ విభాగంలోకి కూడా కంపెనీ ప్రవేశించినట్లయిందని పేర్కొన్నాయి. అత్యంత సంపన్న ఇన్వెస్టర్లకు కోసం 'డబ్ల్యూ' పేరిట కొత్త సర్వీసును అందిస్తుందని వివరించాయి. ఫిస్‌డమ్ వ్యవస్థాపకులైన ఎస్‌వీ సుబ్రమణ్య, ఆనంద్ దాల్మియా, ఇతరత్రా కీలక సిబ్బంది.. గ్రో లో వెల్త్ బిజినెస్‌కు సారథ్యం వహిస్తారు. సంపన్న కస్టమర్లకు మరింత మెరుగైన సర్వీసులు అందించే దిశగా కంపెనీ మరిన్ని నియామకాలు చేపడుతుందనే అంచనాలు ఉన్నాయి. 2016లో ప్రారంభమైన గ్రో.. పూర్తి స్థాయి ఆర్థిక సేవల ప్లాట్‌ఫాంగా ఎదిగింది. ఇటీవలే ఐపీవో కోసం మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీకి ముసాయిదా ప్రాస్పెక్టస్‌ను సమర్పించింది. ఈ ఇష్యూ పరిమాణం రూ. 7,000 కోట్లుగా ఉంటుందని అంచనా. మరోవైపు, ఫిస్‌డమ్ 2015లో ప్రారంభమైంది. పోర్ట్‌ఫోలియో మేనేజ్‌మెంట్ సర్వీసులు, ప్రత్యామ్నాయ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్), ప్రైవేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రోడక్టులు మొదలైనవి అందిస్తోంది. కంపెనీకి రూ.10,000 కోట్ల పైగా ఏయూఎం (నిర్వహణలోని ఆస్తుల పరిమాణం), దేశవ్యాప్తంగా 15 కార్యాలయాలు, పది లక్షల పైగా క్లయింట్లు, సుమారు 150 మంది వెల్త్ పార్ట్‌నర్లు ఉన్నారు.

### అమీన్‌జీ రబ్బర్ లిస్టింగ్ లాభాలు



**హైదరాబాద్:** రైల్వేస్, ఇన్‌ఫ్రా తదితర రంగాలకు పారిశ్రామిక రబ్బర్ ఉత్పత్తులను అందించే హైదరాబాదీ సంస్థ అమీన్‌జీ రబ్బర్ తాజాగా బీఎస్ఈ ఎస్ఎంఈ ఎక్స్చేంజీలో లిస్టయింది. ఇష్యూ ధరతో పోలిస్తే ఆరు శాతం అధికంగా రూ. 106.05 వద్ద క్లోజయ్యింది. రూ. 95–100 ధర శ్రేణితో కంపెనీ రూ. 30 కోట్లు సమీకరించింది. ఇష్యూకి రెండు రెట్లు పైగా స్పందన లభించింది. బీఎస్ఈ ఎస్ఎంఈ ప్లాట్‌ఫాంలో లిస్ట్ కావడం తమకొక కీలక మైలురాయిలాంటిదని సంస్థ సీఎండీ ముఫద్ లాల్ దీసావాలా (అమీన్‌జీ) తెలిపారు.

### కోడిగుడ్లు (హోల్‌సేల్–నెక్ / 100కు రూ.లలో)

| 7-10-2025 | |
|---|---|
| విశాఖ | 520-00 |
| చిత్తూరు | 528-00 |
| ఈస్ట్, వెస్ట్ గోదావరి | 530-00 |
| విజయవాడ | 530-00 |
| రిటైల్ ధర (డజను) | 72.00 |
| హైదరాబాద్ | 515-00 |
| వరంగల్ | 517-00 |
| రిటైల్ ధర | 5.75 |

### నిఫ్టీ 50
టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| MAXHEALTH | 1,137.00 | 6.34 |
| SHRIRAMFIN | 671 | 3.9 |
| TCS | 2,988.00 | 2.97 |
| TECHM | 1,439.60 | 2.78 |
| APOLLOHOSP | 7,636.00 | 2.5 |

### నిఫ్టీ 50
టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

| Symbol | LTP | (%)Change |
|---|---|---|
| TRENT | 4,705.00 | -2.3 |
| TATASTEEL | 170.35 | -1.65 |
| ADANIPORTS | 1,400.80 | -1.29 |
| POWERGRID | 286.75 | -1.02 |
| EICHERMOT | 6,876.00 | -0.94 |

### స్టాక్ మార్కెట్ డేటా

| | టర్నోవర్ (రూ. కోట్లలో) |
|---|---|
| బీఎస్ఈ | 7,190 |
| ఎన్ఎస్ఈ | 96,872 |
| ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్) | 1,52,317 |
| ఎఫ్ఐఐ | - 314 |
| డీఐఐ | + 5,036 |

### ముడిచమురు... (బ్యారెల్)

| | రాత్రి 11.30కు | | క్రితం ముగింపు |
|---|---|---|---|
| నైమెక్స్ లైట్ స్వీట్ | 61.68 | $ | 60.88 |
| బ్రెంట్ | 65.44 | $ | 64.53 |

# ఆరు ఐపీవోలకు గ్రీన్‌సిగ్నల్

**ఆమోదం తెలిపిన సెబీ**
- లిస్టులో లెన్స్‌కార్ట్, వేక్‌ఫిట్, టెనెకో క్లీన్ సంస్థలు
- సుమారు రూ. 6,500 కోట్ల సమీకరణ




**న్యూఢిల్లీ:** మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ మరో ఆరు కంపెనీల పబ్లిక్ ఇష్యూలకు (ఐపీవో) గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఐవేర్ రిటైల్ సంస్థ లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్, వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్, టెనెకో క్లీన్ ఎయిర్ ఇండియా, కార్డీలియా క్రూయిజెస్ నిర్వహణ సంస్థ వాటర్‌వేస్ లీజర్ టూరిజం, కాటన్ యార్న్‌ల తయారీ కంపెనీ శ్రీరామ్ ట్విస్టెక్స్, ఇండస్ట్రియల్ ల్యామినేట్స్ ఉత్పత్తి చేసే లామ్‌టఫ్ ఈ జాబితాలో ఉన్నాయి. ఈ కంపెనీలన్నీ కలిసి సుమారు రూ. 6,500 కోట్లు పైగా సమీకరించవచ్చని అంచనాలు ఉన్నాయి. ఈ ఏడాది జూన్–జూలై మధ్య ఈ ఆరు కంపెనీలు దరఖాస్తు చేసుకోగా, సెప్టెంబర్ 26 – అక్టోబర్ 3 మధ్య అనుమతులు వచ్చినట్లు తెలుస్తోంది. 2025లో 80 కంపెనీలు ఇప్పటికే ఐపీవోల ద్వారా నిధులు సమీకరించుకోగా, ఈ నెలలో మరిన్ని సంస్థలు లైనులో ఉన్నాయి.

#### లెన్స్‌కార్ట్
తాజాగా షేర్ల జారీ ద్వారా లెన్స్‌కార్ట్ సొల్యూషన్స్ రూ. 2,150 కోట్లు సమీకరించనుంది. ప్రమోటర్లు, ఇన్వెస్టర్లు 13.22 కోట్ల షేర్లు విక్రయించనున్నారు. ఐపీవో నిధులను కొత్త స్టోర్స్ ఏర్పాటు చేసేందుకు, స్టోర్ల లీజులు–అద్దెలు మొదలైన వాటి చెల్లింపులకు, టెక్నాలజీ–క్లౌడ్ ఇన్‌ఫ్రాపై ఇన్వెస్ట్ చేసేందుకు, బ్రాండ్ మార్కెటింగ్‌కు, ఇతర సంస్థ కొనుగోలుకు, ఇతరత్రా సాధారణ కార్పొరేట్ అవసరాలకు కంపెనీ వినియోగించుకోనుంది.

#### వేక్‌ఫిట్ ఇన్నోవేషన్స్
రూ. 468.2 కోట్ల వరకు విలువ చేసే షేర్లను కొత్తగా జారీ చేయనుంది. ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) కింద ప్రస్తుత వాటాదారులు 5.84 కోట్ల షేర్లను విక్రయించనున్నారు. ఫ్రెష్ ఇష్యూ ద్వారా వచ్చే నిధుల్లో రూ. 82 కోట్లను 117 కంపెనీ ఆపరేటెడ్ కంపెనీ ఓన్డ్ (కోకో)–రెగ్యులర్ స్టోర్స్, ఒక కోకో–జంబో స్టోర్ ఏర్పాటుకు; కొత్త పరికరాల కొనుగోలుకు రూ. 15.4 కోట్లు; ప్రస్తుత స్టోర్ల లీజులు, అద్దెల కోసం రూ. 145 కోట్లు; మార్కెటింగ్ కోసం రూ. 108 కోట్లను కంపెనీ వినియోగించుకోనుంది.

#### టెనెకో క్లీన్ ఎయిర్ ఇండియా
ఇష్యూ ద్వారా రూ. 3,000 కోట్లు సమీకరించనుంది. ఇది పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) విధానంలో ఉంటుంది. ప్రమోటర్ టెనెకో మారిషస్ హోల్డింగ్స్ ఈ షేర్లను విక్రయించనుంది.

#### వాటర్‌వేస్ లీజర్ టూరిజం
కొత్తగా షేర్లను జారీ చేయడం ద్వారా రూ.727 కోట్లు సమీకరించనుంది. ఇందులో రూ. 552.53 కోట్లను తమ అనుబంధ సంస్థ బేక్రూయిజ్ షిప్పింగ్ అండ్ లీజింగ్‌కి సంబంధించిన అడ్వాన్స్‌లు, లీజులు మొదలైన వాటిని చెల్లించేందుకు, మిగతా మొత్తాన్ని కార్పొరేట్ అవసరాలకు కంపెనీ ఉపయోగించుకోనుంది.

#### శ్రీరామ్ ట్విస్టెక్స్
1.06 కోట్ల షేర్లను కొత్తగా జారీ చేయనుంది. ఈ నిధులను సొంత అవసరాల కోసం 6.1 మెగావాట్ల సౌరవిద్యుత్ ప్లాంటు, 4.2 మెగావాట్ల పవన విద్యుత్ ప్లాంటు ఏర్పాటు కోసం; అలాగే రుణాల చెల్లింపు, ఇతరత్రా నిర్వహణ మూలధన అవసరాల కోసం వినియోగించుకోనుంది.

#### లామ్‌టఫ్
కొత్తగా 1 కోటి షేర్లను జారీ చేయనుండగా, ప్రమోటర్లు 20 లక్షల షేర్లను ఓఎఫ్ఎస్ కింద విక్రయించనున్నారు. తెలంగాణలో తమకున్న తయారీ ప్లాంటు విస్తరణకు, నిర్వహణ మూలధనం, ఇతరత్రా కార్పొరేట్ అవసరాల కోసం నిధులను కంపెనీ ఉపయోగించుకుంటుంది.

### సోషల్ మీడియాలో మోసపూరిత కంటెంట్ తొలగింపు
సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే



**ముంబై:** సోషల్ మీడియా వేదికలపై ఇన్వెస్టర్లను మోసపుచ్చే చట్టవిరుద్ధమైన కంటెంట్‌ను గత 18 నెలల్లో లక్షకు పైగా తొలగించినట్లు సెబీ చైర్మన్ తుహిన్ కాంత పాండే తెలిపారు. మోసగాళ్ల బారి నుంచి ఇన్వెస్టర్లకు రక్షణ కల్పించాల్సిన అవసరాన్ని ప్రస్తావించారు. చట్టవిరుద్ధమైన కంటెంట్ విషయాన్ని గూగుల్, మెటా తదితర ప్లాట్‌ఫామ్‌ల దృష్టికి తీసుకెళ్లి వాటిని తొలగించే దిశగా చర్యలు తీసుకున్నట్లు చెప్పారు. ఎన్ఎస్ఈలో ఏర్పాటు చేసిన ఇన్వెస్టర్ల అవగాహన కార్యక్రమాన్ని ఉద్దేశించి ఆయన మాట్లాడారు. మోసపూరిత కంటెంట్‌ను గుర్తించడంతో టెక్నాలజీ సాయపడుతున్నట్లు తెలిపారు. క్యాపిటల్ మార్కెట్లపై కేవలం 36 శాతం మందికే అధికంగా లేక మోస్తరు అవగాహన ఉందన్న ఇటీవలి సర్వే ఫలితాలను ప్రస్తావిస్తూ.. ఈ పరిస్థితుల్లో మోసపూరిత కంటెంట్ మెజారిటీ ఇన్వెస్టర్లను తప్పుదోవ పట్టించే అవకాశం లేకపోలేదన్నారు. ''విశ్వాసం దెబ్బతింటే అప్పుడు ఆర్థిక వ్యవస్థకు చోదకం కుంటుపడుతుంది. పెట్టుబడులకు ఇన్వెస్టర్లు వెనకాడతారు''అని పాండే పేర్కొన్నారు. అందుకే ఇన్వెస్టర్లలో అవగాహన కల్పించడం సెబీకి కీలక ప్రాధాన్యంగా తెలిపారు. ఈ దిశగా ఎన్నో చర్యలు చేపట్టినట్లు చెప్పారు.

## రూబికాన్ రీసెర్చ్ @ రూ.461-485

**9న మొదలు కానున్న ఐపీవో**




**న్యూఢిల్లీ:** ఫార్మా కంపెనీ రూబికాన్ రీసెర్చ్ రూ.1,377 కోట్ల సమీకరణతో ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ (ఐపీవో)కు వస్తోంది. ఈ నెల 9న మొదలయ్యే ఐపీవో 13న ముగుస్తుంది. యాంకర్ ఇన్వెస్టర్ల బిడ్డింగ్ 8న మొదలు కానుంది. ఒక్కో షేరుకు రూ.461–485 ధరల శ్రేణిగా కంపెనీ ప్రకటించింది. రూ.500 కోట్లను తాజా ఈక్విటీ షేర్ల జారీ రూపంలో సమీకరించనుండగా, రూ.877 కోట్ల విలువైన షేర్లను ప్రమోటర్ సంస్థ జనరల్ అట్లాంటిక్ సింగపూర్ ఆర్ఆర్ పీటీఈ లిమిటెడ్ విక్రయించనుంది. ఇష్యూలో 75 శాతం వాటాలను సంస్థాగత ఇన్వెస్టర్లకు (క్యూఐబీ), 15 శాతం నాన్ ఇనిస్టిట్యూషనల్ ఇన్వెస్టర్లకు, 10 శాతం రిటైల్ ఇన్వెస్టర్ల కోసం రిజర్వ్ చేశారు. తాజా షేర్ల జారీ ద్వారా సమీకరించే నిధుల్లో కొంత మొత్తాన్ని కంపెనీ రుణ భారం తగ్గించుకునేందుకు వినియోగించనుంది. కంపెనీల కొనుగోళ్లకు, ఇతర కార్పొరేట్ అవసరాలకు మిగిలిన నిధులను వెచ్చించనుంది. రూబికాన్ రీసెర్చ్‌లో జనరల్ అట్లాంటిక్ సింగపూర్ ఆర్ఆర్ పీటీఈ లిమిటెడ్‌కు ప్రస్తుతం 52.15 శాతం వాటా ఉంది. ఈ సంస్థ గత నెలలోనే ఒక్కో షేరును రూ.485 చొప్పున 140 కోట్ల విలువ మేరకు టీఐఎంఎఫ్ హోల్డింగ్స్, 360 వన్‌కు కేటాయించడం గమనార్హం. ఇదే ధరపై 51.60 లక్షల షేర్లను (3.3 శాతం వాటా) అమాన్సా ఇన్వెస్ట్‌మెంట్స్‌కు ఆగస్టులో బదిలీ చేసింది. పరిశోధన, అభివృద్ధి (ఆర్అండ్‌డీ) తోపాటు ఫార్ములేషన్లలో రూబికాన్ రీసెర్చ్ ప్రధానంగా కార్యకలాపాలు నిర్వహిస్తోంది.

## సేవల రంగంలో నిదానించిన వృద్ధి


**పీఎంఐ 60.9 పాయింట్లకు పరిమితం**



**న్యూఢిల్లీ:** సేవల రంగంలో కార్యకలాపాల వృద్ధి సెప్టెంబర్ నెలలో కాస్తంత నిదానించింది. హెచ్ఎస్‌బీసీ ఇండియా సేవల రంగం పీఎంఐ ఆగస్టులో 15 ఏళ్ల గరిష్ట స్థాయి 62.9 పాయింట్లకు చేరగా, సెప్టెంబర్‌లో 60.9కు తగ్గింది. అయినప్పటికీ 50 పాయింట్లకు పైన నమోదు కావడాన్ని వృద్ధి కిందే పరిగణిస్తుంటారు. వేగం తగ్గినప్పటికీ, వృద్ధి ధోరణికి ఢోకా లేదని హెచ్ఎస్‌బీసీ భారత ముఖ్య ఆర్థికవేత్త ప్రంజుల్ భండారీ పేర్కొన్నారు. అంతర్జాతీయంగా భారత సేవలకు డిమాండ్ కొంత నిదానించడంతో వృద్ధి వేగానికి కాస్త బ్రేక్‌లు పడినట్లయింది. సెప్టెంబర్‌లో ఎగుమతుల్లో వృద్ధి నెలకొన్నప్పటికీ, ఈ ఏడాది మార్చి తర్వాత నుంచి చూస్తే తక్కువకు పరిమితమైనట్లు హెచ్ఎస్‌బీసీ ఇండియా సర్వే గుర్తించింది. సెప్టెంబర్‌లో ఉపాధి కల్పన సైతం మోస్తరు స్థాయికి నిదానించిందని, కేవలం 5 శాతానికంటే కొంచెం ఎక్కువ కంపెనీలు నియామకాల్లో వృద్ధిని నమోదు చేసినట్లు తెలిపింది. ఇక భవిష్యత్తు కార్యకలాపాలకు సంబంధించిన సూచీ మాత్రం ఈ ఏడాది మార్చి తర్వాత గరిష్ట స్థాయికి చేరుకుంది. భవిష్యత్తులో వ్యాపార కార్యకలాపాల పరంగా సేవల రంగ కంపెనీల్లో ఆశాభావం బలపడినట్టు ఈ సర్వే పేర్కొంది. సెప్టెంబర్ నెలకు సంబంధించి హెచ్ఎస్‌బీసీ ఇండియా కాంపోజిట్ పీఎంఐ (తయారీ, సేవల రంగం కలిపి) 61గా నమోదైంది. ఆగస్టులో ఇది 63.2 పాయింట్లుగా ఉంది. ఈ ఏడాది జూన్ తర్వాత తక్కువ వృద్ధి రేటు ఇదే కావడం గమనార్హం.

## కెనరా రొబెకో ఐపీవో 9న ఆరంభం

**షేరు ధరల శ్రేణి రూ.253-266**




**న్యూఢిల్లీ:** మ్యూచువల్ ఫండ్స్ సేవల్లోని కెనరా రొబెకో అస్సెట్ మేనేజ్‌మెంట్ కంపెనీ (ఏఎంసీ) ఇనీషియల్ పబ్లిక్ ఆఫర్ ఈ నెల 9న ప్రారంభం కానుంది. రూ.1,326 కోట్లను సమీకరించాలన్నది కంపెనీ ప్రణాళికగా ఉంది. ఒక్కో షేరుకు రూ.253–266 ధరల శ్రేణిని ప్రకటించింది. 13న ఇష్యూ ముగుస్తుంది. ఇన్వెస్టర్ల స్పందన ఆధారంగా తుది కేటాయింపు ధరను ఆ తర్వాత ఖరారు చేయనుంది. గరిష్ట ధర ఆధారంగా కంపెనీ మార్కెట్ విలువ రూ.5,300 కోట్లుగా ఉండనుంది. పబ్లిక్ ఇష్యూలో షేర్ల జారీ పూర్తిగా ఆఫర్ ఫర్ సేల్ (ఓఎఫ్ఎస్) రూపంలోనే ఉంటుంది. కెనరా బ్యాంక్ 2.59 కోట్ల షేర్లు, ఓరిక్స్ కార్పొరేషన్ యూరప్ ఎన్‌వీ (గతంలో రొబెకో గ్రూప్ ఎన్‌వీ) 2.39 కోట్ల షేర్లను విక్రయించనున్నాయి. కెనరా రొబెకో ఏఎంసీలో ప్రభుత్వరంగ కెనరా బ్యాంక్‌కు 51 శాతం వాటా ఉండగా, ఓరిక్స్ కార్పొరేషన్‌కు మిగిలిన 49 శాతం వాటా ఉంది. కెనరా బ్యాంక్ 1993లో ఏఎంసీ సేవలను ప్రారంభించింది. దేశంలో రెండో పురాతన ఏఎంసీ సంస్థ ఇదే కావడం గమనార్హం. ఇదేవిధమైన సేవల్లోని హెచ్‌డీఎఫ్‌సీ ఏఎంసీ, నిప్పన్ ఇండియా లైఫ్ ఏఎంసీ, ఆదిత్య బిర్లా సన్‌లైఫ్ ఏఎంసీ, యూటీఐ ఏఎంసీ ఇప్పటికే లిస్ట్ అయి ఉన్నాయి. ఈ ఐపీవోకి యాక్సిస్ క్యాపిటల్, జేఎం ఫైనాన్షియల్ బుక్‌రన్నింగ్ లీడ్ మేనేజర్లుగా వ్యవహరించనున్నాయి. ఈ నెల 16న బీఎస్ఈ, ఎన్ఎస్ఈలో షేర్లు లిస్ట్ అవుతాయి.

### ఐఐహెచ్ఎల్ మారిషస్ చేతికి స్టెర్లింగ్ బ్యాంక్



**న్యూఢిల్లీ:** బహమాస్‌కి చెందిన స్టెర్లింగ్ బ్యాంకులో మిగతా 49 శాతం వాటాలను దక్కించుకున్నట్లు ఇండస్ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ (ఐఐహెచ్ఎల్) మారిషస్ వెల్లడించింది. దీనితో బ్యాంకు కొనుగోలు పూర్తయినట్లు వివరించింది. 2022 సెప్టెంబర్‌లో బ్యాంకులో 51 శాతం వాటాను ఐఐహెచ్ఎల్ మారిషస్ కొనుగోలు చేసింది. బ్యాంకు పేరును 'ఐఐహెచ్ఎల్ బ్యాంక్ అండ్ ట్రస్టు' గా మార్చనున్నట్లు సంస్థ తెలిపింది. బ్యాంకింగ్, బీమా తదితర ఆర్థిక సేవలందించే ఐఐహెచ్ఎల్ నికర విలువ 1.26 బిలియన్ డాలర్లుగా ఉంది. భారత్‌లో అయిదో పెద్ద ప్రైవేట్ రంగ బ్యాంక్ అయిన ఇండస్ఇండ్ బ్యాంక్‌నకు ఐఐహెచ్ఎల్ ప్రమోటరుగా ఉంది.

## కొత్త మొబైల్ యూజర్లలో జియో టాప్

**ఎయిర్‌టెల్‌ను మించిన బీఎస్ఎన్ఎల్**

ట్రాయ్ ఆగస్టు గణాంకాల్లో వెల్లడి




**న్యూఢిల్లీ:** కొత్త మొబైల్ యూజర్లకు సంబంధించి ఆగస్టులో రిలయన్స్ జియో జోరు కొనసాగగా, ప్రభుత్వ రంగ బీఎస్ఎన్ఎల్ దాదాపు ఏడాది తర్వాత భారతి ఎయిర్‌టెల్‌ను అధిగమించింది. టెలికం రంగ నియంత్రణ సంస్థ ట్రాయ్ గణాంకాల ప్రకారం మొబైల్ సెగ్మెంట్లో ఆగస్టులో నికరంగా 35.19 లక్షల కొత్త కనెక్షన్లు నమోదయ్యాయి. జియో కస్టమర్లు అత్యధికంగా 19 లక్షల మేర పెరగ్గా బీఎస్ఎన్ఎల్ (13.85 లక్షలు), ఎయిర్‌టెల్ (4.96 లక్షలు) తర్వాత స్థానాల్లో నిల్చాయి. చివరిసారిగా 2024 సెప్టెంబర్‌లో అన్ని ప్రైవేట్ సంస్థలను మించి బీఎస్ఎన్ఎల్ అత్యధికంగా యూజర్లను దక్కించుకుంది. అప్పట్లో కంపెనీ 3జీ సేవలను మాత్రమే అందించేది. అయితే, ప్రైవేట్ టెల్కోలు టారిఫ్‌లను పెంచేయడం బీఎస్ఎన్ఎల్‌కి కలిసొచ్చింది. కంపెనీ ఇటీవలే దేశవ్యాప్తంగా 4జీ సర్వీసులు ప్రారంభించింది. ఇక, తాజాగా జూలైలో 122 కోట్లుగా ఉన్న మొత్తం టెలిఫోన్ సబ్‌స్క్రయిబర్స్ సంఖ్య ఆగస్టులో 122.45 కోట్లకు చేరింది. వొడాఫోన్ ఐడియా అత్యధికంగా 3.08 లక్షల యూజర్లను కోల్పోయింది. బ్రాడ్‌బ్యాండ్ సెగ్మెంట్లో (మొబైల్, ఫిక్స్‌డ్ లైన్ కలిపి) 50 కోట్ల కస్టమర్లతో జియో అగ్రస్థానంలో ఉండగా, తర్వాత స్థానాల్లో 30.9 కోట్ల కనెక్షన్లతో భారతి ఎయిర్‌టెల్, 12.7 కోట్లతో వొడాఫోన్ ఐడియా, 3.43 కోట్ల కనెక్షన్లతో బీఎస్ఎన్ఎల్, 23.5 లక్షల బ్రాడ్‌బ్యాండ్ కనెక్షన్లతో ఏట్రియా కన్వర్జెన్స్ ఉన్నాయి.

# ప్యాసివ్ ఫండ్స్‌కు పెరుగుతున్న ఆదరణ

**రూ.12.2 లక్షల కోట్లకు చేరిన ఏయూఎం**
- ప్రతి ముగ్గురిలో ఇద్దరు ఇన్వెస్ట్ చేస్తున్నారు
- మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ సర్వే

**న్యూఢిల్లీ:** ప్యాసివ్ మ్యూచువల్ ఫండ్స్ పట్ల ఇన్వెస్టర్లలో అవగాహన విస్తృతం అవుతోంది. ఇందుకు నిదర్శనంగా ప్యాసివ్ ఫండ్స్ నిర్వహణలోని ఇన్వెస్టర్ల పెట్టుబడుల (ఏయూఎం) విలువ 2025 మార్చి నాటికి రూ.12.2 లక్షల కోట్లకు చేరింది. 2019 నాటికి ఉన్న రూ.1.91 లక్షల కోట్ల నుంచి ఆరు రెట్లు పెరిగింది. మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ మూడో ఎడిషన్ 'ప్యాసివ్ సర్వే 2025' ఈ వివరాలు విడుదల చేసింది. 2023 మార్చి నుంచి చూసినా ప్యాసివ్ ఫండ్స్ ఏయూఎం 1.7 రెట్లు పెరిగింది. మూడు వేల మందికి పైగా ఇన్వెస్టర్లు, ఫండ్స్ పంపిణీదారుల నుంచి అభిప్రాయాలను సర్వేలో భాగంగా మోతీలాల్ ఓస్వాల్ మ్యూచువల్ ఫండ్ తెలుసుకుంది. ప్యాసివ్ ఫండ్స్ (ఇండెక్స్ ఫండ్స్/ఈటీఎఫ్‌లు) అన్నవి నిర్దేశిత సూచీల్లోని స్టాక్స్‌లోనే ఇన్వెస్ట్ చేస్తాయి. రాబడి కూడా సూచీల స్థాయిలోనే ఉంటుంది. యాక్టివ్ ఫండ్స్ మెరుగైన రాబడుల అవకాశాలను ఎల్లప్పుడూ అన్వేషిస్తూ, అందుకు అనుగుణంగా పెట్టుబడులు పెడుతుంటాయి. యాక్టివ్ ఫండ్స్‌తో పోల్చి చూస్తే ప్యాసివ్ ఫండ్స్‌లో ఎక్స్‌పెన్స్ రేషియో తక్కువగా ఉంటుంది.




**సర్వే అంశాలు..**
- 76 శాతం మంది ఇన్వెస్టర్లు తమకు ఇండెక్స్ ఫండ్స్, ఈటీఎఫ్‌ల పట్ల అవగాహన ఉన్నట్టు చెప్పడం గమనార్హం.
- 68 శాతం ఇన్వెస్టర్లు కనీసం ఒక ప్యాసివ్ ఫండ్‌లో పెట్టుబడులు పెట్టారు. 2023లో ఇలాంటి వారు 61 శాతంగా ఉన్నారు.
- ప్యాసివ్ ఫండ్స్‌కు ఆదరణ పెరిగినప్పటికీ.. యాక్టివ్ ఫండ్స్‌పైనా కొందరు ఇన్వెస్టర్లలో అమిత విశ్వాసం కొనసాగుతోంది. ఇప్పటికీ ప్రతి ముగ్గురిలో ఒకరు యాక్టివ్ ఫండ్స్‌లోనే ఇన్వెస్ట్ చేస్తున్నారు. వీరికి ప్యాసివ్ ఫండ్స్ గురించి పెద్దగా తెలియకపోవడం కూడా ఒక కారణం.
- ప్యాసివ్ ఫండ్స్‌లో పెట్టుబడులు పెట్టడానికి తక్కువ వ్యయాలు కారణమని 54 శాతం మంది చెప్పారు. సులభత్వం, పారదర్శక గురించి 46 శాతం మంది ప్రస్తావించారు. 29 శాతం మంది పనితీరును కారణంగా పేర్కొన్నారు.
- మ్యూచువల్ ఫండ్స్ పంపిణీదారుల్లోనూ 93% మందికి ప్యాసివ్ ఫండ్స్‌పై అవగాహన ఉంది.
- సర్వేలో పాల్గొన్న ఇన్వెస్టర్లలో 85 శాతం మంది మూడేళ్లకు పైగా పెట్టుబడులు కొనసాగిస్తున్నారు. దీర్ఘకాలం కోసం పెట్టుబడుల ధోరణి వారిలో కనిపించింది. ఏడాది నుంచి మూడేళ్ల మధ్య పెట్టుబడులు కొనసాగిస్తున్న వారు 13 శాతంగా ఉన్నారు.
- 57 శాతం మంది ఇన్వెస్టర్లు సిస్టమ్యాటిక్ ఇన్వెస్ట్‌మెంట్ ప్లాన్ (సిప్), ఒకే విడతలో పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారు. 26 శాతం మంది కేవలం సిప్‌లో, 17 శాతం ఒకే విడత పెట్టుబడులకు ఆసక్తి చూపిస్తున్నారు.
- ఆర్థిక స్వేచ్ఛ కోసం ఇన్వెస్ట్ చేస్తున్నట్టు 61 శాతం మంది చెప్పగా, రిటైర్మెంట్ నిధి కోసం 49 శాతం ఇన్వెస్ట్ చేస్తున్నారు.

### ఏబీ లైఫ్ స్టయిల్‌లో ఎస్‌బీఐ లైఫ్ పెట్టుబడులు
ఆదిత్య బిర్లా ఎంఎఫ్ తదితరులకూ వాటాలు




**న్యూఢిల్లీ:** ఆదిత్య బిర్లా లైఫ్‌స్టయిల్ బ్రాండ్స్‌లో 7.31 కోట్ల షేర్లను (6 శాతం వాటాకు సమానం) ఎస్‌బీఐ లైఫ్ ఇన్సూరెన్స్, ఆదిత్య బిర్లా మ్యూచువల్ ఫండ్, మోర్గాన్ స్టాన్లీ, గోల్డ్‌మ్యాన్ శాక్స్ తదితర సంస్థలు ఫ్లిప్‌కార్ట్ ఇన్వెస్ట్‌మెంట్స్ నుంచి కొనుగోలు చేశాయి. వీటి విలువ రూ.998 కోట్లుగా ఉంది. అమాన్సా క్యాపిటల్, నిప్పన్ ఇండియా మ్యూచువల్ ఫండ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ మ్యూచువల్ ఫండ్, యూటీఐ ఎంఎఫ్, ఐసీఐసీఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్, గిసాల్లో క్యాపిటల్, సొసైట్ జనరాలే, పాత్‌స్టోన్ తదితర ఇన్వెస్టర్లు వాటాలను కొనుగోలు చేశారు. ఈ లావాదేవీల తర్వాత ఆదిత్య బిర్లా లైఫ్‌స్టయిల్ బ్రాండ్స్‌లో ఎస్‌బీఐ లైఫ్ వాటా 2.23 శాతం నుంచి 3.65 శాతానికి పెరిగింది.



# సెంథిల్ శుభారంభం

**న్యూయార్క్:** ప్రొఫెషనల్ స్క్వాష్ అసోసియేషన్ (పీఎస్‌ఏ) ఓపెన్ స్క్వాష్ క్లాసిక్ టోర్నీలో భారత జాతీయ చాంపియన్ వెలవన్ సెంథిల్ కుమార్ శుభారంభం చేశాడు. సోమవారం జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 45వ ర్యాంకర్ సెంథిల్ కుమార్ 11–2, 11–8, 14–12తో పాకిస్తాన్‌కు చెందిన ప్రపంచ 55వ ర్యాంకర్ మొహమ్మద్ అషబ్ ఇర్ఫాన్‌పై గెలుపొందాడు. భారత్‌కే చెందిన వీర్ చోత్రాని కూడా రెండో రౌండ్‌లోకి అడుగు పెట్టాడు. తొలి రౌండ్‌లో వీర్ 6–11, 11–6, 11–5, 11–5తో భారత్‌కే చెందిన అభయ్ సింగ్‌ను ఓడించాడు. ఈ టోర్నీలో ఆడుతున్న మరో భారత ప్లేయర్ రమిత్ టాండన్‌కు తొలి రౌండ్‌లో 'బై' లభించింది.




# స్టార్ ప్లేయర్లతో ఈ సీజన్ టీపీఎల్

**బోపన్న సహా మేటి ఆటగాళ్లు బరిలోకి**

**న్యూఢిల్లీ:** టెన్నిస్ ప్రీమియర్ లీగ్ (టీపీఎల్) ఏడో సీజన్‌లో పలువురు విదేశీ స్టార్లు బరిలోకి దిగేందుకు సిద్ధమయ్యారు. భారత వెటరన్ టెన్నిస్ ప్లేయర్ రోహన్ బోపన్నతో పాటు... ఏటీపీ ర్యాంకింగ్స్‌లో టాప్–50లో ఉన్న ముగ్గురు ఆటగాళ్లు ఈ సీజన్‌లో ఆడనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. టీపీఎల్–7 డిసెంబర్ 9 నుంచి అహ్మదాబాద్‌లో జరుగుతుంది. దీనికంటే ముందుగా ఈ నెల 9న ముంబైలో ఆటగాళ్ల వేలం ప్రక్రియ నిర్వహిస్తారు. ఇటలీకి చెందిన ప్రపంచ 29 ర్యాంకర్ లూసియానో దర్దేరి, ఫ్రాన్స్ ప్లేయర్లు 38వ ర్యాంకర్ కొరెంటిన్ మౌటెట్, 39వ ర్యాంకర్ అలెగ్జాండర్ ముల్లర్, 54వ ర్యాంకర్ ఆర్థర్ రిండెర్క్‌నెచ్ తదితరులు టీపీఎల్‌కు స్టార్‌డమ్ తీసుకొస్తున్నారు. రెండు గ్రాండ్‌స్లామ్‌ల డబుల్స్ చాంపియన్ బోపన్న గతేడాదే టీపీఎల్‌లో అరంగేట్రం చేశాడు. ఎస్‌జీ పైపర్స్ బెంగళూరు తరఫున అతను బరిలోకి దిగుతాడు. లూసియానో రాజస్తాన్ రేంజర్స్, మౌటెట్ గుర్గావ్ గ్రాండ్ స్లామర్స్ తరఫున, ముల్లర్ గుజరాత్ పాంథర్స్, రిండెర్క్‌నెజ్ హైదరాబాద్ స్ట్రయికర్స్ తరఫున బరిలోకి దిగనున్నారు. స్టార్లు, మేటి ఆటగాళ్లతో టీపీఎల్ మరో దశకు చేరుతోందని లీగ్ సహ వ్యవస్థాపకుడు కునాల్ ఠాకూర్ చెప్పారు. ప్రపంచ మేటి ఆటగాళ్లతో కలిసి ఆడటం వల్ల దేశీయ టెన్నిస్ ప్లేయర్లకు లాభిస్తుందని అన్నారు.

# లంక లీగ్‌లో భారత క్రికెటర్లు!

**న్యూఢిల్లీ:** లంక ప్రీమియర్ లీగ్ (ఎల్‌పీఎల్)లో భారత క్రికెటర్లు పాల్గొంటారని నిర్వాహకులు వెల్లడించారు. ఎల్‌పీఎల్ ఆరో సీజన్ డిసెంబర్ 1 నుంచి జరుగుతుంది. అయితే ఇందులో తొలిసారి భారత క్రికెటర్లు బరిలోకి దిగుతారని త్వరలోనే వారి పేర్లను వెల్లడిస్తామని ఎల్‌పీఎల్ వర్గాలు తెలిపాయి. ఈ టి20 లీగ్‌లో మొత్తం 24 మ్యాచ్‌లుంటాయి. ఇందులో 20 లీగ్ మ్యాచ్‌లు కాగా... 4 నాకౌట్ మ్యాచ్‌లు. మూడు వేదికలు కొలంబో, క్యాండీ, దంబుల్లా ఈ మూడు వేదికల్లో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. మొత్తం ఐదు ఫ్రాంచైజీల మధ్య రౌండ్ రాబిన్ లీగ్ పద్ధతిలో మ్యాచ్‌లు నిర్వహిస్తారు. ఐపీఎల్ లాగే 'ప్లే ఆఫ్స్' జరుగుతాయి. టాప్–2లో నిలిచిన జట్లు తొలి క్వాలిఫయర్‌లో ఆడతాయి. గెలిచిన జట్టు ఫైనల్ చేరితే... ఓడిన జట్టేమో... మూడు, నాలుగు స్థానాల మధ్య జరిగే ఎలిమినేటర్ మ్యాచ్ విజేతతో రెండో క్వాలిఫయర్‌లో ఆడుతుంది. 'భారత క్రికెటర్లు కూడా ఈసారి బరిలోకి దిగుతారు. త్వరలోనే వేలానికి వచ్చే ఆ ఆటగాళ్ల వివరాలను ప్రకటిస్తాం. భారత ఆటగాళ్ల రాకతో లీగ్ మరింత రసవత్తరంగా జరుగనుంది' అని ఎల్‌పీఎల్ ఒక ప్రకటనలో పేర్కొంది.



# దబంగ్ ఢిల్లీ ధమాకా...

**ప్రొ కబడ్డీ లీగ్‌లో ఢిల్లీకి పదో విజయం**

**చెన్నై:** మాజీ చాంపియన్ దబంగ్ ఢిల్లీ ప్రొ కబడ్డీ లీగ్ 12వ సీజన్‌లో పదో విజయంతో 'టాప్' లేపింది. సోమవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో దబంగ్ ఢిల్లీ జట్టు 29–26తో మాజీ విజేత జైపూర్ పింక్‌పాంథర్స్‌పై గెలుపొందింది. కెప్టెన్, రెయిడర్ అశు మలిక్ 8 పాయింట్లతో అదరగొట్టాడు. 17 సార్లు కూతకెళ్లిన ఢిల్లీ కెప్టెన్ 8 సార్లు విజయవంతంగా పాయింట్లు తెచ్చాడు. డిఫెండర్ సందీప్ (7) కూడా రాణించడంతో దబంగ్ జట్టు ప్రత్యర్థిపై పైచేయి సాధించింది. మరోవైపు జైపూర్ పింక్ పాంథర్స్ సమష్టిగా గెలిచేందుకు పోరాడింది. డిఫెండర్లు రెజా మీర్‌బగేరి (5), దీపాన్షు ఖత్రి (5), ఆర్యన్ కుమార్ (4) ప్రత్యర్థి రెయిడర్లను బెంబేలెత్తించారు. రెయిడర్లలో మీతు, అలీ సమది చెరో 2 పాయింట్లు చేశారు. 11 మ్యాచ్‌లాడిన దబంగ్ ఢిల్లీ 10 విజయాలతో పట్టికలో అగ్రస్థానంలో కొనసాగుతోంది. అనంతరం జరిగిన రెండో మ్యాచ్‌లో మూడుసార్లు చాంపియన్ పట్నా పైరేట్స్ 36–28తో యూపీ యోధాస్‌పై విజయం సాధించింది. పైరేట్స్ తరఫున రెయిడర్ అయాన్ (15) చెలరేగాడు. 21 సార్లు కూతకెళ్లిన అతను క్రమం తప్పకుండా పాయింట్లు తెచ్చిపెట్టాడు. మిగతా వారిలో డిఫెండర్లు నవ్‌దీప్ (5), దీపక్ (4) రాణించారు. యూపీ యోధాస్ జట్టులో రెయిడర్ గగన్ (10) ఒంటరి పోరాటం చేశాడు. మిగతా వారిలో శివమ్ (3), మహేందర్ సింగ్ (2), హితేశ్ (2), సుమిత్ (2) ఫర్వాలేదనిపించారు. నేడు జరిగే మ్యాచ్‌ల్లో పట్నా పైరేట్స్‌తో తమిళ్ **తలైవాస్, హరియాణా స్టీలర్స్‌తో దబంగ్ ఢిల్లీ తలపడనున్నాయి.**



# శ్రీకాంత్ నిరీక్షణ ముగిసేనా!

**వాంటా (ఫిన్‌లాండ్):** ఎనిమిదేళ్ల టైటిల్ నిరీక్షణకు తెరదించాలనే లక్ష్యంతో... భారత స్టార్ షట్లర్ కిడాంబి శ్రీకాంత్ మరో టోర్నమెంట్‌లో బరిలోకి దిగనున్నాడు. నేడు మొదలయ్యే ఆర్కిటిక్ ఓపెన్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో శ్రీకాంత్ నేరుగా మెయిన్ 'డ్రా'లో చోటు సంపాదించాడు. తొలి రోజు మంగళవారం కేవలం క్వాలిఫయింగ్ మ్యాచ్‌లు జరుగుతాయి. మెయిన్ 'డ్రా'లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్‌తోపాటు భారత్‌కే చెందిన లక్ష్య సేన్, ఆయుశ్ శెట్టి, తరుణ్ మన్నేపల్లి, కిరణ్ జార్జి, శంకర్ ముత్తుస్వామి తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటారు. ఇటీవల మలేసియా మాస్టర్స్ టోర్నీలో రన్నరప్‌గా నిలిచిన శ్రీకాంత్ చివరిసారి 2017లో అంతర్జాతీయ సింగిల్స్ టైటిల్‌ను సాధించాడు. మహిళల సింగిల్స్‌లో భారత్ నుంచి తాన్యా హేమంత్, అన్‌మోల్ ఖరబ్ మాత్రమే బరిలో ఉన్నారు. మహిళల డబుల్స్‌లో కవిప్రియ -సిమ్రన్... మిక్స్‌డ్ డబుల్స్‌లో మోహిత్-లక్షిత జగ్లాన్... తనీషా క్రాస్టో-ధ్రువ్ కపిల జోడీలు పోటీపడతాయి.



# 'బయటి విషయాలు పట్టించుకోం'

- మా అందరి దృష్టి విజయంపైనే
- జెమీమా రోడ్రిగ్స్ వ్యాఖ్య

**కొలంబో:** భారత్‌లో మహిళల క్రికెట్ ఎదుగుదలలో కీలక పాత్ర పోషించిన పలువురి కోసం తాము వన్డే ప్రపంచ కప్‌ను గెలవాలని కోరుకుంటున్నట్లు భారత బ్యాటర్ జెమీమా రోడ్రిగ్స్ వ్యాఖ్యానించింది. ఈ క్రమంలో బయట జరిగే చర్చ గురించి తాము పట్టించుకోమని, తమ దృష్టి మొత్తం విజయంపైనే ఉందని ఆమె వెల్లడించింది. ఆదివారం పాకిస్తాన్‌ను ఓడించిన తర్వాత జెమీమా తమ ప్రదర్శనపై మాట్లాడింది. 'మేం ఒకసారి ఒక మ్యాచ్‌పైనే దృష్టి పెడుతూ ముందుకు వెళుతున్నాం. ప్రపంచ కప్ గురించి బయట ఎంతో చర్చ జరుగుతుందని మాకు తెలుసు. దాని ప్రభావం మాపై పడకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మా బృందం సమావేశాల్లో కూడా ఆటలో ఎదురయ్యే సవాళ్ల గురించే మాట్లాడుకుంటున్నాం. ఒకరినొకరు ప్రోత్సహించుకుంటూ ముందుకు సాగుతున్నాం. నేను జట్టులోకి వచ్చినప్పుడు మిథాలీ, జులన్‌లాంటి సీనియర్లు నడిపించారు. ఇప్పుడు హర్మన్, స్మృతి కలిసి జట్టును ముందుకు తీసుకెళుతున్నారు. అందరూ తమ అత్యుత్తమ ప్రదర్శన చూపించే విధంగా వారు తీర్చిదిద్దారు. భారత మహిళల క్రికెట్ స్థాయిని పెంచిన మిథాలీ, జులన్, నీతూ డేవిడ్ వంటి ప్లేయర్ల కోసం వరల్డ్ కప్ గెలవాలని పట్టుదలగా ఉన్నాం' అని జెమీమా పేర్కొంది. గువహటి, కొలంబో పిచ్‌లను బ్యాటర్లకు సవాల్‌గా నిలిచాయని, పరిస్థితులకు తగినట్లుగా తమ ఆటను మలచుకున్నామని ఆమె వివరించింది.



# సునీల్ ఛెత్రి వచ్చేశాడు


- సింగపూర్‌తో ఆసియా కప్ క్వాలిఫయింగ్ మ్యాచ్
- భారత బృందాన్ని ప్రకటించిన హెడ్ కోచ్ ఖాలిద్ జమీల్

**బెంగళూరు:** గత నెలలో తజికిస్తాన్‌లో జరిగిన నేషన్స్ కప్ ఫుట్‌బాల్ టోర్నమెంట్‌కు దూరంగా ఉన్న భారత మాజీ కెప్టెన్, స్టార్ ప్లేయర్ సునీల్ ఛెత్రి తిరిగి జాతీయ జట్టులోకి వచ్చాడు. ఆసియా కప్ క్వాలిఫయర్స్‌లో భాగంగా సింగపూర్ జట్టుతో సింగపూర్ వేదికగా ఈనెల 9న భారత్ తలపడనుంది. ఈ కీలక మ్యాచ్‌లో పాల్గొనే 23 మంది సభ్యులతో కూడిన భారత జట్టును హెడ్ కోచ్ ఖాలిద్ జమీల్ ప్రకటించారు. నేషన్స్ కప్ టోర్నీకి 41 ఏళ్ల సునీల్ ఛెత్రిని ఎంపిక చేయకుండా విశ్రాంతి ఇచ్చారు. గాయం కారణంగా డిఫెండర్ సందేశ్ జింగాన్ కూడా నేషన్స్ కప్ టోర్నీలో ఆడలేదు. సింగపూర్‌తో జరిగే గ్రూప్ 'సి' కీలక మ్యాచ్‌లో ఈ ఇద్దరు స్టార్ ఆటగాళ్లు బరిలోకి దిగనున్నారు. 9న సింగపూర్‌లో మ్యాచ్ ముగిసిన తర్వాత... ఈ రెండు జట్లు 14న గోవాలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో మరోసారి పోటీపడతాయి. 2005 నుంచి భారత సీనియర్ జట్టుకు ఆడిన సునీల్ 2024 జూన్‌లో రిటైర్మెంట్ ప్రకటించాడు. అయితే ఛెత్రి వీడ్కోలు పలికిన తర్వాత భారత జట్టు ప్రదర్శన మరింత దిగజారడంతో అతను తన రిటైర్మెంట్ నిర్ణయాన్ని వెనక్కి తీసుకొని మళ్లీ జట్టుకు అందుబాటులోకి వచ్చాడు. ఇప్పటి వరకు భారత్ తరఫున 155 మ్యాచ్‌లు ఆడిన సునీల్ ఛెత్రి 95 గోల్స్ సాధించాడు. జాతీయ జట్టు తరఫున అత్యధిక గోల్స్ చేసిన క్రీడాకారుల జాబితాలో సునీల్ ఛెత్రి నాలుగో స్థానంలో ఉన్నాడు. భారత్, సింగపూర్, హాంకాంగ్, బంగ్లాదేశ్ జట్లున్న ఆసియా కప్–2027 క్వాలిఫయింగ్ గ్రూప్ 'సి'లో భారత్ రెండు మ్యాచ్‌లు ఆడి ఒక పాయింట్‌తో చివరిదైన నాలుగో స్థానంలో ఉంది. గ్రూప్ 'సి' విజేత సౌదీ అరేబియా ఆతిథ్యమిచ్చే 2027 ఆసియా కప్ టోర్నీకి అర్హత సాధిస్తుంది.

**భారత ఫుట్‌బాల్ జట్టు:** అమరిందర్ సింగ్, గుర్మీత్ సింగ్, గుర్‌ప్రీత్ సింగ్ సంధూ (గోల్‌కీపర్లు), అన్వర్ అలీ, హిమింథ్మాన్‌మావియా రాల్టె, మొహమ్మద్ ఉవైస్, పరమ్‌వీర్, రాహుల్ భెకె, సందేశ్ జింగాన్ (డిఫెండర్లు), బ్రాండన్ ఫెర్నాండెస్, దానిశ్ ఫారుఖ్ భట్, దీపక్ టాంగ్రి, మకార్టన్ లూయిస్ నిక్సన్, మహేశ్ సింగ్ నవోరెమ్, నిఖిల్ ప్రభు, సాహల్ అబ్దుల్ సమద్, ఉదాంత సింగ్ కుమామ్ (మిడ్ ఫీల్డర్లు), ఫారూఖ్ చౌధరీ, లాలియాన్‌జువాలా చాంగ్టె, లిస్టన్ కొలాకో, రహీమ్ అలీ, విక్రమ్ ప్రతాప్ సింగ్, సునీల్ ఛెత్రి (ఫార్వర్డ్స్).

# సిద్రా అమిన్‌కు ఐసీసీ మందలింపు

**కొలంబో:** మహిళల వన్డే ప్రపంచకప్‌లో ప్రవర్తనా నియమావళిని అతిక్రమించిన పాకిస్తాన్ బ్యాటర్ సిద్రా అమిన్‌ను మ్యాచ్ రిఫరీ మందలించారు. భారత మహిళల జట్టుతో ఆదివారం జరిగిన మ్యాచ్‌లో పాక్ చిత్తుగా ఓడింది. అయితే సిద్రా అమిన్ ఒంటరి పోరాటం ఆకట్టుకుంది. కానీ 40వ ఓవర్లో స్నేహ్ రాణా ఆమెను అవుట్ చేయగా... నిరాశగా క్రీజు వీడుతున్న సిద్రా బ్యాట్‌తో పిచ్‌పై బలంగా కొట్టింది. ఆమె పరిధి దాటిన అసహనంపై అంతర్జాతీయ క్రికెట్ మండలి (ఐసీసీ) నియమావళి ప్రకారం రిఫరీ చర్యలు తీసుకున్నారు. ఎవరైనా ప్లేయర్లు తమ కిట్‌తో గానీ, వేసుకున్న జెర్సీలతోగానీ ఇలా మైదానంలో నేలకేసి బాదడం, విసిరేయడం ప్రవర్తన నియమావళి ఉల్లంఘనే అవుతుందని... అందుకే ఆమెకు ఓ డిమెరిట్ పాయింట్ విధించడంతో పాటు రిఫరీ శాండ్రే ఫ్రిజ్ గట్టిగా మందలించారని ఐసీసీ ఒక ప్రకటనలో తెలిపింది. తన తప్పును సిద్రా అంగీకరించడంతో తదుపరి విచారణ అవసరం లేదని ఐసీసీ పేర్కొంది.



# మన అథ్లెట్ల చారిత్రక ప్రదర్శన

**పారా అథ్లెట్లపై ప్రధాని ప్రశంసల వర్షం**

**న్యూఢిల్లీ:** ప్రపంచ పారా అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్‌లో పతకాలు సాధించిన భారత దివ్యాంగ అథ్లెట్లను ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అభినందించారు. భారత్ ఆతిథ్యమిచ్చిన ఈ పోటీల్లో మన పారా అథ్లెట్ల ప్రదర్శన చారిత్రకమని కితాబిచ్చారు. ఈ మెగా ఈవెంట్‌లో భారత్ రికార్డు స్థాయిలో 22 పతకాలు సాధించింది. ఇందులో 6 స్వర్ణాలు సహా 9 రజతాలు, 7 కాంస్యాలున్నాయి. దీంతో భారత బృందం గతేడాది జపాన్‌లో గెలిచిన 17 పతకాల రికార్డును అధిగమించింది. ఈ సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా 'ఎక్స్'లో ప్రశంసల వర్షం కురిపించారు. 'ఈ చాంపియన్‌షిప్‌లో మన అథ్లెట్లు చరిత్రాత్మక ప్రదర్శన ఇచ్చారు. ఈ ఈవెంట్‌కు ప్రత్యేకతను తీసుకొచ్చారు. భారత పారా అథ్లెట్ల అత్యుత్తమ ప్రదర్శన వల్లే మునుపెన్నడు లేని విధంగా 22 పతకాలు గెలిచాం. విజేతలందరికి శుభాభినందనలు' అని ట్వీట్ చేశారు. పతక విజేతల ఫొటోని కూడా పోస్ట్ చేశారు. ప్రతి పారాథ్లెట్ విజయాన్ని చూసి తాను గర్వపడుతున్నట్లు చెప్పారు. భవిష్యత్తులో వీళ్లు మరిన్ని విజయాలు సాధించాలని ఆశిస్తున్నానని పేర్కొన్నారు. దేశ ప్రతిష్ట పెరిగేలా రాజధానిలో విజయవంతంగా పోటీలు నిర్వహించిన అధికారులు, సిబ్బంది, చెమటోడ్చిన శ్రామికుల్ని కూడా ప్రధాని అభినందించారు. ఢిల్లీ ఆతిథ్యమిచ్చిన ఈ మెగా ఈవెంట్‌ల్లో 100కు పైగా దేశాల నుంచి 2200 పైచిలుకు అథ్లెట్లు పోటీపడ్డారు. 186 మెడల్ ఈవెంట్లు జరిగాయి.




# పంజాబ్ కింగ్స్‌ను వీడిన సునీల్ జోషి

**న్యూఢిల్లీ:** ఐపీఎల్ టీమ్ పంజాబ్ కింగ్స్‌కు స్పిన్ బౌలింగ్ కోచ్‌గా ఉన్న సునీల్ జోషి ఆ బాధ్యతల నుంచి తప్పుకున్నాడు. బెంగళూరులో ఉన్న తన కుటుంబంతో ఎక్కువ సమయం గడిపేందుకు వీలుగా జోషి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఐపీఎల్ వర్గాలు వెల్లడించాయి. గతంలో జోషి పంజాబ్ జట్టు సహాయక సిబ్బందిలో భాగంగా ఉన్నాడు. అనిల్ కుంబ్లే హెడ్ కోచ్‌గా ఉన్న సమయంలో అతను ఈ బాధ్యతలు నిర్వర్తించాడు. ఆ తర్వాత సెలక్టర్‌గా వెళ్లిన అతను మళ్లీ 2023 ఐపీఎల్ నుంచి పంజాబ్ జట్టుతో కలిసి పని చేస్తున్నాడు. లెఫ్టార్మ్ స్పిన్నర్ అయిన సునీల్ జోషి భారత్ తరఫున 15 టెస్టులు, 69 వన్డేలు ఆడాడు.

# చాంప్స్ రేయాంశ్, రినాయర

**సాక్షి, హైదరాబాద్:** తెలంగాణ ర్యాంకింగ్ చెస్ టోర్నమెంట్‌లో అండర్–7 బాలుర విభాగంలో రేయాంశ్ సింఘాల్, అండర్–7 బాలికల విభాగంలో రినాయర వర్మ విజేతలుగా నిలిచారు. హైదరాబాద్ జిల్లా చెస్ సంఘం (హెచ్‌డీసీఏ) ఆధ్వర్యంలో లాల్‌బహదూర్ స్టేడియంలో ఈ టోర్నీని నిర్వహించారు. ఇద్దరు ప్లేయర్లు సమంగా పాయింట్లు సాధిస్తే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్స్‌ను వర్గీకరించారు. తెలంగాణ రాష్ట్ర చెస్ సంఘం (టీజీసీఏ) ఉపాధ్యక్షురాలు టి.పుణ్యవతి, కోశాధికారి కె.నర్సింగ్‌రావు, మధుసూదన్ రెడ్డి, హెచ్‌డీసీఏ అధ్యక్షుడు కేఎస్ ప్రసాద్ విజేతలకు బహుమతులు అందజేశారు. ఆయా వయో విభాగాల విజేతల వివరాలు ఇలా ఉన్నాయి.

**అండర్–7 బాలుర విభాగం:** 1. రేయాంశ్ సింఘాల్ (4.5 పాయింట్లు), 2. గొట్టుముక్కల ఓంఈశ్ (4.5 పాయింట్లు), 3. బొడ్డు రితీశ్ నంధన్ (4 పాయింట్లు). బాలికల విభాగం: 1. రినాయర వర్మ (3 పాయింట్లు), 2. నర్రా మహాయాన (3 పాయింట్లు), 3. జోష్విక పటేల్ (3 పాయింట్లు). అండర్–9 బాలుర విభాగం: 1. జితిన్ యలవర్తి (4 పాయింట్లు), 2. కాసమనేని అక్షజ్ (4 పాయింట్లు), 3. సత్తిరాజు ఇషాన్ (3.5 పాయింట్లు). బాలికల విభాగం: 1. తుంకి శారిక (5 పాయింట్లు), 2. జంగా రిషిక (4 పాయింట్లు), 3. మునిపల్లి ఆశ్రిత (4 పాయింట్లు). అండర్–11 బాలుర విభాగం: 1. పెంజార్ల పూజిత్ అయాన్ (5 పాయింట్లు), 2. వెచ్చ కిన్షుక్ (5 పాయింట్లు), 3. జయంపు సాయి సాత్విక్ (4 పాయింట్లు). బాలికల విభాగం: 1. స్వర దీపక్ ఫాస్గే (4 పాయింట్లు), 2. మాఘం రోహిశ్రీ (4 పాయింట్లు), 3. జొన్నశ్రీ తన్వీ (3 పాయింట్లు). అండర్–13 బాలుర విభాగం: 1. పాడి అద్రిత్ (4.5 పాయింట్లు), 2. జగ్లాన్ అథర్వ్ (4.5 పాయింట్లు), 3. జి.రితీశ్ (4 పాయింట్లు). బాలికల విభాగం: 1. అసిరెడ్డి సహస్ర (4 పాయింట్లు), 2. కె. చిద్విలాసిని (3 పాయింట్లు), 3. వదాలి నిఖిత (3 పాయింట్లు). అండర్–15 బాలుర విభాగం: 1. కె. చరణ్‌తేజ (5 పాయింట్లు), 2. అనయ్ సరాఫ్ (4 పాయింట్లు), 3. చెన్నుపాటి దీపక్ (4 పాయింట్లు). బాలికల విభాగం: 1. యర్రోజు రమ్య (2.5 పాయింట్లు), 2. కప్పాల ఇందిర (2.5 పాయింట్లు), 3. తిరువాయిపేట మనస్విని (2 పాయింట్లు).




రష్యా రాజధాని మాస్కోలోని పార్కులు ఈ ఆకురాల్చే కాలంలో ఇలా కొత్త అందాలను సంతరించుకున్నాయి


కశ్మీర్‌లోని స్కై రిసార్టు గుల్‌మార్గ్‌లో ఈ సీజన్‌లో మొట్టమొదటిసారిగా సోమవారం కురిసిన మంచులో పర్యాటకుల సరదా


యూపీలోని ప్రయాగ్‌రాజ్‌లో శరత్ పూర్ణిమ రోజైన సోమవారం రాత్రి ఆకాశంలో పున్నమి చంద్రుడు కనువిందు చేశాడు

# వదిలేసిన ఆహారం విషమవుతోంది!

## వాతావరణంలోకి విడుదలవుతున్న ప్రమాదకర వాయువులు

### ఆహారం వృథాలో చైనాది మొదటి స్థానం • ఆ తర్వాత భారత్, పాకిస్తాన్‌లే

**న్యూఢిల్లీ:** ప్రపంచవ్యాప్తంగా ఏటా కోట్లాది టన్నుల ఆహారం ఉత్పత్తి అవుతుంది. కొన్ని దేశాలలో ఉత్పత్తి చేసిన ఆహారంలో చాలా భాగం వృథా అవుతోంది. ఇక్కడ ఫుడ్ వేస్ట్ అవడమే కాదు అది మళ్లీ మనకే ప్రాణాంతకమవుతోంది. ఈ వృథా ఆహార పదార్థాలు చెత్త డంపుల్లో పడి మీథేన్ వంటి ప్రమాదకర గ్రీన్‌హౌస్ వాయువులను విడుదల చేస్తుంది. ఇది కార్బన్ డయాక్సైడ్ కంటే ఎక్కువ ప్రమాదకరం. ప్రపంచ గ్రీన్‌హౌస్ గ్యాస్ ఉద్గారాల్లో ఆహారం వృథా కారణంగా 8 నుంచి 10% వరకు ఉంటున్నాయి. అలాగే 30% వ్యవసాయ భూమిని ఆహార పదార్థాలకు మాత్రమే ఉపయోగిస్తున్నాం. మీకు తెలుసా? ఒక ఇంట్లో ప్రతి వ్యక్తి ఏడాదికి సగటున 132 కిలోగ్రాముల ఆహారాన్ని వృథా చేస్తున్నాడు. అలాగే, ప్రపంచదేశాలు ఏటా 1 లక్ష కోట్ల డాలర్లకు పైగా విలువైన ఆహారాన్ని వదిలేస్తున్నాయి. మరో విషాదమేమంటే.. ఇంత ఆహారం వృథా అవుతున్నా ప్రపంచంలో 78.3 కోట్ల మంది ఆకలితో అలమటిస్తుండటం..!

#### చైనా.. భారత్.. పాకిస్తాన్..

ఆహార వృథా సమస్య తీవ్రతపై 2024లో ఓ నివేదిక విడుదలైంది. ఇందులోని డేటాలో ప్రపంచంలోని ఏఏ దేశాల వాళ్లు ఎక్కువ ఆహారాన్ని వృథా చేస్తున్నారో తెలిపారు. ఆహారం వృథా చేసే దేశాల్లో మొదటి స్థానాన్ని చైనా ఆక్రమించింది. ప్రపంచంలోనే ఎక్కువ జనాభా కలిగిన దేశాలలో చైనా ఒకటి. చైనాలో సంవత్సరానికి 108 మిలియన్ టన్నులకు పైగా ఆహారాన్ని వృథా అవుతోంది. అంటే చైనాలో ప్రతి వ్యక్తి సంవత్సరానికి 76 కేజీల ఆహారాన్ని వృథా చేస్తున్నాడన్నమాట. ఇక రెండో స్థానంలో ఉన్నది మనమే. మనదేశంలో సంవత్సరానికి 78 మిలియన్ టన్నులకు పైగా ఆహారం వృథా అవుతోంది. దేశ జనాభా ఎక్కువ కాబట్టి ప్రతి భారతీయుడు సంవత్సరానికి 54 కేజీలు వృథా చేస్తాడు. అసమర్థ స్టోరేజ్, రవాణా లోపాలు, వ్యవసాయ క్షేత్రం నుంచి మార్కెట్‌కు తరలించేటప్పుడు ఆహారం చెడిపోవడం ..వంటివి ఫుడ్ వేస్ట్ అవడానికి ప్రధాన కారణాలు. మూడో స్థానం పాకిస్తాన్. ఇక్కడ ఏడాదికి 31 మిలియన్ టన్నుల ఆహారం వృథా అవుతోంది. అయితే సగటున ప్రతి వ్యక్తి 122 కేజీలు ఆహారాన్ని వృథా చేస్తున్నాడు. ప్రపంచంలో ఆహారం వృథా అయ్యేది ఇక్కడే.



#### నిల్వ వసతులు లేమి

ఆహార వృథాలో నాలుగో స్థానం నైజీరియాది. ఇక్కడ 24.8 మిలియన్ టన్నుల వృథాతో సగటున ఒక్కో వ్యక్తి 106 కేజీల ఆహారం వృథా చేస్తున్నాడు. ఇక్కడ వృథా ఎక్కువగా వినియోగదారుల నుంచి కాకుండా కోల్డ్ స్టోరేజ్ లేకపోవడం, రవాణా సమస్యలు, మార్కెట్ యాక్సెస్ లోపాలతో వృథా అవుతోంది. ఐదో స్థానంలో అమెరికా ఉంది. అమెరికాలో ప్రతి ఏటా దేశం మొత్తంలో 24 మిలియన్ టన్నులు ఆహారం వృథా అవుతండగా లగటు ప్రతి వ్యక్తి 71 కేజీలు వృథా చేస్తున్నారు. ఇక్కడ ఎక్కువగా రెస్టారెంట్లు, సూపర్‌మార్కెట్లలో ఆహారం వృథా అవుతుంది. ఆరో స్థానంలో బ్రెజిల్. సంవత్సరానికి 20 మిలియన్ టన్నులు పైగా, ప్రతి వ్యక్తికి 95 కేజీలు ఆహారాన్ని వృథా చేస్తున్నారు. ఏడో స్థానంలో ఈజిప్ట్ ఉంది. 18 మిలియన్ టన్నులతో ప్రపంచంలోనే అత్యధికంగా ప్రతి వ్యక్తి 155 కేజీలు వృథా చేస్తున్నారు. ఎనిమిదో స్థానంలో ఇండోనేసియా ఉంటుంది. 15 మిలియన్ టన్నులతో ప్రతి వ్యక్తి 52 కేజీలు వృథా చేస్తున్నాడు. తొమ్మిదో స్థానంలో బంగ్లాదేశ్. 4 మిలియన్ టన్నులు పైగా, కానీ వ్యక్తికి 82 కేజీల చొప్పున వృథా అవుతోంది. బంగ్లాదేశ్ లాంటి దేశానికి ఇది చాలా ఎక్కువ. చివరి స్థానంలో మెక్సికో నిలిచింది. ఏడాదికి 13.4 మిలియన్ టన్నుల మేర వృథా అవుతుంది. సగటున ప్రతి వ్యక్తి 102 కేజీలు ఆహారం వృథా అవుతోంది.

#### మనం ఏమి చేయగలం?

అవసరమైన మేరకే కొనుగోలు చేయడం, వ్యర్థాలను కంపోస్ట్ ఎరువుగా మార్చుకోవడం, ఫుడ్ బ్యాంకులకు డొనేట్ చేయడం వంటి చిన్న మార్పులతో పెద్ద తేడా తీసుకురావచ్చని ఆహార నిపుణులు చెబుతున్నారు. మార్పు మన నుంచే మొదలుకావాలన్నది తెలుసుకోవాల్సిన ముఖ్యమైన అంశం. ఆ తర్వాతే సమాజం, దేశంతో పాటు ప్రపంచం కూడా మారుతాయి. ఆరోగ్యంగా ఉండాలంటే మంచి ఆహారం అవసరం. అదే ఆహారం మనకే విషమైతే..? మనుగడ ప్రశ్నార్థకమవుతుంది..!

## ఇడుక్కిలో ఏనుగు దాడి వృద్ధుని మృతి

**ఇడుక్కి (కేరళ):** కేరళ రాష్ట్రం, ఇడుక్కి జిల్లా పూపారాలో సోమవారం అడవి ఏనుగు దాడిలో 62 ఏళ్ల వృద్ధుడు మరణించాడని పోలీసులు తెలిపారు. మృతుడిని పన్నీర్ ఎస్టేట్‌కు చెందిన వేలుసామిగా గుర్తించారు. పోలీసుల కథనం ప్రకారం, వేలుసామి ఉదయం 9 గంటల నుండి 11.10 గంటల మధ్య ఎస్టేట్ సమీపంలోని ఒక యాలకుల తోటలో పని చేస్తుండగా.. అతనిపై ఏనుగు దాడి చేసింది. అతని అరుపులు విని స్థానికులు వెంటనే అక్కడికి చేరుకున్నారు, కానీ ఏనుగు వేలుసామి దగ్గరే ఉండటంతో, అతన్ని రక్షించలేకపోయారు. కాసేపయ్యాక స్థానికులు ఏనుగును తరిమికొట్టగలిగారు, కానీ అప్పటికే వేలుసామి తీవ్ర గాయాలతో మరణించినట్లు పోలీసులు వెల్లడించారు. పోలీసులు, అటవీ శాఖ అధికారులు మృతదేహాన్ని ఆదిమాలిలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆ ప్రాంతంలో అడవి ఏనుగుల దాడులు తరచూ జరుగుతున్నాయని, అందుకే అక్కడ ఫారెస్ట్ రాపిడ్ రెస్పాన్స్ టీమ్‌ను మోహరించినట్లు పోలీసులు తెలిపారు.

## పశువుల రవాణా అడ్డుకుని.. ప్రాణం పోగొట్టుకుని..

### బంగ్లా సరిహద్దులో బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ మృతి

**కోల్‌కతా/న్యూఢిల్లీ:** పశ్చిమ బెంగాల్‌లోని బంగ్లాదేశ్‌తో అంతర్జాతీయ సరిహద్దు వెంబడి పశువుల అక్రమ రవాణా ప్రయత్నాన్ని అడ్డుకునే క్రమంలో 59 ఏళ్ల బోర్డర్ సెక్యూరిటీ ఫోర్స్ ఇన్‌స్పెక్టర్ మరణించారు. పశ్చిమ బెంగాల్ రాష్ట్రం మాల్దా జిల్లాలోని బీఎస్ఎఫ్ ఆగ్రా బోర్డర్ అవుట్‌పోస్ట్ సమీపంలో అక్టోబర్ 4వ తేదీ అర్ధరాత్రి జరిగిన ఈ సంఘటనపై అధికారులు సోమవారం తెలిపిన వివరాలివి. బీఎస్ఎఫ్ ఇన్‌స్పెక్టర్ కపిల్ దేవ్ సింగ్ నాయకత్వం వహిస్తున్న ఒక మెరుపు దాడి బృందం.. భారతదేశం నుండి బంగ్లాదేశ్‌లోకి దున్నపోతులను తోలడానికి ప్రయత్నిస్తున్న పశువుల స్మగ్లర్లను గమనించింది. దీంతో మెరుపుదాడి దళం.. స్మగ్లర్లను నిలువరించేందుకు.. పంప్ యాక్షన్ గన్స్ నుండి మూడు ప్రాణాపాయం లేని రౌండ్లు కాల్చగా, స్మగ్లర్లు పెద్ద కత్తి, కర్రలు తదితర పదునైన ఆయుధాలతో ఎదురు దాడికి దిగారు. భారత బలగంలోని 88వ బెటాలియన్‌కు చెందిన ఇన్‌స్పెక్టర్ సింగ్.. స్మగ్లర్లను వెంబడిస్తున్నప్పుడు బురద, నీరు నిండిన ప్రాంతంలో కాలుజారి అపస్మారక స్థితికి చేరుకున్నారు. వెంటనే అతన్ని ఆసుపత్రికి తరలించగా, అక్కడ మృతి చెందినట్లు ప్రకటించారు. ఇన్‌స్పెక్టర్‌కు బాహ్య గాయాలు ఏమీ కాలేదని, అతని మరణానికి కచ్చితమైన కారణం తెలుసుకునే పనిలో ఉన్నామని అధికారులు చెప్పారు. పోస్ట్‌మార్టం నివేదిక కోసం ఎదురుచూస్తున్నామన్నారు. ఈ సరిహద్దులో నేరస్తులపై మొదట ప్రాణాపాయం లేని ఆయుధాలు, ఆ తర్వాత ప్రాణాపాయం కలిగించే ఆయుధాలను ఉపయోగించాలనే విధానమే.. ఇరువైపులా ఉన్న స్మగ్లర్లకు ధైర్యాన్నిస్తోందని సీనియర్ అధికారులు వ్యాఖ్యానించారు. అందుకే ఇలాంటి సంఘటనలు తరచూ జరుగుతున్నాయని వారు పేర్కొన్నారు. ఈ సంఘటనపై బీఎస్ఎఫ్ 'కోర్ట్ ఆఫ్ ఎంక్వైరీ'కి ఆదేశించింది.

## ఇటలీలో ఘోర రోడ్డు ప్రమాదం

### నలుగురు భారతీయులు దుర్మరణం

**లండన్:** దక్షిణ ఇటలీలోని మాటేరా నగరంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో నలుగురు భారతీయ పౌరులు మరణించినట్లు రోమ్‌లోని భారత రాయబార కార్యాలయం ప్రకటించింది. మాటేరా నగరంలోని స్కన్‌జానో జోనికో మున్సిపాలిటీ పరిధిలో, అగ్రి వ్యాలీ వద్ద శనివారం ఒక ట్రక్కును ఏడు సీట్ల రెనాల్ట్ సీనిక్ వాహనం ఢీకొంది. ఈ వాహనంలో నలుగురు భారతీయులు సహా మరో ఆరుగురు ఉన్నట్లు ఇటాలియన్ వార్తా సంస్థ ఏఎన్ఎస్ఏ ఆదివారం తెలిపింది. మృతులను కుమార్ మనోజ్ (34), సింగ్ సుర్జిత్ (33), సింగ్ హర్వీందర్ (31), సింగ్ జస్కరాన్ (20)గా గుర్తించారు. దక్షిణ ఇటలీలోని మాటేరాలో రోడ్డు ప్రమాదంలో నలుగురు భారతీయ పౌరులు మరణించడంపై తీవ్ర సంతాపం వ్యక్తం చేస్తున్నట్లు భారత రాయబార కార్యాలయం సోషల్ మీడియాలో పోస్ట్ చేసింది. 'మేము వివరాల కోసం స్థానిక ఇటాలియన్ అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నాం. సంబంధిత కుటుంబాలకు రాయబార కార్యాలయం అన్ని విధాలా సహాయాన్ని అందిస్తుంది'.. అని పేర్కొంది. గాయపడిన ఐదుగురిని పోలికోరో ఆసుపత్రికి, అత్యంత తీవ్రంగా గాయపడిన ఆరో వ్యక్తిని.. పొటెన్జాలోని శాన్‌కార్లో ఆసుపత్రికి తరలించినట్లు ఇటాలియన్ వార్తా సంస్థ ఏఎన్ఎస్ఏ తెలిపింది. ట్రక్కు డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు. ప్రమాదంపై మాటేరా పబ్లిక్ ప్రాసిక్యూటర్ కార్యాలయం దర్యాప్తు చేస్తోంది.

## త్వరలోనే వస్తా.. ఎన్నికల్లో పోటీ చేస్తా

### బంగ్లా మాజీ ప్రధాని ఖలేదా పెద్ద కుమారుడి ప్రకటన

**ఢాకా:** బంగ్లాదేశ్ మాజీ ప్రధానమంత్రి ఖలేదా జియా పెద్ద కుమారుడు, బంగ్లాదేశ్ నేషలిస్ట్ పార్టీ(బీఎన్‌పీ)యాక్టింగ్ చైర్మన్ తారిఖ్ రహ్మాన్(58) సోమవారం కీలక ప్రకటన చేశారు. లండన్‌లో గత 26 ఏళ్లుగా అజ్ఞాతంలో గడుపుతున్న ఆయన..'త్వరలోనే బంగ్లాదేశ్‌కు వస్తా..ఎన్నికల బరిలో ఉంటా'అంటూ ప్రకటించారు. 'ఇప్పటి వరకు కొన్ని కారణాల వల్ల బంగ్లాదేశ్‌కు వెళ్లలేకపోయా. ఇప్పుడు సమయం వచ్చింది. త్వరలోనే అక్కడికి వెళ్తా. ఫిబ్రవరిలో జరిగే ఎన్నికల్లో పోటీ చేస్తా'అని ఓ ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఎన్నికల్లో బీఎన్‌పీ గెలిస్తే ప్రధానిగా బాధ్యతలు చేపడతారా అన్న ప్రశ్నకు ఆ విషయాన్ని ప్రజలే నిర్ణయిస్తారని చెప్పారు. 2008లో వైద్య కారణాలపై ఆయన్ను ఆర్మీ లండన్‌కు పంపించింది. తారిఖ్ అన్వర్‌పై పలు నేరారోపణలు, లంచం కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటి నుంచి తప్పించుకునేందుకు హసీనా సారథ్యంలోని ప్రభుత్వం ఉన్నన్ని రోజులు ఆయన లండన్‌లోనే ఉండిపోయారు. మాజీ ప్రధాని, 80 ఏళ్ల ఖలేదా జియా వివిధ ఆరోగ్య సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారు. వచ్చే ఎన్నికల్లో ఆమె ఎన్నికల్లో పోటీ చేస్తారా లేక కుమారుడికి బాధ్యతలను అప్పగిస్తారా అనేది స్పష్టం కావాల్సి ఉంది.

## ఎవరెస్ట్‌పై మంచు తుపాను

- ఒక పర్వతారోహకుడు మృతి
- చిక్కుకుపోయిన మరో 200 మంది


కొనసాగుతున్న సహాయక చర్యలు

**బీజింగ్:** హిమాలయాల్లోని ప్రపంచంలోనే ఎత్తైన ఎవరెస్ట్ శిఖరంపై ఆకస్మికంగా సంభవించిన భీకర మంచు తుపాను పర్వతారోహకులకు ప్రమాదకరంగా మారింది. టిబెటన్ అటానమస్ ప్రాంతంలోని డింగ్రీ కౌంటీలో భారీగా మంచు కురిసిన కారణంగా చిక్కుకుపోయిన 350 మంది పర్వతారోహకులను ఆదివారం రాత్రి కల్లా సురక్షితంగా వెలుపలికి తీసుకువచ్చినట్లు అధికారులు తెలిపారు. మరో 200 మంది టిబెట్ పర్వత సానువుల్లోనే చిక్కుబడి పోయారని, వీరిలో ఒకరు తీవ్ర చలి కారణంగా ప్రాణాలు కోల్పోయారని చైనా అధికార వార్తా సంస్థ జిన్హువా తెలిపింది. వీరిని రక్షించేందుకు అధికారులు క్యుడెంగ్ పట్టణానికి చేరుకున్నారని పేర్కొంది. శనివారం సాయంత్రం నుంచి డింగ్రీలో భారీగా మంచు కురుస్తుండటంతోపాటు, తీవ్ర చలిగాలులు వీస్తున్నాయి. దీంతో క్యుడెంగ్ పట్టణ సమీపంలోని పర్వతారోహకులు ముందుకు సాగే పరిస్థితులు లేకుండాపోయాయి. ఎవరెస్ట్ పర్వత సానువులపై వెయ్యి మందికి పైగా చిక్కుబడిపోయినట్లు ఆదివారం బీబీసీ తెలపడం గమనార్హం.

## ఐరాస భేటీలకు బహుళ పార్టీల ఎంపీల బృందాలు

**న్యూఢిల్లీ:** ఈ నెల 8 నుంచి మొదలయ్యే ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాలకు కేంద్రం బీజేపీతోపాటు వివిధ పార్టీలకు చెందిన పార్లమెంట్ సభ్యుల రెండు బృందాలను న్యూయార్క్ పంపించనుంది. ఈ బృందాలకు బీజేపీ ఎంపీలు పీపీ చౌదరి, దగ్గుబాటి పురందేశ్వరి నాయకత్వం వహిస్తారు. ఎంపీ చౌదరి బృందం ఈ నెల 8 నుంచి 14వరకు, పురందేశ్వరి బృందం 14 నుంచి 27వ తేదీ వరకు సమావేశాల్లో పాల్గొననుంది. ఈ రెండు బృందాల్లో బీజేపీతోపాటు కాంగ్రెస్, సమాజ్‌వాదీ పార్టీ, ఆర్ఎస్‌పీ, ఆర్జేడీ, డీఎంకే, టీఎంసీ, ఆప్‌లకు చెందిన 30 మంది ఎంపీలున్నారు. ఇవి కేవలం అనధికారిక బృందాలని, దేశానికి ప్రతినిధులుగా కంటే భారత ప్రజాస్వామ్యం వంటి వివిధ అంశాలపై దేశ ఐక్యతను చాటే ప్రతినిధులుగా వీరిని భావించవచ్చని ఓ ఎంపీ చెప్పారు. ఐరాస జనరల్ అసెంబ్లీ సమావేశాలకు పార్లమెంటరీ ప్రతినిధులను పంపించడం ఆనవాయితీగా వస్తోందని అన్నారు.

## ఐఎస్ఐ చీఫ్‌గా మాలిక్ కొనసాగింపు

**ఇస్లామాబాద్:** పాకిస్తాన్ నిఘా సంస్థ ఇంటర్-సర్వీసెస్ ఇంటెలిజెన్స్(ఐఎస్ఐ) చీఫ్‌గా లెఫ్టినెంట్ జనరల్ మహ్మద్ ఆసిమ్ మాలిక్ కొనసాగనున్నారు. ఈ విషయాన్ని సోమవారం ఐఎస్ఐ ఒక ప్రకటనలో తెలిపింది. ఆయన పదవీ విరమణకు సబంధించిన కచ్చితమైన తేదీని మాత్రం ప్రకటించలేదు. జాతీయ భద్రతా సలహాదారు(ఎన్ఎస్ఏ)బాధ్యతలను కూడా నిర్వహిస్తున్న మాలిక్ ఈ ఏడాది చివర్లో రిటైర్ కావాల్సి ఉంది. ఈయన 2024 సెప్టెంబర్‌లో ఐఎస్ఐ చీఫ్‌గా బాధ్యతలు చేపట్టారు.ఈ ఏడాది ఏప్రిల్‌లో ఎన్ఎస్ఏగా అదనపు బాధ్యతలను స్వీకరించారు.

## ఆల్బేనియాలో కోర్టులోనే జడ్జి కాల్చివేత

**టిరానా:** కోర్టులో కేసు విచారణ జరుపుతున్న జడ్జిని ఓ దుండగుడు లోపలికి వచ్చి మరీ కాల్చి చంపాడు. బాల్కన్ దేశం ఆల్బేనియాలో ఘటన చోటుచేసుకుంది. రాజధాని టిరానాలోని అప్పీల్స్ కోర్టులో సోమవారం జడ్జి అస్ట్రిట్ కలజా ఓ కేసు విచారణ జరుపుతున్నాడు. అదే సమయంలో తుపాకీతో లోపలికి చొచ్చుకువచ్చిన 30 ఏళ్ల వ్యక్తి జడ్జితోపాటు విచారణలో పాల్గొన్న మరో ఇద్దరిపై కాల్పులు జరిపి పరారయ్యాడు. తీవ్రంగా గాయపడిన జడ్జి ప్రాణాలు కోల్పోయారు. మిగతా ఇద్దరికీ ప్రమాదం తప్పినట్లు అధికారులు చెప్పారు. నిందితుడిని అనంతరం పోలీసులు అరెస్ట్ చేశారు. ఆస్తి వివాదంపై విచారణ జరుగుతుండగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు సమాచారం.

## కేరళవాసికి రూ.25 కోట్ల లాటరీ!

**అలప్పుజ (కేరళ):** అలప్పుజ జిల్లా తైకట్టుస్సేరీ నివాసి శరత్ నాయర్.. తిరువోణం బంపర్ లాటరీలో రూ.25 కోట్ల బహుమతిని గెలుచుకున్నారు. ఈ మేరకు నాయర్ సోమవారం తన లాటరీ టికెట్‌ను స్టేట్‌బ్యాంక్ ఆఫ్ ఇండియా తురవూర్ శాఖ కార్యాలయానికి అందజేశారు. 'టీహెచ్ 577825'నంబరు గల ఈ టికెట్‌ను ఆయన ఏజెంట్ లతీష్‌కు చెందిన లాటరీ రిటైల్ అవుట్‌లెట్‌లో కొనుగోలు చేశారు. 'అక్టోబర్ 3న ఫలితాలు ప్రకటించినప్పుడు ఆ విజేత టికెట్ నా దగ్గరే ఉందని నమ్మలేకపోయాను. తరువాత, ఇంటికి వెళ్లి టికెట్‌ను పరిశీలించి నిర్ధారించుకున్నాను'.. అని నాయర్ తెలిపారు. 'నేను బంపర్ టికెట్ కొనడం ఇదే మొదటిసారి. చిన్న లాటరీ టిక్కెట్లు ఎప్పుడో కానీ కొనను'.. అని శరత్ నాయర్ స్పష్టం చేశారు. రూ.25 కోట్ల మొత్తంతో ఏం చేస్తారని ప్రశ్నించగా.. తానింకా ఏం నిర్ణయించుకోలేదన్నారు. తనకున్న అప్పులు తీర్చాక.. కుటుంబంతో కలిసి భవిష్యత్తు గురించి చర్చిస్తానని పేర్కొన్నారు. పెయింట్ షాప్‌లో ఇంకా పనిచేస్తారా? అని ప్రశ్నించగా.. 12 ఏళ్లుగా అక్కడే పనిచేస్తున్నానని, అక్కడే కొనసాగుతానని సమాధానమిచ్చారు. కేరళ రాష్ట్ర లాటరీల విభాగం నిర్వహించే లాటరీలన్నిటిలోనూ.. అత్యధిక మొత్తం మొదటి బహుమతి తిరువోణం బంపర్‌దే కావడం విశేషం.

## బిహార్‌లో అన్ని సీట్లలోనూ ఆప్ పోటీ

### మొదటి విడత అభ్యర్థుల జాబితా విడుదల

**పట్నా:** బిహార్ అసెంబ్లీలోని మొత్తం 243 సీట్లలోనూ ఒంటరిగా బరిలో దిగనున్నట్లు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) తెలిపింది. ఈ మేరకు 11 మందితో కూడిన మొదటి విడత అభ్యర్థుల జాబితాను విడుదల చేసింది. ఆప్ రాష్ట్ర సహ ఇన్‌ఛార్జి అజేశ్ యాదవ్ సోమవారం మీడియాతో మాట్లాడారు. తమకు ప్రజలతోనే పొత్తు ఉందన్నారు. ప్రస్తుతమున్న రాజకీయ కూటములతో తమ పార్టీ ఎలాంటి పొత్తులు పెట్టుకోబోమన్నారు. ఈ ఎన్నికల్లో గెలిస్తే ఢిల్లీ, పంజాబ్‌ల తరహాలో బిహార్‌లోనూ తమ ఆదర్శ పాలన ఏర్పాటవుతుందన్నారు. ఆమ్ ఆద్మీ పార్టీ తీసుకు వచ్చిన పథకాలు, కార్యక్రమాలపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతోందని తెలిపారు. ఢిల్లీలో ప్రభుత్వం ఏర్పాటుకు అవకాశమిచ్చిన ప్రజలు, బిహార్‌లో మాత్రం ఎందుకివ్వరంటూ తమ నేత కేజ్రీవాల్ ప్రశ్నిస్తున్నారని యాదవ్ పేర్కొన్నారు.

## శివసేన-ఎంఎన్ఎస్‌లది హృదయపూర్వక మైత్రి: రౌత్

**ముంబై:** శివసేన(యూబీటీ), మహారాష్ట్ర నవనిర్మాణ సేన(ఎంఎన్ఎస్)ల మధ్య హృదయపూర్వక మైత్రి ఏర్పడనుందని ఎంపీ సంజయ్ రౌత్ చెప్పారు. ఈ ఏడాది చివర్లో జరిగే ముంబై, థానే, కల్యాణ్ డొంబివిలి, నాశిక్, పుణె తదితర స్థానిక సంస్థలకు జరిగే ఎన్నికల్లో ఏకాభిప్రాయంతో పనిచేయాలని వరుసకు సోదరులయ్యే ఠాక్రేల ద్వయం నిర్ణయం తీసుకుందన్నారు. ఆదివారం జరిగిన శివసేన చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, ఎంఎన్ఎస్ అధ్యక్షుడు రాజ్ ఠాక్రేల సమావేశంపై రౌత్ పైవిధంగా వ్యాఖ్యలు చేశారు. వీరిద్దరి మధ్య వ్యక్తిగత, రాజకీయ సంబంధాలు మరింత దృఢతరం కానున్నాయని, ఈ దిశగా చర్చలు జరుగుతున్నాయని రౌత్ వెల్లడించారు. మహా వికాస్ అఘాడీలో(ఎంవీఏ)లో ఎంఎన్ఎస్ కూడా చేరుతుందా అన్న అనుమానాలను రాజ్ ఠాక్రేయే నివృత్తి చేయాలని రౌత్ వ్యాఖ్యానించారు. ఆదివారం బాంద్రాలో జరిగిన రౌత్ మనవడి నామకరణం వేడుకలో ఉద్ధవ్, రాజ్‌లు పాల్గొన్నారు. జూలై 5వ తేదీ తర్వాత వీరు కలుసుకోవడం ఇది ఐదోసారి కావడం గమనార్హం.

## జంగిల్ రాజ్ నుంచి బిహార్‌కు విముక్తి కల్పించాం: అమిత్ షా

**న్యూఢిల్లీ:** బిహార్‌కు జంగిల్ రాజ్ నుంచి విముక్తి కల్పించిన ఎన్డీయేకు ప్రజలు మరోసారి కట్టం కట్టనున్నారని కేంద్ర హోం మంత్రి అమిత్ షా ధీమా వ్యక్తం చేశారు. ఎన్డీయే పాలనలో రాష్ట్రం సుపరిపాలన, అభివృద్ధి అనే నూతన మార్గంలో పయనిస్తోందని తెలిపారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి అభివృద్ధి రాజకీయాలను ఎంచుకోవాలని ఓటర్లను కోరారు. 'ఎన్నికల కమిషన్ బిహార్ అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్‌ను ప్రకటించింది. అతిపెద్ద ప్రజాస్వామ్య పండగను జరుపుకోనున్న బిహార్ ప్రజలందరికీ శుభాకాంక్షలు'అని ఆయన సోమవారం ఎక్స్‌లో పేర్కొన్నారు. పేదలకు సంక్షేమ పథకాలు, మౌలిక వసరుల కల్పన, విద్య, ఆరోగ్యం సహా అన్ని రంగాల్లోనూ బిహార్ చారిత్రక మార్పులను నమోదు చేసుకుంటోందని తెలిపారు.

## సెంథిల్ బాలాజీకి సుప్రీంలో చుక్కెదురు

**న్యూఢిల్లీ:** డీఎంకే నేత వి.సెంథిల్ బాలాజీకి అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు చుక్కెదురైంది. క్యాష్ ఫర్ లాండ్ కుంభకోణం కేసు పెండింగ్‌లో ఉన్నందున తనను తిరిగి మంత్రివర్గంలో చేర్చుకోవాలా వద్దా అనే విషయంలో గత ఉత్తర్వుపై స్పష్టత ఇవ్వాలంటూ ఆయన పెట్టుకున్న పిటిషన్‌ను జస్టిస్ సూర్యకాంత్, జస్టిష్ జోయ్‌మాల్యా బాగ్చిల ధర్మాసనం సోమవారం కొట్టివేసింది. మంత్రి పదవి గురించిన ప్రస్తావన ఆ ఉత్తర్వుల్లో లేనే లేదని స్పష్టం చేసింది. 'మేం ఆ ఉత్తర్వును మళ్లీ చదవం. మీరు మంత్రిగా మారడానికి దానిని మేం చదవలేం. అయితే, మీరు మంత్రి పదవిని చేపట్టినా లేదా మరే ఇతర అధికార పదవిని నిర్వహించినా రాష్ట్ర వాతావరణం ప్రభావితమైతే, న్యాయం జరిగేలా అప్పుడే చూస్తాం'అని ధర్మాసనం పేర్కొంది. మంత్రిగా ఉన్న సెంథిల్ బాలాజీని పదవికి రాజీనామా చేయాలంటూ ఇచ్చిన తీర్పుపై మళ్లీ స్పష్టత కోరడమెందుకంటూ పిటిషనర్ తరఫు సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్‌ను ప్రశ్నించింది. బెయిలొచ్చిన కొన్ని రోజుల్లోనే తిరిగి మంత్రి పదవిని చేపట్టిన సెంథిల్ బాలాజీ, కేసుల విచారణను ప్రభావితం చేసేందుకు ప్రయత్నిస్తున్నందునే జైలుకు వెళ్లడం మంచిదంటూ అప్పటి ధర్మాసనం వ్యాఖ్యానించి ఉంటుందని పేర్కొంది.

## కేరళ సీఎంపై పిటిషన్ కొట్టివేసిన సుప్రీం

**న్యూఢిల్లీ:** కొచ్చిన్ మినరల్స్ అండ్ రుటైల్ లిమిటెడ్(సీఎంఆర్ఎల్)లో జరిగిన ఆర్థిక అవకతవకలతో కేరళ సీఎం పినరయి విజయన్, ఆయన కుమార్తె వీణా విజయన్‌లకు గల సంబంధాలపై విచారణకు ఆదేశించాలంటూ కాంగ్రెస్ ఎమ్మెల్యే మాథ్యూ కుజలనందన్ వేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు తిరస్కరించింది. 'రాజకీయ వివాదాలను ఎన్నికలప్పుడు ప్రజాక్షేత్రంలోనే తేల్చుకోవాలి. ఇటువంటి వాటికి కోర్టులను వేదికలుగా మార్చొద్దు. ఇదే విషయాన్ని పదేపదే చెబుతూ వస్తున్నాం'అని ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్, జస్టిస్ వినోద్ చంద్రన్‌ల ధర్మాసనం వ్యాఖ్యానించింది. ఇదే విషయమై దాఖలైన మరో పిటిషన్‌ను కూడా ధర్మాసనం తోసిపుచ్చింది. ప్రైవేట్ మైనింగ్ కంపెనీ సీఎంఆర్ఎల్‌తో వీణా విజయన్ గతంలో నడిపిన ఎక్సాలాజిక్ సొల్యూషన్స్ కంపెనీకి జరిగిన రూ.1.72 కోట్ల లావాదేవీలపై విచారణ చేయించాలంటూ కుజలనందన్ వేసిన పిటిషన్‌ను మార్చిలో కేరళ హైకోర్టు కొట్టివేసింది.

# దేశంలో తొలి 'సాయంకాలపు పత్రిక' ఏది?

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

**జనరల్ స్టడీస్**

**ఇండియన్ హిస్టరీ**

### భారత జాతీయోద్యంలో పత్రికల పాత్ర

పత్రికలు భారత జాతీయోద్యమంలో కీలక పాత్రను పోషించాయి. మొగలుల కాలంలో 'అక్బరాత్', 'వఖియనివాస్' అనే పత్రికల ద్వారా వార్తా కథనాలను చక్రవర్తికి అందించేవారు. 1557లో పోర్చుగీస్ గవర్నర్ ఆల్ఫెన్సో కాలంలో గోవాలో పత్రికా ముద్రణను ప్రవేశపెట్టారు. మొదట్లో పాలకుల అభిప్రాయ వేదికలుగా గుర్తింపు పొందిన పత్రికలు ఆ తర్వాత సంఘ సంస్కరణ, సమాజహితం, నవభావన వేదికలుగా, అభ్యుదయ భావ వీచికలుగా, మితవాద, అతివాద, విప్లవవాద, గాంధీ సత్యాగ్రహం ఆలోచనా దీప్తులుగా పనిచేశాయి. సామాన్య ప్రజల్లో ఆలోచనా పరిజ్ఞానాన్ని మేల్కొలిపాయి. 1780లో జేమ్స్ అగస్టస్ హిక్కీ అనే ఆంగ్లేయుడు 'బెంగాల్ గెజిట్' అనే ఆంగ్ల పత్రికను ప్రారంభించాడు. తర్వాత కలకత్తా సమీపంలోని 'శేరంపూర్'లోని క్రైస్తవ మిషనరీ 'దిగ్దర్శన'(మాసపత్రిక), 'సమాచార దర్పన' అనే బెంగాలీ పత్రికలను స్థాపించింది. 1816లో 'గంగాధర భట్టాచార్య' 'బెంగాల్ గెజిట్' అనే పత్రికను ప్రారంభించారు. క్రైస్తవ మిషనరీ స్థాపించిన 'ఫ్రెండ్ ఆఫ్ ఇండియా' 1869లో సామ్యూల్ క్లర్క్ ప్రారంభించిన 'స్టేట్స్‌మెన్' అనే పత్రికలో విలీనమైంది. తర్వాత సామాజిక సంస్కరణలే ధ్యేయంగా రాజా రామ్మోహన్‌రాయ్ 1821లో 'సంవాద కౌముది' అనే వార పత్రికను స్థాపించి,సతీ సహగమన నిషేధం, బాల్య వివాహాల రద్దు, ఏకేశ్వరోపాసనల గురించి ప్రముఖంగా ప్రచారం చేశారు. రాయ్ ఆధునిక భావాలను వ్యతిరేకిస్తూ పోటీగా 'రాధాకాంత్ దేవ్' సనాతన సాంప్రదాయ వాదుల మద్దతుతో 'సమాచార చంద్రిక'ను స్థాపించారు. దాంతో రాయ్ ద్వారకానాథ్ ఠాగూర్ సహాయంతో ఇంగ్లిష్, హిందీ, బెంగాలీ, పారశీక భాషల్లో, ఆధునిక భావాల ప్రచారం కోసం 'వంగదూత', 'మిరాతుల్ అక్బర్', 'కువ్వత్ - ఉల్ - మువాహిద్దీన్' లాంటి పత్రికలను ప్రారంభించారు. వీటిని పోలిన 'జ్ఞానాన్వేషి' అనే పత్రిక సమాజంలో విశేష ప్రాచుర్యం పొందింది. ప్రభుత్వ అధికారుల అవినీతి కార్యకలాపాలను విమర్శిస్తూ యువతరం పత్రిక 'ఎన్‌క్వైరర్' అభ్యుదయ భావాలను ప్రచారం చేసింది. 'సంవాద పూర్ణ చంద్రోదయం' అనే పత్రికలో సనాతన వాదులు మత విషయాలను చర్చించేవారు. తర్వాత దీనినే రాజకీయ దినపత్రికగా ప్రారంభించారు. బంకించంద్ర చటోపాధ్యాయ 'నీలిదర్పణ్' పత్రికను ప్రారంభించారు. దీనికి 'దీనబంధుమిత్ర' ఎడిటర్‌గా వ్యవహరించారు. నీలిమందు రైతుల సమస్యలను ఈ పత్రికలో వ్యాసాల రూపంలో ప్రముఖంగా ప్రస్తావించేవారు. 1826లో కాన్పూర్ నుంచి వెలువడిన 'ఉదాంత మార్తాండం' అనే తొలి హిందీ పత్రిక పరిసర ప్రాంతాల ప్రజల సమస్యలను బ్రిటిష్ పాలకుల దృష్టికి తీసుకొచ్చింది.




- బొంబాయి రాష్ట్రంలో 1822లో దాదాభాయ్ నౌరోజీ నాయకత్వంలో 'రస్తగఫ్తార్' అనే పత్రిక గుజరాతీ భాషలో వెలువడింది. 1832లో మరాఠీ భాషలో వెలువడిన 'బొంబాయి దర్పణ్' పత్రికలో ఆంగ్లభాష విశిష్టత, బ్రిటిషర్ల ప్రజా సంక్షేమ కార్యక్రమాలను బాల శాస్త్రి జంబేకర్ చర్చించారు. బాలశాస్త్రి అనుచరుడు ఛాల్ మహాజన్ 'ప్రభువర్' అనే పత్రికను స్థాపించి సంఘ సంస్కరణకు శ్రీకారం చుట్టారు. 1842లో పుణే నుంచి క్రైస్తవ మిషనరీలు 'జ్ఞానోదయం' అనే పత్రికను ప్రారంభించాయి. 1848లో పుణే నుంచే వెలువడిన 'జ్ఞానప్రకాశీ' తొలి మరాఠీ పత్రికగా ప్రసిద్ధి చెందింది. తిలక్, వాసుదేవ అగార్కర్‌లు కలిసి పుణే నుంచి 1881 లో 'మరాఠీ' (ఆంగ్లపత్రిక), 'కేసరి'(మరాఠీ) పత్రికలను నిర్వహించి బ్రిటిష్ ప్రభుత్వ విధానాలను నిశితంగా విమర్శించడమే కాకుండా, విప్లవ వాదులను సమర్థించినందుకు 1897లో 18 నెలలు జైలుశిక్ష అనుభవించారు. మద్రాస్ రాష్ట్రంలో గాజుల లక్ష్మీనరసుశెట్టి 'క్రీసెంట్' అనే పక్ష పత్రికలో బ్రిటిషర్ల దమన నీతిని విమర్శించారు. తర్వాత తెలుగులో వెలువడిన 'వృత్తాంతిని' (1838–51), 'వర్తమాన', 'తరంగిణి' (1848–52) పత్రికలు సామాజిక సమస్యలపై పోరాడాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1830లో బళ్లారి క్రైస్తవ మిషనరీ 'సత్యదూత' అనే తొలి తెలుగు పత్రికను ప్రారంభించింది. 1875 లో సుబ్రమణ్య అయ్యర్, కస్తూరి రంగస్ ఆధ్వర్యంలో వెలువడిన 'ది హిందూ' పత్రిక భారత జాతిని స్వాతంత్ర్య సమరానికి సన్నద్ధం చేయడంలో కీలకపాత్ర పోషించింది. ఆంధ్రప్రదేశ్ నుంచి వెలు వడిన తొలి తెలుగు రాజకీయ పత్రిక 'ఆంధ్రప్రకాశిక', 'స్వదేశీ మిత్రన్' పత్రికలు కూడా అదే బాటలో పయనించాయి.
- బ్రిటిషర్ల పరిపాలనను సుస్థిరం చేయ డానికి అధికారేతర బ్రిటిషర్లు కొన్ని పత్రికలు స్థాపించారు. అలాంటి వాటిలో 'ఫ్రెండ్ ఆఫ్ ఇండియా', 'సర్కార్', 'బాంబేటైమ్స్', 'మద్రాస్ యునైటెడ్ సర్వీస్ గెజిట్', 'లాహోర్ క్రానికల్', 'సిటీగడో', 'మద్రాస్ స్పెక్టేటర్'లు ముఖ్య మైనవి. ఈ పత్రికలు బ్రిటిష్ పాలనకు అనుకూల వాతావరణాన్ని కల్పించేలా భారతీయ సమాజాన్ని ఉత్తేజ పరుస్తూ రచనలు సాగించాయి. ఈ పద్ధతిని 'పత్రికా స్వేచ్ఛపిత'గా ప్రసిద్ధి చెందిన మెట్‌కాఫ్ నిరసించాడంటే వాటి ధోరణిని అర్థం చేసుకోవచ్చు. ఈ పత్రికలు బ్రిటిష్ సామ్రాజ్య తత్వాన్ని ప్రచారం చేశాయి. 1861లో బొంబాయి నుంచి 'టైమ్స్ ఆఫ్ ఇండియా', 1865లో అలహాబాద్ నుంచి 'పయనీర్', 1868లో మద్రాస్ నుంచి 'మద్రాస్ మెయిల్' (ఇది దేశంలో తొలి సాయంకాలం పత్రిక), లాహోర్ నుంచి 'సివిల్ మిలటరీ గెజిట్'లు ఈ కాలంలో వచ్చిన మరికొన్ని ముఖ్యమైన పత్రికలు.
- తర్వాత కాలంలో బెంగాల్ నుంచి నరేంద్రనాథ్ ఆధ్వర్యంలో వెలువడిన 'ఇండియన్ మిర్రర్' బ్రిటిష్ పాలనకు వ్యతిరేకంగా, భారతీయుల రాజకీయ హక్కుల కోసం పోరాటం సాగించింది. 1868లో శిశిర్‌కుమార్ ఘోష్ ఆధ్వర్యంలో 'అమృతబజార్ ', 'సమాచార దర్పణ్' పత్రికలు బ్రిటిషర్ల ఆర్థిక దోపిడీని విమర్శించాయి. 'సంధ్య, యుగాంతర్, బందీ జీవన్, ఘదర్' లాంటి పత్రికలు బ్రిటిష్ సామ్రాజ్య సౌధాలను పునాదులతో సహా పెకిలించాలని, అందుకు సాయుధ తిరుగుబాటుకు భారతీయులు సన్నద్ధం కావాలని ప్రేరేపించాయి. పార్శీ, ఉర్దూ పత్రికలైన 'మహెఆలం', 'అఫ్రోజ్', గోఖలే ఆధ్వర్యంలో వెలువడిన 'సుధాకర్' పత్రికలు ప్రజా హక్కుల పరిరక్షణ, మితవాద ధోరణిని ప్రతిబింబించగా 'ఇండియన్ మిర్రర్', 'వాయిస్ ఆఫ్ ఇండియా'; అరబిందో ఘోష్, రాస్ బిహారీ ఘోష్‌ల పెట్రియాట్, హిందూప్రకాష్, సోంప్రకాష్ పత్రికలు జాతీయతను రగిలించాయి. 1878లో లార్డ్ లిట్టన్ ప్రాంతీయ భాష పత్రికా చట్టాన్ని ప్రవేశపెట్టి స్వేచ్ఛను హరించాడు. 1882లో రిప్పన్ దేశీయభాషా చట్టాన్ని రద్దు చేసి పత్రికలకు స్వేచ్ఛ కలిగించాడు.
- ఉర్దూలో షంగుల్ అక్బర్, జుంబాల్ ఉల్ అక్బర్, సిరాజ్ - ఉల్ అక్బర్, ఢిల్లీ అక్బర్, సయ్యద్ అక్బర్ పత్రికలు సాంఘిక, మత పునరుజ్జీవానికి కృషి చేశాయి. మిరాతుల్ అక్బర్, జియ జహనామా పత్రికలు హిందూ - ముస్లింల సమైక్యతకు కృషి చేశాయి.
- తెలుగులో కందుకూరి వీరేశలింగం 'వివేకవర్ధని, సత్య సంవర్ధిని, సతీహిత బోధిని' పత్రికలను ప్రారంభించి 'ఆధునిక ఆంధ్రదేశ పిత'గా పేరు గాంచారు. రాయస వేంకటశివుడి 'జనానా, 'సుజన మనోవిలాసిని', అమృతబోధిని' పత్రికలు సాంఘిక దురాచారాలపై ఎక్కుపెట్టిన బ్రహ్మాస్త్రాలు.
- తెలంగాణలో 'గోల్కొండ' (సురవరం ప్రతాపరెడ్డి ఎడిటర్), 'మిజాన్', 'నీలగిరి' , షోయబుల్లాఖాన్ 'ఇమ్రోజ్' పత్రికలు నాటి ప్రభుత్వ విధానాలను వ్యతిరేకించాయి. భారతీయ పత్రికలు 1823లో ఆడమ్స్ ఆంక్షల నుంచి లిట్టన్ ప్రతిబంధకాల వరకు సమస్యలన్నింటినీ అధిగమించి భారత స్వాతంత్ర్య సాధనలో బహుముఖ పాత్రను పోషించాయి.

#### మాదిరి ప్రశ్నలు

1. వీటిలో సరికానిది? (2002 సివిల్స్)
   1) సమాచర దర్పణ్ – మార్స్‌మన్
   2) మిరాతుల్ అక్బర్– రామ్మోహన్ రాయ్
   3) స్వదేశీ మిత్రన్ – సుబ్రమణ్యం
   4) నీల్ దర్పణ్ – శిశిర్ కుమార్ ఘోష్
2. భారతదేశంలో పత్రికా ముద్రణాయం త్రాన్ని ప్రవేశపెట్టినవారు?
   1) బ్రిటిషర్లు 2) పోర్చుగీస్
   3) డచ్చి 4) ఫ్రెంచివారు
3. దేశంలో తొలి 'సాయంకాలపు పత్రిక' ఏది?
   1) బొంబాయి క్రానికల్
   2) మద్రాస్ క్రానికల్
   3) మద్రాస్ మెయిల్ 4) బెంగాల్ గెజిట్
4. 'ది హిందూ' (1875) పత్రిక ఎడిటర్లుగా పని చేసిన వారు?
   1) సుబ్రమణ్యం అయ్యర్, పద్మనాభన్ పిళ్లై
   2) కస్తూరీ రంగస్ – సుబ్రమణ్యం
   3) కస్తూరీ రంగస్ – పద్మనాభన్
   4) పద్మనాభన్ – రాజమార్తాండ
5. 'బెంగాలీ విభజనను' తొలిసారిగా ప్రచురించిన పత్రిక ఏది?
   1) బెంగాల్ గెజిట్ 2) నీల్ దర్పణ్
   3) ఇండియన్ హెరాల్డ్
   4) అమృతబజార్
6. 'సమాచార దర్పణ్' పత్రిక ఎవరి కాలంలో ప్రచురితమైంది?
   1) లార్డ్ కర్జన్ 2) విలియం బెంటింగ్
   3) లార్డ్‌మింటో 4) వారన్ హేస్టింగ్స్
7. కిందివాటిలో సరైన జత?
   1) దీన్ మిత్ర – ముకుంద్‌రావు పాటిల్
   2) సత్య దూత – గంగాధర భట్టాచార్య
   3) సమాచార చంద్రిక–రాజా రామ్మోహన్ రాయ్
   4) బొంబాయి దర్పణ్ – చాల్‌మహాజన్
8. నీలిమందు రైతుల సమస్యలను వివరించిన పత్రిక ఏది?
   1) నీల్ దర్పణ్ 2) ఉదాంత మార్తాండం
   3) జ్ఞానోదయం 4) పైవన్నీ

**సమాధానాలు**

1) 4; 2) 2; 3) 3; 4) 2; 5) 4; 6) 4; 7) 1; 8) 1.

## విద్య, ఉద్యోగ సమాచారం

### ఐఐటీ ఖరగ్‌పూర్‌లో వివిధ ఉద్యోగాలు

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(ఐఐటీ) ఖరగ్పూర్ వివిధ విభాగాల్లో అసిస్టెంట్ రిజిస్ట్రార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 04.
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ రిజిస్ట్రార్–02, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్–02.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో గుర్తింపు పొందిన యూనివర్శిటీ నుంచి కనీసం 55 శాతం మార్కులతో డిగ్రీ, పీజీలో ఉత్తీర్ణతతో పాటు ఉద్యోగానుభవం ఉండాలి.
- » **వయసు:** 40 ఏళ్లు మించకూడదు.
- » **వేతనం:** నెలకు అసిస్టెంట్ రిజిస్ట్రార్‌కు రూ.35,400 నుంచి రూ.1,12,400, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌కు రూ.56,100 నుంచి రూ.1,77,500.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**21.10.2025.
- » **వెబ్‌సైట్:** https://www.iitkgp.ac.in

### బీఈసీఐఎల్ నోయిడాలో ప్రిన్సిపల్ చీఫ్ ప్రాజెక్ట్స్ పోస్టులు

నోయిడాలోని బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్) ఒప్పంద ప్రాతిపదికన ప్రిన్సిపల్ చీఫ్ ప్రాజెక్ట్స్ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 01.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీటెక్/బీఈ, ఎంటెక్‌లో ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి.
- » **వయసు:**31.03.2025నాటికి 60ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.1,00,000.
- » **ఎంపిక విధానం:** ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును బ్రాడ్‌కాస్ట్ ఇంజనీరింగ్ కన్సల్టెంట్స్ ఇండియా లిమిటెడ్(బీఈసీఐఎల్), బీఈసీఐఎల్ భవన్, సీ–56/ఏ–17, సెక్టార్–62, నోయిడా–201307, ఉత్తరప్రదేశ్ చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 15.10.2025.
- » **వెబ్‌సైట్:** https://www.becil.com

### ఎస్ఎం పోర్టు, కోల్‌కతాలో వివిధ ఉద్యోగాలు

కోల్‌కతాలోని శ్యామ్‌ప్రసాద్ ముఖర్జీ పోర్టు (ఎస్‌పీఎంపీ) డైరెక్ట్ రిక్రూట్‌మెంట్ ప్రాతిపదికన వివిధ ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 08.
- » **పోస్టుల వివరాలు:** అసిస్టెంట్ మేనేజర్(పీ అండ్ ఈ డివిజన్, హెచ్‌డీసీ)–03, అసిస్టెంట్ మేనేజర్(ఫైనాన్స్ డివిజన్, హెచ్‌డీసీ)01, అసిస్టెంట్ మేనేజర్(సేఫ్టీ)–01, సీనియర్ అసిస్టెంట్ సెక్రటరీ(అఫీషియల్ లాంగ్వేజ్)–01, డిప్యూటీ మెటీరియల్స్ మేనేజర్–02.
- » **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో డిగ్రీ,పీజీ, సీఏ, ఎంఏ ఉత్తీర్ణతతో పాటు పని అనుభవం ఉండాలి. » **వయసు:** 01.09.2025 నాటికి 18 నుంచి 30 ఏళ్లు ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.50,000 నుంచి ,60,000.
- » **ఎంపిక విధానం:** రాతపరీక్ష/డాక్యుమెంట్ వెరిఫికేషన్, ఇంటర్వ్యూ ఆధారంగా.
- » **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**24.10.2025.
- » **వెబ్‌సైట్:** https://smp.smportkolkata.in

# ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించిన తొలి నాటకం?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

**తెలుగు**



### తెలుగు సాహిత్యంపై ఇతర భాషల ప్రభావం

**సంస్కృతం ప్రభావం:**
ప్రపంచ భాషా కుటుంబాల్లో పెద్దది ఇండో ఆర్యన్ లేదా హిందార్య కుటుంబం. వీటిలో అతి ప్రాచీనమైంది సంస్కృతం. దీనికి సంబంధించి రెండు భేదాలున్నాయి. అవి:

1. వైదిక సంస్కృతం
2. లౌకిక సంస్కృతం

**వైదిక సంస్కృతం:** వైదిక ఆచార వ్యవహారాల్లో ఉపయోగించేది వైదిక సంస్కృతం. కావ్యాల్లోని భాష లౌకిక సంస్కృతం. భారతీయ భాషలన్నింటిపై సంస్కృతం ప్రభావం ఉంది. తెలుగు భాషపై ప్రత్యేకించి ఎక్కువ.

మన దేశంలో అతి ప్రాచీన గ్రంథం 'రుగ్వేదం'. ఇది క్రీ.పూ. 1500 నాటిదని భాషా శాస్త్రవేత్తలు నిర్ధారించారు. వేదాలన్నీ మౌఖికాలు. పూర్వకాలంలో వాటిని విని, వల్లెవేసేవారు కాబట్టి వేదాలను 'శ్రుతులు' అని కూడా అంటారు. మన దేశంలో లిఖిత పూర్వకంగా ముద్రణలో లభించిన మొదటి గ్రంథం యాస్కుని నిరుక్తం.

రుగ్వేదం తర్వాత యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదాలు వచ్చాయి. వేదాలకు వివరణాత్మక వ్యాఖ్యానాలుగా బ్రాహ్మణకాలు, అరణ్యాకాలు, ఉపనిషత్తులు ఆవిర్భవించాయి.

**లౌకిక సంస్కృతం:** కావ్యాల్లో వాడిన భాష లౌకిక సంస్కృతం. దీని కాలం క్రీ.పూ. 1000 నుంచి 600 నాటిదని భాషాశాస్త్రవేత్తలు పేర్కొన్నారు. వాల్మీకి రామాయణం, వ్యాసుడి మహాభారతం, 'పాణి'ని అష్టాధ్యాయి వంటి గ్రంథాలు లౌకిక సంస్కృతంలోనే ఉన్నాయి. పాణిని అష్టాధ్యాయి వ్యాకరణం ప్రపంచంలో ప్రముఖ భాషా శాస్త్రవేత్తల ప్రశంసలు అందుకుంది. 'మానవ మేధాశక్తికి మహత్తర గోపురం' పాణిని వ్యాకరణం అని 'బ్లూమ్‌ఫీల్డ్' అభివర్ణించాడు.

మహాకవి కాళిదాసు కుమార సంభవం, రఘు వంశం, రుతు సంహారం లాంటి ప్రసిద్ధ కావ్యాలను రచించారు. అభిజ్ఞాన శాకుంతలం, మాళవికాగ్ని మిత్రం, విక్రమోర్వశీయం లాంటి గొప్ప నాటకాలు రాశారు. భాసుడు రచించిన 'ప్రతిమ', 'స్వప్న వాసవదత్తం' నాటకాలు కూడా ప్రసిద్ధికెక్కాయి. భర్తృహరి 'సుభాషితాలు', శూద్రకుడి 'మృచ్ఛకటికం' నాటకం పండితుల ప్రశంసలు పొందాయి.

తెలుగు భాషా సాహిత్యంపై సంస్కృత భాషా సాహిత్యాల ప్రభావం ఎక్కువగా ఉంది. తొలిదశలో తెలుగు సాహిత్యం సంస్కృత సాహిత్యాన్ని అనుసరించింది. పురాణాలు, కావ్యాలు, నాటకాల్లో సంస్కృత ప్రభావం కనిపిస్తుంది. ఆదికవి నన్నయ భారతాంధ్రీకరణలో ఐదింట నాలుగుపాళ్లు తత్సమ పదాలను ప్రయోగించారు. భారత, భాగవత, రామాయణ గ్రంథాలన్నీ సంస్కృతం నుంచి అనువాదమైనవే. తిక్కన, ఎర్రన, శ్రీనాథ యుగం సంస్కృత కావ్యాలనే అనుసరించింది. శ్రీనాథుడి శృంగార నైషధం, కాశీఖండం, భీమఖండం కావ్యాలు సంస్కృత అనుసరణలుగా, సంస్కృత సమాస భూయిష్ఠమైన నారికేళ పాకంలో సాగాయి. శ్రీనాథుడు అన్ని భాషలకు సంస్కృతం అమ్మ లాంటిదని (జనని సంస్కృ తంబు సకల భాషలకును) ప్రశంసించారు. 19 వ శతాబ్ది చివరలో బిషప్ కాల్డ్‌వెల్ తెలుగు ద్రావిడ భాషా జన్యమని సిద్ధాంతీకరించేంత వరకు పండితులంతా సంస్కృత భాష నుంచి పుట్టిందనే అభిప్రాయంతో ఉన్నారు. ప్రబంధ కవులు చాలా వరకు సంస్కృత కావ్యాల ఆధారంగా రచనలు సాగించారు. శ్రీ కృష్ణ దేవరాయల ఆముక్త మాల్యద, రామరాజభూషణుడి వసుచరిత్ర సంస్కృత సమాస భూయిష్ఠంగా నారికేళపాకంలో సాగాయి. మనుచరిత్రలో పెద్దన కొంత కదళీపాకాన్ని, కొంత నారికేళ పాకాన్ని మిళితం చేశారు.

రాజకీయ, సాంస్కృతిక, భౌగోళిక సంబంధాల వల్ల తెలుగులో సంస్కృత పదాలు ప్రవేశించాయి. ప్రస్తుతం పూజలు, కర్మకాండలకే సంస్కృతాన్ని ఉపయోగిస్తున్నారు.

#### ఆంగ్ల భాషా ప్రభావం

సంస్కృతం తర్వాత తెలుగు సాహిత్యంపై అత్యధికంగా ప్రభావితం చేసిన భాష ఆంగ్లం. 19వ శతాబ్దంలో ఆంగ్ల సాహిత్య ప్రభావం సాంస్కృతిక పునరుజ్జీవనానికి దోహదం చేసింది. వీరేశలింగం, గురజాడ, గిడుగు, చిలకమర్తి లాంటి కవులు ఆంగ్ల భాషా సాహిత్యాలను అధ్యయనం చేశారు. వీరేశలింగం ఆంగ్ల సాహిత్య ప్రభావంతో నవల, ప్రహసనం, స్వీయ చరిత్ర, జీవిత చరిత్ర ప్రక్రియలను తెలుగులో రాశారు. గురజాడ పాశ్చాత్యుల హేతువాద దృక్పథాన్ని ప్రశంసిస్తూ 'కన్నుగానని వస్తు తత్వము కాంచ నేర్చరు/ లింగిరీజులు' అని మెచ్చుకున్నారు. పాశ్చాత్యుల సంస్కరణ దృక్పథానికి ప్రభావితుడై బాల్య వివాహాలు, కన్యాశుల్కాన్ని నిరసించారు. 'కన్యాశుల్కం' నాటకాన్ని శిల్పవంతంగా తీర్చిదిద్దారు. చిలకమర్తి లక్ష్మీ నరసింహం వీరేశలింగం అడుగుజాడల్లో ప్రసిద్ధ నవలలు, ప్రహసనాలు, నాటకాలను రాశారు. గిడుగు రామ్మూర్తి పంతులు ఆంగ్లభాషా ప్రభావంతో గ్రాంథిక భాష వద్దన్నాడు. వ్యావహారిక భాషా ఉద్యమాన్ని చేపట్టి విజయాన్ని సాధించారు. వ్యావహారిక భాషా ఉద్యమ ఫలితంగా తెలుగు ప్రాంతాల్లో అక్షరాస్యత పెరిగింది. సృజనాత్మక వచన రచనలు వెలువడ్డాయి.

20వ శతాబ్ది మొదటి భాగంలో ఆధునిక కవులైన రాయప్రోలు సుబ్బారావు, విశ్వనాథ సత్యనారాయణ, దేవులపల్లి, తల్లావఝల, కవికొండల వెంకట రావు మొదలైన కవులు షెల్లీ, కీట్స్, వర్డ్స్‌వర్త్, డ్రైడెన్ లాంటి రొమాంటిక్ కవుల ప్రభావంతో భావ కవితా ఉద్యమానికి శ్రీకారం చుట్టారు. ఆంగ్ల సాహిత్య ప్రభావంతో ఆధునిక సాహితీ ప్రక్రియలైన నవల, కథానిక, నాటకం, వ్యాసం, విమర్శ లాంటి రచనలు అందుబాటులోకి వచ్చాయి. పాలనా పరమైన గవర్నర్, కమిషనర్, మేయర్, చైర్మన్, మినిస్టర్, న్యాయ సంబంధమైన కోర్టు, లాయర్, జడ్జి, డిక్రీ లాంటి పదాలు తెలుగులో కలిసిపోయాయి. అలాగే విద్యారంగంలో కాలేజీ, స్కూలు, యూనివర్సిటీ, ప్రొఫెసర్, లెక్చరర్, టీచర్ పదాలు చేరాయి. నిత్య వ్యవహారంలో మిళితమైన రోడ్డు, రైలు, బస్సు, పేపరు, పెన్ను, గన్ను పదాలను ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం 'నవీన తత్సమాలు'గా పేర్కొన్నారు.

**తెలుగు సాహిత్యంపై ఆంగ్లం ప్రభావాన్ని తెలియజేసే ప్రసిద్ధ గ్రంథాలు:**

1. తెలుగు సాహిత్యంపై ఇంగ్లిష ప్రభావం - ఆచార్య కొత్తపల్లి వీరభద్రరావు
2. తెలుగులో ఆంగ్ల పదజాలం - ఆచార్య టి. అక్కిరెడ్డి
3. ఆంధ్ర సాహిత్య విమర్శ- ఆంగ్ల ప్రభా వం - ఆచార్య జి.వి. సుబ్రహ్మణ్యం
4. బాల వ్యాకరణం - వికాస వ్యాఖ్య - ఆచార్య బొడ్డుపల్లి పురుషోత్తం

#### ఉర్దూ ప్రభావం

అల్లాఉద్దీన్ ఖిల్జీ దండయాత్ర ప్రభావంతో ఉర్దూ భాష భారత దేశంలో ప్రవేశించింది. నవీన ఔత్తరాహ భాష హిందీ తర్వాత ప్రముఖమైంది ఉర్దూ. ఈ భాషా వ్యవహర్తలు దేశమంతా ఉన్నారు. మహమ్మదీయుల పాలనలో ఉర్దూ 13వ శతాబ్ది నుంచి పాలనా భాషగా ఉంది. ఇబ్రహీం కుతుబ్‌షా ఉర్దూతోపాటు తెలుగును ఆదరించారు. ఆయన పొన్నెగంటి తెలగన రచించిన 'యయాతి చరిత్ర'ను అంకితం తీసుకున్నారు. ఆంగ్లేయుల పాలనలో 1835లో ఉర్దూను రాజభాషగా ప్రకటించారు. హిందీ బోధన కంటే ఉర్దూ బోధనకే ప్రాధాన్యమిచ్చారు. ముస్లిం ప్రభువుల పాలనలో సైనిక శిబిరాల్లో పుట్టిన ఉర్దూ సాంఘిక, రాజకీయ కారణాల వల్ల బాగా అభివృద్ధి చెందింది. క్రీ.శ.15వ శతాబ్ది నాటికే ఉర్దూ సాహిత్యం ఉంది. ఈ భాషా సాహిత్య రూపాన్ని 'దఖానీ' అని పిలుస్తారు. ఉర్దూ, హిందీలు హిందూస్థానీ భాషలుగా ప్రసిద్ధి చెందాయి. రాజకీయ పాలనా పరంగా నవాబు, నౌకరు, తహసీల్‌దార్, దరఖాస్తు, రసీదు, కుర్తా, కండువా, లంగా మొదలైన ఉర్దూ పదాలు తెలుగులో పూర్తిగా కలిసిపోయాయి. అదే విధంగా సాంస్కృతికపరంగా మసీదు,సలాం, మక్కా, నమాజు లాంటి పదాలు తెలుగులో చేరాయి.

ఆధునిక కవితా రూపాలైన గజల్స్, రుబాయీలు ఉర్దూ సాహిత్య ప్రభావితాలే. ఆధునిక కవుల ప్రయోగాల్లో ఉర్దూ పదాలు విరివిగా ఉన్నాయి. ఉర్దూలో ఇక్బాల్‌చంద్, రాజేందర్ సింగ్ బేడీ ప్రముఖ రచయితలు.

#### ప్రసిద్ధ గ్రంథాలు – రచయితలు

1. తెలుగులో ఉర్దూ పదాలు – డాక్టర్ టి. స్వరాజ్యలక్ష్మి
2. తెలుగు భాషకు మహమ్మదీయుల సేవ – డాక్టర్ షేక్ మస్తాన్
3. తెలుగుపై ఉర్దూ – పారశీకుల ప్రభావం – ఆచార్య కె. గోపాల కృష్ణారావు

#### గత డీఎస్సీలో అడిగిన ప్రశ్నలు

1. తెలుగులో ప్రస్తుతం వాడుకలో ఉన్న లైటు, స్విచ్, కాఫీ అనే ఆంగ్ల పదాలు?
   1) నిత్యావసరాలకుసంబంధించినవి
   2) సాంస్కృతిక సంబంధమైనవి
   3) పరిపాలనా సంబంధ పదాలు
   4) శాస్త్ర పరిభాషా సంబంధమైనవి
2. తెలుగు మాట 'వేయి' పదం?
   1) సంస్కృత పదం
   2) తమిళ పదం 3) కన్నడ పదం
   4) ద్రావిడ వ్యుత్పత్తి ఉన్న స్వతంత్ర పదం
3. 'జమిలి' శబ్దానికి మూలరూపం 'యమల'. ఇది ఏ భాషా పదం?
   1) కన్నడం 2) మలయాళం
   3) సంస్కృతం 4) తమిళం
4. 'చాకిరీ' అనే పదం ఏ భాషలోనిది?
   1) కన్నడం 2) మలయాళం
   3) ఉర్దూ 4) తమిళం

**సమాధానాలు**

1) 1; 2) 4; 3) 3; 4) 3.

#### మాదిరి ప్రశ్నలు

1. సంస్కృతం ఏ భాషా కుటుంబానిది?
   1) ఆర్య భాష 2) ఇండో ఆర్యన్ భాష
   3) సినోటిబెటన్ 4) ఆస్ట్రో ఏషియాటిక్
2. తెలుగులో ప్రవేశించిన పాలనా సంబంధ సంస్కృత పదం?
   1) ఆదేశం 2) నిర్బంధం
   3) పరిపాలన 4) పైవన్నీ
3. తెలుగుతో సంస్కృత భాషకు ఉన్న సంబంధం?
   1) సజాతీయ భాష
   2) విజాతీయ భాష 3) సమీప భాష
   4) మత సంబంధ భాష
4. సంస్కృత సమాస భూయిష్ఠమైన శైలిని ఏమంటారు?
   1) ద్రాక్షాపాకం 2) కదళీపాకం
   3) నారికేళ పాకం
   4) పాషాణ పాకం
5. సంస్కృతం నుంచి తత్సమాలుగా ఎలాంటి మార్పు లేకుండా తెలుగులోకి వచ్చిన మాటలు?
   1) మకారాంత శబ్దాలు
   2) సకారాంత శబ్దాలు
   3) అకారాంత శబ్దాలు
   4) దీర్ఘాచ్చులు ఉన్న ఏకాక్షర పదాలు
6. అన్య దేశ్యాల ద్వారా తెలుగులోకి వచ్చిన అనుబంధ రూపాలు?
   1) దారు, నామా 2) పోతు, గారు
   3) ఖానా, రికం 4) కోరు, పోతు
7. ఆంగ్లం నుంచి తెలుగులోకి అనువదించిన తొలి నాటకం?
   1) మర్చంట్ ఆఫ్ వెనిస్
   2) జూలియస్ సీజర్
   3) రోమియో జూలియట్
   4) కామెడీ ఆఫ్ ఎరర్స్
8. జీవిత చరిత్ర – స్వీయ చరిత్రలకు మూలమైన ఆంగ్ల ప్రక్రియలు?
   1) లైఫ్ హిస్టరీ – బయోగ్రఫీ
   2) ఆటో బయోగ్రఫీ – లైఫ్ హిస్టరీ
   3) బయోగ్రఫీ – ఆటో బయోగ్రఫీ
   4) బయోగ్రఫీ – సెల్ఫ్ హిస్టరీ
9. తెలుగు నుంచి ఆంగ్లంలోకి ప్రవేశించిన పదం?
   1) ఎలిఫెంట్ 2) కా
   3) క్రో 4) బాండికూట్
10. పర్షియన్ నుంచి దువ్వూరి రామిరెడ్డి అనువదించిన 'గులిస్థాన్' మూల రచయిత?
    1) హఫీజ్ 2) ఉమర్‌ఖయ్యాం
    3) సాదీ 4) జలాలుద్దీన్
11. ఉర్దూ పదం కానిది?
    1) కుర్తా 2) చొక్కా
    3) లంగా 4) కండువా
12. ఆంగ్ల ప్రభావం లేని ప్రక్రియ?
    1) వ్యాసం 2) నవల
    3) విమర్శ 4) యక్షగానం

**సమాధానాలు**

1) 2; 2) 4; 3) 2; 4) 3; 5) 4; 6) 1; 7) 2; 8) 3; 9) 4; 10) 2; 11) 2; 12) 4.

# వినాళ గ్రంథులని వేటిని అంటారు?

## హార్మోన్లు

మనిషి శరీరంలోని వివిధ భాగాల మధ్య సమన్వయం ఎంతో కీలకం. ఒక సమగ్ర వ్యవస్థ (Integrated or Coordination System) అందుకు ఉపకరిస్తుంది. నాడీ వ్యవస్థ, అంతఃస్రావక వ్యవస్థలను రెండింటినీ కలిపి సమన్వయ వ్యవస్థ అంటారు. ఈ రెండు వ్యవస్థలు శరీరంలో వివిధ భాగాలు, అవయవ వ్యవస్థల మధ్య సమన్వయానికి కీలకమైనవి.

నాడీ వ్యవస్థ ద్వారా వేగవంతమైన సమన్వయం జరుగుతుంది. నాడీ ప్రచోదనం (Nerve Impulse) అనే నాడీ సమాచార ప్రసారం ద్వారా నాడీ వ్యవస్థ శరీర భాగాల మధ్య సమన్వయాన్ని తీసుకువస్తుంది. అంతఃస్రావక వ్యవస్థలో హార్మోన్లు అనే రసాయనాలు శరీర భాగాల మధ్య సమన్వయాన్ని చేకూరుస్తాయి.

అంతఃస్రావక వ్యవస్థలో అంతఃస్రావక గ్రంథులు, వాటి నుంచి రక్తంలోకి నేరుగా విడుదలయ్యే హార్మోన్లు ఉంటాయి. అంతఃస్రావక గ్రంథులకు నాళం ఉండదు. అందువల్ల వీటిని వినాళ గ్రంథులు అంటారు. శరీరంలోని వివిధ భాగాల్లోని అంతఃస్రావక గ్రంథులు రక్తంలోకి తమ హార్మోన్లను విడుదల చేస్తాయి. మనిషి అభివృద్ధిలోని వివిధ దశల్లో హార్మోన్లు తగిన మోతాదులో రక్తంలోకి విడుదలై పెరుగుదల, అభివృద్ధి, ప్రత్యుత్పత్తి మొదలైన చర్యలను నియంత్రిస్తాయి. హార్మోన్లు రసాయనకంగా మూడు రకాలు.

- ప్రోటీన్ లేదా పెప్టైడ్. **ఉదా:** పెరుగుదల హార్మోన్, ఇన్సులిన్
- స్టిరాయిడ్. **ఉదా:** అన్ని లైంగిక హార్మోన్లు
- అమైనో ఆమ్ల ఉత్పేరకం. **ఉదా:** థైరాక్సిన్

**శరీర భాగాలు : అంతఃస్రావక గ్రంథులు:**

తల – పియూష గ్రంథి
మెడ – అవటు, పార్శ్వ అవటు
ఉదరం – క్లోమం, అధివృక్క, జీర్ణకోశం
బీజకోశాలు (స్త్రీలలో అండాశయాలు) పురుషుని ముష్కాలు ఉదరం వెలుపల ఉంటాయి.

**తాత్కాలిక అంతఃస్రావక గ్రంథులు:** కార్పస్ ల్యుటీయం (స్త్రీలలో) – థైమస్

**పియూష గ్రంథి:**
ఇది మెదడు దిగువన ఉంటుంది. అందువల్ల దీన్ని Hypophysis అంటారు. దీనిలో మూడు లంబికలు ఉంటాయి. పూర్వ లంబిక నుంచి ట్రాపిన్లు అనే హార్మోన్లు విడుదలై కొన్ని ఇతర అంతఃస్రావక గ్రంథులను ప్రేరేపిస్తాయి. పెరుగుదల హార్మోన్ లేదా Somatotropin అనే ట్రాపిన్ శరీర సాధారణ పెరుగుదలను ప్రేరేపిస్తుంది. దీని లోపం వల్ల పిల్లల్లో మరుగుజ్జుతనం (Dwarfism), పెద్దల్లో Simond's వ్యాధి సంభవిస్తుంది. పెరుగుదల హార్మోన్ అధిక మోతాదులో విడుదలవడం వల్ల పిల్లల్లో Gigantism, పెద్దల్లో



Acromegaly సంభవిస్తుంది. Acromegaly ఉన్నవారు గోరిల్లా ఆకృతిని ప్రదర్శిస్తారు. పీయూష గ్రంథి పరలంబిక నుంచి రెండు హార్మోన్లు ఆక్సిటోసిన్, అతిమూత్ర నిరోధక హార్మోన్ (Antidiuretic Hormone) లేదా వాసోప్రెసిన్ విడుదలవుతాయి. ప్రసవం సమయంలో గర్భాశయ మృదు కండరాల సంకోచాన్ని ఆక్సిటోసిన్ ప్రేరేపిస్తుంది. ఫలితంగా శిశు జననానికి తోడ్పడుతుంది. వాసోప్రెసిన్ లేదా అతిమూత్ర నిరోధక హార్మోన్ రక్తపీడనాన్ని పెంచుతుంది. అదే విధంగా మూత్రంలో నీటి శాతాన్ని నియంత్రి స్తుంది. దీని అల్ప మోతాదు వల్ల డయాబెటిస్ ఇన్సిపిడస్ (అతిమూత్ర వ్యాధి) సంభవిస్తుంది.

### అవటు గ్రంథి

ఇది అతిపెద్ద అంతఃస్రావక గ్రంథి. ఇంగ్లిష్ అక్షరం 'ఏ' ఆకారంలో ఉంటుంది. దీని నుంచి $T_3$, $T_4$ అనే రెండు హార్మోన్లు విడుదలవుతాయి. ఈ రెండు ఏర్ప డటానికి ఆహారంలో తగినంత అయోడిన్ అవ సరం. $T_4$ను సాధారణంగా థైరాక్సిన్ అంటారు. ఇది అవటు గ్రంథి నుంచి విడుదలయ్యే ప్రధాన హార్మోన్. శరీరంలోని ఆధార జీవక్రియారేటు (Basal Metabolic Rate, BMR)ను థైరాక్సిన్ నియంత్రిస్తుంది.

### థైరాక్సిన్ సంబంధిత వైపరీత్యాలు

- పుట్టుకతోనే పిల్లల్లో థైరాక్సిన్ లోపం వల్ల క్రెటినిజం సంభవిస్తుంది. మానసిక, శారీరక మాంద్యత దీని ముఖ్య లక్షణం.
- పెద్దల్లో అల్ప థైరాక్సిన్ వల్ల మిక్సోడీమా/గల్స్ వ్యాధి సంభవిస్తుంది. ఆకలి మాంద్యం, జుట్టు రాలడం, గొంతు, ముఖంలో ఒడీమా (వాచిపోవడం) దీని ముఖ్య లక్షణాలు.
- పెద్దల్లో అత్యధిక థైరాక్సిన్ ద్వారా గ్రేవ్స్ వ్యాధి లేదా ఎక్సాఫ్తాల్మిక్ గాయిటర్ సంభవిస్తుంది. అధిక BMR , అధిక వేడి, కళ్ల నుంచి కనుగుడ్లు పడిపోతున్నట్లు కనిపించే బాహ్య లక్షణం.
- ఆహారంలో తగినంత అయోడిన్ లేకపోవడం – **సరళ గాయిటర్.**
  అవటు గ్రంథి మెడ దగ్గర బంతిలా వాచిపోతుంది.

### పార్శ్వ అవటు గ్రంథి

అవటు గ్రంథికి దగ్గరగా నాలుగు పార్శ్వ అవటు గ్రంథులు ఉంటాయి. వీటి నుంచి పారాథార్మోన్ హార్మోన్ విడుదలవుతుంది. ఇది రక్తంలోని కాల్షియం శాతాన్ని పెంచుతుంది. దీని అల్ప గాఢత వల్ల పారాథైరాయిడ్ టెటనీ (దవడ కండరాలు పట్టేయడం, బిగుతుకండరాలు) అధిక స్రావం వల్ల ఆస్టిటిస్ ఫైబ్రోజా (బలహీన ఎముకలు) సంభవిస్తాయి.

### క్లోమం

ఇది ఒక మిశ్రమ గ్రంథి. దీని అంతఃస్రావక భాగాన్ని లాంగర్‌హాన్స్ పుటికలు అంటారు. ఇందులో రెండు రకాల కణాలు ఉంటాయి. ఆల్ఫా కణాల నుంచి గ్లూకగాన్, బీటా కణాల నుంచి ఇన్సులిన్ ఏర్పడతాయి. గ్లూకగాన్ రక్తంలోని చక్కెర శాతాన్ని

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
**జనరల్ స్టడీస్**
బయాలజీ

పెంచుతుంది. ఇన్సులిన్ రక్తంలోని చక్కెర శాతాన్ని తగ్గిస్తుంది. ఈ రెండింటి పరస్పర చర్యల వల్ల శరీరంలో స్థిర గ్లూకోజ్ (80-110 mg/100ml of blood) నియంత్రణలో ఉంటుంది. ఇన్సులిన్ లోపంవల్ల టైప్–1 డయాబెటిస్ మిల్లిటస్ వస్తుంది. ఇన్సులిన్ ఏర్పడి పనిచేయని కారణంగా టైప్ – 2 డయాబెటిస్ మిల్లిటస్ వస్తుంది.

### అధివృక్క గ్రంథులు

రెండు అధివృక్క గ్రంథులుంటాయి. ఒక్కొక్కటి ఒక్కో మూత్రపిండంపై అమరి ఉంటాయి. అధి వృక్క గ్రంథి లోపలి భాగం దవ్వ. వెలుపలి భాగం వల్కలం. దవ్వ భాగం నుంచి అడ్రినాలిన్, నార్ అడ్రినాలిన్ అనే రెండు హార్మోన్లు విడుదలవుతాయి. వీటిని Emergency Hormones లేదా పోరాట పలాయన హార్మోన్లు (Hormones of fight, flight, fright) అంటారు. వల్కలం (Cortex) నుంచి విడుదలయ్యే హార్మోన్లను కార్టికాయిడ్లు అంటారు. వీటిలో ముఖ్యమైనవి కార్టిసోల్, ఆల్డోస్టిరోన్. కార్టిసోల్ శరీరంలో ఒత్తిడి పెరిగినపుడు అధికంగా విడుదలై, దానిని తగ్గిస్తుంది. అయితే ఇది దీర్ఘకాలం పాటు అధిక మోతాదులో విడుదల వడం వల్ల ముఖం, గొంతులో కొవ్వు పేరుకొని Cushing's Syndrome సంభవిస్తుంది. ఆల్డోస్టి రోన్ శరీర ద్రవాల నీటి – లవణ సమతౌల్యతను నియంత్రిస్తుంది. ఇది మూత్రంలో సోడియం విడు దలవకుండా జాగ్రత్త పడుతుంది. దీని అల్పస్రావం వల్ల చర్మం పొడిబారి, అడిసన్స్ వ్యాధి సంభవి స్తుంది. ఈ వ్యాధి వల్ల రక్తం పరిమాణం తగ్గి తీవ్ర స్థాయిలో కోమాకు చేరి మరణిస్తాడు.

### బీజ కోశాలు

పురుష బీజ కోశాలు ముష్కాలు. ముష్కాల్లోని లీడిగ్ కణాల నుంచి ఆండ్రోజన్లు అనే పురుష లైంగిక హార్మోన్లు విడుదలవుతాయి. వీటిలో టెస్టోస్టిరాన్ ముఖ్యమైంది. మీసం, గడ్డం, బొంగురు గొంతు, శరీరంపై రోమాలు వంటి పురుష ద్వితీయ లైంగిక లక్షణాల అభివృద్ధిని టెస్టోస్టిరాన్ ప్రేరేపిస్తుంది. పుట్టుకతో ముష్కాలు మగ శిశువు ఉదరంలోనే ఉండిపోయే స్థితిని Cryptorchidism అంటారు.

స్త్రీ బీజ కోశాలు అండాశయాలు. వీటి నుంచి స్త్రీ లైంగిక హార్మోన్లు ఈస్ట్రోజన్లు విడుదలవుతాయి. వీటిలో ప్రధానమైంది బీటా – ఈస్ట్రాడయాల్. రుతు చక్రం, స్తనాభివృద్ధి, కీచుగొంతు మొదలైన స్త్రీ ద్వితీయ లైంగిక లక్షణాల అభివృద్ధిని ఈస్ట్రోజన్లు ప్రేరేపిస్తాయి.

అండాశయం లోపలి గ్రాఫియన్ పుటికల నడుమ అండం అభివృద్ధి చెంది, ఆ తర్వాత పుటికల విచ్ఛిన్నం ద్వారా ఫాలోపియన్ నాళంలోకి విడుదలవుతుంది. విచ్ఛిన్నమైన గ్రాఫియన్ పుటికలు అధిక రక్త సరఫరాను పొంది కార్పస్ ల్యుటియం అనే తాత్కాలిక అంతఃస్రావక నిర్మాణంగా మారుతుంది. దీని నుంచి ప్రొజెస్టిరాన్ అనే హార్మోను విడుదలవుతుంది. అండం ఫలదీకరణం చెంది గర్భం మొదలైతే, ప్రొజెస్టిరాన్ గర్భావధి కాలం పొడవునా విడదలై, గర్భాన్ని మొత్తం నిర్వహి స్తుంది. అందువల్ల ప్రొజెస్టిరాన్‌ను Pregnancy Hormone అంటారు.

### థైమస్ (బాల గ్రంథి)

ఇది యుక్త వయసు వరకు ఉండి అనంతరం నశిస్తుంది. దీని నుంచి విడుదలయ్యే థైమోసిన్ అనే హార్మోన్ రోగ నిరోధక శక్తిలో కీలకమైన T లింఫోసైట్ల అభివృద్ధిని ప్రేరేపిస్తుంది.

### మాదిరి ప్రశ్నలు

1. ఏ హార్మోన్‌ను స్త్రీల మూత్రంలో గుర్తించడం ద్వారా గర్భధారణ నిర్ధారితమవుతుంది?
ఎ) ప్రొజెస్టిరాన్ బి) రిలాక్సిన్
సి) హ్యూమన్ కోరియోనిక్ గోనడోట్రాపిన్
డి) ఈస్ట్రోజన్
2. అవటు గ్రంథి నుంచి విడుదలయ్యే ఏ ప్రోటీన్ హార్మోన్ రక్తంలోని కాల్షియం శాతాన్ని తగ్గిస్తుంది?
ఎ) పారాథార్మోన్ బి) కాల్సిటోనిన్
సి) థైరాక్సిన్ డి) ఏదీ కాదు
3. ఆహారంలో అయోడిన్ లోపం వల్ల సంభవిం చేది?
ఎ) మహాకాయం బి) జడవామనుడు
సి) విస్తరించిన అవటు గ్రంథి
డి) చిన్న అవటు గ్రంథి
4. కాలేయంలోని పిత్తాశయం సంకోచాన్ని ప్రేరేపించే హార్మోన్?
ఎ) కోలిసిస్టోకైనిన్
బి) గ్యాస్ట్రిన్
సి) సెక్రిటిన్ డి) ఎంటిరోక్రైనిన్
5. భిన్నమైనదేదో కనుక్కోండి?
ఎ) ఈస్ట్రోజన్ బి) ఆండ్రోజన్
సి) టెస్టోస్టిరాన్ డి) డీహైడ్రోటెస్టోస్టిరాన్
6. కింది వాటిలో అంతఃస్రావక, బాహ్య స్రావక చర్యలను ప్రదర్శించే అవయవం?
ఎ) పీయూష గ్రంథి బి) క్లోమం
సి) థైమస్ డి) అవటు
7. మనిషి రక్తంలోని కాల్షియం ఫాస్ఫేట్ శాతాన్ని నియంత్రించే హార్మోన్?
ఎ) గ్లూకగాన్ బి) పెరుగుదల హార్మోన్
సి) పారాథైరాయిడ్ హార్మోన్ డి) థైరాక్సిన్
8. మనిషిలో శుక్రకణాల పోషణను చేపట్టే కణాలు?
ఎ) లీడిగ్ కణాలు బి) సెర్టోలీ కణాలు
సి) గ్రాఫియన్ పుటికలు
డి) కుప్ఫర్ కణాలు
9. కింది వాటిలో హార్మోన్?
ఎ) ట్రిప్సిన్ బి) గ్యాస్ట్రిన్
సి) టయలిన్ డి) పెప్సిన్
10. ఇన్సులిన్ హార్మోన్ ఒక?
ఎ) గ్లైకోలిపిడ్ బి) ఫాటీ యాసిడ్
సి) పెప్టైడ్ డి) స్టీరాల్

**సమాధానాలు**

| | | | | |
|---|---|---|---|---|
| 1 సి | 2 బి | 3 సి | 4 ఎ | 5 ఎ |
| 6 బి | 7 సి | 8 బి | 9 బి | 10 సి |

# How is 'look' written in a code?

## DATA SUFFICIENCY

**Directions (Q. 1 - 20):** Each of the questions below consists of a question and two statements numbe-red I and II given below it. You have to decide whether the data provided in the statements are sufficient to answer the questions. Read both the statements and

**Give answer:**
**1)** If the data in statement I alone sufficient to answer the question, while the data in statement II alone are not sufficient to answer the question
**2)** If the data in statement II alone sufficient to answer the question, while the data in statement I alone are not sufficient to answer the question
**3)** If the data either in statement I alone or in statement II alone are sufficient to answer the question
**4)** If the data given in both the statements I and II together are not sufficient to answer the question
**5)** If the data in both the statements I and II together are necessary to answer the question

**1.** Is X the brother of Y?
I. X is son of Z.
II. Y is daughter of Z.
**Sol:** Both have the same father and X is a male (a son), X must be the brother of Y
**Ans:** (5)

**2.** Is A the brother of B?
I. Mohan is father of A.
II. Mohan is father of B.
**Sol:** It is very clear that A and B are siblings but we can't be sure that A is a brother unless.
We know that he is a male. A may also a sister of Y.
**Ans:** (4)

**3.** Is A the brother of B?
I. B is sister of A.
II. A and B is spouse of each other.
**Sol:** From the second statement alone, we can conclude that A and B are not brothers.
**Ans:** (2)

**4.** Is Ravi the father of Girija?
I. Girija is the daughter of Ravi.
II. Ravi's father is the grandfather of Girija.
**Sol:** From the first statement alone Ravi is the father of Girija.
From the second statement alone Ravi is the father of Girija.
**Ans:** (3)

**5.** Among three friends X, Y and Z, who is the tallest?
I. X is taller than Y.
II. X is taller than Z.
**Sol:** From the two statements, we find that X is taller than both Y and Z. So, X must be tallest.
**Ans:** (5)

**6.** Among three friends X, Y and Z, who is the tallest?
I. X is shorter than Y.
II. X is shorter than Z.
**Sol:** From two statements, we can't find out who is the tallest. We need a comparison of the hei-ghts of Y and Z, which is not given.
**Ans:** (4)

**7.** Among three friends X, Y and Z, who is not the tallest?
I. X is taller than Y.
II. X is taller than Z.
**Sol:** From the first statement alone Y is not the tallest.
From the second statement alone Z is not the tallest.
**Ans:** (3)

**8.** On what date is Arun's birthday?
I. Arun's birthday comes only in a leap year.
II. Arun's birthday is the same as that of Morarji Desai.
**Sol:** We can get the answer (29 February) from the data given in statement I alone, because 29 February is the only date that comes only in a leap year. From the second statement alone, we can also find the answer.
**Ans:** (3)



**9.** On what date is Aruna's birthday?
I. Her birthday falls on the Independence Day of a country.
II. That Country has a flag made of three colours.
**Sol:** There are many countries whose flags have three colours. Hence, the data are insufficient to point out the exact date of her birthday.
**Ans:** (4)

**10.** What is the age of Ajith?
I. 5 years ago, Ajith was 20
II. Ajith is 25 years older than Rahul.
**Sol:** From the first statement alone, we can conclude that Ajith is 25.
**Ans:** (1)

BANK EXAMS
REASONING

**11.** What is the age of Mohan?
I. Mohan is 20 years younger than his father.
II. 5 years later, their ages will be in the ratio 1 : 2.
**Sol:** Both the statements are required to solve this.
**Ans:** (5)

**12.** How is "now" written in a code language?
I. "now are never" is written as "ha na pa" in that code language.
II. "you may come now" is written as "ja ta ha da" in that code language.
**Sol:** From first and second statem-ents the common word "now" is coded as "ha".
**Ans:** (5)

**13.** How is "look" written in a code language?
I. "look for me" is written as "ha da pa" in that code language.
II. "you and me" is written as "ja da na" in that code language.
**Sol:** From first and second statements the common word "me" is coded as "da", but we can't find the code for look. Look is coded either "ha" or "pa".
**Ans:** (4)

**14.** How many boys are there between A and B in a row of thirty boys?
I. A is eighth from the right end of the row.
II. B is ninth from the left end of the row.
**Sol:** From statements I and II A is 8th from the right end and B is 9th from the left end, between A and B [30-(8+9)] = 13.
**Ans:** (5)

**15.** In a row of thirty students, what is M's position from the right end?
I. M is third to the right of D who is twelfth from the left end of the row.
II. K is fourteenth from the right end of the row and there are eight students between K and M.
**Sol:** From the first statement alone, we can find M is 16th from the right end.
**Ans:** (1)

**16.** Six persons A, B, C, D, E and F sit around a circular table. Who is on the immediate left of A?
I. B is opposite to C and D is opposite to E.
II. F is on the immediate left of B.
**Sol:** From the two statements we can't arrange the persons of D and E.
**Ans:** (4)

**17.** How much did Akhil score in the exam?
I. His score was a prime number between 40 and 50.
II. He scored more than 45.
**Sol:** There is only one prime number greater than 45 and less than 50. It is 47. So, both statements are required.
**Ans:** (5)

**18.** Will it be a Sunday tomorrow?
I. It is not Saturday today.
II. It was Wednesday the day before yesterday.
**Sol:** From the first statement alone, tomorrow is not a Sunday.
From the second statement alone, tomorrow is not a Sunday.
**Ans:** (3)

**19.** Are all pens flowers?
I. All pens are gardens.
II. All gardens are flowers.
**Sol:** From the first statement and second statement, we can conclude all pens are flowers.
**Ans:** (5)

**20.** Are some pens pencils?
I. Some pencils are flowers.
II. All pencils are pens.
**Sol:** From the second statement alone, some pens are pencils.
**Ans:** (2)